శనివారం
24•3•2018
కరీంనగర్
• వెల.5 రూ.

మన రాష్ట్రం • మన పత్రిక

నమస్తే తెలంగాణ

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE





శుక్రవారం శంషాబాద్ క్లాసిక్ గార్డెన్స్‌లో ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ కుమార్తె ఎంగేజ్‌మెంట్ కార్యక్రమానికి హాజరైన ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు, డిప్యూటీ సీఎం మహమూద్ అలీ. చిత్రంలో ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ, ముస్లిం మతపెద్దలు కూడా ఉన్నారు.

దివ్యాంగులను పెండ్లాడేవారికి.. ప్రోత్సాహక పారితోషికం రూ.లక్షకు పెంపు

ఉత్తర్వులు జారీ.. ప్రభుత్వ నిర్ణయంపై దివ్యాంగుల సంక్షేమ సంఘాల హర్షం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దివ్యాంగులను ఆదర్శ వివాహం చేసుకునే వారికి ఇచ్చే ప్రోత్సాహక పారితోషికాన్ని (మ్యారేజ్ ఇన్సెంటివ్ అవార్డు) రాష్ట్ర ప్రభుత్వం పెంచింది. ప్రస్తుతం ఇస్తున్న రూ.50 వేల పారితోషకాన్ని రూ.లక్షకు పెంచుతూ మహిళాభివృద్ధి, శిశు, వయోవృద్ధులు, దివ్యాంగుల సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శి ఎం జగదీశ్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. ఆదర్శ వివాహాలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నదని తెలంగాణ వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ కేతిరెడ్డి వాసుదేవరెడ్డి చెప్పారు. ప్రభుత్వం నిర్ణయంపై తెలంగాణ జాగృతి వికలాంగుల విభాగం కన్వీనర్ ఎం శ్రీనివాసులు, వికలాంగుల హక్కుల జాతీయ వేదిక అధ్యక్షుడు కొల్లి వెంకటేశ్వర్‌రావు తదితరులు హర్షం వ్యక్తంచేశారు.

టీహబ్ మరో ముందడుగు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: స్టార్టప్ సంస్థలకు ప్రోత్సాహం అందించేందుకు టీహబ్ మరో కీలక ముందడుగు వేసింది. పీడబ్ల్యూసీ, కో క్రియేషన్ కన్సల్టింగ్ సంస్థతో కలిసి స్టార్టప్‌లకు మార్కెటింగ్ స్థాయి అంతర్గత స్కేలింగ్ కార్యక్రమాల ద్వారా మార్గనిర్దేశనం చేయనుంది. శుక్రవారం గచ్చిబౌలి టీహబ్‌లో జరిగిన కార్యక్రమంలో సంస్థ సీఈవో జై కృష్ణన్, కోక్రియేషన్ కన్సల్టింగ్ సహ వ్యవస్థాపకుడు శ్రీధర్ లంక, పీడబ్ల్యూసీ ప్రతినిధి తలసిల మురళీ ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు.



'కేసీఆర్ ప్రగతి ప్రాంగణం' పుస్తకం ఆవిష్కరణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆర్టీసీ ఉద్యోగి బొట్ల మహర్షి రచించిన 'కేసీఆర్ ప్రగతి ప్రాంగణం' పుస్తకాన్ని ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలో శుక్రవారం ఆ వర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎం జగదీశ్‌కుమార్ ఆవిష్కరించారు. ఆర్టీసీ ఉద్యోగిగా సామాజిక స్ప్రుహతో పుస్తకం రాయడం ప్రశంసనీయమని ఆయన పేర్కొన్నారు. జేఎన్‌యూలో తెలుగు భాష లైబ్రరీ ఏర్పాటుకు కృషిచేస్తామని వీసీ తెలిపారు



శుక్రవారం ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుకు పుష్పగుచ్ఛం ఇచ్చి కృతజ్ఞతలు తెలియజేస్తున్న పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

రెవెన్యూ డివిజన్‌గా పరకాల

- ఫైల్‌పై సంతకంచేసిన సీఎం కేసీఆర్
- కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే ధర్మారెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వరంగల్ రూరల్ జిల్లా పరిధిలో కొత్తగా పరకాల రెవెన్యూ డివిజన్‌ను ఏర్పాటుచేయాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు నిర్ణయించారు. ఈ మేరకు సంబంధిత ఫైల్‌పై శుక్రవారం ఆయన సంతకం చేశారు. పరకాల, ఆత్మకూరు, శాయంపేట, దామెర, నడికుడ మండలాలతో కొత్తగా పరకాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటవుతున్నది. పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

28న బాలల హక్కుల పరిరక్షణ కమిటీ ఎంపికకు ఇంటర్వ్యూలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు, ఆరుగురు సభ్యుల ఎంపికకు ఈ నెల 28న మధ్యాహ్నం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు మహిళా, శిశుసంక్షేమశాఖ డైరెక్టర్ విజయేంద్ర బోయి తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు హైదరాబాద్‌లోని ఆర్‌అండ్‌బీ ఇంజినీరింగ్ ఇన్ చీఫ్ కార్యాలయానికి రావాలని కోరారు.

నేడు రాజ్‌భవన్‌లో ఎర్త్‌అవర్


- గంటపాటు విద్యుత్ సరఫరా నిలిపివేత

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఎర్త్‌అవర్ సందర్భంగా రాజ్‌భవన్‌లో శనివారం రాత్రి గంటపాటు విద్యుత్‌ను వినియోగించకూడదని నిర్ణయించినట్టు రాజ్‌భవన్ అధికారులు తెలిపారు. గవర్నర్ నరసింహన్ ఆదేశాల మేరకు ఎర్త్‌అవర్‌ను పాటించనున్నట్టు పేర్కొన్నారు. రాజ్‌భవన్ దర్బార్‌హాల్, ఉద్యోగుల క్వార్టర్లు, సుధామా ఆఫీస్ బిల్డింగ్, నార్త్ బ్లాక్ గెస్ట్‌హౌస్, అన్ని కార్యాలయాలకు రాత్రి 8.30 నుంచి 9.30 వరకు కరంట్ సరఫరాను నిలిపివేయనున్నారు.

ముహూర్తం



సూర్యోదయం: 6.21 గంటలకు



సూర్యాస్తమయం: 6.24 గంటలకు

విళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, శుక్లపక్షం సప్తమి ఉదయం 10.08 వరకు, తదుపరి అష్టమి, నక్షత్రం: మృగశిర మధ్యాహ్నం 3.43 వరకు తదుపరి ఆరుద్ర, అమృతఘడియలు: ఉదయం 7.22 నుంచి 8.58 వరకు, రాహుకాలం: ఉదయం 9.21 నుంచి 10.52 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 6.21 నుంచి 7.57 వరకు, వర్జ్యం: రాత్రి 11.38 నుంచి 1.14 వరకు.

లోకం పోకడ



కనీసం వాళ్ల ఎమ్మెల్యేలైన వాళ్లకు ఓటేస్తారా, లేదా? తెలుసుకోడానికి పోటీకి దింపారట - అంతే!

యథేచ్ఛగా జీఎస్టీ జీరో దందా

- కేంద్రం నిర్లక్ష్యం.. రాష్ర్టానికి నష్టం
- వే-బిల్లు ఇవ్వరు.. ఎన్‌ఫోర్స్ చేయరు.. అంతర్రాష్ట్ర సరుకులకు అడ్డేలేదు



ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ: వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) అమలులోకి వచ్చి తొమ్మిది నెలలు గడుస్తున్నా కేంద్రం ఇంతవరకు వే-బిల్లుల నోటిఫికేషన్‌ను విడుదల చేయలేదు. ఒక రాష్ట్రం నుంచి ఇంకో రాష్ర్టానికి సరుకులను తరలించాలంటే వే-బిల్లు తప్పనిసరి అనే నిబంధనను పక్కాగా అమలుచేయకపోవడం వల్ల 'నల్ల వ్యాపారులు' చెలరేగిపోతున్నారు. దర్జాగా జీరో దందాకు తెగబడుతున్నారు. జీఎస్టీ వస్తే జీరోదందాకు చెక్ పడుతుందని అంతా భావించారు. కానీ, కేంద్ర ప్రభుత్వ నిర్లిప్త వైఖరితో పరిస్థితి అందుకు భిన్నంగా మారింది. జీరో వ్యాపారులకు జీఎస్టీ ఒక వెసులుబాటుగా మారింది. ఫలితంగా రాష్ట్ర జీఎస్టీ రాబడికి గండి పడుతున్నది.

దాడుల్లో బయటపడ్డ దందా

తెలంగాణ రాష్ట్ర అధికారులు ఇటీవల వరుసగా జరిపిన దాడులలో భారీఎత్తున నల్లదందా బాగోతం బయటపడింది. ఒకవైపు రాష్ట్ర వాణిజ్యపన్నులశాఖ అధికారులు స్పెషల్‌డ్రైవ్‌లు, మహాచెక్‌లు, ఎన్‌ఫోర్స్‌మెంట్ ద్వారా జీరో దందాకు చెక్‌పెట్టడానికి ప్రయత్నిస్తున్నా కేంద్ర అధికారుల నుంచి ఏ మాత్రం సహకారం లభించడం లేదు. పైగా కేంద్రం వే-బిల్లులను ఇంకా జారీచేయకపోవడం వల్ల రాష్ట్రం అంతర్రాష్ట్ర సరుకులను ఏవిధంగా తనిఖీ చేస్తుందని వ్యాపారులు సవాల్ చేస్తున్నారు. కేంద్రం మాత్రం 'అమ్మ పెట్టదు, అడుక్కు తిననివ్వదు' అన్న చందంలా వ్యవహరిస్తున్నది. దీంతో స్టీల్, సిమెంట్, ప్లైవుడ్, టైల్స్, గ్రానైట్ వంటి సరుకులను వ్యాపారులు పెద్దఎత్తున అడ్డదారిలో తరలిస్తూ పన్నులకు ఎగనామం పెడుతున్నారు. అయినప్పటికీ రాష్ట్ర అధికారులు అతికష్టం మీద స్టేట్ జీఎస్టీ రాబడిని పెంచుతున్నారు. మరోవైపు రాష్ట్ర ఆధీనంలోని విలువ ఆధారిత పన్ను రాబడిని రికార్డు స్థాయిలో పెంచుకుని ముందుకు సాగుతున్నారు. వ్యాట్ రాబడిలో ఇప్పటికే 23 నుంచి 24 శాతం రాబడి చోటుచేసుకోగా కేంద్ర ప్రభుత్వ వైఖరి వల్ల జీఎస్టీ రాబడిలో 9 నుంచి 10 శాతం వృద్ధిరేటు చోటుచేసుకున్నది. గత సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది మార్చి వరకు 21 శాతం వృద్ధిరేటు చోటుచేసుకుంది. కానీ, కేంద్ర ప్రభుత్వం సకాలంలో వే-బిల్లులు మంజూరు చేసినా, జీఎస్టీఎన్ నెట్‌వర్క్‌ను పటిష్ఠం చేసినా, కేంద్ర పరిధిలోని జీఎస్టీ అధికారులు సహకరించినా వృద్ధిరేటు మరింత పెరిగేది. రాష్ర్టానికి మరింత రాబడి పెరిగేది.

పొరుగు రాష్ర్టాల నుంచి అడ్డదారిలో..

వ్యాపారులు ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ర్టానికి సరుకులు తరలిస్తూ భారీఎత్తున పన్నును ఎగవేస్తున్నట్టు తెలంగాణ అధికారులు తరుచూ నిర్వహిస్తున్న ప్రత్యేక దాడులలో వెల్లడవుతున్నది. ఇటీవల తెలంగాణ రాష్ట్ర వాణిజ్యపన్నుల అధికారులు రాష్ట్ర వ్యాప్తంగా జరిపిన 'మహాచెక్'లో పన్ను చెల్లించకుండా సరుకులను తరలిస్తున్న భారీ వాహనాలను పెద్ద సంఖ్యలో పట్టుకున్న విషయం తెలిసిందే. ఇతర రాష్ర్టాల నుంచి సరుకులను తీసుకువచ్చి ఇంటిగ్రేటెడ్ గూడ్స్ అండ్ సర్వీస్ టాక్స్(ఐజీఎస్టీ) చెల్లించకుండా పన్నులను ఎగవేస్తున్నట్లు అధికారుల విచారణలో తేలింది. వారి నుంచి తెలంగాణ వాణిజ్యపన్నుల అధికారులు కోటి రూపాయలకు పైగా ఎస్‌జీఎస్టీ పన్నును వసూలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సోమేశ్‌కుమార్, వాణిజ్యపన్నుల శాఖ కమిషనర్ అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక దాడులు మంచి ఫలితాలను ఇచ్చాయి. మహాచెక్‌లతో ఈ అక్రమ దందా బండారం బయటపడుతున్న తరుణంలో వ్యాపారులు కోర్టు నుంచి స్టే తెచ్చుకున్నారు. ఇప్పటివరకు ఐజీఎస్టీ కింద కేంద్ర ప్రభుత్వం వే-బిల్లులను జారీ చేయడం లేదని, అసలు కేంద్రం నుంచి నోటిఫికేషన్ రాకుండా తమను ఏవిధంగా కట్టడి చేస్తారని వారు ఎదురు ప్రశ్నిస్తున్నారు. ఇతర రాష్ర్టాల నుంచి వచ్చే సరుకులకు సంబంధించి వే-బిల్లులను అడిగే అధికారం రాష్ర్టానికి లేదని వ్యాపారులు కోర్టులో వాదించి స్టే తెచ్చుకున్నారు. ఇతర రాష్ర్టాల నుంచి వచ్చే సరుకులు ఐజీఎస్టీ పరిధిలోకి వస్తాయి కాబట్టి రాష్ర్టాలకు సరుకులను సీజ్ చేసే అధికారం లేదని కోర్టు చెప్పింది. దీంతో మహాచెక్ తనిఖీలకు తెలంగాణ అధికారులు తాత్కాలికంగా తెరదించాల్సి వచ్చింది. ఇతర రాష్ర్టాల కంటే ఎక్కువ వృద్ధిరేటుతో అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న తెలంగాణకు ఇది నష్టాన్ని కొనితెస్తున్నది. వాస్తవానికి తెలంగాణ రాష్ట్రం మాత్రం ఆగస్టు 10నుంచే ఆన్‌లైన్‌లో వే-బిల్లులను జారీ చేస్తున్నది. మొదట డిసెంబర్ నుంచి పూర్తిస్థాయిలో వే-బిల్లులను జారీ చేస్తామని చెప్పిన కేంద్రం ఈ తర్వాత జీఎస్టీఎన్ నెట్‌వర్క్‌లో సమస్య అంటూ జనవరికి వాయిదా వేసింది. ఆ తర్వాత కూడా నెట్‌వర్క్‌ను సరిచేయలేక ఫిబ్రవరి అటు తర్వాత ఏప్రిల్‌కు వాయిదా వేసింది. ఏప్రిల్ నుంచి వే-బిల్లులు జారీ చేస్తామని చెబుతున్నా అది కూడా అనుమానమేనని, జీఎస్టీఎన్ నెట్‌వర్క్ ఇంకా సిద్ధం కాలేదని తెలుస్తున్నది. పోనీ జీరోదందాను అరికట్టడానికి కేంద్ర జీఎస్టీ అధికారులు ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులు చేస్తున్నారా? అంటే అదీ లేదు. రాష్ట్ర పరిధిలో వ్యాపారుల సరుకులను మన అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తూ పన్నులను రాబడుతున్నారు.

రాష్ర్టానికి నష్టం

జీఎస్టీ అమలులోకి వచ్చిన తర్వాత ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు నష్టం వస్తే దానిని ఐదేండ్ల వరకు తాము భరిస్తామని కేంద్రం ప్రకటించింది. కానీ తెలంగాణ రాష్ట్రం విషయంలో ఇది కొంత ఇబ్బందికరంగానే ఉంది. మిగతా రాష్ర్టాలకు ఇది అనుకూలం. అత్యధిక వృద్ధిరేటు ఉన్న రాష్ర్టాలలో తెలంగాణ అగ్రస్థానంలో ఉంది. తెలంగాణ రాష్ట్రం రాబడి ప్రతీ ఏడాది కనీస స్థాయిలో 18 నుంచి 22 శాతం వరకు పెరుగుతున్నది. ఒక్కోసారి అది 30 శాతం వరకు ఉంటుంది. తెలంగాణ వృద్ధిరేటుతో పోలిస్తే మిగతా రాష్ర్టాల వృద్ధిరేటు తక్కువ. నిబంధనల ప్రకారం కేంద్రం 14 శాతం నష్టాన్ని భరిస్తే తెలంగాణ మిగతా రాబడిని కోల్పోవాల్సి ఉంటుంది. ఇప్పటికైనా కేంద్రం వే-బిల్లులపై నోటిఫికేషన్‌ను జారీచేయాలని, జీఎస్టీఎన్ నెట్‌వర్క్‌ను పటిష్ఠపరచాలని, పూర్తిస్థాయి ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు కేంద్రాన్ని కోరుతున్నారు.

గడువులోపుగా భగీరథ అర్బన్ పూర్తి

- అన్ని వర్కింగ్ ఏజెన్సీలు వేగంగా పనిచేయాలి
- సమీక్షలో పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ స్పష్టీకరణ
- ప్రభుత్వం నుంచి అన్నిరకాల సాయం అందిస్తాం
- గడువులోపు పూర్తిచేస్తే ప్రోత్సాహకాలిస్తామని హామీ



మిషన్ భగీరథ అర్బన్ పనుల పురోగతిపై శుక్రవారం హైదరాబాద్‌లోని సీడీఎంఏ కార్యాలయంలో అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి కే తారకరామారావు. చిత్రంలో ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కూడా ఉన్నారు.

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఎట్టి పరిస్థితుల్లో నిర్ణీత గడువులోపు మిషన్ భగీరథ (అర్బన్) పనులను పూర్తికావాలని పురపాలకశాఖ మంతి కల్వకుంట్ల తారకరామారావు అధికారులు, వర్కింగ్ ఏజెన్సీలను ఆదేశించారు. మిషన్ భగీరథ అర్బన్ పనుల పురోగతిని సీడీఎంఏ కార్యాలయంలో శుక్రవారం మంత్రి కేటీఆర్ సమీక్షించారు. త్వరలో పనులు పూర్తయ్యే పట్టణాల జాబితాను రూపొందించడంతోపాటు ప్రతి పట్టణంలో ఏయే తేదీలోపు పనులు పూర్తవుతాయో తెలుపాలని సూచించారు. అమృత్ పథకం కింద ఉన్న పట్టణాల్లో పనులు జరుగుతున్న తీరును మంత్రి సమీక్షించారు. గడువులోపు పనులు పూర్తయ్యేందుకు అవసరమయ్యే అన్నిరకాల సహాయ సహకారాలను ప్రభుత్వం నుంచి వర్కింగ్ ఏజెన్సీలకు అందించాలని అధికారులను మంత్రి కేటీఆర్ ఆదేశించారు. గడువులోపు పనులు పూర్తిచేసే ఏజెన్సీలకు ప్రోత్సాహకాలను ఇస్తామన్న విషయాన్ని మంత్రి గుర్తుచేశారు. వచ్చే వర్షాకాలం నాటికి పనులను సేఫ్ స్టేజీకి తీసుకురావాలని సూచించారు

పలు పట్టణాల్లో పెరిగిన వేగం

మణుగూరులో పనులు దాదాపుగా పూర్తయ్యాయని, ఆర్మూరులో 98 శాతం, సిరిసిల్లలో 80 శాతం పనులు ముగిశాయని అధికారులు మంత్రి కేటీఆర్‌కు తెలిపారు. రాష్ట్రంలోని సగం పురపాలికల్లో పనులు వేగంగా జరుగుతున్నాయని, వచ్చే నాలుగైదు నెలల్లో పనులు పూర్తవుతాయని పేర్కొన్నారు. ఎక్కడైనా పనులు మందగించి ఉంటే, అక్కడి సమస్యలను ఎప్పటికప్పుడు తమ దృష్టికి తీసుకురావాలని, పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి ఆయా జిల్లా కలెక్టర్లతో చర్చించి వాటి పరిష్కారానికి ప్రయత్నిస్తారని మంత్రి చెప్పారు. త్వరలోనే మిషన్ భగీరథ (అర్బన్)పై వివిధ ప్రభుత్వ శాఖల అధిపతులతో ఒక సమన్వయ సమావేశాన్ని ఏర్పాటుచేస్తామని మంత్రి తెలిపారు. మిషన్ భగీరథ కార్యక్రమంపై ప్రతివారం సమీక్షను నిర్వహిస్తామన్నారు. మిషన్ భగీరథలో వేసే ప్రతి పైపులైను వెంబడి కచ్చితంగా ఆప్టిక్ ఫైబర్ డక్ట్‌ను వేయాల్సిందేనని వర్కింగ్ ఏజెన్సీలకు మంత్రి స్పష్టంచేశారు. ఫైబర్‌గ్రిడ్ ప్రభుత్వ ప్రతిష్ఠ కార్యక్రమమని గుర్తుంచుకోవాలని సూచించారు. సమావేశంలో పురపాలకశాఖ ముఖ్యకార్యదరి అరవింద్‌కుమార్, ఈఎన్సీ (పీఈ) ధన్‌సింగ్, శ్రీదేవి, వర్కింగ్ ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు.

కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు సలహాదారుగా యాకూబ్

- ఖమ్మం జిల్లా కవికి దక్కిన అరుదైన గౌరవం



డాక్టర్ యాకూబ్

కారేపల్లి రూరల్: కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు సలహాసంఘం సభ్యునిగా డాక్టర్ యాకూబ్‌ను నియమించారు. కేంద్ర సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ కే శ్రీనివాసరావు ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. 2022 వరకు నాలుగేండ్లపాటు యాకూబ్ సలహాదారుగా కొనసాగుతారు. తెలుగు సాహిత్య విమర్శలో ఆధునిక ధోరణులు అనే అంశంపై ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ పూర్తిచేసిన ఆయన ప్రస్తుతం హైదరాబాద్‌లోని గోల్కొండ మహిళా డిగ్రీ కళాశాలలో తెలుగు ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. పలువురు కవులు, రచయితలు యాకూబ్‌కు అభినందనలు తెలిపారు. మూడు దశాబ్దాలుగా తెలుగు సాహిత్యరంగంలో ఎనలేని కృషిచేసి నాలుగు కవిత్వ సంకలనాలు, మూడు విమర్శనా గ్రంథాలు రాశారు. అనేక పుస్తకాలకు సంపాదకత్వం వహించారు. సామాజిక మాధ్యమంలో కవి సంగమం, కవిత్వ వేదికను ప్రారంభించి ఐదేండ్లుగా కొత్తతరం, పాతతరం కవులకు మధ్య వారధిగా నిలుస్తున్నారు. కవిసంగమం ఇటీవలనే ఆరేండ్లు పూర్తి చేసుకున్నది. కవిత్వ వాతావరణాన్ని సృష్టించి నిరంతరం సాహిత్య సేవచేస్తూ పలువురి మన్ననలను పొందుతున్నారు. యాకూబ్ తన స్వగ్రామమైన రొట్టమాకురేవులో కేఎల్ పుస్తక సంగమం పేరుతో గ్రంథాలయాన్ని ప్రారంభించారు. ఇక్కడే ప్రతియేటా కవులకు 'రొట్టమాకురేవు కవిత్వ అవార్డుల'ను అందజేస్తున్నారు.



శుక్రవారం ఢిల్లీలో కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ మంత్రి హర్దీప్‌సింగ్ పూరి చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న సిద్దిపేట మున్సిపల్ కమిషర్ శ్రీనివాస్‌రెడ్డి, శ్రీసాయితేజ స్లమ్ సమాఖ్య అధ్యక్షురాలు నవ్య, కార్యదర్శి విజయ, మెప్మా బృందం

సిద్దిపేటకు స్వచ్ఛ ఎక్సలెన్స్ అవార్డు

- దేశవ్యాప్త పోటీలో 196 పట్టణాలు
- చెత్త సేకరణ, ఓడీఎఫ్, తడి,పొడి చెత్త వేరు చేయడంలో సిద్దిపేటకు ప్రథమ బహుమతి
- ప్రజల భాగస్వామ్యానికి బహుమతి ఇది: మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: స్పెషల్‌గ్రేడ్ మున్సిపాలిటీ సిద్దిపేటకు మరో అరుదైన గౌరవం దక్కింది. స్వచ్ఛభారత్ మిషన్ కార్యక్రమంలో భాగంగా సిద్దిపేట మున్సిపాలిటీ పలు ఆచరణాత్మకమైన కార్యక్రమాలను చేపట్టింది. బహిరంగ మలవిసర్జన రహిత ప్రాంతాలు (ఓడీఎఫ్)గా తీర్చిదిద్దే కార్యక్రమం, చెత్త సేకరణ, తడి-పొడి చెత్తను వేరుచేయడం వంటి కార్యక్రమాలను మెప్మా (పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ) సహకారంతో సిద్దిపేట మున్సిపాలిటీ విజయవంతంగా నిర్వహిస్తున్నది. అన్నిరంగాల్లో సిద్దిపేటను అగ్రభాగాన నిలుపాలన్న రాష్ట్రమంత్రి హరీశ్‌రావు సంకల్పం, పట్టణాభివృద్ధిపై ప్రత్యేకవిజన్‌కు ప్రజానీకం మద్దతుగా నిలిచింది. కేంద్ర గృహనిర్మాణ, పట్టణాభివృద్ధి మంత్రిత్వశాఖ జాతీయస్థాయిలో నిర్వహించిన స్వచ్ఛత ఎక్సలెన్స్ పోటీల్లో సిద్దిపేట మొదటిస్థానాన్ని దక్కించుకున్నది. దేశవ్యాప్తంగా దాదాపు 196 నామినేషన్లు రాగా.. సిద్దిపేట మిగతా పట్టణాలను వెనుకకు నెట్టేసి పారిశుద్ధ్య నిర్వహణ, శుభ్రత విభాగంలో ప్రథమస్థానాన్ని కైవసం చేసుకున్నది. సిద్దిపేటలోని శ్రీసాయితేజ స్లమ్ సమాఖ్యకు ఎక్సలెన్స్ అవార్డు, ప్రశంసాపత్రం, షీల్డ్‌తో పాటు రూ.1.50 లక్షల నగదు పారితోషికం లభించింది. తెలంగాణ నుంచి ఇబ్రహీంపట్నం, షాద్‌నగర్ కూడా ఈ పోటీలో పాల్గొనగా.. సిద్దిపేట అంతిమవిజేతగా నిలిచింది. శుక్రవారం ఢిల్లీలో కేంద్ర పట్టణాభివృద్ధి మంత్రి హర్దీప్‌సింగ్ పూరి నుంచి సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, శ్రీసాయితేజ స్లమ్ సమాఖ్య అధ్యక్షురాలు నవ్య, కార్యదర్శి విజయ, మెప్మా బృందం అవార్డును అందుకున్నారు. కార్యక్రమంలో తెలంగాణ మెప్మా అదనపు డైరెక్టర్ జాన్ శాంసన్, రాష్ట్ర కోఆర్డినేటర్ సుజాత, సిద్దిపేట కోఆర్డినేటర్ హన్మంతరెడ్డి, ఏడీఎంసీ సంతోషిమాత, అర్బన్ ప్లానర్ సంగీత, సాయికృష్ణ, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సహకారంతోనే సాధ్యమైంది!

'సిద్దిపేట మున్సిపాలిటీకి జాతీయస్థాయిలో అవార్డు రావడం సంతోషంగా ఉంది. సిద్దిపేట ప్రజల సహకారమెంతో గొప్పది. వంద శాతం బహిరంగ మలవిసర్జన రహిత పట్టణంగా తీర్చిదిద్దడం, చెత్త సేకరణ, తడి-పొడి చెత్తను వేరు చేయడం వంటి అంశాల్లో సిద్దిపేట ప్రజలు సరికొత్త స్ఫూర్తిని ప్రదర్శించారు. ఇప్పటికే అనేక అవార్డులను సాధించిన సిద్దిపేట మున్సిపాలిటీకి జాతీయస్థాయిలో ప్రథమస్థానం లభించడం అభినందనీయం. మున్సిపల్ కౌన్సిల్, మున్సిపల్ అధికారులను, శ్రీసాయితేజ స్లమ్ సమాఖ్య సభ్యులను అభినందిస్తున్నాను'.

- మంత్రి హరీశ్‌రావు

వెనుకకు తగ్గేది లేదు

- రిజర్వేషన్ల అంశంపై పార్లమెంట్‌లో టీఆర్‌ఎస్ ఎంపీల ఆందోళన
- పోడియం దగ్గర బైఠాయించి నిరసన.. ఉభయసభలూ వాయిదా

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రిజర్వేషన్లను కేటాయించే హక్కు రాష్ర్టాలకే ఉండాలని పార్లమెంట్‌లో టీఆర్‌ఎస్ ఎంపీలు ఆందోళనను మరింత ఉధృతంచేశారు. శుక్రవారం ఉభయసభల్లోనూ ఎంపీల ఆందోళనలు కొనసాగాయి. లోక్‌సభ మొదలైన మూడు నిమిషాల్లోనే వాయిదాపడింది. సభ ప్రారంభమైన వెంటనే టీఆర్‌ఎస్ ఎంపీలు పెద్దఎత్తున నినాదాలు చేస్తూ స్పీకర్ పోడియం దగ్గరకు దూసుకుపోయారు. 'జై తెలంగాణ.. వీ వాంట్ జస్టిస్' అని నినాదాలు చేస్తూ.. ప్లకార్డులతో పోడియం దగ్గర బైఠాయించారు. ఎలాంటి చర్చకు అవకాశం ఇవ్వకుండా.. రిజర్వేషన్ల అంశాన్ని తేల్చాలంటూ టీఆర్‌ఎస్ ఎంపీలు ఆందోళనకు దిగారు. స్వాతంత్ర్య సమరయోధులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లకు నివాళులర్పించిన సమయంలో మౌనం పాటించిన టీఆర్‌ఎస్ ఎంపీలు.. అనంతరం నిరసనకు దిగారు. పోడియం దగ్గర బైఠాయించి ఆందోళన చేయడంతో స్పీకర్ సుమిత్రామహాజన్.. సభను మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు. తిరిగి సమావేశమయ్యాక కూడా టీఆర్‌ఎస్ ఎంపీలు పట్టు వీడలేదు. స్పీకర్ నచ్చజెప్పే ప్రయత్నం చేసినా ఎంపీలు వెనక్కి తగ్గలేదు. రిజర్వేషన్ల అంశాన్ని తేల్చాల్సిందేనంటూ నినాదాలు చేశారు. ఎంపీల ఆందోళనతో లోక్‌సభ హోరెత్తింది. స్పీకర్ వారించినా.. టీఆర్‌ఎస్ ఎంపీలు ఆందోళన ఆపలేదు. దీంతో సభను మంగళవారానికి వాయిదా వేస్తున్నట్టు స్పీకర్ ప్రకటించారు. మరోవైపు టీఆర్‌ఎస్ ఎంపీల డిమాండ్‌కు మద్దతు పెరుగుతున్నది. ఎంపీల డిమాండ్ న్యాయమైనదేనంటూ ఎల్కే అద్వానీ.. స్పీకర్‌కు సూచించిన విషయం విదితమే. అధికారపక్షం నుంచి కూడా మద్దతు లభిస్తుండటంతో టీఆర్‌ఎస్ ఎంపీలు ఆందోళనను మరింత ఉధృతం చేస్తున్నారు. రిజర్వేషన్ల అంశం తేలేవరకు పట్టువీడకుండా ఉభయసభల్లో పోరాటం చేస్తున్నారు. రాజ్యసభలోనూ టీఆర్‌ఎస్‌తో పాటు పలు పార్టీల ఎంపీలు ఆందోళనకు దిగడంతో రాజ్యసభ సోమవారానికి వాయిదా పడింది. టీఆర్‌ఎస్ ఎంపీలు ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేస్తూ.. వెల్‌లోకి దూసుకెళ్లారు. రిజర్వేషన్ల అంశాన్ని తేల్చాలంటూ నినాదాలు చేస్తూ ఆందోళన కొనసాగించారు. దీంతో సభ సజావుగా సాగే పరిస్థితి లేకపోవడంతో చైర్మన్ వెంకయ్యానాయుడు సోమవారానికి వాయిదా వేశారు.

సకల ఉద్యోగుల సభ పోస్టర్ ఆవిష్కరణ

ఆబిడ్స్, నమస్తే తెలంగాణ: ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో భాగంగా ఈ నెల 25న సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించనున్న సకల ఉద్యోగుల సభను విజయవంతం చేయాలని టీజేఏసీ చైర్మన్ కారం రవీందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. తెలంగాణ వాణిజ్య పన్నులశాఖ నాన్ గెజిటెడ్ అధికారుల అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన సకల ఉద్యోగుల సభ పోస్టర్‌ను శుక్రవారం హైదరాబాద్‌లో కారం రవీందర్‌రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీఎన్జీవో కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి ఎం రాజేందర్, అసోసియన్ అధ్యక్షుడు ఎంబీ కృష్ణాయాదవ్, నాయకులు ఎం ఉపేందర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, సంధ్యారాణి, విజయలక్ష్మి, ఆర్ ప్రదీప్‌కుమార్‌రెడ్డి, హరిప్రసాద్, రహమత్ అలీ, దేవులపల్లి శ్రీనివాసరావు, శ్రీనివాసులు, ధన్‌రాజ్, రవూఫ్, కే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



వాణిజ్య పన్నులశాఖ జేఏసీ సకల ఉద్యోగుల సభ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో మాట్లాడుతున్న టీజేఏసీ చైర్మన్ కారం రవీందర్‌రెడ్డి

శనివారం
24•3•2018
కరీంనగర్
•వెల.5 రూ.
•సంపుటి 7 •సంచిక 266
•పేజీలు : 16 + (20/16)

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE



PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

టీఆర్ఎస్ తీన్మార్

రాజ్యసభ ఎన్నికల్లో ముగ్గురు అభ్యర్థుల ఘనవిజయం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

రాజ్యసభ ఎన్నికల బరిలో టీఆర్ఎస్ తీన్మార్ మోగించింది. మొత్తం ముగ్గురు అభ్యర్థులు విజయం సాధించి గులాబీ పార్టీకి ఏ ఎన్నికల్లోనైనా తిరుగులేదని చాటారు. పాలకపక్షం విజయపరంపర కొనసాగుతుండగా.. ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ పార్టీ లేనిపోని అంచనాలతో రంగంలోకి దిగి బొక్కబోర్లా పడింది. శుక్రవారం రాజ్యసభకు జరిగిన ఎన్నికల్లో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుతో సహా 108 మంది ఎమ్మెల్యేలు తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. స్వతంత్ర అభ్యర్థి దొంతి మాధవరెడ్డి ఓటు చెల్లకుండా పోవడంతో 107 ఓట్లను పరిగణనలోకి తీసుకుని ఒక్కొక్క అభ్యర్థి విజయానికి 27 ఓట్లు

మిగతా 4వ పేజీలో

- ఓటేసిన 108 మంది ఎమ్మెల్యేలు
- చెల్లని దొంతి మాధవరెడ్డి ఓటు
- కటాఫ్ మార్క్‌గా 27 ఓట్లు.. 30కి పైగా సాధించిన టీఆర్ఎస్ అభ్యర్థులు
- కాంగ్రెస్ అభ్యర్థికి పడింది కేవలం 10 ఓట్లే
- తాను తీసుకున్న గోతిలో తానే పడ్డ కాంగ్రెస్

పెద్దల సభకు సంతోష్‌కుమార్, బడుగుల లింగయ్య యాదవ్, బండ ప్రకాశ్



రాజ్యసభ ఎన్నికల్లో గెలుపొందిన టీఆర్ఎస్ అభ్యర్థులు జోగినిపల్లి సంతోష్‌కుమార్, బడుగుల లింగయ్య యాదవ్, బండ ప్రకాశ్ శుక్రవారం ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావును కలుసుకున్న దృశ్యం



శంషాబాద్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయ దశాబ్ది వేడుకలను జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు. చిత్రంలో మంత్రులు కే తారకరామారావు, పట్నం మహేందర్‌రెడ్డి, చీఫ్ సెక్రటరీ ఎస్‌కే జోషి, ఏవియేషన్‌శాఖ కార్యదర్శి రాజీవ్ చౌబే, జీఎంఆర్ అధినేత గ్రంధి మల్లిఖార్జునరావు తదితరులు

మీ పురోగతి స్ఫూర్తిదాయకం

ఎయిర్‌పోర్ట్ ఎక్స్‌ప్రెస్ కనెక్టివిటీకి 4650 కోట్లు.. రాష్ట్రంలో విమాన ఇంధనంపై 1% వ్యాట్ తగ్గింపు
శంషాబాద్ విమానాశ్రయ దశాబ్ది వేడుకల్లో మంత్రి కేటీఆర్

5

అన్నివైపులా ఐటీ విస్తరణ

రాష్ట్రంలో 46 వేల ఎకరాల్లో పారిశ్రామిక పార్కులు

- 19 వేల ఎకరాల్లో ఫార్మాసిటీ
- వరంగల్‌లో దేశంలోనే అతిపెద్ద జౌళిపార్కు
- లక్షల మంది యువతకు ఉపాధి
- దళిత, గిరిజన పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం
- మండలిలో మంత్రి కేటీఆర్



హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

రాష్ట్రంలో అన్నివైపులా ఐటీ పార్కులు విస్తరింపచేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ దృఢసంకల్పంతో ఉన్నారని ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కే తారకరామారావు చెప్పారు. రాష్ట్రంలో 46వేల ఎకరాల్లో నూతన పారిశ్రామికపార్కులను ఏర్పాటుచేస్తున్నట్టు ఆయన తెలిపారు. 19 వేల ఎకరాల్లో ఫార్మాసిటీని ఏర్పాటు చేయనున్నామని, వరంగల్‌లో దేశంలోనే అతిపెద్ద జౌళిపార్కు రూపుదిద్దుకుంటున్నదని చెప్పారు. శాసనమండలిలో శుక్రవారం కర్నె ప్రభాకర్, ఎంఎస్ ప్రభాకర్‌రావు, బీ వెంకటేశ్వర్లు, భానుప్రసాద్ అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. రంగారెడ్డి జిల్లా ముచ్చర్లలో హైదరాబాద్ ఫార్మాసిటీ, మహేశ్వరం మండలంలో ఎలక్ట్రానిక్ తయారీ క్లస్టర్లు, సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో జాతీయ పెట్టుబడి జోన్, ఖమ్మం జిల్లా బుగ్గపాడు వద్ద మెగా ఫుడ్‌పార్కు, యాదాద్రి భువనగిరి జిల్లా దండుమల్కాపూర్‌లో ఎంఎస్ఈ పారిశ్రామికపార్కు వంటి మెగాపార్కులు వస్తున్నాయని చెప్పారు. పారిశ్రామికపార్కుల ఏర్పాటుతో లక్షల మంది యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లా వేల్పూరులో స్పైస్‌పార్క్, సిద్దిపేట జిల్లా బండమైలారంలో విత్తనపార్కు, నల్లగొండ జిల్లా మిర్యాలగూడెం, పెద్దపల్లి జిల్లా కుందనపల్లి

మిగతా 5వ పేజీలో

గ్రూప్-2లో అవకతవకల్లేవ్

- జవాబుల మూల్యాంకనంలో టీఎస్‌పీఎస్సీ జోక్యం చేసుకోలేదు
- క్లీన్‌చిట్ ఇచ్చిన సీనియర్ న్యాయవాదుల కమిటీ
- హైకోర్టుకు నివేదిక

5

ఆచరణలోకి 'సింగరేణి' వరాలు

- మాట నిలుపుకొన్న సీఎం కేసీఆర్
- కారుణ్య నియామకాలు, వైద్యం, కొత్త క్వార్టర్ల నిర్మాణం
- సింగరేణి కార్మికుల్లో ఆనందం

వివరాలు వాణిజ్యలో

ఐడీబీఐలో ఇంటి దొంగలు

445.32 కోట్లకు కుచ్చుటోపీ
మాజీ జీఎం, మరో 30 మందిపై సీబీఐ కేసు


డీసీ చైర్మన్‌పై చీటింగ్ కేసు

రేటింగ్ సంస్థ 'కేర్', ఐడీఎఫ్‌సీపైనా..
బీమా కంపెనీని 30 కోట్లకు ముంచారని అభియోగం

తొట్టెంపూడి దంపతుల అరెస్టు

'టోటెమ్' స్కాంలో సీబీఐ పురోగతి
బ్యాంకు అధికారుల ప్రమేయంపై ఆరా






ఉత్పత్తి వ్యయం కన్నా ఒకటిన్నర రెట్లు మద్దతు ధర

త్వరలో అమల్లోకి
కేంద్ర మంత్రి రాధామోహన్‌సింగ్

III









ప్రస్తుతం సాధారణ మధ్యస్థ రాజకీయాలదే రాజ్యమైపోయింది. నేను ఇలాంటి రాజకీయాలకు వ్యతిరేకిని. ప్రజల సంక్షేమం పట్టని రాజకీయాలన్నింటికీ నేను వ్యతిరేకం. అన్నిరకాల ఉగ్రవాదాలకూ విరోధం. తమిళ పేపర్ల నిండా హిందూ ఉగ్రవాదమే కనిపిస్తున్నది. దాన్ని నిర్మూలించాలి.

కమల్‌హాసన్, 'మక్కల్ నీది మయ్యం' అధినేత

యూపీలో యోగీ ఆదిత్యనాథ్ ప్రభుత్వం మత ప్రాతిపదికన కేసులు ఎత్తివేయటం దారుణం. ముజఫర్‌నగర్ మత కలహాలకు సంబంధించి బీజేపీ కార్యకర్తలపై ఉన్న కేసులను ఎత్తివేయటం మతవిభజనకు తార్కాణమే. మొత్తం 503 కేసుల్లో 179 కేసులనే ఎందుకు ఎత్తివేశారు? సమాజాన్ని చీల్చి, భయాందోళనలు రేపే తీవ్ర నేరాల కేసులను ఎత్తివేయటం యోగీ పనితీరుకు నిదర్శనం.

రణ్‌దీప్‌సింగ్ సుర్జేవాలా, కాంగ్రెస్ అధికార ప్రతినిధి



చరిత్రలో నేడు



1882

క్షయవ్యాధి కారకాన్ని కనుగొన్న జర్మన్ శాస్త్రవేత్త రాబర్ట్ కోచ్.

1952



వర్గ వివక్షకు వ్యతిరేకంగా దక్షిణాఫ్రికాలో మహా ప్రదర్శన.



1990

శ్రీలంక నుంచి భారత శాంతి పరిరక్షక దళాల ఉపసంహరణ.

ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం దుర్వినియోగమవుతున్నదన్న విషయంలో సుప్రీంకోర్టు తాజాగా మార్గదర్శకాలను సూచించింది. కొన్ని ఉదంతాలతో ఎస్సీ,ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం-1989 స్ఫూర్తిని నీరుగార్చలేమని చెబుతూనే, చట్టం అమలులో నిర్దిష్ట మార్గదర్శకాలను విధిగా పాటించాలని సూచించటం ఆహ్వానించదగ్గ పరిణామం. ఈ చట్టం కింద ఎవరినైనా అరెస్టు చేయాలంటే జిల్లా స్థాయి పోలీస్ అధికారి ధ్రువీకరణతోనే ముందుకుసాగాలని తెలిపింది. అలాగే కేసులో ముందస్తు బెయిలు పొందే వీలు కూడా ఉండాలని సూచించటం గమనార్హం.

ది హిందూ

కేంబ్రిడ్జ్ అనలిటికా (సీఏ) చేసిన పనితో 'ఫేస్‌బుక్' భారీ మూల్యాన్నే చెల్లించాల్సి వస్తున్నది. ఫేస్‌బుక్ ఖాతాదారుల వ్యక్తిగత సమాచారం, అభిరుచులు, భావవ్యక్తీకరణలపై ఆధారపడి వారిలో ఒక నిర్దిష్ట భావజాలానికి అనుగుణంగా ప్రభావితంచేసే విధంగా చేయటం మొత్తం ప్రపంచాన్ని కుదిపేస్తున్నది. ఈ విధమైన భావజాల నియంత్రణ ద్వారానే ఈ మధ్యకాలంలో జరిగిన అమెరికా ఎన్నికలు, బ్రెగ్జిట్ ప్రజాభిప్రాయ సేకరణ ఫలితాలు ప్రభావితమయ్యాయని వెలుగులోకి రావటం దిగ్భ్రాంతికి గురిచేస్తున్నది.

ది టైమ్స్ ఆఫ్ ఇండియా

సభాకాలం అమూల్యం

పార్లమెంటు సమావేశాలు సజావుగా సాగించడానికి వీలుగా నిరసన ప్రదర్శనలు చేస్తున్న రాజకీయపక్షాలతో చర్చలు జరుపుతామని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల సహాయ మంత్రి విజయ్ గోయెల్ ప్రకటించడం విశేషమే. కీలకమైన ప్రతిపక్ష నేతల ఇండ్లకు మరీ చర్చిస్తామని కూడా ఆయన అన్నారు. కానీ మంత్రి చెబుతున్న మాటలు నమ్మదగినవిగా లేవని ప్రతిపక్షాలు కొట్టిపారేస్తున్నాయి. తెలంగాణ రాష్ట్ర సమితి, కాంగ్రెస్, అన్నాడీఎంకే, తృణమూల్ కాంగ్రెస్, టీడీపీ తదితర పార్టీలు కొద్దిరోజులుగా నిరసనలు తెలుపుతున్నాయి. ఈ నిరసనలకు ఎవరి కారణాలు వారికి ఉన్నాయి. బడ్జెట్ సమావేశాల రెండవ విడత 23 రోజులు జరుగవలసి ఉంది. అయితే ఇందులో ఇప్పటికే 14 రోజులు వృథాగా గడిచిపోయాయని మంత్రి గోయెల్ అన్నారు. పార్లమెంటులో నిరసనలు ఇంతగా సాగుతుంటే, అధికారపక్షం ఇంతకాలం పట్టనట్టు వ్యవహరించడం సబబు కాదు. ఇప్పటికే చాలా కాలయాపన జరిగింది. పార్లమెంటులో నిరసనలను రెండువిధాలుగా ఉంటాయి. కొందరు ఒక్కోసారి సభ నడువకూడదనే ధ్యేయంతో గొడవ చేస్తూ ఉంటారు. వీరికి సభా మర్యాదల పట్ల, రాజకీయ విలువలపైన గౌరవ భావం ఉండదు. తెలంగాణ బిల్లు ఆమోదించే సందర్భంలో చోటుచేసుకున్న అవాంఛనీయ ఘటనలు ఇందుకు ఉదాహరణ. అటువంటి పెడ ధోరణుల పట్ల కఠినంగా వ్యవహరించడం ద్వారా పార్లమెంటు ఔన్నత్యాన్ని కాపాడటం అవసరం. కానీ న్యాయబద్ధమైన అంశాలను రాజకీయపక్షాలు లేవనెత్తినప్పుడు, చర్చించి పరిష్కారమార్గాలు అన్వేషించాలే తప్ప, పట్టించుకోకుండా ఉండకూడదు.

టీఆర్‌ఎస్ కొద్దిరోజులుగా రిజర్వేషన్ అంశంపై పట్టుబడుతున్నది. దీనిపై అధికారపక్షం మొదటిరోజే స్పందించి, చర్చించి మెప్పించాల్సింది. వెంటనే కాకపోయినా, తర్వాతికాలంలోనైనా కూలంకషంగా చర్చిస్తామని, సానుభూతితో అర్థం చేసుకుంటామని నిజయితీగా హామీ ఇస్తే సరిపోయేది. ప్రజల ఆకాంక్షలను అవసరమైతే గట్టిగానైనా వినిపించడం పార్లమెంటులో సాధారణమే. దానిని తప్పుబట్టాల్సిందేమీ లేదు. పార్లమెంటు చర్చలకు భంగం కలిగించే విషయానికి వస్తే, ప్రాంతీయపక్షాల కన్నా, జాతీయపక్షాలే బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నాయి. యూపీఏ రెండవ పర్యాయం అధికారానికి వచ్చినప్పుడు, బీజేపీ ప్రతిపక్ష పార్టీగా, పార్లమెంటు సమావేశాలకు అదేపనిగా అడ్డుతగిలింది. దేశ చరిత్రలోనే అత్యంత ఎక్కువగా సభాకాలం వృథా అయింది. అదే బీజేపీ ఇప్పుడు సభాకాలం విలువైంది అంటూ నీతులు చెబుతున్నది. ఆ నాడు బీజేపీ సమావేశాలకు అడ్డుతగిలితే, ఇప్పుడు కాంగ్రెస్‌పార్టీ అదే విధమైన విచ్ఛిన్నకర పాత్ర పోషిస్తున్నది. రెండు జాతీయ పార్టీలు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తే, ఉభయసభల్లో చర్చలు మరింత నిర్మాణాత్మకంగా జరుగుతాయి. ప్రాంతీయపార్టీలు తమ గొంతు వినిపించడానికి అవకాశం ఇస్తే మరింత హుందాగా ఉంటుంది.

> **పార్లమెంటు నడువడానికి నిమిషానికి రెండున్నర లక్షల రూపాయల వ్యయమవుతుందని మంత్రి గోయెల్ వ్యాఖ్యానించారు. గోయెల్ సభా సమయాన్ని పైసలతో లెక్కగట్టడం ఆశ్చర్యకరంగా ఉన్నది. సభా సమయం అమూల్యమైనది. పైసల లెక్కలకు అందనిది. ఇటీవల పార్లమెంటు చర్చ జరుగకుండానే బడ్జెట్‌ను ఆమోదించింది. కోట్లాది దేశప్రజల శ్రేయస్సుకు సంబంధించిన పద్దులను చర్చించకుండానే సభ ఆమోదించడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే.**

పార్లమెంటు నడువడానికి నిమిషానికి రెండున్నర లక్షల రూపాయల వ్యయమవుతుందని మంత్రి గోయెల్ వ్యాఖ్యానించారు. గోయెల్ సభా సమయాన్ని పైసలతో లెక్కగట్టడం ఆశ్చర్యకరంగా ఉన్నది. సభా సమయం అమూల్యమైనది. పైసల లెక్కలకు అందనిది. ఇటీవల పార్లమెంటు చర్చ జరుగకుండానే బడ్జెట్‌ను ఆమోదించింది. కోట్లాది దేశప్రజల శ్రేయస్సుకు సంబంధించిన పద్దులను చర్చించకుండానే సభ ఆమోదించడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే. విస్తృతమైన దేశంలో ఎన్నో భౌగోళిక విభాగాలు, ఆర్థిక మండలులు, భిన్నజాతులూ సంస్కృతులు గల దేశం మనది. ప్రతిప్రాంతానికి, సామాజికవర్గానికి సమస్య లు ఉంటాయి. ప్రతి ప్రాంత అభివృద్ధి వ్యూహం వేరు విధంగా ఉంటుంది. వీరి సమస్యలు, ఆకాంక్షలు చర్చించి నిర్ణయాలు తీసుకోవలసిన బాధ్యత ప్రజాప్రతినిధులది. కేంద్ర రాష్ట్రాల మధ్య అధికారాల పంపిణీ ఒక సమస్య. కాలాన్నిబట్టి రాష్ట్రాల డిమాండ్లు నెరవేరకపోతే, పరిపాలనా వ్యవస్థ విఫలమవుతుంది. రిజర్వేషన్ల అంశం జనాభాకు సగానికిపైగా ఉన్న అనేక సామాజికవర్గాల అభివృద్ధికి సంబంధించిన అంశం. ఇవి సకాలంలో పరిష్కారం కాకపోతే, సామాజిక అనిశ్చితి చోటుచేసుకుంటుంది. పార్లమెంటులో కొన్ని రాజకీయపక్షాలు నిరసన తెలుపుతున్నాయనే సాకు చూపి ఇట్లా ఏ అంశాలూ చర్చించకుండా సమావేశాలు ముగిస్తే చట్టసభలు ప్రాధాన్యం కోల్పోతాయి. ప్రజాప్రతినిధులు సమస్యలను చర్చించుకొని పరిష్కరించకపోతే, ప్రజలకు పార్లమెంటరీ వ్యవస్థపై విశ్వాసం సన్నగిల్లే ప్రమాదం ఉంటుంది. ఇప్పటికైనా రాజకీయ పక్షాల నాయకులు చొరవ తీసుకొని చర్చలు సజావుగా సాగేవిధంగా చర్యలు తీసుకోవాలె. పాలనాదక్షత అంటే, అన్నివర్గాలను మెప్పిస్తూ పాలించడమే తప్ప, సభాకాలాన్ని వినియోగించుకోకుండా మొక్కుబడిగా బిల్లులను ఆమోదించుకోవడం కాదు.

సందర్భం

'జలదృశ్యం' నుంచి..

2001, ఏప్రిల్ 27.. జలదృశ్యం ప్రాంగణం.. అప్పటి అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్, ప్రస్తుత సీఎం కేసీఆర్, టీడీపీకి, ఆ పార్టీ ద్వారా లభించిన పదవులకు రాజీనామా చేసి, తెలంగాణ ఉద్యమాన్ని భుజానికెత్తుకున్న సందర్భం.

తెలంగాణ జిల్లాల నుంచి తరలివచ్చిన వందలాది మందిని వేదిక సమీపంలో కూర్చోబెడుతూ కనిపించాడో యువకుడు. ఇరువై రెండేండ్ల వయస్సులో తనకు అప్పగించిన పని ని శ్రద్ధగా చేస్తున్న ఆ యువకుడిని గమనిస్తున్నా ను. వేసవి ఎండలో దప్పిగొన్నవారికి మంచినీళ్ల గ్లాసులు అందిస్తూ, మరోపక్క సభా ప్రాంగణానికి వస్తున్నవారికి సముచిత స్థానాలు చూపిస్తూ కూర్చోబెడుతున్న ఆ యువకుడు చకచకా కదులుతూ అన్నీతానై కనిపిస్తున్నాడు. అంతలో కేసీఆర్ రావడం, సభ ప్రారంభం కావడంతో వేదికపైపే దృష్టి కేంద్రీకరించాను. ఆ యువకుడు మటుకు సుశిక్షితుడైన సైనికుడిలా తన బాధ్యతను కొనసాగిస్తూనే కనిపించాడు. నాటినుంచి నేటివరకు కేసీఆర్ అడుగుజాడల్లో పయనిస్తున్న ఆ యువకుడు జోగినిపల్లి సంతోష్ కుమార్. 18 ఏండ్ల క్రితం జలదృశ్యంలో ప్రారంభించిన ప్రస్థానాన్ని కొనసాగిస్తూ అంచెలంచెలుగా ఎదిగిన చరిత్ర ఆ యువకుడిది.

ఉద్యమ ప్రస్థానంలో జిల్లాలతో చక్కని అనుబంధాన్ని పెంచుకొని తెలంగాణ భూమి పుత్రులకు, వీర వనితలకు తలలో నాలుకలా వ్యవహరిస్తూ అన్నివేళలా ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం అవిశ్రాంతంగా పరిశ్రమిస్తూ వస్తున్న ఆ యువకుడు అందరి ఆదరాభిమానాలతో ప్రస్తుతం రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికయ్యారు. అధినేత కనుసన్నల్లో మెదులుతూ వెంట నడువడానికే పరిమితం కాకుండా మానవీయ కోణానికి పెద్దపీట వేస్తూ అందరితో కలుపుగోలుగా వ్యవహరించడం ఆ యువకుడి విధానం. ఇన్నాళ్ళు గా ఆయన అనుసరిస్తున్న విధానమే, చిన్న వయస్సులో ఆయనను పెద్దల సభకు చేర్చింది.

జలదృశ్యం నుంచి తెలంగాణభవన్ వరకూ అవిశ్రాంతంగా కొనసాగుతున్న ఆ యువకుడి ప్రస్థానం మరింత ఉత్తేజంగా కొనసాగాలని, 'తెలంగాణ' గుండె సవ్వడిని 'హస్తిన'లో సమర్థవంతంగా వినిపిస్తాడని ఆకాంక్షించడం అత్యాశ కాదు.

– శరదిందు

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@namasthetelangaana.com Fax-040-23291118

ముక్తసరి



దేవులపల్లి ప్రభాకరరావు

ఉరి కంబంపై ఉద్యమవీరులు

త్రేతాయుగంలోని శ్రీరామచంద్రుని గురించి మాట్లాడుతున్నప్పుడు రావణాసురుని ప్రస్తావన రాకతప్పదు. రాముని దూతగా ఆంజనేయస్వామి పలు అవరోధాలను అధిగమించి, పలువురుని హతమార్చి లంకా నగరంలో ప్రవేశించగానే వాల్మీకి వర్ణించింది రాక్షస చక్రవర్తి రావణాసురుని ఔన్నత్యం, లంకాపురి వైభవం గురించే. దేశభక్తులను, వారి త్యాగాలను స్మరిస్తున్నప్పుడు దేశద్రోహుల సంగతి చెప్పక తప్పదు. 1931, మార్చి 23 (నిన్నటి రోజు) లాహోర్ జైల్లో బ్రిటిష్ పాలకులు జైలు నియమాలన్నింటినీ ఉల్లంఘించారు.

ఉరికంబం ఎక్కించి, ఉరితీసిన ముగ్గురు భారతమాత ముద్దుబిడ్డలు, భారత స్వాతంత్ర్య సమరయోధులు, యువయోధులు భగత్‌సింగ్, రాజ్‌గురు (శివ్‌రామ్ హరి రాజ్‌గురు), సుఖ్‌దేవ్ తమ సన్నిహితులు, ఆత్మీయులు, శ్రేయోభిలాషులు ఎవరెన్ని ఒత్తిడిలు తెచ్చినా రాజీపడటానికి, క్షమాభిక్ష కోరడానికి అంగీకరించలేదు. అదే సమయంలో బ్రిటిష్ పాలకుల ముందు తలవంచిన వాళ్లున్నారు, క్షమార్పణ పత్రాలు రాసిచ్చిన వాళ్లున్నారు. బతికుంటే బలుసాకు ఏరుకొని తినవచ్చని, పచ్చిక మైదానాల్లో కడుపార మేయడానికి, గుమ్ములు నింపుకోవడానికి ఎన్నో కలలుగన్న దేశద్రోహులున్నారు. అందువల్లనే ఓ శతక కవి అన్నాడు.. 'పురుషులందు పుణ్య పురుషులు వేరయా' అని. బ్రిటిష్ పాలకులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ మరోక్షణం బతికుంటే ఏమవుతుందోనని గజగజలాడారు. లాహోర్ కుట్ర కేసు (పోలీసు అధికారి సాండర్స్ హత్య కేసు) విచారణను త్వరగా పూర్తిచేసి శిక్షలు విధించడానికి అప్పటి వైస్రాయ్ లార్డ్ ఇర్విన్ 1930, మే 1న ఒక ఆర్డినెన్స్ జారీచేసి ముగ్గురు హైకోర్టు న్యాయమూర్తులతో ఒక స్పెషల్ ట్రిబ్యునల్‌ను నియమించాడు. ఈ ఆర్డినెన్స్ సక్రమంగా లేదని, ఆర్డినెన్స్‌ను జారీచేసే అధికారం వైస్రాయ్‌కి లేదని కోర్టులో సవాలు చేసినా ఫలితం కనిపించలేదు. 1930, మే 5 నుంచి సెప్టెంబర్ 10 వరకు ఏక పక్ష విచారణ తతంగం నడిపిన ట్రిబ్యునల్ (ఆర్డినెన్స్, ట్రిబ్యునల్ చివరిరోజు 1930 అక్టోబర్ 31 గనుక) 1930 అక్టోబర్ 7న 300 పేజీ ల తీర్పు వెలువరించి అదేరోజు, ఆ తీర్పులోనే భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లకు ఉరిశిక్ష విధించింది. ఈ కేసులోని మరో 12 మందికి ట్రిబ్యునల్ యావజ్జీవ జైలు శిక్ష విధించింది. లండన్‌లోని ప్రీవీ కౌన్సిల్ ట్రిబ్యునల్ తీర్పుపై అప్పీలును తిరస్కరించింది. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ ఉరిశిక్షను ఆపడానికి అహింసామూర్తి గాంధీజీ, పండిత్ మద న్ మోహన్ మాలవీయ జరిపిన ప్రయత్నాలు ఫలించలేదు. మార్చి 24 న ఉరిశిక్ష అమలుజరుగాలన్న ట్రిబ్యునల్ తీర్పును మార్చి బ్రిటిష్ ప్రభు త్వం 1931 మార్చి 23 సాయంత్రం 7.30 నిమిషాలకు లాహోర్ జైల్లో ముగ్గురిని ఉరికంబం ఎక్కించింది. ముగ్గురు ఉద్యమవీరులు, స్వాతం త్ర్య సమరయోధుల పార్థివ శరీరాలను అదేరోజు రాత్రి రహస్యంగా దహనంచేసి అవశేషాలను సట్లెజ్ నదిలో నిమజ్జనం చేసింది. హింసావాదాన్ని వ్యతిరేకించేవారు సైతం దేశమంతటా, ప్రపంచమంతటా ముగ్గురి ఉరితీతను తీవ్రంగా ఖండించారు. దేశమంతటా కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ఈ ఉరితీత పట్ల ఆగ్రహావేశాలు, నిరసనలు వ్యక్తమయ్యాయి. అదే సమయాన కరాచీలో భారత జాతీయ కాంగ్రెస్ సమావేశాల్లో పాల్గొనడానికి వెళ్లిన నాయకులు ప్రజల నిరసనకు గురికావలసి వచ్చింది. దేశభక్తుల కుటుంబంలో జన్మించి, బాల్యంనుంచే, ఉగ్గు పాలతోనే స్వాతంత్ర్య వాంఛతో, దేశభక్తితో ప్రభావితుడైన భగత్‌సింగ్ ఒక లేఖలో రాసిన వాక్యాలివి.. "My life has been dedicated to the noblest cause, that of the freedom of the country. Therefore, there is no rest or wordly desire that can lure me now..." ఉరిశిక్ష నాటికి భగత్‌సింగ్ 24 ఏండ్ల యువకుడు. ఆయనతో కలిసి దేశం కోసం ప్రాణత్యాగం చేసిన రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లు యువయోధులే. ముగ్గురు స్వాతంత్ర్య సమరయోధులకు బూటకపు విచారణలో ఉరిశిక్ష విధించి, ముగ్గురిని ఒకేసారి ఉరికంబం ఎక్కించి ప్రాణాలను బలిగొన్న విషాద సంఘటన ప్రపంచంలో అంతవరకు ఎక్కడా సంభవించలేదు.

భగత్‌సింగ్, ఆయన సహచరులు దేశ స్వాతంత్ర్యం కోసం అంతులేని ఆరాటంతో అనుసరించిన హింసాత్మక విధానంతో ఏకీభవించలేకపోయినప్పటికీ స్వాతంత్ర్యప్రియులు, దేశభక్తులందరూ వారి నిరుపమాన త్యాగానికి చేతులెత్తి జోహార్లు అర్పించారు, శ్రద్ధాంజలి ఘటించారు. అదే సమయాన కరాచీలో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ మహాసభ భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల ధైర్య సాహసాలను, త్యాగనిరతిని వేనోళ్ల శ్లాఘిస్తూ తీర్మానించింది. 1931, మార్చి 29 యంగ్ ఇండియాలో అహింసా ప్రవక్త గాంధీజీ రాసిన వాక్యాలు.. The Congress made many attempts to save their lives, but all has been in vain.. Bhagat Singh refused to apologise or even file an app-eal. Bhagat Singh was not a devotee of non-violence, but he did not subscribe to the religion of violence. He took to violence due to helplessness and to defend his home land... These heroes had conquered the fear of death. Let us bow to them a thousand times for their heroism..." భగత్‌సింగ్ వ్యక్తిత్వంపై, దేశస్వాతంత్ర్యం కోసం ఆ యువనేత, ఆయన సహచరులు అనుసరించిన విధానాలపై గాంధీజీ విశ్లేషణ సహేతుకమైనది. బ్రిటిష్ వలస, దుష్టపాలనకు వ్యతిరేకంగా గత శతాబ్ది ఆరంభంలో లోకమాన్య బాలగంగాధరతిలక్ వ్యక్తపరిచిన అభిప్రాయాలను, ఆయన అనుసరించాలనుకున్న విధానాలను 'అతివాదం'గా పరిగణించారు. గోపాలకృష్ణ గోఖలే అభిప్రాయాలను, ఆయన సూచనలను 'మితవాదం'గా భావించారు. వాదం ఏదైనా వారి లక్ష్యం ఒక్కటే. స్వాతంత్ర్య సాధన, పరాయి పాలననుంచి భారత విముక్తి. ఇదే లక్ష్యంతో భగత్‌సింగ్, ఆయన మిత్రులు, సహచరులు వారు మేలనుకున్న, వారు సత్వర ఫలితాలు లభిస్తాయనకున్న విధానాన్ని అనుసరించారు. బ్రిటిష్ సామ్రాజ్యంలో భాగంగా, బ్రిటిష్ పాలన కింద డొమినియన్‌స్థాయి పొందితే చాలు జీవితం ధన్యమవుతుందని కొందరు మితవాదులు భావిస్తున్న రోజుల్లో భారత జాతీయ కాంగ్రెస్ ఒక అడుగుముందుకు వేసి స్వాతంత్ర్యమే తమ లక్ష్యమని మదరాసు మహాసభలో తొలిసారి తీర్మానించింది. జవహర్‌లాల్ నెహ్రూ, సుభాష్ చంద్రబోస్ మరికొన్ని అడుగులు ముందుకువేసి, అతివాదులుగా పట్టుపట్టడంతో 1929లో (1928లో దేశమంతటా సైమన్ కమిషన్‌ను నిరసన నినాదాలతో బహిష్కరించడంతో) లాహోర్‌లో, రావి నదీతీరంలో భారత జాతీయ కాంగ్రెస్ సంపూర్ణ స్వరాజ్యం తమ లక్ష్యమని ప్రకటించవలసి వచ్చింది.

> 1921 ఫిబ్రవరిలో గురుద్వార నన్‌కానాసాహెబ్‌లో అనేక నిరాయుధుల వధ 14 ఏండ్ల బాలుడు భగత్‌సింగ్ హృదయాన్ని క్షోభింపజేసింది. ఈ ఘటనలన్నింటికీ పరాకాష్ఠగా 1928లో సైమన్ కమిషన్‌ను బహిష్కరిస్తున్న లాలాలజపత్‌రాయ్‌పై బ్రిటిష్ పోలీసు అధికారి జేమ్స్ స్కాట్ లాఠీచార్జి, తర్వాత కొద్దిరోజులకే లాలాజీ మృతి యువకుడు భగత్‌సింగ్‌లో ప్రతీకారాగ్నిని ప్రజ్వరిల్లచేసింది. భగత్‌సింగ్ ఒక హింసావాదిగా మారి దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణార్పణం చేయడానికి ఈ సంఘటనలన్నీ ప్రేరణ కలిగించాయి.

భగత్‌సింగ్ వ్యక్తిత్వ పరిణతి, వికాసాలపై సమకాలిక సంఘటనలు, పరిణామాల ప్రభావం స్పష్టంగా కనిపిస్తున్నది. నాటి పంజాబ్ ప్రావిన్స్ లాయల్పూర్ జిల్లా జరన్‌వాలా తహసీల్ బంగా గ్రామంలో (ఇప్పుడు ఈ గ్రామం పాక్ పంజాబ్‌లో ఉంది) 1907, సెప్టెంబర్ 28న ఒక దేశభక్తుల జాట్ కుటుంబంలో భగత్‌సింగ్ జన్మించాడు. తల్లి విద్యావతి కౌర్, తండ్రి కిషన్‌సింగ్ సంధు. భగత్‌సింగ్ తండ్రి, దగ్గరి బంధువులు గదర్ పార్టీ సభ్యులు. భగత్‌సింగ్ పుట్టిన వెంటనే తండ్రి లాహోర్ జైలు నుంచి, మరో బంధువు మాండలె జైలు నుంచి విడుదలైనారు. భగత్‌సిం గ్ అదృష్టవంతుడని సంతోషపడి నాయనమ్మ ఆ పసిబిడ్డను 'భగవాన్ వాలా' అని పిలిచి ముద్దాడింది. వారిది విభిన్న సిద్ధాంతాలు, విశ్వాసాల కుటుంబం. భగత్‌సింగ్ తాత అర్జున్‌సింగ్ ఆర్యసమాజ్ స్థాపకుడు దయానంద సరస్వతి అనుయాయి. గదర్ పార్టీ విప్లవ భావాలు, ఆర్య సమాజ్ హైందవ సంస్కరణ సిద్ధాంతాలు బాల్యంలోనే భగత్‌సింగ్‌పై ప్రభావాన్ని ప్రసరించాయి. సిక్కు పిల్లలు చదివే ఖాల్సా హైస్కూల్‌లో చదివించకుండా తాత అర్జున్‌సింగ్ తన మనుమడు భగత్‌సింగ్‌ను ఆర్యసమాజ్ వారి దయానంద్ ఆంగ్లో వేదిక్ పాఠశాలలో చేర్పించాడు. అనతి కాలంలోనే తన మనుమడు ఒక ప్రసిద్ధ విప్లవకారుడిగా, ఒక మార్క్సిస్టుగా, ఒక నాస్తికుడిగా రూపొందబోతున్నాడని తాత అర్జున్‌సింగ్ ఊహించలేదు. పసితనంలోనే భగత్‌సింగ్ మేధస్సు, విజ్ఞానం, స్వాతం త్ర్యభావాలు విస్మయకరంగా వికసించాయి. అమృత్‌సర్ జలియన్ వాలాబాగ్‌లో (1919 ఏప్రిల్‌లో) వేలాది అమాయకుల వధ (డయ్యర్ రాక్షసత్వంతో) పన్నెండేండ్ల బాలుడు భగత్‌సింగ్ హృదయాన్ని విలపిం పజేసింది. వెంటనే బాలుడు భగత్‌సింగ్ జలియన్‌వాలాబాగ్ వెళ్లి శ్రద్ధాంజలి ఘటించాడు. చౌరీచారాలో హింస చెలరేగిందని గాంధీజీ ఉద్యమా న్ని తాత్కాలికంగా విరమించడం భగత్‌సింగ్‌కు నిస్పృహ కలిగించింది. 1921 ఫిబ్రవరిలో గురుద్వార నన్‌కానాసాహెబ్‌లో అనేక నిరాయుధుల వధ 14 ఏండ్ల బాలుడు భగత్‌సింగ్ హృదయాన్ని క్షోభింపజేసింది. ఈ ఘటనలన్నింటికీ పరాకాష్ఠగా 1928లో సైమన్ కమిషన్‌ను బహిష్కరిస్తున్న లాలాలజపత్ రాయ్‌పై బ్రిటిష్ పోలీసు అధికారి జేమ్స్ స్కాట్ లాఠీచార్జి, తర్వాత కొద్దిరోజులకే లాలాజీ మృతి యువకుడు భగత్‌సింగ్‌లో ప్రతీకారాగ్నిని ప్రజ్వరిల్లచేసింది. భగత్‌సింగ్ ఒక హింసావాదిగా మారి దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణార్పణం చేయడానికి ఈ సంఘటనలన్నీ ప్రేరణ కలిగించాయి. భగత్‌సింగ్ అహింసామార్గాన్ని కూడా అనుసరించి మియావలి జైలులో ఖైదీల హక్కులకోసం నిరాహారదీక్ష ప్రారంభించాడు. తర్వాత లాహోర్ జైల్‌లో కూడా భగత్‌సింగ్ నిరాహార దీక్ష కొనసాగించి 116వ రోజున (1929 అక్టోబర్ 5న) విరమించడం ఒక ఉజ్వలఘటన. భగత్‌సింగ్ రచయిత, పత్రికాసంపాదకుడు, మేధా వి. తన జీవితకాలంలో లెనిన్‌పై అధ్యయనం పూర్తిచేయాలన్న ఆయన కోరిక నెరవేరడం విశేషం.

కేసీఆర్ విధానం రైతుకు భరోసా

తెలంగాణం



రమేశ్ హజారి

తనకు తాను ఏమీ కానని తనకు ఎవరూ లేరని భావించే పరిస్థితులు నెలకొన్నప్పుడు ఒక మనిషిని ఆ సమాజం అక్కున చేర్చుకోకపోవడం అంటే, అతన్ని నిరాశ, నిస్పృహలకు గురిచేసి ఆత్మహత్యకు పురికొల్పడమే అంటాడు ఇమైల్ దుర్ఖైమ్ అనే ఫ్రెంచ్ సామాజిక శాస్త్రవేత్త.

ఆత్మహత్య వ్యక్తి వైఫల్యం కాదు అది సమాజ వైఫల్యం అనీ, అది వ్యక్తి సమస్య కాదు సామాజిక సమస్య అని నిర్వచిస్తాడు ఎమిల్. గత 60 ఏండ్లుగా తెలంగాణను ఏలిన వలస పాలకులు రైతుకు ఏ సాయమూ అందించక, ఒంటరిగా వదిలి అతని ఆత్మహత్యకు కారణమైతే, వారికి నేనున్నానని భరోసానందిస్తూ కేసీఆర్ తెలంగాణ రైతును ఆత్మహత్య భావన నుంచి ఆత్మవిశ్వాసం పెంపొందించే దిశగా ముందుకు తీసుకుపోతున్నడు. తెలంగాణలో రైతు ఆత్మహత్యలు తగ్గుముఖం పట్టినయని పార్లమెంటులో కేంద్ర వ్యవసాయ శాఖామంత్రి ప్రకటించడం వెనుక ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకుంటున్న నిర్ణయాలే కారణం.

భూ తల్లి, ప్రకృతి మీద భరోసా పెట్టి లక్షలాది రూపాయలను పెట్టుబడిగా పెడుతున్న రైతన్నను గాలికొదిలిపెట్టిన ప్రభుత్వాలు ఈ దేశాన్ని 70 ఏండ్లుగా ఏలుతున్నై. వ్యవసాయాన్ని ఓ తమాషా తంతుగా చూస్తున్నై. దూరదృష్టి కొరవడి స్వార్థ రాజకీయాలతో రైతు చావుకు ప్రత్యక్ష, పరో క్షంగా కారణమవుతూ, రైతు ఆత్మహత్యలను ఎన్నికల వ్యవసాయంలో ఎరువుగా వాడుకుంటున్నయి. ఆంధ్రాకు సాగునీటి కాల్వలను మళ్లించుక పోవడం మీద ఉన్న ధ్యాస తెలంగాణ రైతు కన్నీటిని తుడువడానికి లేకుం డె నాటి పాలకులకు. అప్పులపాలై, వేసిన బోర్ల ఖర్చు తడిసి మోపెడై రైత న్న మెడలకు ఉరితాళ్లు పేనినయే తప్ప నీటిధారలను కురిపించలేదు. ఆదుకునేవారు లేరనే నైరాశ్యంలో ఆత్మహత్యలకు పాల్పడ్డ తెలంగాణ రైతును ఇవాళ తెలంగాణ ప్రభుత్వం కడుపుల దాసుకొని కొండంత భరోసా అందిస్తున్నది.

తెలంగాణలో సీఎం కేసీఆర్ తీసుకున్న విధానపరమైన నిర్ణయాలన్నీ రైతు కేంద్రంగానే ఉన్నయి. మిషన్ కాకతీయతో ప్రారంభమైన తెలంగాణ రైతు భరోసాయాత్ర, కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం మీదుగా ఎకరానికి 8 వేల పెట్టుబడిదాక చేరి తెలంగాణ రైతుకు భవిష్యత్తు మీద భరోసాను పెంచింది. దేశం గర్వించదగ్గస్థాయిలో నిర్మాణమవుతున్న సాగునీటి ప్రాజెక్టుల నుంచి వ్యవసాయ పెట్టుబడిదాకా రైతుకు గుండె ధైర్యాన్నిస్తున్నది. వివిధ పథకాల రూపంలో కేసీఆర్ రైతుకు ఇస్తున్న భరోసా రైతు సమాజాన్ని గుణాత్మకంగా మార్చివేస్తున్నది. తద్వారా వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపుతున్నది. తెలంగాణ రైతు, కూలీలను ఆత్మహత్య నుంచి ఆత్మవిశ్వాసం వైపు మళ్లిస్తున్నది. ఒకనాడు ఎవడూ కానని వ్యవసాయ భూములు నేడు ధరల రెక్కలు తొడుగడం ప్రారంభించినయి. ప్రపంచ వ్యవసాయ చరిత్రలోనే ఏ ప్రభుత్వం తీసుకోని నిర్ణయాలతో వ్యవసాయం దండుగ కాదు పండుగ అనే నినాదాన్ని నిజం చేసి చూయిస్తున్నది.

దేశవ్యాప్తంగా జరుగుతున్న రైతు ఆత్మహత్యలతో పోల్చితే తెలంగాణ రైతన్నల ఆత్మహత్యలు గత మూడేండ్లలో అధికశాతం తగ్గిపోవటం కేసీఆర్ దార్శనికతకు సాక్ష్యం. దేశం మొత్తమ్మీద 2015,16 సంవత్సరాల్లో జరిగిన రైతు ఆత్మహత్యల గణాంకాల వివరాలను పరిశీలిస్తే.. తెలంగాణలో ఆత్మహత్యలు యాభై శాతానికి తగ్గిపోయినయి. తెలంగాణ వచ్చిన కొత్తలో అంటే 2015 లో నాటి వలసపాలన ప్రభావంతో 1400 మంది రైతులు ఆత్మహత్యలు చోటుచేసుకుంటే, కేసీఆర్ పాలనలో 2016 కల్లా వాటి సంఖ్య 645కు తగ్గాయి. స్వయంపాలనలో దాదాపు 54 శాతానికి రైతు ఆత్మహత్యలు తగ్గిపోయినయి. తెలంగాణ వచ్చేనాటికి 449 మంది వ్యవసాయకూలీలు ఆత్మహత్య చేసుకుంటే 2015లో ఆ సంఖ్య 42కు పడిపోయి, 2016కల్లా 13 మందికి తగ్గాయి. అభివృద్ధి అనేది 'కంపారిటివ్' అనే సంగతిని తెలంగాణ ప్రభుత్వాన్ని విమర్శించే నిత్య నిరసనకారులు మర్చిపోతున్నరు.

> తెలంగాణ రైతుకు ఇప్పుడిప్పుడే ఆత్మవిశ్వాసం పెరుగుతున్నది. రాబోయే కొద్దిరోజుల్లో ప్రతి ఎకరాన్నీ తడుపనున్న గంగమ్మ కోసం ఉత్సాహంగా ఎదురుచూస్తున్నడు తెలంగాణ రైతన్న. ఈ నేపథ్యంలో ఓట్ల రాజకీయాల కోసం రైతులను పావులుగా వాడుకునే ప్రయత్నాన్ని ప్రతిపక్షాలు మానుకోవాలె. బాధ్యతారహిత ప్రవర్తనతో రైతు కూలీ బిడ్డలను మరింత నిరుత్సాహంలోకి నెట్టడం వారిని ఆత్మహత్యలకు ప్రేరేపించడమే.

2015లో మహారాష్ట్రలో రైతుల ఆత్మహత్యలు 1491 జరిగితే, 2016లో వాటి సంఖ్య 3661కి పెరిగింది. అంటే 145 శాతం పెరుగుదల అన్న మాట. అట్లనే కర్ణాటకల 32.5 శాతం, మధ్యప్రదేశ్‌లో మూడు శాతం రైతు ఆత్మహత్యలు పెరిగితే, తెలంగాణల మాత్రం 54 శాతానికి తగ్గినయి. అదే ఛత్తీస్‌గఢ్‌లో 39.8 శాతానికి, తమిళనాడులో 37.1 శాతానికి మాత్రమే రైతు ఆత్మహత్యలు తగ్గినయి. ఆంధ్రప్రదేశ్‌లో ఆత్మహత్యల తగ్గుదల 13.9 శాతం మాత్రమే. ఈ గణాంకాలను చూస్తే, తెలంగాణలో సామాజిక భద్రత పెరిగిందనీ, రైతుకు రేపటిమీద ఆశలు చిగురిస్తున్నయ ని అర్థమవుతున్నది. అదే సమయంలో బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లోనే రైతు ఆత్మహత్యలు పెరుగుతున్నయనీ గణాంకాలు చెప్తున్నయి.

ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయాల ఫలితంగానే తెలంగాణలో సామాజిక భద్రత పెరిగి ఆత్మహత్యలు తగ్గుతున్నయని చెప్పవచ్చు. రైతును ఆదుకోవడం అంటే మరణించిన తర్వాత ఎక్స్‌గ్రేషియా ఇవ్వడమనే వలస పాలనలోని బాధ్యతారహిత ఆలోచనా విధానం నుంచి విడివడి ఆలోచించ గలిగిండు కాబట్టే ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయాలు సత్ఫలితాలనిస్తున్నయి. మిషన్ కాకతీయ, 24 గంటల విద్యుత్ ఉచిత సరఫరా, సకాలంలో ఎరువులు విత్తనాలు, గోడౌన్ల నిర్మాణం, పెట్టుబడికి ఎకరానికి 8 వేలు, వ్యవసాయ యాంత్రీకరణ, గ్రీన్‌హౌజ్, పాలీహౌజ్ తదితర పథకాల ద్వారా తెలంగాణ రైతుకు నేరుగా సహకారం అందుతున్నది. మరోపక్క కళ్యాణలక్ష్మీ, అమ్మఒడి, కేసీఆర్ కిట్, గురుకుల పాఠశాలల వంటి పథకాల ద్వారా విద్య, వైద్యం తదితర కుటుంబ ఖర్చులను తగ్గించి సామాజిక భద్రత పెరుగడానికి దోహదపడుతున్నది. రైతుకూలీలుగా జీవిస్తున్న గొల్ల, కురుమ, ముదిరాజ్, బెస్త తదితర వృత్తికులాల కోసం ప్రత్యేకంగా గొర్రెలు, చేపల పెంపకం వంటి పథకాలను ప్రకటించింది కేసీఆర్ ప్రభుత్వం. తద్వారా ఆర్థిక స్వావలంభనను చేకూర్చి వ్యవసాయాన్ని, వ్యవసాయాధారిత రంగాలను సంపద సృష్టించే కేంద్రాలుగా మార్చి గ్రామ ఆర్థిక వ్యవస్థలో విప్లవాత్మక పరిణామాలకు శ్రీకారం చుట్టిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుంది.

ఈ నేపథ్యంలో మూసపద్ధతిలో విమర్శలకు పూనుకోవడం తగదు. తెలంగాణ రైతుకు ఇప్పుడిప్పుడే ఆత్మవిశ్వాసం పెరుగుతున్నది. రాబోయే కొద్దిరోజుల్లో ప్రతి ఎకరాన్నీ తడుపనున్న గంగమ్మ కోసం ఉత్సాహంగా ఎదురుచూస్తున్నడు తెలంగాణ రైతన్న. ఈ నేపథ్యంలో ఓట్ల రాజకీయాల కోసం రైతులను పావులుగా వాడుకునే ప్రయత్నాన్ని ప్రతిపక్షాలు మానుకోవాలె. బాధ్యతారహిత ప్రవర్తనతో రైతు కూలీ బిడ్డలను మరింత నిరుత్సాహంలోకి నెట్టడం వారిని ఆత్మహత్యలకు ప్రేరేపించడమే. ఆత్మహత్యల నుంచి ఆత్మవిశ్వాసం వైపు తెలంగాణ రైతన్నను నడిపిస్తున్న కేసీఆర్ ప్రభుత్వవిధానాలను భగ్నంచేయడం నేరానికి పాల్పడటమే అవుతుంది.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.437, Near Velama Kalyana Mandapam, Devara Yamjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078, Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

ఆచరణలోకి 'సింగరేణి' వరాలు

ఇచ్చినమాట నిలబెట్టుకుంటున్న సీఎం కేసీఆర్


సింగరేణి కార్మికుల కండ్లల్లో ఆనందం ● అమలవుతున్న ఆదేశాలు

- **కారుణ్య నియామకాలు, వైద్యం, కొత్త క్వార్టర్ల నిర్మాణం**

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఇచ్చినమాట నిలబెట్టుకుంటారని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు మరోసారి నిరూపించారు. ఫిబ్రవరి 27న శ్రీరాంపూర్‌లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో సీఎం కేసీఆర్ సింగరేణి కార్మికులకు పలు హామీలిచ్చారు. నెల కూడా పూర్తికాకముందే అవి ఆచరణలోకి వస్తుండటంతో సింగరేణి కార్మికులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలు, రిటైర్డ్ ఉద్యోగులకు వైద్యం, కొత్త క్వార్టర్ల నిర్మాణం వంటి హామీలపై సింగరేణి సంస్థ వరుసగా సర్క్యులర్ జారీచేసింది. కారుణ్య నియామకాలపై మెడికల్ బోర్డు ఏర్పాటుకు మార్చి 9న సర్క్యులర్ జారీచేసింది. ఈ బోర్డు వచ్చేవారం నుంచి క్రమం తప్పకుండా సమావేశమవుతూ కారుణ్య నియామకాల ప్రక్రియను వేగవంతంగా, సజావుగా నిర్వహించనుంది. తద్వారా సింగరేణివ్యాప్తంగా కారుణ్య నియామకాలు జరగనున్నాయి. కార్మికులకు నీటిబిల్లు, విద్యుత్ బిల్లుల చెల్లింపు నుంచి పూర్తిగా మినహాయించాలని సీఎం కేసీఆర్ ఆదేశించిన నేపథ్యంలో యాజమాన్యం ఉత్తర్వులు జారీచేసింది. కొత్తగా పదివేల క్వార్టర్ల నిర్మాణానికి తొలి దశలో రూ.వంద కోట్లు మంజూరు చేసింది. శ్రీరాంపూర్ ప్రాంతంలో కంపెనీ స్థలాల్లో ఇండ్లు నిర్మించుకున్నవారికి ఇంటి పట్టాలు ఇచ్చేందుకు కంపెనీ సీఎండీ శ్రీధర్ మంచిర్యాల జిల్లా కలెక్టర్‌తో చర్చించారు. పదవీ విరమణ చేసిన సింగరేణి ఉద్యోగులకు నెలవారి పెన్షన్లు పెంచడానికి చర్యలు తీసుకోవాలని, ఈలోపుగా వెంటనే వారికి కంపెనీ ద్వారా ఉచిత వైద్య సేవలు అందించడానికి ఆదేశాలు ఇవ్వాలని సీఎం కేసీఆర్ యాజమాన్యాన్ని కోరారు. దీనిపై యాజమాన్యం తక్షణమే స్పందిస్తూ రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్ వ్యవహారాలను చూసే కోల్‌మైన్స్ ప్రావిడెంట్‌ఫండ్ (ధన్‌బాద్)కు లేఖ రాసింది. నెలవారీ పెన్షన్‌ను రూ.350 నుంచి రూ.8,000కు పెంచాలని లేఖలో పేర్కొంది. రిటైరైన ఉద్యోగులందరికీ ఉచిత వైద్య సేవలందించడానికి అంగీకరిస్తూ మార్చి 22వ తేదీన సర్క్యులర్ జారీచేసింది.

తెలంగాణలో సాహితీ వికాసం

- **జాతీయ సదస్సులో సాహిత్య అకాడమీ చైర్మన్ నందిని సిధారెడ్డి**



రవీంద్రభారతి: తెలంగాణలో సాహితీ వికాసం జరుగుతున్నదని సాహిత్య అకాడమీ చైర్మన్ డాక్టర్ నందిని సిధారెడ్డి అన్నారు. రవీంద్రభారతిలో శుక్రవారం తెలంగాణ సాహిత్య అకాడమీ, వారధి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండురోజుల జాతీయ సదస్సు ప్రారంభోత్సవ సభలో ఆయన ప్రసంగించారు. తెలంగాణ తనను తాను వెతుక్కుంటున్న సమయం ఇది అన్నారు. 'కాకతీయుల నుంచి అసఫ్ జాహీల వరకు తెలంగాణ' శీర్షికన చారిత్రక తెలంగాణ సంస్కృతి, భాష, సాహిత్యంపై వారధి సంస్థతో కలిసి సదస్సు నిర్వహించటం విశేషమని చెప్పారు. తెలంగాణలో అద్భుతమైన సాహిత్యం ఉన్నదని, తెలంగాణ రాష్ట్రం వచ్చిన తరువాత అది ఆవిష్కృతం అవుతున్నదని పేర్కొన్నారు. హైదరాబాద్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ జీ అరుణకుమారి అధ్యక్షతన జరిగిన ఈ సభలో చారిత్రక పరిశోధకులు డీ రాజారెడ్డి, కే జితేంద్రబాబు, సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ, ఆచార్య శరత్‌జ్యోత్స్నరాణి, మల్లెగోడ గంగాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆశ వర్కర్లు సీఎంకు రుణపడి ఉండాలి

- **టీఆర్‌ఎస్‌కేవీ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు**



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆశ వర్కర్ల జీవితాల్లో వెలుగునింపిన గొప్ప నేత ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అని, ఆయనకు ఉద్యోగులందరు రుణపడి ఉండాలని తెలంగాణ రాష్ట్ర సమితి కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జీ రాంబాబు అన్నారు. టీఆర్‌ఎస్‌కేవీ అనుబంధ గ్రామీణ ఆరోగ్య కార్యకర్తల (ఆశ కార్యకర్తల) సంఘం రాష్ట్రస్థాయి సమావేశం శుక్రవారం తెలంగాణ భవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ ఇప్పటికే రూ.6 వేలుగా వేతనం పెంచిన ముఖ్యమంత్రి త్వరలో మరింత పెంచేందుకు సానుకూలంగా ఉన్నారని చెప్పారు. యూనిఫాం, ఆరోగ్య భద్రత వంటివి సాధించేందుకు ప్రయత్నిస్తామని అన్నారు. కార్యక్రమంలో టీఆర్‌ఎస్‌కేవీ ప్రధాన కార్యదర్శి నారాయణ, కన్వీనర్ మాధవి, నాయకులు శారద, కరుణ, రేణుక, శోభ తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఉపాధి దిశగా జైళ్లశాఖ

- **జైళ్లశాఖ డీజీ వీకే సింగ్ వెల్లడి**



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: యాచకులు లేని నగరంగా హైదరాబాద్‌ను మార్చేందుకు చేసిన ప్రయత్నాలు సత్ఫలివ్వడంతో యువతకు ఉపాధి కల్పన దిశగా తమ శాఖ దృష్టి సారించినట్టు జైళ్లశాఖ డీజీ వీకేసింగ్ చెప్పారు. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థల సహకారంతో గ్రామీణ పేదలకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా కార్యాచరణ రూపొందిస్తున్నట్టు తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ జైళ్లశాఖ ఆధ్వర్యంలో పరిశ్రమల సంఖ్య పెంచడంతోపాటు 2020 నాటికి 100 పెట్రోల్ బంక్‌లను ఏర్పాటుచేయనున్నట్టు చెప్పారు. త్వరలో దేవరకొండ, మిర్యాలగూడ, జడ్చర్ల, నాగర్‌కర్నూల్, సంగారెడ్డి, హుజురాబాద్‌లలో ఆరు కొత్తగా పెట్రోల్‌బంక్‌లను ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. విజయ డెయిరీ సహాయంతో వారి ఔట్‌లెట్లలో జైళ్లశాఖ ప్రాడక్ట్స్‌ను కూడా ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రభుత్వ ప్రోత్సాహంతో చేపట్టిన అనేక సంస్కరణలు మంచి ఫలితాలు ఇస్తున్నాయని డీజీ వివరించారు. మూడున్నరేండ్లుగా తీసుకుంటున్న పలు కార్యక్రమాలతో రిపీటెడ్ నేరగాళ్ల సంఖ్య తగ్గిందని అన్నారు. సమావేశంలో ఐజీ ఆకుల నరసింహ, డీఐజీ సైదయ్య తదితరులు పాల్గొన్నారు.



ఎయిర్‌పోర్టు విస్తరణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్. చిత్రంలో మంత్రులు కేటీఆర్, మహేందర్‌రెడ్డి, ఏవియేషన్ కార్యదర్శి రాజీవ్ నయన్‌చౌబే, జీఎమ్మార్ చైర్మన్ గ్రంధి మల్లికార్జునరావు, ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు తీగల కృష్ణారెడ్డి, ప్రకాశ్‌గౌడ్



శుక్రవారం శంషాబాద్ విమానాశ్రయ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ఎయిర్‌పోర్టు నమూనాను పరిశీలిస్తున్న సీఎం కే చంద్రశేఖర్‌రావు. చిత్రంలో మంత్రులు కేటీఆర్, మహేందర్‌రెడ్డి, సీఎస్ ఎస్కే జోషి తదితరులు కూడా ఉన్నారు.

విమాన ఇంధనంపై వ్యాట్ తగ్గింపు

- **ఎయిర్‌పోర్టు ఎక్స్‌ప్రెస్ కనెక్టివిటీకి రూ.4,650 కోట్లు**
- **అంతర్జాతీయస్థాయిలో హైదరాబాద్**
- **శంషాబాద్ విమానాశ్రయం దశాబ్ది వేడుకల్లో మంత్రి కేటీఆర్**



శుక్రవారం శంషాబాద్ ఎయిర్‌పోర్టు దశాబ్ది ఉత్సవాలకు హాజరైన విమానాశ్రయ అధికారులు, సిబ్బంది తదితరులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గ్లోబల్ సిటీగా మారుతున్న హైదరాబాద్‌లోని అంతర్జాతీయ ఎయిర్‌పోర్టుకు ఎక్స్‌ప్రెస్ కనెక్టివిటీ కోసం రాష్ట్ర బడ్జెట్‌లో రూ.4,650 కోట్లు కేటాయించినట్టు ఐటీ, పరిశ్రమలశాఖమంత్రి కే తారకరామారావు తెలిపారు. రాష్ట్రంలో విమాన ఇంధనంపై ప్రస్తుతం ఉన్న వ్యాట్ (16 శాతం)ని ఒకశాతం మేర తగ్గిస్తున్నట్టు ప్రకటించారు. శుక్రవారం జీఎమ్మార్ అంతర్జాతీయ విమానాశ్రయ దశాబ్ది వేడుకల్లో మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ ఈ విమానాశ్రయం 2008లో ఏడాదికి కోటీ 20 లక్షల సామర్థ్యంతో మొదలైందని, ఏటేటా ఏడుశాతం వృద్ధితో కోటిన్నర ప్రయాణికులకు పెంచుకున్నదని కొనియాడారు. అనతికాలంలోనే పది కోట్లకు చేరుకుంటుందని జీఎమ్మార్ గ్రూపు అధినేతలు ప్రకటించడం, పదేండ్లలో ఊహించని విధంగా పురోగతిని సాధించడం ఎంతో స్ఫూర్తినిస్తుందన్నారు. ఎక్కడో రాజాం నుంచి వచ్చి అంతర్జాతీయస్థాయికి ఎదగడం అమోఘమన్నారు. హైదరాబాద్ ఎయిర్‌పోర్టుకు రోడ్డు, రైలు, మెట్రో రైలు, ఎంఎంటీఎస్ కనెక్టివిటీ కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని చెప్పారు. హైదరాబాద్ ఫాస్టెస్ట్ గ్రోత్‌సిటీగా త్వరితగతిన అభివృద్ధి చెందుతున్నదని, మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తుందని తెలిపారు. హైదరాబాద్‌ను అంతర్జాతీయ స్థాయిలో నిలబెట్టేందుకు పక్కా ప్రణాళికతో అడుగులు వేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు తీసుకుంటున్న పరిపాలన సంస్కరణల్లో భాగంగా సంక్షేమంతోపాటు అభివృద్ధి పోటీపడుతున్నాయని పేర్కొన్నారు. హైదరాబాద్ అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు ప్రయాణికులకు అందిస్తున్న సేవలు, సౌకర్యాలు, గ్రీనరీ అమితంగా ఆకట్టుకుంటున్నాయన్నారు. ప్రయాణికులకు అందిస్తున్న సేవలకుగాను ఎన్నో అవార్డులు అందుకొని దేశంలో నంబర్-1 విమానాశ్రయంగా వెలుగొందుతున్నదని ప్రశంసించారు. ఎయిర్‌పోర్టు ప్రాంతంలో జీఎమ్మార్ 12 వేలమంది సామర్థ్యంతో.. మెగా కన్వెన్షన్ కం ఎగ్జిబిషన్ సెంటర్ నిర్మిస్తున్నందున.. పెద్దపెద్ద సెమినార్లు, ఎగ్జిబిషన్లు, మీటింగులు ఏర్పాటు చేసుకునే అవకాశం కలుగుతుందని చెప్పారు. పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్‌లో జీఎమ్మార్ ఆధ్వర్యంలో వరలక్ష్మీ ఫౌండేషన్ ట్రస్టు చేస్తున్న పలు రకాల స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు ఎంతగానో పేదలకు ఉపయోగపడుతున్నాయని కొనియాడారు. 'షైనింగ్ హైదరాబాద్' వెలుగులు విరజిమ్ముతూ అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నదని.. ఇందుకు ప్రభుత్వం చూపిస్తున్న చొరవ కారణమని పేర్కొన్నారు. భవిష్యత్‌లో జీఎమ్మార్ సేవలను తెలంగాణవ్యాప్తంగా విస్తృతం చేయాలని సూచించారు.

రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపిస్తున్న కేసీఆర్: జీఎమ్మార్ చైర్మన్

సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో పయనింపజేస్తున్నారని జీఎమ్మార్ చైర్మన్ గ్రంధి మల్లికార్జునరావు పేర్కొన్నారు. హైదరాబాద్‌ను గ్లోబల్‌సిటీగా మార్చేదిశలో అభివృద్ధి పునాదులు వేసుకుంటున్నాయని అన్నారు. సీఎం అనేక రకాల సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రజారంజక పాలన చేస్తున్నారని కొనియాడారు. ఒకప్పుడు తెలంగాణ కరంట్ కోతలతో ఇబ్బందులు పడుతుండేదని, నేడు నిరంతర విద్యుత్ కాంతులతో మిగులు స్థాయికి చేరుకుంటున్నదని గుర్తుచేశారు. టీఎస్ ఐపాస్ ద్వారా రాష్ట్రానికి పెట్టుబడులను ఆహ్వానించి పరిశ్రమలకు సులువుగా అనుమతులు అందించి అభివృద్ధికి బాటలు వేసిందన్నారు. దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని నంబర్-1గా నిలబెడుతున్నారని పేర్కొన్నారు. ప్రధానంగా మిషన్‌భగీరథ, మిషన్ కాకతీయ లాంటి పథకాలను దిగ్విజయంగా అమలుచేస్తున్నారని చెప్పారు. దశాబ్ది ఉత్సవాల సందర్భంగా జీఎమ్మార్ అభివృద్ధిలో భాగస్వామ్యమై వివిధరంగాల్లో సేవలందించినవారికి మంత్రి కేటీఆర్ జ్ఞాపికలను అందించారు. ఈ కార్యక్రమంలో ఏవియేషన్ కార్యదర్శి రాజీవ్ నయన్‌చౌబే, ప్రభుత్వ ప్రధానకార్యదర్శి ఎస్కే జోషి, రవాణాశాఖ మంత్రి మహేందర్‌రెడ్డి, డీజీపీ మహేందర్‌రెడ్డి, ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ప్రకాశ్‌గౌడ్, తీగల కృష్ణారెడ్డి, జీఎమ్మార్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టు విస్తరణకు సీఎం కేసీఆర్ శంకుస్థాపన

హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని విస్తరించే పనులకు శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు పునాదిరాయి వేశారు. జీఎమ్మార్ హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయ శతాబ్ది ఉత్సవాల్లో సీఎం కేసీఆర్ ముఖ్య అతిథిగా పాల్గొని పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. దీనితో మరో 40 మిలియన్ ప్రయాణికుల సామర్థ్యం గల ఎయిర్‌పోర్టు విస్తరణ పనులు జరుగనున్నాయి. అలాగే మెగా కన్వెన్షన్ కం ఎగ్జిబిషన్ సెంటర్‌కు సీఎం శంకుస్థాపన చేశారు. ఈ కన్వెన్షన్ సెంటర్‌ను 12,000 మంది ఒకేచోట కూర్చుని సెమినార్లు, మీటింగ్‌లు పెట్టుకునేందుకు అనువుగా నిర్మించనున్నారు. అంతర్జాతీయ సెమినార్లు నిర్వహించుకునే స్థాయిలో నిర్మాణాలు చేపట్టడం హైదరాబాద్‌లో ఇదే మొదటిసారి. దీనితోపాటు భారతదేశపు మొట్టమొదటి స్మార్ట్, గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ సిటీని ప్రారంభించారు. ఈ సందర్భంగా దశాబ్దపు శ్రేష్ఠతను పురస్కరించుకుని స్టాంపును, ఎన్వలప్‌ను విడుదల చేశారు. ఈ శంకుస్థాపన కార్యక్రమాల్లో మంత్రులు కేటీఆర్, మహేందర్‌రెడ్డి, జీఎమ్మార్ చైర్మన్ గ్రంధి మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

పాత రుణాలూ మాఫీ



చేనేతన్నలపై ప్రభుత్వ ఔదార్యం -మరో నాలుగేండ్ల ముందు నుంచీ మాఫీ వర్తింపు

2010 ఏప్రిల్ 1 నుంచి రుణమాఫీ వర్తింపజేస్తూ జీవో జారీ

తాజా నిర్ణయంతో రెట్టింపు చేనేత కార్మికులకు లబ్ధి

సుమారు 8,500 మందికి, రూ.40 కోట్ల రుణాలు మాఫీ

రుణాలు చెల్లించినవారికి కూడా రూ.లక్ష వరకు జమ చేయనున్న ప్రభుత్వం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: చేనేతన్నలకు రాష్ట్ర ప్రభుత్వం మరింత ఊరట కల్పించింది. చేనేత కార్మికులకు రాష్ట్రం ఏర్పడటానికి పూర్వం ఉన్న రుణాలను కూడా మాఫీ చేయాలని నిర్ణయించింది. తొలుత నిర్ణయించిన విధంగా 2014 జనవరి 1 నుంచి కాకుండా 2010 ఏప్రిల్ 1 నుంచే రుణమాఫీని వర్తింపజేస్తూ.. శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. తాజా నిర్ణయం వల్ల దాదాపు 8,500 మంది చేనేత కార్మికులు రుణ విముక్తులవుతారని, రూ.40 కోట్ల వరకు లబ్ధిపొందుతారని ఐటీ, పరిశ్రమలశాఖల మంత్రి కే తారకరామారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తొలుత ప్రభుత్వం చేనేత కార్మికులు జాతీయ బ్యాంకుల నుంచి, జిల్లా కేంద్ర సహకార బ్యాంకుల నుంచి చేనేత ఉత్పత్తుల కోసం.. 2014 జనవరి 1 నుంచి 2017 మార్చి 31 వరకు తీసుకున్న వర్కింగ్ కాపిటల్, వ్యక్తిగత రుణాలను రూ.లక్ష వరకు (లక్షపైబడి రుణాలు తీసుకున్నా.. రూ.ఒక లక్ష వరకు మాఫీ లభిస్తుంది) మాఫీ చేస్తూ జీవోను జారీచేసింది. ఇదివరకు గత ప్రభుత్వం 2010 మార్చి 31 వరకు మాత్రమే రుణమాఫీ చేసింది. ఆ తర్వాత సంవత్సరాల్లో ఎలాంటి రుణమాఫీ కాలేదు. ఈ విషయాన్ని పలువురు నేతన్నలు తమ దృష్టికి తీసుకొచ్చారని, ప్రస్తుత రుణమాఫీని 2010 ఏప్రిల్ ఒకటి నుంచి వర్తింపజేయాలని కోరారని, దీంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. ప్రభుత్వ పథకాలకు 2014 జూన్ 2ను కటాఫ్ డేట్‌గా పరిగణించి నిర్ణయాలు తీసుకుంటున్నామని.. చేనేత రుణమాఫీ విషయంలో నేతన్న సంక్షేమం కోసం ప్రత్యేక అంశంగా పరిగణించి సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొన్నారు. రుణమాఫీ ద్వారా చేనేత కార్మికులకు సాధ్యమైనంత గరిష్ఠంగా ప్రయోజనం కలిగించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. సాధారణంగా రుణమాఫీ చేసిన సందర్భాల్లో రుణాలు చెల్లించనివారికే రుణమాఫీ వర్తింపజేస్తారని.. కానీ, సకాలంలో రుణాలు చెల్లించినవారు నష్టపోకుండా ఉండేందుకు.. వారు చెల్లించిన రుణాలను సైతం ప్రభుత్వం తిరిగి వారి ఖాతాల్లో జమ చేస్తుందని మంత్రి తెలిపారు. రుణాలు చెల్లించిన కార్మికుల ఖాతాల్లో లక్ష రూపాయల పరిమితితో వారి డబ్బులను తిరిగి చెల్లిస్తున్నామన్నారు.

చేనేత రుణమాఫీ నిర్ణయం అద్భుతం

వీవర్స్ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ అధ్యక్షుడు సురేశ్‌దాస్

చేనేత రుణమాఫీని 2014 నుంచి కాకుండా 2010 నుంచి అమలుచేయడం అద్భుత నిర్ణయమని వీవర్స్ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ అధ్యక్షుడు సురేశ్‌దాస్ అన్నారు. దీనివల్ల 8,500మంది లబ్ధి పొందుతారని, చేనేత కార్మికులు ప్రభుత్వానికి రుణపడి ఉంటారని చెప్పారు. పాత రుణాల గురించి తాము కూడా ప్రభుత్వానికి తెలియజేశామని, కార్మికుల కష్టాలను గుర్తించిన ప్రభుత్వం అనుకూల నిర్ణయం తీసుకున్నదని శుక్రవారం విడుదలచేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

టీఆర్పీ రేటింగ్‌లో మాయాజాలం

హైదరాబాద్, నమస్తేతెలంగాణ: టీవీ చానళ్ల టీఆర్పీ రేటింగ్ మాయాజాలం బయటపడుతున్నది. గిమ్మిక్కులకు పాల్పడినవారిపై ఇప్పటికే కరీంనగర్, వరంగల్, ఆదిలాబాద్ జిల్లాల్లో కేసులు నమోదయ్యాయి. బార్క్- ఇండియా టీఆర్పీ రేటింగ్‌ను ప్రకటిస్తుంది. ఈ రేటింగ్ ఆధారంగానే టీవీ చానళ్లకు వాణిజ్య ప్రకటనలొస్తాయి. బార్క్ సంస్థ దేశవ్యాప్తంగా 'బార్- ఓ మీటర్ల' సహాయంతో టీవీ వ్యూయర్ షిప్ డాటాను సేకరించేందుకు ఆయారాష్ట్రాల్లో ఇతర సంస్థల సహాయం తీసుకుంటున్నది. తెలంగాణలో 2015లో హన్సా రిసర్చ్ సంస్థకు టీవీ వ్యూయర్ షిప్ డాటాను సేకరించే బాధ్యతలను అప్పగించారు. కొన్ని చానళ్లతో కుమ్మక్కయిన హన్సా ఉద్యోగులు నిబంధనలకు విరుద్ధంగా డాటాను సేకరిస్తున్నా రు. ఈ సంస్థ సిబ్బంది సహకరిస్తున్న పలు చానళ్లకు టీఆర్పీ రేటింగ్ పెరుగడంతో, ఆ చానళ్లకు వాణిజ్య ప్రకటనలు జోరందుకున్నాయి. దీంతో బార్క్ ఇండియా హన్సా సంస్థతో చేసుకున్న ఒప్పందాన్ని 2017లో రద్దు చేసుకొని, సికింద్రాబాద్‌లోని జీడీపీ సెక్యూరిటీ ప్రైవేటు లిమిటెడ్‌కు అప్పగించింది. ఆ తర్వాతకూడా టీఆర్పీ విషయంలో పలు ఆరోపణలు రావడంతో నేరుగా బార్క్ ఇండియా సంస్థనే రంగంలోకి దిగిం ది. బార్క్ ఇండియా సంస్థ ప్రతినిధులు ఇటీవల డీజీపీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. జీడీపీ చేసిన ఫిర్యాదుతో కరీంనగర్, వరంగల్, ఆదిలాబాద్ జిల్లా ల్లో హన్సారిసర్చ్ సిబ్బందిపై కేసులు నమోదవుతున్నాయి.

అన్నివైపులా ఐటీ విస్తరణ

మూడోపేజీ తరువాయి...

రామగుండంలలో కొత్త పార్కులు రాబోతున్నాయని వివరించారు. 2005-06 తర్వాత రాష్ట్రానికి కొత్త పారిశ్రామికపార్కులు రాలేదని తెలిపారు. డ్రైపోర్టు ఏర్పాటుపై దుబాయ్ పోర్టు కంపెనీతో ఒప్పందం చేసుకున్నామని మంత్రి వివరించారు. జెమ్స్ అండ్ జువెల్లరీ పార్క్‌కు 190 ఎకరాలు కేటాయించామని, దళిత, గిరిజన పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహకాలు ఇస్తున్నామని తెలిపారు. రహేజా మైండ్‌స్పేస్‌లో 1.10 లక్షల మందికి ఐటీ ద్వారా ఉపాధి లభిస్తున్నదని మంత్రి పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో భూములు కేటాయించినప్పటికీ, ఇప్పటివరకు పరిశ్రమలు ఏర్పాటుచేయని సంస్థలపైన చర్యలు తీసుకుంటున్నామని, వాటికి కేటాయించిన భూములను స్వాధీనం చేసుకునే ప్రక్రియ కూడా ప్రారంభమైందని వివరించారు.

జీహెచ్‌ఎంసీ పరిధిలోని చెరువుల పునరుద్ధరణ

జీహెచ్‌ఎంసీ పరిధిలోని చెరువులన్నింటినీ దశలవారీగా పునరుద్ధరిస్తామని మంత్రి కేటీఆర్ తెలిపారు. మొత్తం 188 చెరువులు ఉన్నాయని, మొదటి దశలో 20 చెరువులను పునరుద్ధరించనున్నట్టు చెప్పారు. ఇందుకోసం రూ.280 కోట్లతో అంచనాలు రూపొందించామని మండలిలో ఎంఎస్ ప్రభాకర్‌రావు, కర్నె ప్రభాకర్ తదితరులు అడిగిన ప్రశ్నలకు సమాధానంగా తెలిపారు.

దక్షిణాఫ్రికా సదస్సులో తెలంగాణ పథకాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: భారతదేశంలో అమలవుతున్న గ్రామీణాభివృద్ధి పథకాలు, మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి పథకాలపై రాష్ట్రానికి చెందిన ఐఏఎస్ అధికారి మురళి దక్షిణాఫ్రికా అధికారులకు వివరించారు. శుక్రవారం బెలబెల పట్టణంలో అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్‌వో) అంతర్జాతీయ అవగాహన సదస్సును నిర్వహించింది. భారతదేశం, తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న పథకాల తీరును దాదాపు 300 మంది దక్షిణాఫ్రికా అధికారులకు మురళి తెలిపారు. ఈ సందర్భంగా దక్షిణాఫ్రికా అధికారులు లేవనెత్తిన సందేహాలను నివృత్తిచేశారు.

TELANGANA STATE PUBLIC SERVICE COMMISSION
Prathibha Bhavan, M.J.Road, Nampally, Hyderabad
PRESS NOTE
SUPERVISOR GRADE-I / EXTENTION OFFICER GRADE-I
(DIRECT RECRUITMENT, NOTIFICATION NO. 66/2017
The candidates who are applied for the post of Supervisors-Grade-I/Extension Officer Grade-I vide Notification No.66/2017 are hereby informed that, the edit option is made available on Commission's website to correct their bio-data if any, w.e.f. from 24/03/2018 to 27/03/2018. For further details visit Commission's website i.e., www.tspsc.gov.in
Hyderabad Sd/-
Dt: 22/03/2018 SECRETARY

గ్రూప్-2లో అవకతవకలు జరుగలేదు

- **జవాబుల మూల్యాంకనంలో టీఎస్‌పీఎస్సీ జోక్యం చేసుకోలేదు**
- **క్లీన్‌చిట్ ఇచ్చిన సీనియర్ న్యాయవాదుల కమిటీ**
- **హైకోర్టుకు నివేదిక అందజేత**

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గ్రూప్-2 రాత పరీక్షల జవాబుపత్రాల మూల్యాంకనంలో అవకతవకలు జరుగలేదని న్యాయవాదుల కమిటీ తేల్చిచెప్పింది. రాతపరీక్షలకు సంబంధించిన ఓఎంఆర్ షీట్ల మూల్యాంకనం విషయంలో తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ)కి క్లీన్‌చిట్ ఇచ్చింది. గ్రూప్-2 రాతపరీక్షల నిర్వహణలో టీఎస్‌పీఎస్సీపై వచ్చిన ఆరోపణలు ఉత్తివేనని స్పష్టంచేసింది. గ్రూప్-2 రాతపరీక్షలపై నమోదైన వ్యాజ్యాలన్నింటినీ కలిపి విచారించిన హైకోర్టుకు.. ఓఎంఆర్ షీట్ల మూల్యాంకనాన్ని పరిశీలించేందుకు ముగ్గురు సీనియర్ న్యాయవాదులతో ఏర్పాటుచేసిన కమిటీ ఈ మేరకు నివేదికను అందించింది. రాష్ట్రంలో తొలిసారిగా నిర్వహించిన గ్రూప్-2 రాతపరీక్షల్లో ఓఎంఆర్ షీట్ల మూల్యాంకనంలో టీఎస్‌పీఎస్సీ జోక్యం చేసుకోలేదని న్యాయవాదుల కమిటీ ఉమ్మడి హైకోర్టుకు నివేదించింది. ఓఎంఆర్ షీట్ల బబ్లింగ్‌పై వచ్చిన ఆరోపణల్లో మూడింటిని గుర్తించగా.. తప్పుడు బబ్లింగ్, రెండుసార్లు బబ్లింగ్, బబ్లింగ్ చేయకపోవడం వంటి విషయాలు తమ దృష్టికి వచ్చాయని కమిటీ తమ నివేదికలో పేర్కొన్నది. ప్రశ్నలు, సమాధానాలకు సంబంధించిన బబ్లింగ్‌లో జరుగలేదని స్పష్టంచేసింది. కేవలం అభ్యర్థుల రోల్ నంబర్, ప్రశ్నాపత్రం బుక్‌లెట్ నంబర్, టెస్ట్ బుక్ సిరీస్‌లను ఓఎంఆర్ షీట్లలోని పార్ట్-ఏలో నమోదుచేసే సమయంలో అభ్యర్థులు అయోమయ పరిస్థితుల్లో చేసినట్టు పరిశీలనలో తేలిందని కమిటీ సభ్యులు తమ నివేదికలో పేర్కొన్నారు. రాతపరీక్షల్లో అర్హత ద్వారా మౌఖిక పరీక్షల కోసం టీఎస్‌పీఎస్సీ షార్ట్‌లిస్ట్ చేసిన 3,147 మంది అభ్యర్థుల్లో.. 120 మంది వరకు పార్ట్- ఏ బబ్లింగ్ వ్యవహారాల్లో కొన్ని తప్పిదాలు చేసినట్టు తెలుస్తున్నదని చెప్పారు. ఈ తప్పిదాలు జవాబులకు సంబంధించినవి కాకపోవడంతో ఆయా అభ్యర్థులను టీఎస్‌పీఎస్సీ షార్ట్‌లిస్ట్‌లోకి ఎంపికచేసిందని వివరించారు. పార్ట్-సీలో అభ్యర్థులు, ఇన్విజిలేటర్ల సంతకాలు, అభ్యర్థుల పేర్ల నమోదు విషయంలో నాలుగైదు పొరపాట్లు జరిగాయని పేర్కొన్నారు. జవాబుల బబ్లింగ్‌కు సంబంధించిన పార్ట్-బీ విషయంలో టీఎస్‌పీఎస్సీ జోక్యం చేసుకోలేదని కమిటీ తేల్చిచెప్పింది. గ్రూప్-2 రాత పరీక్షలకు సంబంధించిన జవాబుపత్రాల మూల్యాంకనం విషయంలో అవకతవకలు జరిగాయని, తప్పుడు బబ్లింగ్ చేసినవారిని, వైట్‌నర్ ఉపయోగించిన అభ్యర్థులను రాత పరీక్షల్లో అర్హులుగా తేల్చారంటూ టీఎస్‌పీఎస్సీపై ఆరోపణలతో హైకోర్టులో పలు వ్యాజ్యాలు దాఖలైన విషయం తెలిసిందే. వీటిపై విచారణ సందర్భంగా ఓఎంఆర్ షీట్ల మూల్యాంకనంలో తప్పిదాలను తెలుసుకొనేందుకు జస్టిస్ పొనుగోటి నవీన్‌రావు నేతృత్వంలోని ధర్మాసనం.. ముగ్గురు హైకోర్టు సీనియర్ న్యాయవాదులతో కమిటీని ఏర్పాటుచేసింది. మార్కుల ఆధారంగా అగ్రస్థానంలో నిలిచిన ఐదువేలమంది అభ్యర్థుల ఓఎంఆర్ షీట్లను ఒక్కొక్కటి స్వయంగా పరిశీలించి, పూర్తిస్థాయి నివేదికను అందించాలని న్యాయవాదుల కమిటీకి ఆదేశాలు జారీచేసింది. జేఎన్టీయూ అధికారుల సమక్షంలో న్యాయవాదుల కమిటీ అభ్యర్థుల ఓఎంఆర్ షీట్లను పరిశీలించి, గమనించిన అంశాలతో ఈ నెల 22న హైకోర్టుకు సీల్డ్‌కవర్‌లో నివేదికను అందజేసింది. ఈ నివేదికలను హైకోర్టు శుక్రవారం పిటిషనర్ల తరపు న్యాయవాదులకు అందించింది.

తెలంగాణలో పెరిగిన అటవీసంపద

- **రాష్ట్ర అటవీశాఖ అడిషనల్ పీసీసీఎఫ్ రఘువీర్ వెల్లడి**

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో అటవీ సంపద గణనీయంగా పెరిగిందని, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించుకొని దానిని కాపాడుతున్నట్లు రాష్ట్ర అటవీశాఖ అడిషనల్ పీసీసీఎఫ్ పీ రఘువీర్ చెప్పారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత రాష్ట్రంలో అడవులకు రక్షణ పెరిగిందని, విధ్వంసం చాలావరకు తగ్గిందని అన్నారు. 'సెంటర్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ అండ్ డెవలప్‌మెంట్' (సీఈడీ) నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ మైక్రోస్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్, జవహర్ లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీల సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్ యూసఫ్‌గూడ ఎంఎస్ఎంఈ సెంటర్‌లో రెండోరోజు శుక్రవారం నిర్వహించిన తెలంగాణ ఎన్విరాన్‌మెంట్ కాంగ్రెస్‌లో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. శాటిలైట్ చిత్రాల ఆధారంగా పర్యావరణ పరిరక్షణకు ఏ విధంగా చర్యలు తీసుకోవచ్చో వివరించారు.

GITAM
(DEEMED TO BE UNIVERSITY)
(Estd. u/s 3 of the UGC Act, 1956)
VISAKHAPATNAM • HYDERABAD • BENGALURU
NAAC A+ Grade
MHRD 'I' Category
Recognized Research University
GAT-2018
ONLINE ADMISSION TEST
B.Tech., M.Tech., B.Arch., M.Arch., B.Pharm. & M.Pharm. Programs
offered at Bengaluru, Hyderabad & Visakhapatnam campuses
Apply online @ www.gitam.edu
Applications available at selected branches of Union Bank of India, Indian Bank, Karur Vysya Bank
IMPORTANT DATES
Last date for receipt of applications: 26 March 2018
Online admission test at different centres: 11-26 April 2018
For details: IVRS - 0891-2866444
BENGALURU CAMPUS 080-28098008, 28098000
HYDERABAD CAMPUS 08455-221266 / 200 / 204
VISAKHAPATNAM CAMPUS 0891-2866555 / 2730177



ప్రస్తుతం సాధారణ మధ్యస్థ రాజకీయాలదే రాజ్యమైపోయింది. నేను ఇలాంటి రాజకీయాలకు వ్యతిరేకిని. ప్రజల సంక్షేమం పట్టని రాజకీయాలన్నింటికీ నేను వ్యతిరేకం. అన్నిరకాల ఉగ్రవాదాలకూ విరోధం. తమిళ పేపర్ల నిండా హిందూ ఉగ్రవాదమే కనిపిస్తున్నది. దాన్ని నిర్మూలించాలి.

కమల్‌హాసన్, 'మక్కల్ నీది మయ్యం' అధినేత

యూపీలో యోగీ ఆదిత్యనాథ్ ప్రభుత్వం మత ప్రాతిపదికన కేసులు ఎత్తివేయటం దారుణం. ముజఫర్‌నగర్ మత కలహాలకు సంబంధించి బీజేపీ కార్యకర్తలపై ఉన్న కేసులను ఎత్తివేయటం మతవిభజనకు తార్కాణమే. మొత్తం 503 కేసుల్లో 179 కేసులనే ఎందుకు ఎత్తివేశారు? సమాజాన్ని చీల్చి, భయాందోళనలు రేపే తీవ్ర నేరాల కేసులను ఎత్తివేయటం యోగీ పనితీరుకు నిదర్శనం.

రణ్‌దీప్‌సింగ్ సుర్జేవాలా, కాంగ్రెస్ అధికార ప్రతినిధి



చరిత్రలో నేడు



1882

క్షయవ్యాధి కారకాన్ని కనుగొన్న జర్మన్ శాస్త్రవేత్త రాబర్ట్ కోచ్.

1952

వర్ణ వివక్షకు వ్యతిరేకంగా దక్షిణాఫ్రికాలో మహా ప్రదర్శన.





1990

శ్రీలంక నుంచి భారత శాంతి పరిరక్షక దళాల ఉపసంహరణ.

ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం దుర్వినియోగమవుతున్నదన్న విషయంలో సుప్రీంకోర్టు తాజాగా మార్గదర్శకాలను సూచించింది. కొన్ని ఉదంతాలతో ఎస్సీ,ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం-1989 స్ఫూర్తిని నీరుగార్చలేమని చెబుతూనే, చట్టం అమలులో నిర్దిష్ట మార్గదర్శకాలను విధిగా పాటించాలని సూచించటం ఆహ్వానించదగ్గ పరిణామం. ఈ చట్టం కింద ఎవరినైనా అరెస్టు చేయాలంటే జిల్లా స్థాయి పోలీస్ అధికారి ధ్రువీకరణతోనే ముందుకుసాగాలని తెలిపింది. అలాగే కేసులో ముందస్తు బెయిలు పొందే వీలు కూడా ఉండాలని సూచించటం గమనార్హం.

ది హిందూ

కేంబ్రిడ్జ్ అనలిటికా (సీఏ) చేసిన పనితో 'ఫేస్‌బుక్' భారీ మూల్యాన్నే చెల్లించాల్సి వస్తున్నది. ఫేస్‌బుక్ ఖాతాదారుల వ్యక్తిగత సమాచారం, అభిరుచులు, భావవ్యక్తీకరణలపై ఆధారపడి వారిలో ఒక నిర్దిష్ట భావజాలానికి అనుగుణంగా ప్రభావితంచేసే విధంగా చేయటం మొత్తం ప్రపంచాన్ని కుదిపేస్తున్నది. ఈ విధమైన భావజాల నియంత్రణ ద్వారానే ఈ మధ్యకాలంలో జరిగిన అమెరికా ఎన్నికలు, బ్రెగ్జిట్ ప్రజాభిప్రాయ సేకరణ ఫలితాలు ప్రభావితమయ్యాయని వెలుగులోకి రావటం దిగ్భ్రాంతికి గురిచేస్తున్నది.

ది టైమ్స్ ఆఫ్ ఇండియా

సభాకాలం అమూల్యం

పార్లమెంటు సమావేశాలు సజావుగా సాగించడానికి వీలుగా నిరసన ప్రదర్శనలు చేస్తున్న రాజకీయపక్షాలతో చర్చలు జరుపుతామని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల సహాయ మంత్రి విజయ్ గోయెల్ ప్రకటించడం విశేషమే. కీలకమైన ప్రతిపక్ష నేతల ఇండ్లకు మరీ చర్చిస్తామని కూడా ఆయన అన్నారు. కానీ మంత్రి చెబుతున్న మాటలు నమ్మదగినవిగా లేవని ప్రతిపక్షాలు కొట్టిపారేస్తున్నాయి. తెలంగాణ రాష్ట్ర సమితి, కాంగ్రెస్, అన్నాడీఎంకే, తృణమూల్ కాంగ్రెస్, టీడీపీ తదితర పార్టీలు కొద్దిరోజులుగా నిరసనలు తెలుపుతున్నాయి. ఈ నిరసనలకు ఎవరి కారణాలు వారికి ఉన్నాయి. బడ్జెట్ సమావేశాల రెండవ విడత 23 రోజులు జరుగవలసి ఉంది. అయితే ఇందులో ఇప్పటికే 14 రోజులు వృథాగా గడిచిపోయాయని మంత్రి గోయెల్ అన్నారు. పార్లమెంటులో నిరసనలు ఇంతగా సాగుతుంటే, అధికారపక్షం ఇంతకాలం పట్టనట్టు వ్యవహరించడం సబబు కాదు. ఇప్పటికే చాలా కాలయాపన జరిగింది. పార్లమెంటులో నిరసనలను రెండువిధాలుగా ఉంటాయి. కొందరు ఒక్కోసారి సభ నడువకూడదనే ధ్యేయంతో గొడవ చేస్తూ ఉంటారు. వీరికి సభా మర్యాదల పట్ల, రాజకీయ విలువలపైన గౌరవ భావం ఉండదు. తెలంగాణ బిల్లు ఆమోదించే సందర్భంలో చోటుచేసుకున్న అవాంఛనీయ ఘటనలు ఇందుకు ఉదాహరణ. అటువంటి పెడ ధోరణుల పట్ల కఠినంగా వ్యవహరించడం ద్వారా పార్లమెంటు ఔన్నత్యాన్ని కాపాడటం అవసరం. కానీ న్యాయబద్ధమైన అంశాలను రాజకీయపక్షాలు లేవనెత్తినప్పుడు, చర్చించి పరిష్కారమార్గాలు అన్వేషించాలే తప్ప, పట్టించుకోకుండా ఉండకూడదు.

టీఆర్‌ఎస్ కొద్దిరోజులుగా రిజర్వేషన్ అంశంపై పట్టుబడుతున్నది. దీనిపై అధికారపక్షం మొదటిరోజే స్పందించి, చర్చించి మెప్పించాల్సింది. వెంటనే కాకపోయినా, తర్వాతికాలంలోనైనా కూలంకషంగా చర్చిస్తామని, సానుభూతితో అర్థం చేసుకుంటామని నిజయితీగా హామీ ఇస్తే సరిపోయేది. ప్రజల ఆకాంక్షలను అవసరమైతే గట్టిగానైనా వినిపించడం పార్లమెంటులో సాధారణమే. దానిని తప్పుబట్టాల్సిందేమీ లేదు. పార్లమెంటు చర్చలకు భంగం కలిగించే విషయానికి వస్తే, ప్రాంతీయపక్షాల కన్నా, జాతీయపక్షాలే బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నాయి. యూపీఏ రెండవ పర్యాయం అధికారానికి వచ్చినప్పుడు, బీజేపీ ప్రతిపక్ష పార్టీగా, పార్లమెంటు సమావేశాలకు అదేపనిగా అడ్డుతగిలింది. దేశ చరిత్రలోనే అత్యంత ఎక్కువగా సభాకాలం వృథా అయింది. అదే బీజేపీ ఇప్పుడు సభాకాలం విలువైంది అంటూ నీతులు చెబుతున్నది. ఆ నాడు బీజేపీ సమావేశాలకు అడ్డుతగిలితే, ఇప్పుడు కాంగ్రెస్‌పార్టీ అదే విధమైన విచ్ఛిన్నకర పాత్ర పోషిస్తున్నది. రెండు జాతీయ పార్టీలు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తే, ఉభయసభల్లో చర్చలు మరింత నిర్మాణాత్మకంగా జరుగుతాయి. ప్రాంతీయపార్టీలు తమ గొంతు వినిపించడానికి అవకాశం ఇస్తే మరింత హుందాగా ఉంటుంది.

పార్లమెంటు నడువడానికి నిమిషానికి రెండున్నర లక్షల రూపాయల వ్యయమవుతుందని మంత్రి గోయెల్ వ్యాఖ్యానించారు. గోయెల్ సభా సమయాన్ని పైసలతో లెక్కగట్టడం ఆశ్చర్యకరంగా ఉన్నది. సభా సమయం అమూల్యమైనది. పైసల లెక్కలకు అందనిది. ఇటీవల పార్లమెంటు చర్చ జరుగకుండానే బడ్జెట్‌ను ఆమోదించింది. కోట్లాది దేశప్రజల శ్రేయస్సుకు సంబంధించిన పద్దులను చర్చించకుండానే సభ ఆమోదించడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే.

పార్లమెంటు నడువడానికి నిమిషానికి రెండున్నర లక్షల రూపాయల వ్యయమవుతుందని మంత్రి గోయెల్ వ్యాఖ్యానించారు. గోయెల్ సభా సమయాన్ని పైసలతో లెక్కగట్టడం ఆశ్చర్యకరంగా ఉన్నది. సభా సమయం అమూల్యమైనది. పైసల లెక్కలకు అందనిది. ఇటీవల పార్లమెంటు చర్చ జరుగకుండానే బడ్జెట్‌ను ఆమోదించింది. కోట్లాది దేశప్రజల శ్రేయస్సుకు సంబంధించిన పద్దులను చర్చించకుండానే సభ ఆమోదించడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే. విస్తృతమైన దేశంలో ఎన్నో భౌగోళిక విభాగాలు, ఆర్థిక మండలులు, భిన్నజాతులూ సంస్కృతులు గల దేశం మనది. ప్రతిప్రాంతానికి, సామాజికవర్గానికి సమస్య లు ఉంటాయి. ప్రతి ప్రాంత అభివృద్ధి వ్యూహం వేరు విధంగా ఉంటుంది. వీరి సమస్యలు, ఆకాంక్షలు చర్చించి నిర్ణయాలు తీసుకోవలసిన బాధ్యత ప్రజాప్రతినిధులది. కేంద్ర రాష్ట్రాల మధ్య అధికారాల పంపిణీ ఒక సమస్య. కాలాన్నిబట్టి రాష్ట్రాల డిమాండ్లు నెరవేరకపోతే, పరిపాలనా వ్యవస్థ విఫలమవుతుంది. రిజర్వేషన్ల అంశం జనాభాకు సగానికిపైగా ఉన్న అనేక సామాజికవర్గాల అభివృద్ధికి సంబంధించిన అంశం. ఇవి సకాలంలో పరిష్కారం కాకపోతే, సామాజిక అనిశ్చితి చోటుచేసుకుంటుంది. పార్లమెంటులో కొన్ని రాజకీయపక్షాలు నిరసన తెలుపుతున్నాయనే సాకు చూపి ఇట్లా ఏ అంశాలూ చర్చించకుండా సమావేశాలు ముగిస్తే చట్టసభలు ప్రాధాన్యం కోల్పోతాయి. ప్రజాప్రతినిధులు సమస్యలను చర్చించుకొని పరిష్కరించకపోతే, ప్రజలకు పార్లమెంటరీ వ్యవస్థపై విశ్వాసం సన్నగిల్లే ప్రమాదం ఉంటుంది. ఇప్పటికైనా రాజకీయ పక్షాల నాయకులు చొరవ తీసుకొని చర్చలు సజావుగా సాగేవిధంగా చర్యలు తీసుకోవాలె. పాలనాదక్షత అంటే, అన్నివర్గాలను మెప్పిస్తూ పాలించడమే తప్ప, సభాకాలాన్ని వినియోగించుకోకుండా మొక్కుబడిగా బిల్లులను ఆమోదించుకోవడం కాదు.

సందర్భం

'జలదృశ్యం' నుంచి..

2001, ఏప్రిల్ 27.. జలదృశ్యం ప్రాంగణం.. అప్పటి అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్, ప్రస్తుత సీఎం కేసీఆర్, టీడీపీకి, ఆ పార్టీ ద్వారా లభించిన పదవులకు రాజీనామా చేసి, తెలంగాణ ఉద్యమాన్ని భుజానికెత్తుకున్న సందర్భం.

తెలంగాణ జిల్లాల నుంచి తరలివచ్చిన వందలాది మందిని వేదిక సమీపంలో కూర్చోబెడుతూ కనిపించాడో యువకుడు. ఇరువై రెండేండ్ల వయస్సులో తనకు అప్పగించిన పని ని శ్రద్ధగా చేస్తున్న ఆ యువకుడిని గమనిస్తున్నా ను. వేసవి ఎండలో దప్పిగొన్నవారికి మంచినీళ్ల గ్లాసులు అందిస్తూ, మరోపక్క సభా ప్రాంగణానికి వస్తున్నవారికి సముచిత స్థానాలు చూపిస్తూ కూర్చోబెడుతున్న ఆ యువకుడు చకచకా కదులుతూ అన్నీతానై కనిపిస్తున్నాడు. అంతలో కేసీఆర్ రావడం, సభ ప్రారంభం కావడంతో వేదికవైపే దృష్టి కేంద్రీకరించాను. ఆ యువకుడు మటుకు సుశిక్షితుడైన సైనికుడిలా తన బాధ్యతను కొనసాగిస్తూనే కనిపించాడు. నాటినుంచి నేటివరకు కేసీఆర్ అడుగుజాడల్లో పయనిస్తున్న ఆ యువకుడు జోగినిపల్లి సంతోష్ కుమార్. 18 ఏండ్ల క్రితం జలదృశ్యంలో ప్రారంభించిన ప్రస్థానాన్ని కొనసాగిస్తూ అంచెలంచెలుగా ఎదిగిన చరిత్ర ఆ యువకుడిది.


ఉద్యమ ప్రస్థానంలో జిల్లాలతో చక్కని అనుబంధాన్ని పెంచుకొని తెలంగాణ భూమి పుత్రులకు, వీర వనితలకు తలలో నాలుకలా వ్యవహరిస్తూ అన్నివేశలా ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం అవిశ్రాంతంగా పరిశ్రమిస్తూ వస్తున్న ఆ యువకుడు అందరి ఆదరాభిమానాలతో ప్రస్తుతం రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికయ్యారు. అధినేత కనుసన్నల్లో మెదులుతూ వెంట నడువడానికే పరిమితం కాకుండా మానవీయ కోణానికి పెద్దపీట వేస్తూ అందరితో కలుపుగోలుగా వ్యవహరించడం ఆ యువకుడి విధానం. ఇన్నాళ్ళు గా ఆయన అనుసరిస్తున్న విధానమే, చిన్న వయస్సులో ఆయనను పెద్దల సభకు చేర్చింది.

జలదృశ్యం నుంచి తెలంగాణభవన్ వరకూ అవిశ్రాంతంగా కొనసాగుతున్న ఆ యువకుడి ప్రస్థానం మరింత ఉత్తేజంగా కొనసాగాలని, 'తెలంగాణ' గుండె సవ్వడిని 'హస్తిన'లో సమర్థవంతంగా వినిపిస్తాడని ఆకాంక్షించడం అత్యాశ కాదు.

– శరదిందు

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@namasthetelangaana.com Fax-040-23291118

ముక్తసరి



దేవులపల్లి ప్రభాకరరావు

ఉరి కంబంపై ఉద్యమవీరులు

త్రేతాయుగంలోని శ్రీరామచంద్రుని గురించి మాట్లాడుతున్నప్పుడు రావణాసురుని ప్రస్తావన రాకతప్పదు. రాముని దూతగా ఆంజనేయస్వామి పలు అవరోధాలను అధిగమించి, పలువురుని హతమార్చి లంకా నగరంలో ప్రవేశించగానే వాల్మీకి వర్ణించింది రాక్షస చక్రవర్తి రావణాసురుని ఔన్నత్యం, లంకాపురి వైభవం గురించే. దేశభక్తులను, వారి త్యాగాలను స్మరిస్తున్నప్పుడు దేశద్రోహుల సంగతి చెప్పక తప్పదు. 1931, మార్చి 23 (నిన్నటి రోజు) లాహోర్ జైల్లో బ్రిటిష్ పాలకులు జైలు నియమాలన్నింటినీ ఉల్లంఘించారు.

ఉరికంబం ఎక్కించి, ఉరితీసిన ముగ్గురు భారతమాత ముద్దుబిడ్డలు, భారత స్వాతంత్ర్య సమరయోధులు, యువయోధులు భగత్‌సింగ్, రాజ్‌గురు (శివ్‌రామ్ హరి రాజ్‌గురు), సుఖ్‌దేవ్ తమ సన్నిహితులు, ఆత్మీయులు, శ్రేయోభిలాషులు ఎవరెన్ని ఒత్తిడిలు తెచ్చినా రాజీపడటానికి, క్షమాభిక్ష కోరడానికి అంగీకరించలేదు. అదే సమయంలో బ్రిటిష్ పాలకుల ముందు తలవంచిన వాళ్లున్నారు, క్షమార్పణ పత్రాలు రాసిచ్చిన వాళ్లున్నారు. బతికుంటే బలుసాకు ఏరుకొని తినవచ్చని, పచ్చిక మైదానాల్లో కడుపార మేయడానికి, గుమ్ములు నింపుకోవడానికి ఎన్నో కలలుగన్న దేశద్రోహులున్నారు. అందువల్లనే ఓ శతక కవి అన్నాడు.. 'పురుషులందు పుణ్య పురుషులు వేరయా' అని. బ్రిటిష్ పాలకులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ మరోక్షణం బతికుంటే ఏమవుతుందోనని గజగజలాడారు. లాహోర్ కుట్ర కేసు (పోలీసు అధికారి సాండర్స్ హత్య కేసు) విచారణను త్వరగా పూర్తిచేసి శిక్షలు విధించడానికి అప్పటి వైస్రాయ్ లార్డ్ ఇర్విన్ 1930, మే 1న ఒక ఆర్డినెన్స్ జారీచేసి ముగ్గురు హైకోర్టు న్యాయమూర్తులతో ఒక స్పెషల్ ట్రిబ్యునల్‌ను నియమించాడు. ఈ ఆర్డినెన్స్ సక్రమంగా లేదని, ఆర్డినెన్స్‌ను జారీచేసే అధికారం వైస్రాయ్‌కి లేదని కోర్టులో సవాలు చేసినా ఫలితం కనిపించలేదు. 1930, మే 5 నుంచి సెప్టెంబర్ 10 వరకు ఏక పక్ష విచారణ తతంగం నడిపిన ట్రిబ్యునల్ (ఆర్డినెన్స్, ట్రిబ్యునల్ చివరిరోజు 1930 అక్టోబర్ 31 గనుక) 1930 అక్టోబర్ 7న 300 పేజీ ల తీర్పు వెలువరించి అదేరోజు, ఆ తీర్పులోనే భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లకు ఉరిశిక్ష విధించింది. ఈ కేసులోని మరో 12 మందికి ట్రిబ్యునల్ యావజ్జీవ జైలు శిక్ష విధించింది. లండన్‌లోని ప్రీవీ కౌన్సిల్ ట్రిబ్యునల్ తీర్పుపై అప్పీలును తిరస్కరించింది. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ ఉరిశిక్షను ఆపడానికి అహింసామూర్తి గాంధీజీ, పండిత్ మద న్ మోహన్ మాలవీయ జరిపిన ప్రయత్నాలు ఫలించలేదు. మార్చి 24 న ఉరిశిక్ష అమలుజరుగాలన్న ట్రిబ్యునల్ తీర్పును మార్చి బ్రిటిష్ ప్రభు త్వం 1931 మార్చి 23 సాయంత్రం 7.30 నిమిషాలకు లాహోర్ జైల్లో ముగ్గురిని ఉరికంబం ఎక్కించింది. ముగ్గురు ఉద్యమవీరులు, స్వాతం త్ర్య సమరయోధుల పార్థివ శరీరాలను అదేరోజు రాత్రి రహస్యంగా దహనంచేసి అవశేషాలను సట్లేజ్ నదిలో నిమజ్జనం చేసింది. హింసావాదాన్ని వ్యతిరేకించేవారు సైతం దేశమంతటా, ప్రపంచమంతటా ముగ్గురి ఉరితీతను తీవ్రంగా ఖండించారు. దేశమంతటా కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ఈ ఉరితీత పట్ల ఆగ్రహావేశాలు, నిరసనలు వ్యక్తమయ్యాయి. అదే సమయాన కరాచీలో భారత జాతీయ కాంగ్రెస్ సమావేశాల్లో పాల్గొనడానికి వెళ్లిన నాయకులు ప్రజల నిరసనకు గురికావలసి వచ్చింది. దేశభక్తుల కుటుంబంలో జన్మించి, బాల్యంనుంచే, ఉగ్గు పాలతోనే స్వాతంత్ర్య వాంఛతో, దేశభక్తితో ప్రభావితుడైన భగత్‌సింగ్ ఒక లేఖలో రాసిన వాక్యాలివి.. "My life has been dedicated to the noblest cause, that of the freedom of the country. Therefore, there is no rest or wordly desire that can lure me now..." ఉరిశిక్ష నాటికి భగత్‌సింగ్ 24 ఏండ్ల యువకుడు. ఆయనతో కలిసి దేశం కోసం ప్రాణత్యాగం చేసిన రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లు యువయోధులే. ముగ్గురు స్వాతంత్ర్య సమరయోధులకు బూటకపు విచారణలో ఉరిశిక్ష విధించి, ముగ్గురిని ఒకేసారి ఉరికంబం ఎక్కించి ప్రాణాలను బలిగొన్న విషాద సంఘటన ప్రపంచంలో అంతవరకు ఎక్కడా సంభవించలేదు.

భగత్‌సింగ్, ఆయన సహచరులు దేశ స్వాతంత్ర్యం కోసం అంతులేని ఆరాటంతో అనుసరించిన హింసాత్మక విధానంతో ఏకీభవించలేకపోయినప్పటికీ స్వాతంత్ర్యప్రియులు, దేశభక్తులందరూ వారి నిరుపమాన త్యాగానికి చేతులెత్తి జోహార్లు అర్పించారు, శ్రద్ధాంజలి ఘటించారు. అదే సమయాన కరాచీలో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ మహాసభ భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల ధైర్య సాహసాలను, త్యాగనిరతిని వేనోళ్ల శ్లాఘిస్తూ తీర్మానించింది. 1931, మార్చి 29 యంగ్ ఇండియాలో అహింసా ప్రవక్త గాంధీజీ రాసిన వాక్యాలు.. The Congress made many attempts to save their lives, but all has been in vain.. Bhagat Singh refused to apologise or even file an app-eal. Bhagat Singh was not a devotee of non-violence, but he did not subscribe to the religion of violence. He took to violence due to helplessness and to defend his home land... These heroes had conquered the fear of death. Let us bow to them a thousand times for their heroism..." భగత్‌సింగ్ వ్యక్తిత్వంపై, దేశస్వాతంత్ర్యం కోసం ఆ యువనేత, ఆయన సహచరులు అనుసరించిన విధానాలపై గాంధీజీ విశ్లేషణ సహేతుకమైనది. బ్రిటిష్ వలస, దుష్టపాలనకు వ్యతిరేకంగా గత శతాబ్ది ఆరంభంలో లోకమాన్య బాలగంగాధరతిలక్ వ్యక్తపరిచిన అభిప్రాయాలను, ఆయన అనుసరించాలనుకున్న విధానాలను 'అతివాదం'గా పరిగణించారు. గోపాలకృష్ణ గోఖలే అభిప్రాయాలను, ఆయన సూచనలను 'మితవాదం'గా భావించారు. వాదం ఏదైనా వారి లక్ష్యం ఒక్కటే. స్వాతంత్ర్య సాధన, పరాయి పాలననుంచి భారత విముక్తి. ఇదే లక్ష్యంతో భగత్‌సింగ్, ఆయన మిత్రులు, సహచరులు వారు మేలనుకున్న, వారు సత్వర ఫలితాలు లభిస్తాయనకున్న విధానాన్ని అనుసరించారు. బ్రిటిష్ సామ్రాజ్యంలో భాగంగా, బ్రిటిష్ పాలన కింద డొమినియన్‌స్థాయి పొందితే చాలు జీవితం ధన్యమవుతుందని కొందరు మితవాదులు భావిస్తున్న రోజుల్లో భారత జాతీయ కాంగ్రెస్ ఒక అడుగుముందుకు వేసి స్వాతంత్ర్యమే తమ లక్ష్యమని మదరాసు మహాసభలో తొలిసారి తీర్మానించింది. జవహర్‌లాల్ నెహ్రూ, సుభాష్ చంద్రబోస్ మరికొన్ని అడుగులు ముందుకువేసి, అతివాదులుగా పట్టుపట్టడంతో 1929లో (1928లో దేశమంతటా సైమన్ కమిషన్‌ను నిరసన నినాదాలతో బహిష్కరించడంతో) లాహోర్‌లో, రావి నదీతీరంలో భారత జాతీయ కాంగ్రెస్ సంపూర్ణ స్వరాజ్యం తమ లక్ష్యమని ప్రకటించవలసి వచ్చింది.

భగత్‌సింగ్ వ్యక్తిత్వ పరిణతి, వికాసాలపై సమకాలిక సంఘటనలు, పరిణామాల ప్రభావం స్పష్టంగా కనిపిస్తున్నది. నాటి పంజాబ్ ప్రావిన్స్ లాయల్పూరు జిల్లా జరన్‌వాలా తహసీల్ బంగా గ్రామంలో (ఇప్పుడు ఈ గ్రామం పాక్ పంజాబ్‌లో ఉంది) 1907, సెప్టెంబర్ 28న ఒక దేశభక్తుల జాట్ కుటుంబంలో భగత్‌సింగ్ జన్మించాడు. తల్లి విద్యావతి కౌర్, తండ్రి కిషన్‌సింగ్ సంధు. భగత్‌సింగ్ తండ్రి, దగ్గరి బంధువులు గదర్ పార్టీ సభ్యులు. భగత్‌సింగ్ పుట్టిన వెంటనే తండ్రి లాహోర్ జైలు నుంచి, మరో బంధువు మాండలె జైలు నుంచి విడుదలైనారు. భగత్‌సిం గ్ అదృష్టవంతుడని సంతోషపడి నాయనమ్మ ఆ పసిబిడ్డను 'భగవాన్ వాలా' అని పిలిచి ముద్దాడింది. వారిది విభిన్న సిద్ధాంతాలు, విశ్వాసాల కుటుంబం. భగత్‌సింగ్ తాత అర్జున్‌సింగ్ ఆర్యసమాజ్ స్థాపకుడు దయానంద సరస్వతి అనుయాయి. గదర్ పార్టీ విప్లవ భావాలు, ఆర్య సమాజ్ హైందవ సంస్కరణ సిద్ధాంతాలు బాల్యంలోనే భగత్‌సింగ్‌పై ప్రభావాన్ని ప్రసరించాయి. సిక్కు పిల్లలు చదివే ఖాల్సా హైస్కూల్‌లో చదివించకుండా తాత అర్జున్‌సింగ్ తన మనుమడు భగత్‌సింగ్‌ను ఆర్యసమాజ్ వారి దయానంద్ ఆంగ్లో వేదిక్ పాఠశాలలో చేర్పించాడు. అనతి కాలంలోనే తన మనుమడు ఒక ప్రసిద్ధ విప్లవకారుడిగా, ఒక మార్క్సిస్టుగా, ఒక నాస్తికుడిగా రూపొందబోతున్నాడని తాత అర్జున్‌సింగ్ ఊహించలేదు. పసితనంలోనే భగత్‌సింగ్ మేధస్సు, విజ్ఞానం, స్వాతం త్ర్యభావాలు విస్మయకరంగా వికసించాయి. అమృత్‌సర్ జలియన్ వాలాబాగ్‌లో (1919 ఏప్రిల్‌లో) వేలాది అమాయకుల వధ (డయ్యర్ రాక్షసత్వంతో) పన్నెండేండ్ల బాలుడు భగత్‌సింగ్ హృదయాన్ని విలపిం పజేసింది. వెంటనే బాలుడు భగత్‌సింగ్ జలియన్‌వాలాబాగ్ వెళ్లి శ్రద్ధాంజలి ఘటించాడు. చౌరీచారాలో హింస చెలరేగిందని గాంధీజీ ఉద్యమా న్ని తాత్కాలికంగా విరమించడం భగత్‌సింగ్‌కు నిస్పృహ కలిగించింది. 1921 ఫిబ్రవరిలో గురుద్వార నన్‌కానాసాహెబ్‌లో అనేక నిరాయుధుల వధ 14 ఏండ్ల బాలుడు భగత్‌సింగ్ హృదయాన్ని క్షోభింపజేసింది. ఈ ఘటనలన్నింటికీ పరాకాష్టగా 1928లో సైమన్ కమిషన్‌ను బహిష్కరిస్తున్న లాలాలజపత్ రాయ్‌పై బ్రిటిష్ పోలీసు అధికారి జేమ్స్ స్కాట్ లాఠీచార్జి, తర్వాత కొద్దిరోజులకే లాలాజీ మృతి యువకుడు భగత్‌సింగ్‌లో ప్రతీకారాగ్నిని ప్రజ్వరిల్లచేసింది. భగత్‌సింగ్ ఒక హింసావాదిగా మారి దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణార్పణం చేయడానికి ఈ సంఘటనలన్నీ ప్రేరణ కలిగించాయి. భగత్‌సింగ్ అహింసామార్గాన్ని కూడా అనుసరించి మియావలి జైలులో ఖైదీల హక్కులకోసం నిరాహారదీక్ష ప్రారంభించాడు. తర్వాత లాహోర్ జైల్‌లో కూడా భగత్‌సింగ్ నిరాహార దీక్ష కొనసాగించి 116వ రోజున (1929 అక్టోబర్ 5న) విరమించడం ఒక ఉజ్వలఘటన. భగత్‌సింగ్ రచయిత, పత్రికాసంపాదకుడు, మేధా వి. తన జీవితకాలంలో లెనిన్‌పై అధ్యయనం పూర్తిచేయాలన్న ఆయన కోరిక నెరవేరడం విశేషం. ■

1921 ఫిబ్రవరిలో గురుద్వార నన్‌కానాసాహెబ్‌లో అనేక నిరాయుధుల వధ 14 ఏండ్ల బాలుడు భగత్‌సింగ్ హృదయాన్ని క్షోభింపజేసింది. ఈ ఘటనలన్నింటికీ పరాకాష్టగా 1928లో సైమన్ కమిషన్‌ను బహిష్కరిస్తున్న లాలాలజపత్‌రాయ్‌పై బ్రిటిష్ పోలీసు అధికారి జేమ్స్ స్కాట్ లాఠీచార్జి, తర్వాత కొద్దిరోజులకే లాలాజీ మృతి యువకుడు భగత్‌సింగ్‌లో ప్రతీకారాగ్నిని ప్రజ్వరిల్లచేసింది. భగత్‌సింగ్ ఒక హింసావాదిగా మారి దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణార్పణం చేయడానికి ఈ సంఘటనలన్నీ ప్రేరణ కలిగించాయి.

కేసీఆర్ విధానం రైతుకు భరోసా

తెలంగాణం



రమేశ్ హజారి

తనకు తాను ఏమీ కానని తనకు ఎవరూ లేరని భావించే పరిస్థితులు నెలకొన్నప్పుడు ఒక మనిషిని ఆ సమాజం అక్కున చేర్చుకోకపోవడం అంటే, అతన్ని నిరాశ, నిస్పృహలకు గురిచేసి ఆత్మహత్యకు పురికొల్పడమే అంటాడు ఇమైల్ దుర్ఖైమ్ అనే ఫ్రెంచ్ సామాజిక శాస్త్రవేత్త.

ఆత్మహత్య వ్యక్తి వైఫల్యం కాదు అది సమాజ వైఫల్యం అనీ, అది వ్యక్తి సమస్య కాదు సామాజిక సమస్య అని నిర్వచిస్తాడు ఎమిల్. గత 60 ఏండ్లుగా తెలంగాణను ఏలిన వలస పాలకులు రైతుకు ఏ సాయమూ అందించక, ఒంటరిగా వదిలి అతని ఆత్మహత్యకు కారణమైతే, వారికి నేనున్నానని భరోసానందిస్తూ కేసీఆర్ తెలంగాణ రైతును ఆత్మహత్య భావన నుంచి ఆత్మవిశ్వాసం పెంపొందించే దిశగా ముందుకు తీసుకుపోతున్నడు. తెలంగాణలో రైతు ఆత్మహత్యలు తగ్గుముఖం పట్టినయని పార్లమెంటులో కేంద్ర వ్యవసాయ శాఖామంత్రి ప్రకటించడం వెనుక ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకుంటున్న నిర్ణయాలే కారణం.

భూ తల్లి, ప్రకృతి మీద భరోసా పెట్టి లక్షలాది రూపాయలను పెట్టుబడిగా పెడుతున్న రైతన్నను గాలికొదిలిపెట్టిన ప్రభుత్వాలు ఈ దేశాన్ని 70 ఏండ్లుగా ఏలుతున్నై. వ్యవసాయాన్ని ఓ తమాషా తంతుగా చూస్తున్నై. దూరదృష్టి కొరవడి స్వార్థ రాజకీయాలతో రైతు చావుకు ప్రత్యక్ష, పరో క్షంగా కారణమవుతూ, రైతు ఆత్మహత్యలను ఎన్నికల వ్యవసాయంలో ఎరువుగా వాడుకుంటున్నయి. ఆంధ్రాకు సాగునీటి కాల్వలను మళ్లించుక పోవడం మీద ఉన్న ధ్యాస తెలంగాణ రైతు కన్నీటిని తుడువడానికి లేకుం డె నాటి పాలకులకు. అప్పులపాలై, వేసిన బోర్ల ఖర్చు తడిసి మోపెడై రైత న్న మెడలకు ఉరితాళ్లు పేనినయే తప్ప నీటిధారలను కురిపించలేదు. ఆదుకునేవారు లేరనే నైరాశ్యంలో ఆత్మహత్యలకు పాల్పడ్డ తెలంగాణ రైతును ఇవాళ తెలంగాణ ప్రభుత్వం కడుపుల దాసుకొని కొండంత భరోసా అందిస్తున్నది.

తెలంగాణలో సీఎం కేసీఆర్ తీసుకున్న విధానపరమైన నిర్ణయాలన్నీ రైతు కేంద్రంగానే ఉన్నయి. మిషన్ కాకతీయతో ప్రారంభమైన తెలంగాణ రైతు భరోసాయాత్ర, కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం మీదుగా ఎకరానికి 8 వేల పెట్టుబడిదాక చేరి తెలంగాణ రైతుకు భవిష్యత్తు మీద భరోసాను పెంచింది. దేశం గర్వించదగ్గస్థాయిలో నిర్మాణమవుతున్న సాగునీటి ప్రాజెక్టుల నుంచి వ్యవసాయ పెట్టుబడిదాకా రైతుకు గుండె ధైర్యాన్నిస్తున్నది. వివిధ పథకాల రూపంలో కేసీఆర్ రైతుకు ఇస్తున్న భరోసా రైతు సమాజాన్ని గుణాత్మకంగా మార్చివేస్తున్నది. తద్వారా వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపుతున్నది. తెలంగాణ రైతు, కూలీలను ఆత్మహత్య నుంచి ఆత్మవిశ్వాసం వైపు మళ్లిస్తున్నది. ఒకనాడు ఎవడూ కానని వ్యవసాయ భూములు నేడు ధరల రెక్కలు తొడుగడం ప్రారంభించినయి. ప్రపంచ వ్యవసాయ చరిత్రలోనే ఏ ప్రభుత్వం తీసుకోని నిర్ణయాలతో వ్యవసాయం దండుగ కాదు పండుగ అనే నినాదాన్ని నిజం చేసి చూయిస్తున్నది.

దేశవ్యాప్తంగా జరుగుతున్న రైతు ఆత్మహత్యలతో పోల్చితే తెలంగాణ రైతన్నల ఆత్మహత్యలు గత మూడేండ్లలో అధికశాతం తగ్గిపోవటం కేసీఆర్ దార్శనికతకు సాక్ష్యం. దేశం మొత్తమ్మీద 2015,16 సంవత్సరాల్లో జరిగిన రైతు ఆత్మహత్యల గణాంకాల వివరాలను పరిశీలిస్తే.. తెలంగాణలో ఆత్మహత్యలు యాభై శాతానికి తగ్గిపోయినయి. తెలంగాణ వచ్చిన కొత్తలో అంటే 2015 లో నాటి వలసపాలన ప్రభావంతో 1400 మంది రైతులు ఆత్మహత్యలు చోటుచేసుకుంటే, కేసీఆర్ పాలనలో 2016 కల్లా వాటి సంఖ్య 645కు తగ్గాయి. స్వయంపాలనలో దాదాపు 54 శాతానికి రైతు ఆత్మహత్యలు తగ్గిపోయినయి. తెలంగాణ వచ్చేనాటికి 449 మంది వ్యవసాయకూలీలు ఆత్మహత్య చేసుకుంటే 2015లో ఆ సంఖ్య 42కు పడిపోయి, 2016కల్లా 13 మందికి తగ్గాయి. అభివృద్ధి అనేది 'కంపారిటివ్' అనే సంగతిని తెలంగాణ ప్రభుత్వాన్ని విమర్శించే నిత్య నిరసనకారులు మర్చిపోతున్నరు.

2015లో మహారాష్ట్రలో రైతుల ఆత్మహత్యలు 1491 జరిగితే, 2016 లో వాటి సంఖ్య 3661కి పెరిగింది. అంటే 145 శాతం పెరుగుదల అన్న మాట. అట్లనే కర్ణాటకల 32.5 శాతం, మధ్యప్రదేశ్‌లో మూడు శాతం రైతు ఆత్మహత్యలు పెరిగితే, తెలంగాణల మాత్రం 54 శాతానికి తగ్గినయి. అదే ఛత్తీస్‌గఢ్‌లో 39.8 శాతానికి, తమిళనాడులో 37.1 శాతానికి మాత్రమే రైతు ఆత్మహత్యలు తగ్గినయి. ఆంధ్రప్రదేశ్‌లో ఆత్మహత్యల తగ్గుదల 13.9 శాతం మాత్రమే. ఈ గణాంకాలను చూస్తే, తెలంగాణలో సామాజిక భద్రత పెరిగిందనీ, రైతుకు రేపటిమీద ఆశలు చిగురిస్తున్నయ ని అర్థమవుతున్నది. అదే సమయంలో బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లోనే రైతు ఆత్మహత్యలు పెరుగుతున్నయనీ గణాంకాలు చెప్తున్నయి.

ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయాల ఫలితంగానే తెలంగాణలో సామాజిక భద్రత పెరిగి ఆత్మహత్యలు తగ్గుతున్నయని చెప్పవచ్చు. రైతును ఆదుకోవడం అంటే మరణించిన తర్వాత ఎక్స్‌గ్రేషియా ఇవ్వడమనే వలస పాలనలోని బాధ్యతారహిత ఆలోచనా విధానం నుంచి విడివడి ఆలోచించ గలిగిండు కాబట్టే ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయాలు సత్ఫలితాలనిస్తున్నయి. మిషన్ కాకతీయ, 24 గంటల విద్యుత్ ఉచిత సరఫరా, సకాలంలో ఎరువులు విత్తనాలు, గోడౌన్ల నిర్మాణం, పెట్టుబడికి ఎకరానికి 8 వేలు, వ్యవసాయ యాంత్రీకరణ, గ్రీన్‌హౌజ్, పాలీహౌజ్ తదితర పథకాల ద్వారా తెలంగాణ రైతుకు నేరుగా సహకారం అందుతున్నది. మరోపక్క కళ్యాణలక్ష్మీ, అమ్మఒడి, కేసీఆర్ కిట్, గురుకుల పాఠశాలల వంటి పథకాల ద్వారా విద్య, వైద్యం తదితర కుటుంబ ఖర్చులను తగ్గించి సామాజిక భద్రత పెరుగడానికి దోహదపడుతున్నది. రైతుకూలీలుగా జీవిస్తున్న గొల్ల, కురుమ, ముదిరాజ్, బెస్త తదితర వృత్తికులాల కోసం ప్రత్యేకంగా గొర్రెలు, చేపల పెంపకం వంటి పథకాలను ప్రకటించింది కేసీఆర్ ప్రభుత్వం. తద్వారా ఆర్థిక స్వావలంభనను చేకూర్చి వ్యవసాయాన్ని, వ్యవసాయాధారిత రంగాలను సంపద సృష్టించే కేంద్రాలుగా మార్చి గ్రామ ఆర్థిక వ్యవస్థలో విప్లవాత్మక పరిణామాలకు శ్రీకారం చుట్టిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుంది.

ఈ నేపథ్యంలో మూసపద్ధతిలో విమర్శలకు పూనుకోవడం తగదు. తెలంగాణ రైతుకు ఇప్పుడిప్పుడే ఆత్మవిశ్వాసం పెరుగుతున్నది. రాబోయే కొద్దిరోజుల్లో ప్రతి ఎకరాన్నీ తడుపనున్న గంగమ్మ కోసం ఉత్సాహంగా ఎదురుచూస్తున్నడు తెలంగాణ రైతన్న. ఈ నేపథ్యంలో ఓట్ల రాజకీయాల కోసం రైతులను పావులుగా వాడుకునే ప్రయత్నాన్ని ప్రతిపక్షాలు మానుకోవాలె. బాధ్యతారహత ప్రవర్తనతో రైతు కూలీ బిడ్డలను మరింత నిరుత్సాహంలోకి నెట్టడం వారిని ఆత్మహత్యలకు ప్రేరేపించడమే. ఆత్మహత్యల నుంచి ఆత్మవిశ్వాసం వైపు తెలంగాణ రైతన్నను నడిపిస్తున్న కేసీఆర్ ప్రభుత్వవిధానాలను భగ్నంచేయడం నేరానికి పాల్పడటమే అవుతుంది. ■

తెలంగాణ రైతుకు ఇప్పుడిప్పుడే ఆత్మవిశ్వాసం పెరుగుతున్నది. రాబోయే కొద్దిరోజుల్లో ప్రతి ఎకరాన్నీ తడుపనున్న గంగమ్మ కోసం ఉత్సాహంగా ఎదురుచూస్తున్నడు తెలంగాణ రైతన్న. ఈ నేపథ్యంలో ఓట్ల రాజకీయాల కోసం రైతులను పావులుగా వాడుకునే ప్రయత్నాన్ని ప్రతిపక్షాలు మానుకోవాలె. బాధ్యతారహత ప్రవర్తనతో రైతు కూలీ బిడ్డలను మరింత నిరుత్సాహంలోకి నెట్టడం వారిని ఆత్మహత్యలకు ప్రేరేపించడమే.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.437, Near Velama Kalyana Mandapam, Devara Yamjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078, Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

సెన్సెక్స్	నిఫ్టీ
32,596	9,998
↓ 410	↓ 117

ముడి చమురు (బ్రెంట్) ↓ 69.86 డాలర్లు

బంగారం ధరలు

ముంబై (రూ.లలో)	
24 క్యారెట్లు	30,835
22 క్యారెట్లు	30,685
వెండి (కిలో)	38,465

విదేశీ మారకం

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలర్	59.32	68.78
బహ్రెయిన్ దినార్	160.64	184.09
కువైట్ దినార్	179.91	223.97
సౌదీ రియాల్	15.77	18.69
యూఏఈ దిర్హామ్	16.14	18.87

చికెన్ ధరలు

	(రూ.లలో)
ఫారం ధర	62.00
రిటైల్ లైవ్	84.00
డ్రెస్డ్	122.00
స్కిన్‌లెస్	139.00

నెక్ (వంద గుడ్లకు)

	(రూ.లలో)
హైదరాబాద్	315-00
రంగారెడ్డి	315-00
మెదక్	315-00
కరీంనగర్	317-00
వరంగల్	317-00
రిటైల్ ప్రైస్	3-75

టాటా చేతికి భూషణ్ స్టీల్

- బిడ్డింగ్‌లో గెలుపొందిన సంస్థ
- రూ.35 వేల కోట్లుగా ఉంటుందని అంచనా



న్యూఢిల్లీ, మార్చి 23: రుణభారంతో సతమతమవుతూ దివాలా చట్ట పరిధిలోకి చేరిన భూషణ్ స్టీల్ ఎట్టకేలకు టాటా స్టీల్ వశమైంది. ఎంతమేరకు కొనుగోలు చేసిన విషయాన్ని మాత్రం సంస్థ వెల్లడించలేదు. ఇండస్ట్రీ వర్గాల అంచనా ప్రకారం ఈ ఒప్పందం రూ.35 వేల కోట్ల స్థాయిలో ఉంటుందని అంచనా. పూర్తి స్థాయి నగదు రూపంలో జరుగనున్న ఈ ఒప్పందంతో టాటా స్టీల్ దేశంలో మూడో అతిపెద్ద స్టీల్ ఉత్పత్తి సంస్థగా అవతరించడానికి దోహదపడనున్నది. ప్రస్తుతం టాటా 13 మిలియన్ టన్నుల స్టీల్‌ను ఉత్పత్తి చేస్తుండగా, భూషణ్ స్టీల్‌కు చెందిన 56 లక్షల టన్నుల స్టీల్ కూడా జతకానున్నది. ఈ మేరకు 22న భూషణ్ స్టీల్ లిమిటెడ్(బీఎస్ఎల్)కు చెందిన క్రెడిట్ కమిటీల(కోసీ) నిర్ణయం తీసుకున్నదని టాటా స్టీల్ ఒక ప్రకటనలో వెల్లడించింది. అయితే ఈ ఒప్పందానికి రెగ్యులేషన్ కమిటీ తోపాటు జాతీయ కంపెనీ చట్ట ట్రిబ్యునల్, కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) తదితర నియంత్రణ సంస్థల నుంచి తగిన అనుమతులు లభించాల్సి ఉందని కంపెనీ ఒక ప్రకటనలో పేర్కొంది. భూషణ్ స్టీల్‌ను కొనుగోలు చేయడానికి జేఎస్‌డబ్ల్యూ చేసిన ప్రయత్నాలు బెడిసి కొట్టాయి. రూ.29,700 కోట్ల బిడ్ దాఖలు చేసినప్పటికీ టాటా స్టీల్ అత్యధికంగా రూ.35 వేల కోట్లు కోడ్ చేసి దక్కించుకున్నట్లు తెలుస్తున్నది. ప్రస్తుతం భూషణ్ స్టీల్‌కు రూ.48,100 కోట్ల స్థాయిలో అప్పు ఉన్నది. వచ్చే ఐదేండ్లలో స్టీల్ ఉత్పత్తి సామర్థ్యాన్ని రెండింతలు పెంచాలనుకుంటున్న టాటా స్టీల్‌కు ఈ కొనుగోలు దోహదం చేయనున్నది.

రాజన్ నేతృత్వంలో లిబరల్ ఆర్ట్స్ వర్సిటీ



ముంబై, మార్చి 23: ఆర్బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ నేతృత్వంలో ప్రత్యేకంగా లిబరల్ ఆర్ట్స్ వర్సిటీ ఏర్పాటుకాబోతున్నది. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసిటీ వద్ద రూ.750 కోట్ల పెట్టుబడితో ఏర్పాటుకానున్న ఈ క్రియా యూనివర్సిటీకి చైర్మన్‌గా ఆర్ శేషసాయి వ్యవహరించనున్నారు. దాతృత్వ కార్యకలాపాల్లో భాగంగా పలు కార్పొరేట్ సంస్థలు ఏర్పాటు చేస్తున్న ఈ యూనివర్సిటీకోసం తొలి విడుత రూ.750 కోట్లు ఖర్చు చేయనున్నట్లు ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ ఏడాది నవంబర్‌లో అడ్మిషన్లు ప్రారంభించనుండగా, వచ్చే ఏడాది జూలై నాటికి తొలి బ్యాచ్ అందుబాటులోకి రానున్నది. హాస్టల్ సదుపాయం కలుపుకొని వార్షిక ఫీజు కింద రూ.7-8 లక్షలు వసూలు చేయనున్నారు. శ్రీసిటీలో 200 ఎకరాల స్థలంలో ఏర్పాటు చేస్తున్న ఈ క్యాంపస్ 2020 నాటికి సిద్ధంకానున్నది.

పరివర్తన బాటలో పీఎన్‌బీ



న్యూఢిల్లీ, మార్చి 23: వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ, ఆయన మామ మెహుల్ చోక్సీ ఆధ్వర్యంలోని వివిధ సంస్థలకు వేలాది కోట్ల రూపాయల రుణాలిచ్చి దారుణంగా మోసపోయిన పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ) మున్ముందు ఇటువంటి కుంభకోణాలు జరుగకుండా నిరోధించేందుకు 'మిషన్ పరివర్తన్' పేరుతో పది అంచెల వ్యూహానికి శ్రీకారం చుట్టింది. లాభాలను గరిష్ఠ స్థాయికి తీసుకెళ్లడం, ఆస్తుల నాణ్యతను, రుణాల వసూళ్లను, ఉత్పాదకతను పెంపొందించుకోవడం, రిటైల్ వ్యాపారాన్ని పెంపొందించుకునేందుకు కొత్త పద్ధతులను పాటించడం, తప్పులను, ఫిర్యాదులను తగ్గించుకుని సరికొత్త నిఘా పద్ధతులను అవలంబించడం ఈ వ్యూహంలో ముఖ్యాంశాలని పీఎన్‌బీ ఒక ప్రకటనలో వివరించింది.

తగ్గిన టెలికం సబ్‌స్క్రైబర్లు

- జనవరిలో 117 కోట్లకు చేరిక: ట్రాయ్

న్యూఢిల్లీ, మార్చి 23: టెలికం వినియోగదారులు క్రమంగా తగ్గుతున్నారు. జనవరి నెలతో ముగిసేనాటికి దేశవ్యాప్తంగా వినియోగదారులు 117.5 కోట్లకు తగ్గినట్లు టెలికం నియంత్రణ మండలి ట్రాయ్ వెల్లడించింది. చిన్నస్థాయి సంస్థలు తమ వినియోగదారులను కోల్పోవడంతో ఈ పరిస్థితి నెలకొన్నదని పేర్కొంది. డిసెంబర్ 2017 నాటికి 119.06 కోట్ల స్థాయిలో ఉన్న వినియోగదారులు ఆ మరుసటి నెలకుగాను 117.5 కోట్లకు తగ్గారు. వీరిలో మొబైల్ వినియోగదారులు 115.19 కోట్లు ఉన్నారు. జనవరిలో కొత్తగా 1.26 కోట్ల మంది మొబైల్ వినియోగదారులు చేరారని తెలిపింది. వీరిలో ఒక రిలయన్స్ జియోకు 83 లక్షల మంది చేరగా, భారతీ ఎయిర్‌టెల్‌కు 15 లక్షలు, వొడాఫోన్‌కు 12.82 లక్షలు, ఐడియాకు 11.44 లక్షలు, బీఎస్ఎన్ఎల్ 3.96 లక్షల మంది నెట్‌వర్క్‌లను ఎంచుకున్నారు.

దలాల్ స్ట్రీట్ దడదడ



- 410 పాయింట్లు కోల్పోయిన సెన్సెక్స్
- 10 వేల పాయింట్ల దిగువకు నిఫ్టీ
- ఐదు నెలల కనిష్ఠ స్థాయికి సూచీలు పతనం
- రూ.1.57 లక్షల కోట్ల సంపద ఆవిరి

ముంబై, మార్చి 23: అగ్రరాజ్యం అమెరికా దెబ్బకు స్టాక్ మార్కెట్లు విలవిల్లాడాయి. మొన్నటికి మొన్న స్టీల్, అల్యూమినియం దిగుమతులపై సుంకం విధించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్..తాజాగా చైనా నుంచి దిగుమతయ్యే ఉత్పత్తులపై సుంకం విధించడంతో ప్రపంచ స్టాక్ మార్కెట్లను కలవరానికి గురిచేసింది. ప్రపంచ వ్యాణిజ్యంలో యుద్ధమేఘాలు కమ్ముకుంటుండటంతో మదుపరుల్లో ఆందోళన తీవ్రస్థాయికి చేరుకున్నది. దీంతో అమ్మకాలకు మొగ్గుచూపడంతో దేశీయ స్టాక్ మార్కెట్లు ఐదు నెలల కనిష్ఠ స్థాయికి జారుకున్నాయి. ఫలితంగా వారంతం ట్రేడింగ్ ప్రారంభం నుంచే కుప్పకూలిన సూచీలు ఏ దశలోనూ కోలుకోలేకపోయాయి. ఒక దశలో 500 పాయింట్లకు పైగా పతనం చెందిన బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ ప్రధాన సూచీ సెన్సెక్స్ చివరకు 409.73 పాయింట్లు లేదా 1.24 శాతం నష్టంతో 32,596.54 వద్దకు జారుకున్నది. గతేడాది అక్టోబర్ 23 తర్వాత ఇదే కనిష్ఠ స్థాయి ముగింపు. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ప్రధాన సూచీ నిఫ్టీ 10 వేల దిగువకు పడిపోయింది. నిన్నటి ముగింపుతో పోలిస్తే 116.70 పాయింట్లు (1.15 శాతం) తగ్గి 9,998.05 వద్ద స్థిరపడింది. ఈ ఏడాదిలో ఇంత తక్కువగా నమోదవడం ఇదే తొలిసారి. మదుపరుల్లో ఆందోళన తీవ్రతరం కావడంతో అమ్మకాలకు మొగ్గుచూపారు. ఫలితంగా రూ.1.57 లక్షల కోట్ల సంపద హారతి కర్పూరంలా కరిగిపోయింది. దీంతో బీఎస్ఈలో లిస్టైన కంపెనీల విలువ రూ.1,39,30,643 కోట్లుగా నమోదైంది. చైనా నుంచి వచ్చే దిగుమతులపై దాదాపు 60 బిలియన్ డాలర్ల పన్నులు విధించాలని 'పెద్దన్న' తీసుకున్న నిర్ణయం మార్కెట్లలో ప్రకంపనలు సృష్టించిందని మార్కెట్ విశ్లేషకులు పేర్కొన్నారు. గడిచిన నాలుగు వారాలుగా దిగువముఖం పట్టిన సూచీలు ఈ వారంలోనూ పతనం చెందాయి. ఈ వారం మొత్తానికి సెన్సెక్స్ 579.46 పాయింట్లు (1.75 శాతం), నిఫ్టీ 197.10 పాయింట్లు (1.93 శాతం) నష్టపోయాయి. 30 షేర్ల ఇండెక్స్‌లో 24 నష్టపోగా, కేవలం ఆరు మాత్రమే లాభపడ్డాయి. రంగాల వారీగా చూస్తే రియల్టీ 3.31 శాతం తగ్గగా, మెటల్ 2.89 శాతం, బ్యాంకెక్స్ 2.08 శాతం పతనం చెందాయి. వీటితోపాటు క్యాపిటల్ గూడ్స్, హెల్త్‌కేర్, పీఎస్‌యూ, ఆటో, ఆయిల్ అండ్ గ్యాస్ విభాగాలకు చెందిన షేర్లు దిగువముఖం పట్టాయి. హిందుస్థాన్ జింక్, టాటాస్టీల్, ఎన్ఎండీసీ, జేఎస్‌డబ్ల్యూ కంపెనీల షేర్లు ఏడు శాతం వరకు పతనం చెందాయి. ఎనిమిది బ్యాంకులను టోటెమ్ ఇన్‌ఫ్రా రూ.1,394 కోట్లకు మోసగించినట్లు సీబీఐ కేసు దాఖలు చేయడంతో ఈ రంగ షేర్లు కుప్పకూలాయి. నిఫ్టీ బ్యాంక్ ఇండెక్స్ 471.10 లేదా 1.95 శాతం చొప్పున పతనం చెంది ఎనిమిది నెలల కనిష్ఠ స్థాయి 23,670.40కి పడిపోయింది. యాక్సిస్ బ్యాంక్, పీఎన్‌బీ, యెస్ బ్యాంక్, కెనరా బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, ఐడీఎఫ్‌సీ బ్యాంక్, ఎస్‌బీఐ, బ్యాంక్ ఆఫ్ బరోడా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, కొటక్ బ్యాంక్, ఫెడరల్ బ్యాంక్, ఇండస్ఇండ్ బ్యాంక్‌ల షేర్లు 3.87 శాతం వరకు తగ్గాయి. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అత్యధికంగా 8.29 శాతం తగ్గి రూ.86.85కి జారుకున్నది. వీటితో పాటు టాటా మోటార్స్, ఎల్ అండ్ టీ, బజాజ్ ఆటో, డాక్టర్ రెడ్డీస్, రిలయన్స్ ఇండస్ట్రీస్, విప్రో, హెచ్‌డీఎఫ్‌సీ, సన్‌ఫార్మా, హీరో మోటోకార్ప్, హెచ్‌యూఎల్, మారుతి సుజుకీ, భారతీ ఎయిర్‌టెల్, ఓఎన్‌జీసీ, ఐటీసీ, టీసీఎస్, ఎన్‌టీపీసీలు రెండు శాతంకు పైగా మార్కెట్ వాటాను కోల్పోయాయి. కానీ ఐటీ, మీడియా రంగ షేర్లు లాభాల్లో ముగియడం విశేషం. అదానీ పోర్ట్స్, ఇన్ఫోసిస్, పవర్‌గ్రిడ్, మహీంద్రా అండ్ మహీంద్రా, కోల్ ఇండియా, ఏషియన్ పెయింట్స్‌లు ఒక శాతంవరకు లాభపడ్డాయి. 419 స్టాక్‌లు 52 వారాల కనిష్ఠ స్థాయికి జారుకోగా, 23 మాత్రం ఏడాది గరిష్ఠ స్థాయికి చేరుకోవడం విశేషం.

అంతర్జాతీయ మార్కెట్లదీ అదే పరిస్థితి..

అమెరికా తీసుకున్న నిర్ణయం అంతర్జాతీ మార్కెట్లలో అమ్మకాలు పోటెత్తాయి. దీంతో వాల్ స్ట్రీట్ జర్నల్ భారీగా నష్టపోగా.. మధ్యాహ్నం తర్వాత ప్రారంభమైన ఆసియా, యూరప్ మార్కెట్లు కూడా దిగువముఖం పట్టాయి. జపాన్‌కు చెందిన నిక్కీ 4.51 శాతం పతనం చెందగా, హాంకాంగ్స్ హ్యాంగ్‌సెంగ్ 2.45 శాతం, షాంఘై కంపోసైట్ ఇండెక్స్ 3.39 శాతం వరకు కోల్పోయింది.

తొలి రోజే బీడీఎల్‌కు దెబ్బ

స్టాక్ మార్కెట్లో లిస్టైన తొలిరోజే ప్రభుత్వ రంగంలోని రక్షణ రంగ పరికరాల తయారీ సంస్థ భారత్ డైనమిక్స్ (బీడీఎల్)కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఇష్యూ ధర రూ.428 కంటే తొమ్మిది శాతం తక్కువకు పడిపోయింది. రూ.360 వద్ద లిస్టైన షేరు ఇంట్రాడేలో 15.88 శాతం పడిపోయింది. చివరకు 8.71 శాతం తగ్గి రూ.390.70 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈలో 8.92 శాతం పతనం చెంది రూ.389.90 వద్దకు చేరుకున్నది.

ఐడీబీఐలో ఇంటి దొంగలు

- రూ.445.32 కోట్లకు కుచ్చుటోపీ
- మాజీ జీఎం, మరో 30 మందిపై సీబీఐ కేసు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: బ్యాంకులను మోసం చేసిన దగాకోరుల చిట్టా ఒక్కొక్కటిగా బయటికొస్తున్నది. ఇటువంటి దగాకోరుల వలన నష్టపోయిన పంజాబ్ నేషనల్ బ్యాంక్, ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాల సరసన తాజాగా ఐడీబీఐ బ్యాంకు చేరింది. ఈ బ్యాంకు నుంచి దాదాపు రూ.445.32 కోట్ల మేరకు రుణం తీసుకున్న 31 మందిపై సీబీఐ శుక్రవారం కేసు నమోదు చేసింది. ఇందులో ఐడీబీఐ మాజీ జనరల్ మేనేజర్ బట్టు రామారావు, మరో 21 సంస్థలు ఉండటం గమనార్హం. రామారావు అక్రమాలు బయటికి రావడంతో బ్యాంకు అతన్ని ఉద్యోగం నుంచి తొలగించింది. హైదరాబాద్‌లోని ఐడీబీఐ రీజినల్ హెడ్ మంజునాథ్ పాయ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం సీబీఐ అధికారులు కేసు నమోదు చేశారు. చేపల పెంపకందారులకు మంజూరు చేసే రుణాలతో పాటు, ఇతర రుణాల్ని విడుదల చేయడంలో అప్పటి బషీర్‌బాగ్ ఐడీబీఐ బ్యాంకు శాఖ డీజీఎం బట్టు రామారావు, చీఫ్ జనరల్ మేనేజర్ ఆర్ దామోదరన్‌లు కుట్రపూరితంగా వ్యవహరించి 22 గ్రూపులకు రూ.192.98 కోట్ల రుణాలను మంజూరు చేయడంలో తోడ్పడ్డారు. ప్రస్తుతం మొత్తం రుణబకాయి రూ.445.32 కోట్లకు చేరినట్లు ఐడీబీఐ గుర్తించింది. ఐడీబీఐ హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్, హబ్సిగూడ శాఖలతో పాటు విశాఖపట్నం సిరిపురం బ్రాంచీ ద్వారా ఈ రుణాలు మంజూరు చేయడం గమనార్హం. రుణగ్రహీతలు ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాలతో పాటు తెలంగాణలోని ఆదిలాబాద్ జిల్లాలో చేపలను పెంచుతున్నట్లు చూపెట్టి ఈ రుణాలను మంజూరు చేశారు. వాస్తవానికి వీరిలో ఎవరూ చేపలు పెంచడం లేదని బ్యాంకు గమనించింది. బ్యాంకు విడుదల చేసిన రుణమొత్తాన్ని ఆయా సంస్థలకు చెందిన ప్రతినిధులు తమ వ్యక్తిగత పొదుపు ఖాతాల్లోకి బదిలీ చేసుకున్నారని సీబీఐకిచ్చిన ఫిర్యాదులో ఐడీబీఐ వెల్లడించింది. రుణాన్ని మంజూరు చేసేటప్పుడు ఆయా సంస్థలు దాఖలు చేసిన తనఖా దస్తావేజులు నకిలీవిగా బ్యాంకు గుర్తించింది. మొత్తానికి 2009 నుంచి 2012 దాకా దాదాపు 220 రుణ ఖాతాల నుంచి రూ.192.98 కోట్ల రుణాన్ని ఐడీబీఐ విడుదల చేసింది.

డీసీ చైర్మన్‌పై సీబీఐ కేసు



న్యూఢిల్లీ, మార్చి 23: ఆర్థిక నేరగాళ్లపై ఉక్కుపాదం మోపుతున్న కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) తాజాగా డెక్కన్ క్రానికల్ హోల్డింగ్స్ లిమిటెడ్ (డీసీహెచ్ఎల్), ఆ సంస్థ చైర్మన్ టీ వెంకట్రామ్ రెడ్డితో పాటు మరికొంత మంది ఇతరులపై ఛీటింగ్ కేసు నమోదు చేసింది. ప్రభుత్వ రంగంలోని ప్రముఖ బీమా సంస్థ యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ (యూఐఐసీ) లిమిటెడ్‌ను రూ.30.54 కోట్లకు మోసగించారన్న అభియోగాల మేరకు వీరితో పాటు యూఐఐసీ చెన్నై పెట్టుబడుల విభాగ మాజీ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఏ బాలసుబ్రమణియన్, మాజీ ఛీఫ్ మేనేజర్ కేఎల్ కుంజీల్వార్, సెబీ (సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా) నుంచి ఆమోదం పొందిన ప్రముఖ రేటింగ్ సంస్థ 'కేర్', ఐడీఎఫ్‌సీలపై కూడా సీబీఐ కేసు నమోదు చేసినట్లు అధికారులు శుక్రవారం న్యూఢిల్లీలో వెల్లడించారు. నేరపూరిత కుట్రలో భాగంగా బాలసుబ్రమణియన్, కుంజీల్వార్ 2011లో డీసీహెచ్ఎల్ జారీచేసిన అన్‌సెక్యూర్డ్ రిడీమబుల్ నాన్-కన్వర్టబుల్ డిబెంచర్లలో స్వల్పకాలిక పెట్టుబడులు పెట్టారని, ఆ మొత్తాన్ని తిరిగి చెల్లించకపోవడంతో యూఐఐసీకి రూ.30.54 కోట్ల నష్టం వాటిల్లినట్లు అధికారులు వివరించారు.

తొట్టెంపూడి దంపతుల అరెస్టు

- 'టోటెమ్' వ్యవహారంలో సీబీఐ పురోగతి
- బ్యాంకు అధికారుల ప్రమేయంపై ఆరా

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ) సహా ఎనిమిది బ్యాంకుల కన్సార్టియంను రూ.1,394 కోట్ల మేరకు మోసగించిన టోటెమ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థ ఎండీ తొట్టెంపూడి సలలిత్, డైరెక్టర్ తొట్టెంపూడి కవిత దంపతులను సీబీఐ అధికారులు శుక్రవారం బెంగళూరులో అరెస్టు చేశారు. మార్చి 21న యూబీఐ ఇండస్ట్రియల్ ఫైనాన్స్ బ్రాంచీ సీనియర్ మేనేజర్ షేక్ మహమ్మద్ అలీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీబీఐ అధికారులు గురువారం వీరిపై కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. వీరి నుంచి కేవలం ఏడు ఎకరాల భూమిని, గుర్గావ్ (హర్యానా)లోని 3,740 చదరపు అడుగుల ఆఫీసు స్థలాన్ని తనఖాగా పెట్టుకుని కోట్లాది రూపాయల రుణాలను మంజూరు చేసిన బ్యాంకు అధికారుల పాత్రపై కూడా సీబీఐ ఆరా తీస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలో గురువారం నుంచి సీబీఐ అధికారులు హైదరాబాద్‌లోని టోటెమ్ సంస్థ కార్యాలయం, కంపెనీ యజమాని ఇళ్లలో సోదాలను నిర్వహిస్తున్నారు. ఈ కేసును విచారించడానికి సీబీఐ బెంగళూరు ఎస్పీ టీ రాజబాలాజీ.. డీఎస్పీ సత్యమూర్తిని నియమించారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సీబీఐకి ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం.. టోటెమ్ ఇన్‌ఫ్రా సంస్థ పలు బ్యాంకుల నుంచి రుణాలను పొందింది. వీరికి రుణాలిచ్చిన బ్యాంకుల్లో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎస్‌బీఐ (పూర్వపు ఎస్‌బీహెచ్, ఎస్‌బీఎం), పంజాబ్ నేషనల్ బ్యాంక్, సిండికేట్, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఐడీబీఐ, కర్ణాటక బ్యాంకు, ఓరియెంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ కన్సార్టియంగా ఏర్పడ్డాయి. వీటికి లీడ్ బ్యాంక్‌గా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వ్యవహరించింది. టోటెమ్ ఇన్‌ఫ్రా రహదారుల ప్రాజెక్టులు, మంచినీటి నిర్మాణాలు, భవన నిర్మాణాలు చేపట్టే వ్యాపారంలో నిమగ్నమైంది.

జిగ్నేష్‌కు బిగుస్తున్న ఉచ్చు

కమోడిటీ ట్రేడింగ్ నిర్వహిస్తున్న ఎంసీఎక్స్ మాజీ ఎండీ జిగ్నేష్ షాకు వ్యతిరేకంగా కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ తాజాగా మరో కేసును దాఖలు చేసింది. ఫార్వార్డ్ మార్కెట్ కమిషన్ నలుగురు మాజీ చైర్‌పర్సన్లపై కూడా శుక్రవారం సీబీఐ కేసును నమోదు చేసింది. ముంబై, గ్వాలియర్, సిమ్లాలో షాతోపాటు ఇతర ఉన్నతాధికారులకు ఉన్న కార్యాలయాలపై దాడుల చేసినట్లు సీబీఐ వర్గాలు వెల్లడించాయి. ఇప్పటికే షాపై పలు కేసును దాఖలు చేసింది.

'డ్రాగన్'కు గుణపాఠం

వాషింగ్టన్, మార్చి 23: అమెరికా మేధో సంపదను అడ్డగోలుగా దోచుకుంటున్న చైనాపై అగ్రరాజ్య అధినేత డొనాల్డ్ ట్రంప్ కన్నెర్ర చేశారు. చైనా నుంచి తమ దేశంలోకి వచ్చే దిగుమతులపై ఆయన 60 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.4 లక్షల కోట్ల) సుంకాలను విధించారు. ప్రపంచంలోని రెండు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలైన అమెరికా, చైనా మధ్య ఇప్పటికే ఉద్రిక్తంగా ఉన్న వాణిజ్య సంబంధాలు ట్రంప్ తీసుకున్న తాజా నిర్ణయంతో మరింత దిగజారే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. మేధో సంపత్తి చౌర్యం చాలా కాలం నుంచి అమెరికా-చైనా వాణిజ్య సంబంధాల్లో వివాదాస్పద అంశంగా ఉన్న విషయం తెలిసిందే. దీనిపై ఏడు నెలల పాటు విస్తృత దర్యాప్తు జరిపించిన ట్రంప్.. చివరికి చైనా నుంచి వచ్చే దిగుమతులపై దాదాపు 60 బిలియన్ డాలర్లకు సమానమైన సుంకాలను విధించాల్సిందిగా అమెరికా వాణిజ్య ప్రతినిధి (యూఎస్‌టీఆర్) రాబర్ట్ లైట్‌హైజర్‌ను ఆదేశించారు. దీంతో చైనా నుంచి దిగుమతి అయ్యే దాదాపు 1,300 వస్తువుల ధరలు పెరిగే అవకాశం ఉన్నదని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. 'మేధో సంపత్తి చౌర్యం వలన మేము చాలా తీవ్రమైన సమస్యను ఎదుర్కొంటున్నాం. ఇది అమెరికాను పటిష్ఠవంతం చేసి మరింత ధనిక దేశంగా మార్చింది' అని ట్రంప్ పేర్కొన్నారు. చైనాపై తాజాగా ఆర్థిక ఆంక్షలు విధించేందుకు ఉద్దేశించిన పత్రాలపై అమెరికా అధ్యక్ష భవనం వైట్ హౌస్‌లో సంతకాలు చేస్తూ ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. మేధో సంపదను తస్కరిస్తున్న చైనాపై రాబర్ట్ లైట్‌హైజర్ విస్తృత దర్యాప్తు జరిపి తన నివేదికను సమర్పించిన మరుసటి రోజే ట్రంప్ ఈ ఆర్థిక ఆంక్షలను విధించారు. వ్యాపారంలో చైనా అడ్డదారులు తొక్కుతూ అమెరికా కంపెనీలపై వత్తిడి తీసుకువచ్చి అక్రమంగా తమ సంస్థలకు సాంకేతిక పరిజ్ఞానాన్ని బదిలీ చేయించుకుంటోందని, ఇందుకోసం విదేశీ యాజమాన్యాలపై ఉండే ఆంక్షలు, జాయింట్ వెంచర్ నిబంధనలు, ఈక్విటీ పరిమితులు, పెట్టుబడులకు సంబంధించిన ఇతర నిబంధనలను చైనా ఉపయోగించుకుంటోందని రాబర్ట్ లైట్‌హైజర్ తన దర్యాప్తు నివేదికలో తేల్చారు. ఈ విషయంలో 'డ్రాగన్'ను ప్రతిఘటించి అమెరికా మేధో సంపత్తిని కాపాడుకోవాలంటే కఠినమైన ఆర్థిక ఆంక్షలతో చైనాకు బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉన్నదని ఆయన పేర్కొన్నారు. దీంతో చైనా నుంచి వచ్చే దిగుమతులపై దాదాపు 60 బిలియన్ డాలర్లకు సమానమైన సుంకాలను విధించాలని, చైనా నుంచి అమెరికాలోకి దిగుమతయ్యే ఉత్పత్తుల జాబితాను, వాటిపై పెంచే సుంకాల వివరాలను 15 రోజుల వ్యవధిలోగా ముద్రించాలని యూఎస్‌టీఆర్‌ను ట్రంప్ ఆదేశించారు. చైనాతో తమ వార్షిక వాణిజ్య లోటు భారీ స్థాయిలో 504 బిలియన్ డాలర్లకు (దాదాపు రూ.32.76 లక్షల కోట్లకు) పెరిగిందని ఆయన తెలిపారు. 'చైనాతో అమెరికా వార్షిక వాణిజ్య లోటు 375 బిలియన్ డాలర్లుగా ఉన్నట్లు కొన్ని అంచనాలు చెబుతున్నాయి. ఈ అంచనాలు ఎలా ఉన్నప్పటికీ చైనాతో మా వాణిజ్య లోటు ప్రపంచంలోని మరే ఇతర దేశంలోనూ లేనంత భారీ స్థాయికి పెరిగింది. దీంతో పరిస్థితి చేయి దాటిపోయింది. ఈ లోటులో కనీసం కొంతైనా తగ్గించాలని మేము ఎన్నోసార్లు చైనాకు విజ్ఞప్తి చేసినప్పటికీ ఫలితం లేకపోయింది' అని ట్రంప్ ఆవేదన వ్యక్తం చేశారు.


మేధో సంపత్తి చౌర్యంపై 'పెద్దన్న' ఆగ్రహం

చైనాపై ఉత్పత్తులపై అమెరికా ఆర్థిక ఆంక్షలు

దిగుమతులపై 4 లక్షల కోట్ల పన్నులు

20 లక్షల ఉద్యోగాలను కోల్పోయాం..

ఇదిలావుంటే, చైనాతో వాణిజ్య లోటు పెరగడం వలన అమెరికాలో 20 లక్షల ఉద్యోగాలను కోల్పోవాల్సి వచ్చిందని వైట్ హౌస్ పేర్కొన్నది. 'మార్కెట్లను దెబ్బతీసే విధానాలతో తలెత్తే ప్రతి 100 కోట్ల డాలర్ల వాణిజ్య లోటు వలన మేము దాదాపు 6,000 చొప్పున ఉద్యోగాలను కోల్పోతున్నట్లు కొన్ని లెక్కలు పేర్కొంటున్నాయి. ఈ లెక్కల ప్రకారం అమెరికా సుమారు 20 లక్షల ఉద్యోగాలను కోల్పోయినట్లు స్పష్టమవుతున్నది. ఇది చాలా తీవ్రమైన సమస్య. దీనికంతటికీ చైనా అనుసరిస్తున్న అనుచిత వ్యాపార విధానాలే కారణం' అని వైట్ హౌస్ ఉన్నతాధికారి ఒకరు అన్నారు.



వాణిజ్య యుద్ధానికి సై

- అమెరికాపై ప్రతీకార చర్యలు తప్పవని చైనా హెచ్చరిక

బీజింగ్: అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తమ ఉత్పత్తులపై ఆర్థిక ఆంక్షలు విధించడంపై చైనా దీటుగా స్పందించింది. అమెరికాతో వాణిజ్య యుద్ధం సాగించేందుకు వెనుకంజ వేసే ప్రసక్తే లేదని, ఆ దేశంపై ప్రతీకార చర్యలు తప్పవని చైనా స్పష్టం చేసింది. అమెరికాపై తాము కూడా ఆర్థిక ఆంక్షలు విధిస్తామని, అగ్రరాజ్యం నుంచి నుంచి తమ దేశంలోకి దిగుమతయ్యే వస్తువులపై సుంకాలను పెంచి తీరుతామని చైనా శుక్రవారం నాడు ప్రకటించింది. సుంకాలు పెంచాలనుకుంటున్న పలు అమెరికా వస్తువుల జాబితాను కూడా చైనా విడుదల చేసింది. పంది మాంసం మొదలుకొని తాజా పండ్లు, వైన్ వరకు అనేక వస్తువులు ఈ జాబితాలో ఉన్నాయి. అయితే ఈ వస్తువులపై సుంకాలను పెంచే విషయంపై అమెరికాతో చర్చించి నిర్ణయం తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నామని చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ట్రంప్ సర్కారు వాణిజ్య యుద్ధం మొదలుపెడితే తాము వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేసింది. అయితే ఈ వాణిజ్య యుద్ధంలో పోరాడాలని తాము భావించడం లేదని, కానీ దాని గురించి భయపడటం లేదని, చర్చల ద్వారా వివాదాన్ని పరిష్కరించుకునేందుకు సిద్ధంగా ఉన్నామని చైనా వాణిజ్య శాఖ పేర్కొన్నది.

తెలంగాణ ప్రభుత్వం

తెలంగాణ ప్రభుత్వం

తెలంగాణ ప్రభుత్వం

రాములోరి పెండ్లికి భద్రగిరి ముస్తాబు

- విద్యుత్ దీపాలతో వెలుగొందుతున్న ఆలయం
- నేడు ఆలయానికి రానున్న మంత్రి తుమ్మల


దేదీప్యమానంగా వెలుగొందుతున్న భద్రాద్రి రామాలయం


ధ్వజపటం వద్ద పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం, నమస్తే తెలంగాణ: భద్రాద్రి రాముని కల్యాణ ఘడియలు రానే వచ్చాయి. ఈనెల 26న శ్రీసీతారాముల కల్యాణం, 27న శ్రీరామపట్టాభిషేకం నిర్వహించనున్నారు. ఇందుకోసం ప్రభుత్వం అన్ని ఏర్పాట్లను సిద్ధం చేసింది. విళంబినామ సంవత్సరంలో ఈ ప్రధాన వేడుకలు జరుగనున్న నేపథ్యంలో 60 ఏండ్లకోసారి వచ్చే ఈ అరుదైన ముహూర్తం రోజు కల్యాణం, పట్టాభిషేకం వేడుకలు కనులారా వీక్షించేందుకు దేశ నలుమూలల నుంచి భక్తులు భద్రాద్రికి చేరుకోనున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా జిల్లా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లను సిద్ధం చేసింది. స్వామివారి కల్యాణం నిర్వహించే మిథిలా ప్రాంగణం ముస్తాబైంది. చలువ పందిళ్లను ఏర్పాటు చేశారు. చాందినీ వస్త్రాలతో అందంగా అలంకరించారు. కల్యాణ మండపాన్ని రంగులతో తీర్చిదిద్దారు. మిథిలా ప్రాంగణంలో కూలర్లు, ఏసీలు, ఫ్యాన్లు ఏర్పాటు చేస్తున్నారు. మిథిలా ప్రాంగణం బయట బ్రిడ్జి సెంటర్, గోపాలకృష్ణ సినిమా హాల్ సెంటర్ వరకు షామియానాలు ఏర్పాటు చేశారు. భక్తులకు తాత్కాలిక మరుగుదొడ్లు, వసతి గృహాలు ఏర్పాటు, తాగునీటి సౌకర్యాన్ని కల్పిస్తున్నారు. కరకట్ట ప్రాంతాన్ని అందంగా తీర్చిదిద్దారు. గోదావరి తీరంలోనూ షామియానాలు వేశారు. లడ్డూ ప్రసాదాలు సిద్ధం చేశారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంత్ భద్రాచలంలో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఎస్పీ అంబర్‌కిషోర్‌ఝా బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. శ్రీరామనవమి ఏర్పాట్లను పర్యవేక్షించడానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శనివారం భద్రాచలం రానున్నారు.

వైభవంగా ధ్వజపట భద్రక మండల లేఖనం...

శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ధ్వజపట భద్రక మండల లేఖనం వేడుకను వైభవంగా నిర్వహించారు. ఉదయం రామాలయంలో స్వామివారికి ఏకాంత స్నపనం నిర్వహించారు. యాగశాలలో చతుస్థానార్చన బింబం జరిపారు. సాయంత్రం బాజాభజంత్రీలు, సన్నాయి మేళాల నడుమ జియర్ మఠం వరకు ఊరేగింపు నిర్వహించారు. అక్కడ గరుడపటాన్ని చిత్రీకరించారు. ఈ పటాన్ని మంగళవాయిద్యాల నడుమ తిరిగి గర్భగుడికి తీసుకొచ్చి శ్రీసీతారామచంద్రస్వామి వారికి చూపించారు. యాగశాలలో గరుడాదివాసం, గరుడ జపం, గరుడ హోమం, మహాకుంభ ప్రతిష్టాపన తదితర కార్యక్రమాలు కనుల పండువగా నిర్వహించారు. శనివారం అగ్నిప్రతిష్ఠ, ధ్వజారోహణం, భేరీ పూజ, దేవతాహ్వానం, బలిహరణం, హన్మంత వాహనంపై తిరువీధిసేవ తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. శనివారం భక్తరామదాసు కీర్తనలపై ప్రముఖ సినీ సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్ ఆధ్వర్యంలో వెయ్యి మంది కళాకారులతో స్థానిక ఉత్తర ద్వారం వేదిక వద్ద కళార్చన కార్యక్రమం నిర్వహించనున్నారు.

పరకాల డివిజన్ ఏర్పాటుపై హర్షాతిరేకాలు

- కొత్తగా నడికూడ మండలం ఏర్పాటు
- సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే ధర్మారెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం


పరకాలలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న టీఆర్ఎస్ శ్రేణులు

వరంగల్ రూరల్ జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ: మూడు దశాబ్దాల పరకాల ప్రాంత ప్రజల కల సాకారమైంది. పరకాలను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటుచేస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేయడంతో ఈ ప్రాంత ప్రజల్లో ఆనందం వెల్లివిరిసింది. 30 ఏండ్లుగా పరకాల కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కల ఎట్టకేలకు నెరవేరింది. ఇటీవల టెక్స్‌టైల్ పార్కుకు శంకుస్థాపన చేసిన క్రమంలో సీఎం కేసీఆర్ రెవెన్యూ డివిజన్ ఇస్తానని హామీ ఇచ్చారు. ఆ వెంటనే అధికారులకు ఆదేశాలిచ్చి ప్రతిపాదనలు తెప్పించుకున్నారు. శుక్రవారం పరకాలను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేస్తూ జీవో జారీచేశారు. పరకాల మండలంతోపాటు కొత్తగా ఏర్పడబోయే నడికూడ మండలం, దామెర, శాయంపేట, ఆత్మకూరు మండలాలతో కలిపి పరకాల డివిజన్‌ను ఏర్పాటుచేస్తున్నారు. కొత్తగా దామెర మండలంలో కలిపిన నాలుగు గ్రామాలు కౌకొండ, కంఠాత్మకూర్, సర్వాపూర్, రామకృష్ణాపూర్ గ్రామాలతోపాటు నడికూడకు అవతలివైపున ఉన్న నార్లాపూర్, వరికోలు, రాయపర్తి, పులిగిల్ల, చర్లపల్లి, చౌటుపర్తి, ధర్మారం, ముస్త్యాలపల్లితో మొత్తం 13 గ్రామాలతో నడికూడ మండలం ఏర్పాటుకానున్నది. ఈ రెండింటికీ ప్రభుత్వం జీవో జారీ చేయడంతో సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి చిత్రపటాలకు స్థానికులు క్షీరాభిషేకం చేశారు. ఆ తర్వాత మిఠాయిలు పంచిపెట్టారు.


మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్రలో ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు

గులాబీ పార్టీలో చేరికల జోష్

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: గులాబీ పార్టీలోకి వలసలు జోరందుకున్నాయి. సీఎం కేసీఆర్ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ప్రధాన పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, ఇతర సంఘాల వారు పెద్ద ఎత్తున టీఆర్ఎస్‌లో చేరుతున్నారు. శుక్రవారం కూడా భారీగా చేరారు. నిజామాబాద్ జిల్లా రెంజల్ మండలం కళ్యాపూర్‌కు చెందిన కాంగ్రెస్, టీడీపీ నాయకులు 35 మంది బోధన్ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ సమక్షంలో హైదరాబాద్‌లో టీఆర్ఎస్‌లో చేరారు. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం వెంకటేశ్వర్లబావి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు దాదాపు 20మంది ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ఆధ్వర్యంలో, మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలం పర్దీపూర్ గ్రామానికి చెందిన ఎంపీటీసీ జయమ్మ, ఉపసర్పంచ్ వెంకటయ్య మరో ముగ్గురు దేవరకద్రలో ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సమక్షంలో గులాబీ గూటికి చేరారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా గోవిందరావుపేటలో కాంగ్రెస్, టీడీపీ, సీపీఎం, వైఎస్సార్ సీపీలకు చెందిన సుమారు 500 మంది టీఆర్ఎస్‌లో చేరారు. వీరికి టీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, ములుగు మార్కెట్ కమిటీ చైర్మన్ అజ్మీరా ప్రహ్లాద్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.


నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలవాసులకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

పరీక్ష రాసేందుకు వెళ్తుండగా ఆటో బోల్తా

ఆరుగురికి గాయాలు

చింతపల్లి: పదో తరగతి పరీక్ష రాసేందుకు వెళ్తున్న విద్యార్థుల ఆటో బోల్తా పడగా ఆరుగురికి గాయాలైన ఘటన నల్లగొండ జిల్లా వింజమూరులో శుక్రవారం జరిగింది. కుర్మేడు గ్రామానికి చెందిన 11 మంది పదో తరగతి విద్యార్థులు చింతపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో పరీక్ష రాసేందుకు గ్రామం నుంచి ఆటోలో బయలుదేరారు. వీరి ఆటో వింజమూరు శివారులో బోల్తా పడి ఆరుగురు విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వీరిని చింతపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందించారు. అనంతరం విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు.

ఛత్తీస్‌గఢ్‌లో ఐఈడీ పేల్చిన మావోయిస్టులు

ఇద్దరు జవాన్లకు తీవ్రగాయాలు

కొత్తగూడెం క్రైం: ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు మరోసారి రెచ్చిపోయారు. బుధవారం అర్ధరాత్రి సుక్మా జిల్లాలో పటేల్ దుర్రై అనే వ్యక్తిని ఇన్‌ఫార్మర్ అనే నెపంతో హత్యచేసిన మావోయిస్టులు.. శుక్రవారం బీజాపూర్‌లో మరో దుశ్చర్యకు పాల్పడ్డారు. బీజాపూర్ జిల్లా భూపాలపట్నం అటవీ ప్రాంతంలో రోడ్డు తవ్వి ఇంప్రొవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైస్ (ఐఈడీ)ని పేల్చారు. అటువైపు వెళ్లిన జవానులు చెల్లాచెదురయ్యారు. ఇద్దరు జవాన్లకు తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం భూపాలపట్నం వైద్యశాలకు తరలించారు.

రోడ్డు పక్కన పసికందు మృతదేహం

గుండాల: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలంలో శుక్రవారం దారుణం జరిగింది. రహదారి పక్కన పసికందు మృతదేహం పడి ఉన్నది. తెల్లవారుజామున గుండాల రహదారి పక్కన మృతిచెందిన పసికందు కనిపించింది. నెలలు నిండకముందే కన్నందున పాప మృతిచెందడంతో రహదారి పక్కనే ఉన్న చెత్తలో వదిలేసి ఉంటారని స్థానికులు చెప్తున్నారు.

సీఎం కేసీఆర్‌కు సలాం

ఆహ్వానిస్తే టీఆర్ఎస్‌లోకి వస్తా: నటుడు సుమన్


భువనగిరిలో మీడియాతో మాట్లాడుతున్న నటుడు సుమన్

భువనగిరి టౌన్: గౌడలను తలెత్తుకునేలా చేసిన సీఎం కేసీఆర్‌కు గౌడ జాతి రుణపడి ఉంటుందని సినీ నటుడు సుమన్ అన్నారు. అభిమాని శ్రీధర్ జన్మదిన వేడుకల్లో పాల్గొనేందుకు యాదగిరిగుట్ట వెళ్తూ మార్గమధ్యం భువనగిరి పట్టణం రహదారి బంగ్లాలో శుక్రవారం మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వం గౌడ భవన్‌కు ఐదెకరాల భూమి, రూ.5 కోట్లు మంజూరుచేయడం ప్రకటించడంపై హర్షం వ్యక్తంచేశారు. ఉమ్మడి రాష్ట్రంలో ఎందరో ముఖ్యమంత్రులు వచ్చి వెళ్లారు కానీ గౌడ జాతికి చేసిందేమీ లేదన్నారు. బీసీల్లో అనేక కులాలున్నాయని అందరికీ అన్ని చేస్తానని చెప్పిన సీఎం కేసీఆర్ దేవుడని అన్నారు. బీసీలకు ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం ఎన్టీఆర్ తర్వాత సీఎం కేసీఆరే న్యాయం చేశారని చెప్పారు. గౌడ జాతిని తలెత్తుకునేలా చేసిన సీఎం కేసీఆర్‌కు సలాం, నమస్తే, పాదాభివందనం అన్నారు. తాను ప్రస్తుతం నటనపైనే దృష్టిపెడుతున్నానని చెప్పారు. సీఎం కేసీఆర్ పార్టీలోకి ఆహ్వానిస్తే వెళ్తానని, రామునికి ఉడుత సాయంలాగా ఆయనకు తోడుగా నిలబడతానని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ జడల అమరేందర్‌గౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ సుర్వి లావణ్య శ్రీనివాస్ గౌడ్, భువనగిరి పీఏసీఎస్ చైర్మన్ ఎడ్ల సత్తిరెడ్డి, గౌడ సంఘం రాష్ట్ర నాయకులు అతికం లక్ష్మినారాయణగౌడ్ పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ పీహెచ్‌సీలో సౌకర్యాలు భేష్

ప్రశంసించిన సీజీజీ బృందం


సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ పీహెచ్‌సీకి వచ్చిన సీజీజీ బృందం సభ్యులకు సౌకర్యాలను వివరిస్తున్న డాక్టర్ దీప్తి ప్రియాంక

పెన్‌పహాడ్: మోడల్ దవాఖానలా రూపుదిద్దుకున్న సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం 'సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్' రాష్ట్ర బృందం సందర్శించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పెన్‌పహాడ్ వైద్యశాలలో మెరుగుపడిన సౌకర్యాలు, ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 'కేసీఆర్ కిట్' అమలు తీరును ఆరా తీసేందుకు పెన్‌పహాడ్ పీహెచ్‌సీని సందర్శించినట్టు ఆ బృందం సభ్యులు కర్ణాకర్, శ్రీజ తెలిపారు. పేద ప్రజలంతా ఆరోగ్యకర జీవితం గడుపాలని, ప్రభుత్వ దవాఖానలో మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఉన్నదని బృందం సభ్యులు పేర్కొన్నారు. దవాఖానలోని ఆపరేషన్, ఓపీ, సిబ్బంది గదులు, ఏసీ జనరల్ వార్డు, ఓపీ రిజిస్టర్, దవాఖాన ఆవరణలో ఏర్పాటు చేసిన గ్రీనరీ తదితర సౌకర్యాలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పెన్‌పహాడ్ దవాఖానను చూస్తే కార్పొరేట్ వైద్యశాలను తలపిస్తున్నదని, ఇక్కడి పరిస్థితులను రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ దవాఖానలతోపాటు అవసరమైతే ఇతర రాష్ట్రాల్లో అమలుకు కృషి చేయనున్నట్టు చెప్పారు. వీరివెంట డిప్యూటీ డీఎంహెచ్ఓ కళావతి, జిల్లా టీబీ సూపర్‌వైజర్ వెంకటేశ్, ప్రోగ్రాం అధికారులు రవి, గంగవర ప్రసాద్, డీపీఎంఓ కృష్ణయ్య ఉన్నారు.

సంతోష్‌కుమార్ గెలుపుపై సంబురాలు


సంతోష్‌కుమార్ స్వగ్రామం బోయినపల్లి మండలం కొదురుపాకలో పటాకులు కాలుస్తున్న టీఆర్ఎస్ నాయకులు

బోయినపల్లి: రాజ్యసభ సభ్యుడిగా జోగినిపల్లి సంతోష్‌కుమార్ ఎన్నికవడంపై ఆయన స్వగ్రామం రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం కొదురుపాకలో శుక్రవారం రాత్రి గ్రామస్తులు, టీఆర్ఎస్ నాయకులు సంబురాలు జరుపుకున్నారు. కొదురుపాకకు చెందిన టీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు జోగినిపల్లి రవీందర్‌రావు కుమారుడు సంతోష్‌కుమార్ రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికవడంపై గ్రామస్తులు, చిన్ననాటి స్నేహితులు, అభిమానులు, కార్యకర్తలు, టీఆర్ఎస్ నాయకులు పటాకులు కాల్చారు. ఈ సంబురాల్లో డీసీఎంఎస్ చైర్మన్ ముదుగంటి సురేందర్‌రెడ్డి, జెడ్పీటీసీ కొనుకటి లచ్చిరెడ్డి, వైస్ ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, రిటైర్డు ఆర్ఐ హైజేబ్ రవిచందర్, టీఆర్ఎస్ నాయకులు కత్తెరపాక కొండయ్య, ఏమిరెడ్డి మల్లారెడ్డి, అనుమల్ల భాస్కర్ రెడ్డి, బండి శ్రీనివాస్, ఎర్ర మల్లయ్య, ఏమిరెడ్డి సురేందర్ రెడ్డి, లెంకల సత్యనారాయణ రెడ్డి, కత్తెరపాక రవీందర్, పెంతల బాల్‌రెడ్డి, అనుముల రాజు, ఎర్ర నాగరాజు, కొనుకటి తిరుపతి, అనుముల దేవయ్య, తిమ్మాపురం అశోక్, పెంజర్ల బాలమల్లు, కుడుదుల రాజమల్లు, తిరుపతియాదవ్, రాంప్రసాద్, దేవయ్య, తిరుపతి, మల్లారెడ్డి, పెంతల రమేశ్, కొనుకటి మల్లికార్జున్, తదితరులు పాల్గొన్నారు.

పెద్దూరులో..

రాజన్న సిరిసిల్ల జిల్లా పెద్దూరులోనూ సంతోష్‌కుమార్ ఎంపీగా గెలువడంపై సంబురాలు జరుపుకున్నారు. సంతోష్‌రావు తండ్రి రవీందర్‌రావు పుట్టిన ఊరైన సిరిసిల్ల మండలం పెద్దూరులో టీఆర్ఎస్ నాయకులు పటాకులు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ సంబురాల్లో నాయకులు గంద్ర రమేశ్‌రావు, జూపల్లి శ్రీనాథరావు, ఎరవెల్లి వెంకటరమణరావు,ఆదిపెల్లి దేవగౌడ్ పాల్గొన్నారు.


తెలంగాణ ప్రభుత్వం
నీటి పారుదల మరియు ఆయకట్టు అభివృద్ధి శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
Nos.77,78,79 & 80/2017-18, తేది : 20-03-2018
మిషన్ కాకతీయ ఫేజ్- IV-వరంగల్ రూరల్ జిల్లాలో నాలుగు (04) పునరుద్ధరణ పనుల కొరకు బిడ్లు కోరబడుచున్నవి. వెబ్‌సైట్‌లో బిడ్లు 22-03-2018 నుండి 29-03-2018 వరకు లభిస్తాయి. తదుపరి వివరాల కొరకు http://tender.telangana.gov.in వెబ్‌సైట్‌కి లాగాన్ కాగలరు.
సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్, I&CADD, ఇరిగేషన్ సర్కిల్, వరంగల్
DIPR RO No.690pp/CL/Advt/1/1/2017-18, Dt: 23/3/2018

వేద పాఠశాల ట్రస్టు ఏర్పాటు

వేములవాడ, నమస్తేతెలంగాణ: వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామివారి సన్నిధిలో నిర్వహించనున్న వేద ఆగమపాఠశాల కోసం రాజన్న ఆలయం తరపున ట్రస్ట్‌ను ఏర్పాటు చేస్తూ శుక్రవారం రిజిస్ట్రేషన్ చేయించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో దూస రాజేశ్వర్ మాట్లాడుతూ రాజన్న క్షేత్రంలో వేద ఆగమపాఠశాల వచ్చే విద్యాసంవత్సరం నుంచే ప్రారంభిస్తామన్నారు. ఇందుకోసం ఐదుగురు సభ్యులతో శ్రీరాజరాజేశ్వర వేద ఆగమ సంస్కృత విద్యాలయ ట్రస్ట్‌ను రిజిస్ట్రేషన్ చేయించినట్టు తెలిపారు. ఇందులో కార్యనిర్వహణాధికారి, సహాయ కార్యనిర్వహణాధికారితోపాటు ఇద్దరు వేద పండితులు ఉంటారన్నారు. ట్రస్టు బోర్డు సభ్యులు కూడా ఈ ట్రస్టులో ఉండాల్సి ఉంటుందన్నారు. ప్రస్తుతం నలుగురితో ట్రస్ట్‌ను రిజిస్ట్రేషన్ చేయించామని, త్వరలోనే ప్రవేశాల నోటిఫికేషన్ కూడా జారీచేస్తామన్నారు. రిజిస్ట్రేషన్ అనంతరం పత్రాలను సబ్‌రిజిస్ట్రార్ ఇంతియాజొద్దీన్ చేతులమీదుగా అందుకున్నారు.

పుట్టెడు దుఃఖంతో పరీక్షకు ..

తండ్రిపోయిన బాధతో విద్యార్థిని, తల్లిపోయిన శోకంతో విద్యార్థి


బాధిత విద్యార్థులు నాగరాణి, శివకుమార్

కోరుట్ల టౌన్/కోయిల్ కొండ: రోడ్డు ప్రమాదంలో తండ్రి మరణించగా పుట్టెడు దుఃఖంతో ఓ విద్యార్థిని పదో తరగతి పరీక్షకు హాజరుకాగా, నవమాసాలు మోసి ప్రాణం పోసిన తల్లి గుండెపోటుతో తుదిశ్వాస విడిచినా ఓ విద్యార్థి పదో తరగతి పరీక్షలకు హాజరైన ఘటన పలువురిని కదిలిచింది. వివరాల్లోకి వెళితే.. జగిత్యాల జిల్లా కోరుట్లలోని శ్రీకృష్ణ మందిరం సమీపంలో గురువారం రాత్రి శ్రీపాద సత్యనారాయణ ప్రమాదవశాత్తూ బైక్ అదుపుతప్పి పడిపోయి చనిపోయాడు. తండ్రి మరణించిన దుఃఖంలోనూ కూతురు నాగరాణి స్థానిక గౌతమ్ హైస్కూల్ పరీక్ష కేంద్రంలో శుక్రవారం పరీక్ష రాశారు. పరీక్షల అనంతరం అంత్యక్రియలకు హాజరై తండ్రికి కన్నీటి వీడ్కోలు పలికారు. మరోవైపు తన తల్లి గుండెపోటుతో మరణించిన పుట్టెడు దుఃఖంలోనూ విద్యార్థి పదో తరగతి పరీక్షకు హాజరయ్యాడు. ఈ ఘటన కోయిల్‌కొండ మండలం చంద్రాస్‌పల్లిలో జరిగింది. చంద్రస్‌పల్లికి చెందిన దివ్యాంగుడు వడ్డె శివకుమార్ పదో తరగతి పరీక్షలను గార్లపాడ్ పరీక్షా కేంద్రంలో రాస్తున్నా డు. వడ్డె నర్సమ్మ (40) గురువారం రాత్రి గుండె నొప్పితో బాధపడుతూ శివకుమార్ కళ్ల ముందే చనిపోయింది. తల్లి మృతిని గుండెలో దాచుకుని విద్యార్థి పరీక్షకు హాజరయ్యాడు. అనంతరం తల్లి అంత్యక్రియల్లో పాల్గొన్నాడు. ఈ రెండు ఘటనలు స్థానికులను కంటతడి పెట్టించాయి.

మా భూములు మాకివ్వండి

అక్రమ పట్టాలను నిరసిస్తూ వాటర్‌ట్యాంక్ ఎక్కిన రైతులు

భీమారం: భూములపై హక్కులు కల్పించాలని మంచిర్యాల జిల్లా భీమారం గ్రామానికి చెందిన పెండ్యాల లింగయ్య, మెండె రాజం శుక్రవారం మండల కేంద్రంలో నీళ్ల ట్యాంక్ ఎక్కి నిరసన తెలిపారు. ఆర్డీవో శ్రీనివాస్ రావాలని మంచిర్యాల-చెన్నూర్ రహదారిపై రైతు కుటుంబాల మహిళలు రోడ్డుపై బైఠాయించారు. ఎస్సై మంగిలాల్ రైతులను సముదాయించినా వినలేదు. ఆర్డీవో వచ్చి రైతులతో మాట్లాడారు. తమ భూమిని అక్రమంగా పటా చేసుకున్నారని, న్యాయం చేయాలని కోరగా, ఆర్డీవో కోర్టులో పరిష్కారిస్తానని ఆయన హామీనిచ్చారు. వీఆర్వో శశిరేఖపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు.

ఎన్నారైలకు 100 కోట్లు కేటాయింపు సంతోషం

తెలంగాణ ప్రవాసీ సంక్షేమ వేదిక

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌లో ఎన్నారైలకు రూ.100 కోట్లు కేటాయించడం సంతోషకరమని తెలంగాణ ప్రవాసి సంక్షేమ వేదిక హర్షం వ్యక్తంచేసింది. నేపాల్ రాజధాని ఖాట్మండులో ఈ నెల 21 నుంచి 23 వరకు అంతర్జాతీయ గల్ఫ్ వలసల భాగస్వామ్య వ్యూహాల శిక్షణ శిబిరం జరిగింది. శుక్రవారం నాటి సమావేశంలో తెలంగాణ ప్రవాసి సంక్షేమ వేదిక సభ్యుడు మహ్మద్ బషీర్ మాట్లాడుతూ.. ఎన్నారైలకు వంద కోట్ల బడ్జెట్ కేటాయింపు, హైదరాబాద్‌లో ఎన్నారై భవన్ నిర్మించడాన్ని స్వాగతించారు.

గురుకులాల్లో ఒక్కో విద్యార్థిపై లక్ష ఖర్చు

- విద్యాశాఖ పరిధిలోకే అన్ని సంక్షేమశాఖల గురుకులాలు
- ఒకే గొడుకు కిందకు స్టడీ సర్కిళ్లు
- కొత్తగా విధుల్లోకి 8,434 మంది గురుకుల ఉపాధ్యాయులు
- సీఆర్టీల వేతనాలు పెంచాలని సీఎం కేసీఆర్ ఆదేశించారు
- శాసనమండలిలో లఘుచర్చపై డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి


మాట్లాడుతున్న కడియం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని సంక్షేమశాఖలు, విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గురుకుల విద్యాసంస్థల్లో చదువుతున్న ఒక్కొక్క విద్యార్థిపై ప్రభుత్వం రూ.లక్ష ఖర్చు చేస్తున్నదని డిప్యూటీ సీఎం, విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి చెప్పారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్యను అందుబాటులోకి తీసుకొస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో గురుకుల విద్యాసంస్థలపై శుక్రవారం శాసనమండలిలో జరిగిన లఘుచర్చకు కడియం శ్రీహరి సమాధానమిచ్చారు. దేశంలో ఎక్కడాలేనివిధంగా తెలంగాణ ప్రభుత్వం కేజీ టు పీజీ ఉచిత విద్యావిధానానికి శ్రీకారం చుట్టిందన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన 71 సంవత్సరాల్లో 296 గురుకుల విద్యాలయాలను ఏర్పాటుచేస్తే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన నాలుగేండ్లలోనే 577 గురుకుల విద్యాలయాలను ప్రారంభించామని చెప్పారు. రాష్ట్రంలో వివిధ సంక్షేమశాఖల ఆధ్వర్యంలో కొనసాగుతున్న గురుకుల విద్యాలయాలన్నింటినీ విద్యాశాఖ పరిధిలోకి తీసుకురావాలని భావిస్తున్నామని, అన్నిరకాల స్టడీ సర్కిళ్లను కూడా ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చే అంశాన్ని పరిశీలిస్తున్నామని చెప్పారు. కేజీబీవీలు, మోడల్ స్కూళ్లు, గురుకులాల్లో పనిచేస్తున్న సీఆర్టీల వేతనాలను పెంచడానికి సీఎం కేసీఆర్ ఇప్పటికే ఆదేశాలు ఇచ్చారని, త్వరలో వీరి వేతనాలను పెరుగనున్నాయని వివరించారు.

అంబేద్కర్ స్ఫూర్తిని భావితరాలకు అందించేందుకే..

రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 వల్లే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సాధ్యమైందని కడియం శ్రీహరి చెప్పారు. రాజ్యాంగనిర్మాత బీఆర్ అంబేద్కర్ స్ఫూర్తిని భావితరాలకు అందించాలనే ఉద్దేశ్యంతోనే ట్యాంక్‌బండ్ వద్ద 125 అడుగుల ఎత్తైన ఆయన కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని సీఎం కేసీఆర్ భావించారని తెలిపారు. అంబేద్కర్ 125వ జయంతి సందర్భంగా 125 గురుకులాల విద్యాలయాల ఏర్పాటు గురించి అడిగితే.. 577 గురుకులాల ఏర్పాటుకు అనుమతి తెలిపిన సీఎం కేసీఆర్ గొప్ప మనసున్న మారాజు అని ఆయన అభివర్ణించారు. ఈ విద్యాసంవత్సరంలో 8,434 మంది గురుకుల ఉపాధ్యాయులు కొత్తగా విధుల్లో చేరనున్నారని కడియం చెప్పారు. కొత్త గురుకులాల్లో ఇప్పటికే 240 గురుకులాలకు నూతన భవనాల కోసం స్థలాలను కేటాయించామని, ఒక్కో గురుకులానికి రూ.1.50 కోట్లతో భవనాన్ని నిర్మించనున్నామని తెలిపారు. ఏడాదిలోపే భవన నిర్మాణాన్ని కూడా పూర్తిచేస్తామని ప్రకటించారు. గురుకుల విద్యాలయాల్లో క్రికెట్ అకాడమిలను ఏర్పాటుచేయాలని యోచిస్తున్నట్టు తెలిపారు. ప్రస్తుతం తెలంగాణలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాల్లో ఒక సైనిక్ స్కూల్‌ను ఉమ్మడి వరంగల్ జిల్లాలో మరొక సైనిక్ స్కూల్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఇవి విజయవంతమైతే అదిలాబాద్‌లో కూడా సైనిక్ స్కూల్ ఏర్పాటును పరిశీలిస్తామన్నారు. ఇతర దేశాల్లో అమలుచేస్తున్న విద్యా విధానాన్ని అధ్యయనం చేయడానికి త్వరలోనే విదేశాలకు ఒక బృందాన్ని పంపుతామని సభ్యులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. గురుకులాలపై లఘుచర్చలో సభ్యులు నారదాసు లక్ష్మణరావు, గంగాధరగౌడ్, ఫరీదుద్దీన్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

కొత్త జిల్లాల్లో ఒకే రకమైన డిజైన్లతో గ్రంథాలయాలు

గ్రంథాలయాలు సామాజిక చైతన్యం పెంపొందించడంలో ముఖ్యపాత్ర పోషిస్తున్నాయని కడియం శ్రీహరి అన్నారు. కొత్తగా ఏర్పాటుచేసిన 21 జిల్లాల్లో ఒకేరకమైన గ్రంథాలయ భవనాలను నిర్మించేందుకు డిజైన్లు రూపొందించామని, ఒక్కొక్క భవనానికి రూ.కోటి యాభైలక్షలు మంజూరు చేశామని తెలిపారు. శుక్రవారం శాసనమండలిలో ప్రశ్నోత్తరాల సమయంలో పాతూరి సుధాకర్‌రెడ్డి, కర్నె ప్రభాకర్, పట్నం నరేందర్‌రెడ్డి అడిగిన ప్రశ్నలకు ఉపముఖ్యమంత్రి సమాధానాలిచ్చారు.



మున్సిపాలిటీలకు ఆర్థిక స్వావలంబన

- పట్టణాల్లో పూర్తి సౌకర్యాలు
- 43 పట్టణాలకు రూ.1,000 కోట్లు
- మిషన్ భగీరథ ద్వారా తాగునీరు
- అన్ని పట్టణాల్లో పౌరసేవా కేంద్రాల ఏర్పాటు
- మెర్సర్ సర్వేలో నాలుగోసారి హైదరాబాద్ టాప్
- అసెంబ్లీలో పద్దులపై చర్చ సందర్భంగా మంత్రి కేటీఆర్


మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మున్సిపాలిటీలకు ఆర్థిక స్వావలంభన కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నదని మున్సిపల్‌శాఖ మంత్రి కే తారకరామారావు పేర్కొన్నారు. మున్సిపాలిటీ నిధులకు అదనంగా ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయించి, అభివృద్ధికి అండగా నిలుస్తున్నదన్నారు. మౌలిక వసతుల కల్పన కోసం 43 పట్టణాలకు రూ.1,000 కోట్లకు పైగా టీయూఎఫ్ఐడీసీ ద్వారా నిధులు మంజూరు చేసి ప్రధాన భారాన్ని తగ్గిస్తున్నట్టు చెప్పారు. నీరు, విద్యుత్ ఖర్చులు మున్సిపాలిటీలకు పెద్ద భారంగా మారాయని, ఇలాంటి సమయంలో మిషన్ భగీరథ పథకం ద్వారా పట్టణాలకు తాగునీరు అందించేందుకు ప్రభుత్వం ముందుకొచ్చిందని తెలిపారు. ఎలాంటి పన్నులు, అదనపు చార్జీలు పౌరులపై విధించకుండానే స్వయం సమృద్ధి సాధించేలా ప్రోత్సహిస్తున్నామన్నారు. తొలిసారిగా మున్సిపల్ బాండ్లను తెరపైకి తీసుకొచ్చామని, ప్రస్తుతం జీహెచ్ఎంసీ ద్వారా బాండ్లు జారీ చేసి రూ.1,000 కోట్లు సమీకరించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్టు చెప్పారు. రాష్ట్రంలో పట్టణ జనాభా 42శాతం ఉందని, అది మరింత పెరిగే అవకాశం ఉన్నందున.. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా చర్యలు చేపడుతున్నట్టు వివరించారు. హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దేందుకు మరింత ముందుచూపుతో పనిచేస్తున్నామన్నారు. మెర్సర్ సంస్థ ప్రకటించిన నివాసయోగ్యత గల నగరాల్లో హైదరాబాద్ వరుసగా నాలుగోసారి ప్రథమస్థానంలో నిలవడం సంతోషకరమన్నారు.

పట్టణాల దశ మారుస్తున్నాం

'గతంలో పట్టణ ప్రజలు అనేక సమస్యలతో సతమతమయ్యేవారు. హైదరాబాద్‌లో నీటి కోసం ఇబ్బందులు పడేవారు. ప్రస్తుతం అలాంటి పరిస్థితుల్లేవు. హైదరాబాద్ వాటర్‌వర్క్స్ డిపార్ట్‌మెంట్ ద్వారా సమస్యను అధిగమించా'మని మంత్రి కేటీఆర్ చెప్పారు. వీధి దీపాలను ఎల్ఈడీ లైట్లుగా మారుస్తున్నామని, ఇప్పటివరకు నాలుగులక్షల ఎల్ఈడీ బల్బులను మార్చడం ద్వారా నెలకు రూ.35 కోట్లు ఆదా చేస్తున్నామని తెలిపారు. అన్ని పట్టణాల్లో అత్యున్నత ప్రమాణాలతో పౌరసేవా కేంద్రాలు ఏర్పాటుచేయబోతున్నట్టు వెల్లడించారు.

స్వచ్ఛ నగరాలే లక్ష్యం

పరిశుభ్రతకు పెద్దపీట వేసి ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తున్నామని మంత్రి కేటీఆర్ తెలిపారు. ఇప్పటికే ఉన్న స్వచ్ఛ ఆటోల స్థానంలో ఎలక్ట్రిక్ వాహనాలను తీసుకొచ్చే యోచనలో ఉన్నట్టు చెప్పారు. అన్ని పట్టణాల్లో స్వచ్ఛ టిప్పర్లు సమకూరుస్తున్నామన్నారు. జవహర్‌నగర్ డంప్ యార్డు వద్ద గ్రీన్ కవరింగ్ చేసి సమస్యను పరిష్కరిస్తామని పేర్కొన్నారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను అన్ని పట్టణాల్లో నిర్మించేందుకు సిద్ధంగా ఉన్నట్టు చెప్పారు.

హైదరాబాద్‌లో మెరుగైన సౌకర్యాలు:

హైదరాబాద్‌లో దాదాపు రూ.3,000 కోట్ల అంచనాలతో వివిధ పనులు చేపడుతున్నామని కేటీఆర్ తెలిపారు. చార్మినార్‌ను ఆధునికీకరించి పర్యాటకాన్ని మరింత అభివృద్ధి చేస్తామని.. అమృత్‌సర్ కంటే ఎక్కువగా హంగులు కల్పిస్తామని చెప్పారు. నగరంలో 826 అత్యాధునిక బస్ షెల్టర్లు నిర్మిస్తున్నామని, ఏప్రిల్ నుంచి ఇవి అందుబాటులోకి వస్తాయన్నారు. డ్రైనేజీ సమస్యలు ఉన్నాయనడంలో వాస్తవం లేదని, ఇప్పటివరకు 833 నాలాల అవరోధాలను తొలగించామని, మిగతావి త్వరలో పూర్తిచేస్తామన్నారు. ఢిల్లీ తరహాలో 18 బస్తీ దవాఖానలు నెలకొల్పి, పేదలకు వైద్యం త్వరలో అందిస్తామన్నారు. గండిపేట కట్ట 2020 నాటికి వందేండ్లు పూర్తవుతున్న సందర్భంగా అద్భుతంగా అభివృద్ధి చేసేందుకు 100 కోట్లు కేటాయించినట్టు చెప్పారు. మూసీనది సుందరీకరణ, శుద్ధీకరణ ఆగస్టులో ప్రారంభిస్తామన్నారు.

24 నెలల్లో ఎయిర్‌పోర్టుకు మెట్రో

హైదరాబాద్ మెట్రో విజయవంతంగా ప్రయాణికులకు సేవలు అందిస్తున్నదని మెట్రో కేటీఆర్ చెప్పారు. ప్రతిరోజు 50-60 వేలమంది ప్రయాణికులను మెట్రో గమ్యానికి చేరుస్తున్నదని వివరించారు. 24 నెలల్లోనే ఎయిర్‌పోర్టు ఎక్స్‌ప్రెస్ కనెక్టివిటీ పేరుతో ఎయిర్‌పోర్టు వరకు మెట్రోపనులు పూర్తిచేసే లక్ష్యంతో పనిచేస్తామన్నారు. ఆగస్టు, సెప్టెంబర్ నాటికి హైటెక్ సిటీ వరకు, జూన్-జూలై నాటికి ఎల్బీనగర్ వరకు మెట్రో ప్రారంభిస్తామన్నారు.

వచ్చే ఏడాది వానకాలం పంటకు

ఉదయసముద్రం నీళ్లు

అసెంబ్లీలో నీటిపారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు.. 11 పద్దులకు శాసనసభ ఆమోదం


మాట్లాడుతున్న మంత్రి టీ హరీశ్‌రావు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఉదయసముద్రం పనులు వీలైనంత త్వరగా పూర్తిచేసి, 2019 వానకాలం పంటకు సాగునీరందిస్తామని నీటిపారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. 2007లో ఈ ప్రాజెక్టును ప్రారంభించినా, కాంగ్రెస్ పాలకుల నిర్లక్ష్యంతో పనులు ముందుకు కదలలేదన్నారు. కమిషన్ల కోసం మోటర్లు, పంపులు కొనిపెట్టారని పనులు మాత్రం జరుగలేదని, బిల్లులు మాత్రం తీసుకున్నారని విమర్శించారు. కరువుపీడిత ప్రాంతాలకు వెళ్లే ప్రాజెక్టు ఉదయసముద్రం అని తెలిపారు. శుక్రవారం అసెంబ్లీ ప్రశ్నోత్తరాల్లో భాగంగా ఉదయసముద్రం ప్రాజెక్టు పనులపై ఎమ్మెల్యేలు వేముల వీరేశం, నల్లమోతు భాస్కర్‌రావు, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అడిగిన ప్రశ్నలకు మంత్రి హరీశ్‌రావు సమాధానమిస్తూ, ఈ ప్రాజెక్టు పూర్తిచేస్తే నకిరేకల్, నల్లగొండ, మునుగోడు, తుంగతుర్తి నియోజకవర్గాల్లో లక్ష ఎకరాలకు సాగునీరు అందుతుందని వివరించారు. 40కి పైగా చెరువులను నింపుతామని తెలిపారు.మహబూబ్‌నగర్ జిల్లా జిల్లాలోని కోయిల్‌సాగర్ కుడి, ఎడమ కాల్వలను ఆధునీకరిస్తున్నామని మంత్రి హరీశ్‌రావు తెలిపారు. శాసనసభలో కోయిల్‌సాగర్ కాల్వల ఆధునీకరణపై దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వరరెడ్డి అడిగినప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చా రు. రాజన్నసిరిసిల్ల జిల్లా, వేములవాడ మండ లం, వేములవాడ ఆలయ పట్టణంలో గుడి చెరువుకు అదనంగా నీరు చేర్చడానికి సంకేపల్లి గ్రామం సమీపంలోని మిడ్‌మానేరు రిజర్వాయర్ తీరంలోని ఎత్తిపోతల పథకం నుంచి నీరందించనున్నట్టు హరీశ్‌రావు తెలిపారు. చెన్నమనేని రమేశ్ అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ, సీఎం ఆదేశాలతో గుడి చెరువు అభివృద్ధికి మిషన్ కాకతీయ పథకం కింద రూ.74 కోట్లు కేటాయించినట్టు తెలిపారు.

11 పద్దులకు ఆమోదం

శాసనసభ శుక్రవారం 11 పద్దులను ఆమోదించింది. శాసనసభలో మంత్రులు ప్రవేశ పెట్టిన వాణిజ్య పన్నులు, రెవెన్యూ, రిజిస్ట్రేషన్, విపత్తుల నిర్వహణ, పురపాలక, నగరాభివృద్ధి, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, రోడ్లు భవనాలు, రవాణ, భారీ మధ్యతరహా, చిన్న నీటి వనరులు, ఇంధన, ఎక్సైజ్ ల పద్దులపై సవివరంగా చర్చించిన సభ్యు లు ఆతరువాత ఆమోదించారు. అనంతరం డిప్యూటీ స్పీకర్ సభను శనివారానికి వాయిదా వేశారు.

నీటిపారుదల వ్యవస్థను కాంగ్రెస్, టీడీపీలే దెబ్బతీశాయి

- పద్దులపై సమాధానం సందర్భంగా మంత్రి హరీశ్ విమర్శలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అరవై ఏండ్ల ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణకు ఒరిగిందేమిలేదని నీటిపారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. 1956 నుంచి 2014 వరకు కాంగ్రెస్, టీడీపీల పాలనలో ప్రాజెక్టులన్నీ పెండింగ్ ప్రాజెక్టులుగా మారాయని చెప్పారు. మొత్తం సాగునీటి వ్యవస్థను దెబ్బతీశాయని అన్నారు. మిషన్ కాకతీయ ద్వారా 46 వేల చెరువుల పునరుద్ధరణతోపాటు పెండింగ్ ప్రాజెక్టుల పూర్తి, ఆయకట్టు స్థిరీకరణతో ముందుకు సాగుతున్నామని చెప్పారు. కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, డిండి ప్రాజెక్టు, సీతారామ ప్రాజెక్టు లాంటి నూతన ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ సంకల్పం గొప్పదని, రాష్ట్ర సాధన కోసం 14 ఏండ్లు ఉద్యమించి తెలంగాణ సాధించారని, అదే స్ఫూర్తితో ప్రాజెక్టులు నిర్మించి 1.25 కోట్ల ఎకరాలకు సాగునీరు అందిస్తామన్నారు. శుక్రవారం బడ్జెట్ పద్దులపై జరిగిన చర్చకు సమాధానమిస్తూ ఈ రెండు పార్టీలు భారీ, మధ్యతరహా ప్రాజెక్టుల కింద 26 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరు ఇచ్చామని చెప్తున్నాయని, కానీ వాస్తవంగా ఇందులో చాలావరకు సాగునీరు అందడం లేదని చెప్పారు. టీఆర్ఎస్ మూడున్నరేండ్ల పాలనలో 11 లక్షల ఎకరాల నూతన ఆయకట్టుకు నీరిచ్చామని, 2018 చివరినాటికి మరో 10 లక్షల ఎకరాల నూతన ఆయకట్టుకు నీరిస్తామని తెలిపారు. పార్లమెంటులో కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి రాధామోహన్‌సింగ్ తెలంగాణలో రైతుల ఆత్మహత్యలు తగ్గాయని స్టేట్‌మెంట్ ఇచ్చారని మంత్రి హరీశ్ తెలిపారు.

త్వరలో కొత్త పంచాయతీ చట్టం

- శాసనసభలో పద్దులపై చర్చలో మంత్రి జూపల్లి



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పంచాయతీలను మరింత పరిపుష్టం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నడుం బిగించిందని, ఇందులో భాగంగా కొత్త పంచాయతీ చట్టాన్ని తీసుకువచ్చేందుకు సిద్ధమైందని శాసనసభలో పద్దులపై చర్చ సందర్భంగా పంచాయతీరాజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు చెప్పారు. రాజ్యాంగంలో పేర్కొన్న 29 అధికారాలను బదిలీ చేయడంతో పాటు సర్పంచులకు అధికారాలు ఇచ్చి మరింత బాధ్యతను పెంచనున్నట్టు తెలిపారు. ప్రస్తుతం ఉన్న 8690కి అదనంగా మరో 4,000 పంచాయతీలు కొత్తగా ఏర్పడనున్నట్టు చెప్పారు.

ఆర్టీసీ సేవలు మెరుగుపరుస్తాం

రాష్ట్రంలో ఆర్టీసీ సేవలను మరింత మెరుగుపరుస్తామని, లాభాల బాటలో నడిచేలా శ్రమిస్తున్నామని రవాణాశాఖ మంత్రి మహేందర్‌రెడ్డి పద్దులపై చర్చ సందర్భంగా చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో 10,600 బస్సులు నడుస్తున్నాయని, కోటికి పైగా జనాభా సేవలు పొందుతున్నారని చెప్పారు. 17 కోట్లతో సిరిసిల్లలో డ్రైవింగ్ స్కూల్ ఏర్పాటు చేస్తున్నామని, అన్ని జిల్లాల్లో డ్రైవింగ్ శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు.

రోడ్ల అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నాం




మారుమూల ప్రాంతాలకు సైతం రోడ్డు సౌకర్యం కల్పించే లక్ష్యంతో పనిచేస్తున్నామని రోడ్లు, భవనాలశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. అన్ని మండల కేంద్రాలకు డబుల్‌లేన్ రోడ్లు ఈ ఏడాది చివరినాటికి పూర్తి చేస్తామన్నారు. తీవ్రవాద ప్రభావిత జిల్లాలుగా ఉన్న కరీంనగర్, వరంగల్, ఆదిలాబాద్, ఖమ్మం జిల్లాల్లో రూ.వెయ్యి కోట్లతో రోడ్ల అభివృద్ధి చేయనున్నట్టు చెప్పారు.

సీఎం కేసీఆర్ దూరదృష్టితో సజీవ గోదావరి



సకల రోగాలకు కారణం జలమేనని.. సీఎం కేసీఆర్ రక్షిత తాగునీటిని అందించేందుకు చేపట్టిన మిషన్ భగీరథతో తెలంగాణలో ఇకముందు సగం రోగాలు మాయం కానున్నాయని ఆర్టీసీ చైర్మన్, ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ అన్నారు. శాసనసభలో శుక్రవారం పలు పద్దులపై జరిగిన చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ దూరదృష్టిలో రూపొందించిన సాగునీటి ప్రాజెక్టుల రీడిజైనింగ్‌తో ఏకంగా 250 కిలోమీటర్ల మేర గోదావరి సంవత్సరం పొడవునా సజీవంగా ఉంటుందని అన్నారు. పద్దులపై చర్చ సందర్భంగా ఎమ్మెల్యేలు వెంకట్రావు, ఆర్ కృష్ణయ్య, సండ్ర వెంకటవీరయ్య, జాఫర్ హుసేన్ మాట్లాడారు.

మరో 3 వేల దేవాలయాలకు ధూప, దీప, నైవేద్యం



రాష్ట్రంలో మరో మూడువేల దేవాలయాలకు ధూప, దీప, నైవేద్య పథకం వర్తింపజేయనున్నట్టు దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి తెలిపారు. ధూప, దీప, నైవేద్యం పథకం అమలుపై ఎమ్మెల్యేలు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, ఒడితెల సతీశ్‌కుమార్, పుట్టా మధు, సుదీర్‌రెడ్డిలు అడిగిన ప్రశ్నలకు మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సమాధానమిచ్చారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 1805 దేవాలయాల్లో ధూప, దీప, నైవేద్య పథకం అమలులో ఉందని, ఇందుకు ప్రతి నెలా రూ.1.08 కోట్లు వెచ్చిస్తున్నట్టు తెలిపారు.

జీరోఅవర్‌లో ప్రశ్నలు.. మంత్రుల హామీలు

జీరోఅవర్‌లో పలువురు సభ్యులు వివిధ అంశాలను లేవనెత్తారు. సంగారెడ్డి జిల్లాలో చెక్‌డ్యాంలు నిర్మించాలని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ కోరారు. హైదరాబాద్‌లోని కొన్ని ప్రాంతాల్లో రౌడీయిజం మళ్లీ పెరుగుతున్నదని ఎంఐఎం ఎమ్మెల్యే జాఫర్ హుసేన్ ప్రస్తావించగా, చర్యలు తీసుకుంటామని హోంమంత్రి నాయిని చెప్పారు. ఎమ్మెల్యేలు కోరం కనకయ్య , బిగాల గణేశ్, ఆర్ కృష్ణయ్య, కూసుకుంట ప్రభాకర్‌రెడ్డి, మదన్‌లాల్, రవీంద్రకుమార్, పుట్ట మధు లేవనెత్తిన అంశాలను ఆయా శాఖల మంత్రులు నోట్ చేసుకొని, తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

అదనంగా 8.89 లక్షల ఎకరాలకు నీళ్లు

- జూన్‌నాటికి అందించేలా ప్రణాళిక రూపొందించిన నీటిపారుదలశాఖ
- 2017-18 ఫిబ్రవరి వరకు కొత్తగా 16.66 లక్షల ఎకరాలకు జీవం
- మిషన్ కాకతీయ కింద 11.61 లక్షల ఎకరాల స్థిరీకరణ
- శాసనసభలో నీటిపారుదలశాఖ పద్దుపై ప్రభుత్వ వివరణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కోటి ఎకరాలకు సాగునీటిని అందించే లక్ష్యంతో.. రాష్ట్ర ప్రభుత్వం భగీరథ యత్నానికి శ్రీకారం చుట్టడంతో ఏటేటా ఆ ఫలితాలు రైతన్నకు అందుతున్నాయి. 2017-18 నీటి సంవత్సరంలో ఫిబ్రవరి వరకు కొత్తగా 16.66 లక్షల ఎకరాలకు సాగునీరు అందించిన ప్రభుత్వం.. నాలుగునెలల్లోనే మరో 8.89 లక్షల ఎకరాలకు అదనంగా సాగునీరందించేలా కార్యక్రమాన్ని రూపొందించింది. ఇందులో భారీ, మధ్యతరహా ప్రాజెక్టుల కింద 8.29 లక్షల ఎకరాలు, చిన్నతరహా సాగునీటి రంగం కింద 33వేలు, ఐడీసీ కింద మరో 27 వేల ఎకరాలు ఉంది. శాసనసభలో శుక్రవారం నీటిపారుదలశాఖ పద్దుపై చర్చ సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన వివరణలో పలు అంశాలను పొందుపరిచింది. ప్రభుత్వం రూ.1,94,403 కోట్లతో 36 భారీ, మధ్యతరహా సాగునీటి ప్రాజెక్టులను చేపట్టింది. ఇందులో పది పూర్తికాగా.. మరో 11 పాక్షికంగా పూర్తయి సాగునీటిని అందిస్తున్నాయి. చిన్న నీటిపారుదల రంగం నుంచి కొత్తగా 60వేల ఎకరాలు, సాగునీటి అభివృద్ధి సంస్థ రంగం (ఐడీసీ) నుంచి 1.23 లక్షల ఎకరాలు ఇలా.. ఫిబ్రవరి నాటికి 16.66 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు ఏర్పడినట్టు వెల్లడించింది.

జూన్‌నాటికి కొత్తగా సిద్ధమవుతున్న ఆయకట్టు వివరాలు ప్రాజెక్టులవారీగా (ఎకరాల్లో..)

ప్రాజెక్టు పేరు	సిద్ధమవుతున్న ఆయకట్టు
భారీ ప్రాజెక్టులు	
ఎస్సారెస్పీ రెండో దశ	1,26,823
కల్వకుర్తి లిఫ్టు	1,64,241
భీమా లిఫ్టు	3,000
నెట్టెంపాడు	58,000
ఏఎమ్మార్పీ	50,000
దేవాదుల లిఫ్టు	1,23,217
ఎల్లంపల్లి (కాళేశ్వరంతోపాటుగా)	75,000
కాళేశ్వరం లిఫ్టు	25,000
వరద కాల్వ నుంచి ఎస్సారెస్పీ	1,02,882
చనాఖా-కొరాటా	29,800
మధ్యతరహా ప్రాజెక్టుల కింద	
పాలెంవాగు	3,132,
గొల్లవాగు	3,500,
నీల్వాయి	6,000
కుమ్రంభీం	24,500
జగన్నాథపూర్	15,000
కోయిల్‌సాగర్	18,250
కిన్నెరసాని	1,000
చిన్నతరహా ప్రాజెక్టుల కింద	33,000
ఐడీసీ లిఫ్టుల కింద	27,000
మొత్తం	8,89,345

మిషన్ కాకతీయతో 14.95 లక్షల ఎకరాలకు..

మిషన్ కాకతీయ మూడుదశల్లో 23,233 చెరువులను పునరుద్ధరణకు ఎంపికచే పనులు కొనసాగిస్తున్నారు. ఇప్పటివరకు 16,606 చెరువుల పునరుద్ధరణ పూర్తయినట్టు నీటిపారుదలశాఖ స్పష్టంచేసింది. మూడు దశల్లో భాగంగా 23.24 కోట్ల క్యూబిక్ మీటర్ల పూడిక మట్టిని తొలిగించడం విశేషం. నాలుగోదశ కింద మరో 5,419 చెరువుల అంచనాలు పూర్తికాగా.. 4,108 ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదం తెలిపినట్టు పేర్కొన్నారు. మొదటి మూడు దశల్లో 11.61 లక్షల ఎకరాల (మొదటిదశలో 6.71, రెండో దశలో 3.80, మూడో దశలో 1.10) ఆయకట్టు స్థిరీకరణ జరిగిందని నీటిపారుదలశాఖ చెప్పింది. రాష్ట్రంలోని 46,531 చెరువుల కింద 25.11 లక్షల ఎకరాల ఆయకట్టు ఉండగా... రెండేండ్లుగా మిషన్ కాకతీయ ఫలితాలు మొదలై.. ఆయకట్టు విస్తీర్ణం గణనీయంగా పెరుగుతుంది.

గత ఐదేండ్ల వివరాలు

సంవత్సరం	సాగునీరు అందిన ఆయకట్టు (ఎకరాలు లక్షల్లో..)
2013-14	11.10
2014-15	10.30
2015-16	3.00
2016-17	15.99
2017-18	14.95

మీడియా పాయింట్

గీత కార్మికులకు సీఎం కేసీఆర్ దేవుడు



అసెంబ్లీ సాక్షిగా వరాలు కురిపించిన సీఎం కేసీఆర్.. గీత కార్మికులకు దేవుడిగా నిలిచారు. ఆయనకు గౌడ కులస్థులంతా రుణపడి ఉంటారు. రాష్ట్రంలో రెండున్నర లక్షల మంది గీత కార్మికులున్నారు. అత్యంత ప్రమాదకర పరిస్థితుల్లో కులవృత్తి కొనసాగిస్తున్నారు. గత పాలకులు కల్లుగీత వృత్తిని మరుగునపడేసే ప్రయత్నం చేశారు. సీఎం కేసీఆర్ గీతవృత్తికి పూర్వవైభవం తీసుకొస్తున్నారు. గీత కార్మికులకు ఎక్స్‌గ్రేషియా రూ.5 లక్షలకు పెంచారు. చెట్టు పన్నును రద్దు చేయడం గౌడ కులస్థులకు పెద్ద ఊరట. గీత కార్మికులకు పింఛన్లు, గౌడభవన్ నిర్మాణానికి స్థలం, నిధులు కేటాయించడం అభినందనీయం.

- బూరనర్సయ్యగౌడ్ , ఎంపీ

సీఎం కేసీఆర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు




గౌడ కులస్థులకు వరాలు ప్రకటించిన సీఎం కేసీఆర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు. గౌడ కులస్థులను ఇప్పటివరకు ఓట్ల కోసమే వాడుకున్నారు. కానీ సీఎం కేసీఆర్ మాత్రమే వారి కష్టాలు గుర్తించారు. గౌడభవన్ నిర్మాణానికి సీఎం కేసీఆర్ నిధులు కేటాయించడం మంచి పరిణామం. పేద విద్యార్థులకు గౌడభవన్ ఉపయోగపడుతుంది. గీతవృత్తిదారులంతా సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటారు.

-గంగాధర్‌గౌడ్, ఎమ్మెల్సీ

విద్యుత్ రేట్లు సవరించే ప్రతిపాదన లేదు

- విద్యుత్‌శాఖ మంత్రి జీ జగదీశ్‌రెడ్డి



హైదరాబాద్, నమస్తేతెలంగాణ: రాష్ట్రంలో విద్యుత్ టారిఫ్ స్లాబులు, రేట్లను సవరించే ప్రతిపాదనేదీ లేదని విద్యుత్‌శాఖ మంత్రి జీ జగదీశ్‌రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం శాసనమండలిలో సయ్యద్ అమీనుల్ హసన్‌జాఫ్రీ, జనార్దన్ రెడ్డి, పూల రవీందర్ తదితరులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. ప్రతిఏటా డిస్కంలపై రుణభారం పడుతున్నదని, తెలంగాణ ప్రభుత్వం రూ.8,923 కోట్ల రుణభారాన్ని భరిస్తున్నదని చెప్పారు. వ్యవసాయరంగానికి చెల్లిస్తున్న సబ్సిడీలపైన పూర్తిస్థాయి వివరాలు అందలేదని తెలిపారు.

ఆర్టీసీ ఉద్యోగులందరికీ ఉచిత వైద్యపరీక్షలు

- రవాణాశాఖమంత్రి పట్నం మహేందర్‌రెడ్డి




హైదరాబాద్, నమస్తే తెలంగాణ: టీఎస్సార్టీసీలో పనిచేస్తున్న 56 వేలమంది ఉద్యోగులకు రూ.48 కోట్ల నిధులతో ఉచిత వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నామని రవాణాశాఖమంత్రి పీ మహేందర్‌రెడ్డి చెప్పారు. శుక్రవారం శాసనమండలిలో కాటేపల్లి జనార్దన్‌రెడ్డి, పూల రవీందర్, గంగాధర్‌గౌడ్, బాలసాని లక్ష్మీనారాయణ, భూపతిరెడ్డి అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. ప్రయాణికుల భద్రత దృష్ట్యా సంస్థలో డ్రైవర్లకు ఆర్నెళ్లకోసారి వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ముగ్గురు డ్రైవర్లు విధి నిర్వహణలోనే ఆకస్మికంగా మరణించిన సంఘటనలున్నాయని, దీనిని దృష్టిలో ఉంచుకుని డ్రైవర్లకు ఎప్పటికప్పుడు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు.

ప్రశ్నోత్తరాల సమయం

భూరికార్డుల ప్రక్షాళన 98 శాతం పూర్తి

- డిప్యూటీ సీఎం మహమూద్ అలీ




భూరికార్డుల ప్రక్షాళన రాష్ట్రవ్యాప్తంగా 98 శాతం పూర్తయినట్టు డిప్యూటీ సీఎం మహమూద్‌అలీ తెలిపారు. ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు పక్కా పర్యవేక్షణతో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తిచేస్తున్నట్టు చెప్పారు. శుక్రవారం అసెంబ్లీ ప్రశ్నోత్తరాల్లో భాగంగా భూ రికార్డుల ప్రక్షాళనపై ఎమ్మెల్యేలు వీ శ్రీనివాస్‌గౌడ్, కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, ఆరూరి రమేశ్, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, సండ్ర వెంకటవీరయ్య, లక్ష్మణ్ అడిగిన ప్రశ్నలకు డిప్యూటీ సీఎం సమాధానమిచ్చారు. అన్ని జిల్లాల్లోనూ పూర్తికావస్తున్నదని, జగిత్యాల జిల్లాలో వందశాతం భూరికార్డుల ప్రక్షాళన పూర్తయిందని, రాష్ట్రంలో 2 కోట్ల 39 లక్షల 87 వేల 994 ఎకరాల భూమికి సంబంధించి రికార్డుల ప్రక్షాళన పూర్తయినట్టు తెలిపారు.

స్టాండ్ అప్ ఇండియా కార్యక్రమాన్ని సమీక్షిస్తాం

- ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కేటీఆర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: స్టాండ్ అప్ ఇండియా కార్యక్రమంలో భాగంగా ఆర్థికమంత్రి ఈటల రాజేందర్‌తో కలిసి త్వరలో బ్యాంకర్లతో సమావేశం ఏర్పాటుచేస్తామని, ఎస్సీ, ఎస్టీ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు రుణాలు అందుతున్న తీరును సమీక్షిస్తామని ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కే తారక రామారావు శుక్రవారం శాసనమండలిలో వివరించారు. సబావత్ రాములునాయక్, డీ రాజేశ్వర్‌రావు తదితరులు అడిగిన ప్రశ్నలకు కేటీఆర్ సమాధానమిచ్చారు. రాష్ట్రంలో 35 ఇంక్యుబేటర్లు, కో-వర్కింగ్ స్పేస్‌లు పనిచేస్తున్నాయని చెప్పారు. టీ-హబ్, వీ-హబ్‌లను ప్రభుత్వమే నేరుగా ఏర్పాటుచేసిందని, మిగిలిన ఇంక్యుబేటర్లను విశ్వవిద్యాలయాలు, పరిశోధనాసంస్థలు, ప్రైవేటుకంపెనీలు ఏర్పాటుచేశాయని తెలిపారు. స్టాండ్ అప్ ఇండియా కార్యక్రమంలో బ్యాంకుల ప్రమేయం లేనప్పటికీ.. ఎస్సీ, ఎస్టీ, మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రతిబ్యాంకూ ఆర్థిక సహాయం చేయాల్సి ఉంటుందని తెలిపారు. తెలంగాణలోని 4,804 బ్యాంకుశాఖల్లో 778 శాఖలు స్టాండ్ అప్ ఇండియా కార్యక్రమంలో ఇప్పటివరకు 698 కోట్ల రుణాలు మంజూరు చేశాయని తెలిపారు.

6,180 మందికి పునరావాసం



రాష్ట్రంలో గుడుంబా తయారీని నిషేధించడంతోపాటు గతంలో గుడుంబా తయారీ మీద ఆధారపడినవారికి ప్రభుత్వ పునరావాసం కల్పిస్తున్నదని ఆబ్కారీశాఖ మంత్రి పద్మారావు తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 6,180 మందికి పునరావాసం కల్పించినట్టు ఆయన పేర్కొన్నారు. గుడుంబా విక్రేతల పునరావాసంపై ఎమ్మెల్యేలు సోలిపేట రామలింగారెడ్డి, రాజాసింగ్, సతీశ్‌కుమార్ అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. ఇప్పటివరకు రూ.183.60 కోట్లు పునరావాసానికి చెల్లించినట్టు తెలిపారు. స్పీకర్ మధుసూదనచారి కలుగజేసుకుని, గుడుంబా తయారీదారులకు పునరావాసం కల్పించే అంశం తన నియోజకవర్గం సహా అన్ని నియోజకవర్గాల్లో సమస్యగా ఉందన్నారు. రాష్ట్రంలో కనీసం 50 వేల మందికి పునరావాసం కల్పిస్తేనే ప్రభుత్వ లక్ష్యం విజయవంతమవుతుందని చెప్పారు. దీనికి మంత్రి పద్మారావు సమాధానమిస్తూ.. తగినచర్యలు తీసుకుంటామని తెలిపారు.

47,121 మంది మహిళలకు అమ్మఒడి సేవలు



రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 47,121 మంది మహిళలు అమ్మఒడి పథకం 102 అంబులెన్స్ సేవలను వినియోగించుకున్నట్టు వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డి తెలిపారు. అసెంబ్లీ ప్రశ్నోత్తరాల్లో భాగంగా అజ్మీరా రేఖానాయక్, బొడిగె శోభ అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. అంతకుముందు ఇద్దరు ఎమ్మెల్యేలు అమ్మఒడి పథకాన్ని తీసుకువచ్చినందుకు మహిళల తరపున సీఎం కేసీఆర్‌కు, ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో 241 అమ్మఒడి వాహనాలు అందుబాటులో ఉన్నాయన్నారు.

ప్రపంచకప్‌లో అఫ్ఘనిస్థాన్

సూపర్ సిక్స్‌లో ఐర్లాండ్‌పై గెలుపు.. సత్తా చాటిన రషీద్



హరారే: వారెవ్వా..! లీగ్ దశలో ఒక్క మ్యాచ్ గెలువకపోయినా.. ఒక్క పాయింట్ సాధించకపోయినా.. ఐసీసీ ప్రపంచకప్ క్వాలిఫయింగ్ టోర్నీలో అఫ్ఘనిస్థాన్ జట్టు సంచలనం చేసింది. సూపర్ సిక్స్‌లో వరుసగా మూడు మ్యాచ్‌లు నెగ్గి ప్రధాన టోర్నీకి అర్హత సాధించింది. శుక్రవారం జరిగిన సూపర్ సిక్స్ ఫైనల్ మ్యాచ్‌లోనూ 5 వికెట్ల తేడాతో ఐర్లాండ్‌ను చిత్తు చేస్తూ సగర్వంగా 2019 వన్డే ప్రపంచకప్ బెర్త్‌ను దక్కించుకుంది. ఐర్లాండ్ నిర్దేశించిన 210 పరుగుల లక్ష్యాన్ని అఫ్ఘనిస్థాన్ 49.1 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 213 పరుగులు చేసి ఛేదించింది. మహ్మద్ షహజాద్ (54), గుల్బాదిన్ నబీ (45), అస్గర్ స్టానిక్జై (39 నాటౌట్) దుమ్మురేపారు. ఐర్లాండ్ బౌలర్ సిమి సింగ్ 3 వికెట్లు తీసినా ప్రయోజనం లేకపోయింది. అంతకుముందు ఐర్లాండ్ 50 ఓవర్లలో 7 వికెట్లకు 209 పరుగులు చేసింది. స్టిర్లింగ్ (55), కెవిన్ ఒబ్రియాన్ (41), నీల్ ఒబ్రియాన్ (36) రాణించారు. స్పిన్నర్ రషీద్ ఖాన్ 3, దౌలత్ జద్రాన్ 2 వికెట్లు తీశారు. షహజాద్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. లీగ్ దశలో స్కాట్లాండ్, జింబాబ్వే, హాంకాంగ్ చేతిలో ఓడిన అఫ్ఘనిస్థాన్.. సూపర్ సిక్స్‌లో వరుసగా వెస్టిండీస్, యూఏఈ, ఐర్లాండ్‌పై గెలిచింది. వరల్డ్‌కప్‌నకు అర్హత సాధించడం అఫ్ఘాన్‌కు ఇది రెండోసారి.

రాజేశ్వరి స్థానంలో రాధా యాదవ్

న్యూఢిల్లీ: ముక్కోణపు టీ20 సిరీస్‌లో పాల్గొంటున్న భారత మహిళల జట్టులో ఒక మార్పు చోటు చేసుకున్నది. కుడి చేతి గాయంతో బాధపడుతున్న స్పిన్నర్ రాజేశ్వరీ గైక్వాడ్ స్థానంలో రాధా యాదవ్‌ను తీసుకున్నారు. ఆసీస్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో ఫీల్డింగ్ చేస్తూ రాజేశ్వరీ గాయపడింది. అయితే స్టార్ స్పిన్నర్ ఏక్తా బిష్త్ చూపుడు వేలి గాయంతో టోర్నీకి ముందే వైదొలుగడంతో ఆమె స్థానంలో రాజేశ్వరీకి అవకాశం ఇచ్చారు.

కబడ్డీ చాంపియన్ నిజామాబాద్



నిజామాబాద్ స్పోర్ట్స్: నిజామాబాద్ జిల్లా కేంద్రంలో తొలి తెలంగాణ రాష్ట్ర స్థాయి టీఎన్జీవో క్రీడా పోటీలలో భాగంగా జరిగిన కబడ్డీ ఫైనల్లో నిజామాబాద్ జట్టు 25-34 పాయింట్ల తేడాతో మెదక్ జట్టును ఓడించింది. క్రికెట్‌తో పాటు వాలీబాల్ ఫైనల్లో కరీంనగర్ జట్టు విజేతగా నిలువగా నిజామాబాద్ జట్టు రన్నరప్‌గా నిలిచింది. మహిళల అథ్లెటిక్స్ విభాగంలో నిజామాబాద్‌కు చెందిన రుద్రం కవిత షాట్‌పుట్, జావెలిన్, డిస్కస్‌త్రోలో మూడు స్వర్ణాలు గెలుచుకుని మహిళల విభాగంలో ఓవరాల్ చాంపియన్‌గా నిలువగా.. పురుషుల విభాగంలో మెదక్ జిల్లాకు చెందిన రాజశేఖర్ గౌడ్, మహబూబ్‌నగర్‌కు చెందిన సీతారాం ఇరువురు 13 పాయింట్లతో ఓవరాల్ చాంపియన్‌గా నిలిచారు. ముగింపు కార్యక్రమానికి హాజరైన జిల్లా కలెక్టర్ ఆర్ రామ్మోహన్ రావు, బెవరేజెస్ చైర్మన్ దేవీ ప్రసాద్ విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు.

రైనాలా రాణిస్తా..

ఐపీఎల్‌లో అదురగొడతా: రింకూ సింగ్



కోల్‌కతా: అనుకోకుండా అద్భుత అవకాశం దక్కించుకున్న రింకూసింగ్ ఐపీఎల్‌లో రాణించేందుకు అతని ఆరాధ్య ఆటగాడు సురేశ్ రైనా ఇచ్చిన సలహాను పాటిస్తానంటున్నాడు. శుక్రవారం మీడియాతో మాట్లాడిన ఈ యువ క్రికెటర్ దేశవాళీ టోర్నీలో అతను అరంగేట్రం చేసిన సందర్భంగా అతనికి జత గ్లౌజులు, బ్యాట్‌ను బహుమతిగా ఇచ్చిన విషయాన్ని గుర్తు చేసుకున్నాడు. ఈ సీజన్ వేలంలో రూ.80 లక్షలకు కేకేఆర్ నన్ను దక్కించుకున్న సందర్భంగా రైనా నాకు పంపిన సందేశం స్ఫూర్తిగా అదురగొడుతానన్నాడు. 'ఎలాంటి ఒత్తిడి లేకుండా.. నీ సహజశైలిలో ఆడి ఐపీఎల్‌లో రాణించు' అని సందేశం పంపాడని, ఈ సీజన్‌లో అరంగేట్రం చేస్తే తప్పకుండా నా ఆరాధ్య ఆటగాడి సలహా పాటిస్తానంటూ రింకూ సింగ్ స్పష్టం చేసాడు. దేశవాళీ మ్యాచ్‌లు ఆడుతున్న సందర్భంగా రైనా నా గదికి రావడం ఎప్పుడూ నేను మరిచిపోనన్నాడు. 'ఐపీఎల్‌లో నా అరంగేట్రానికి ముందు నా ఆరాధ్య ఆటగాడు రైనాను కలువడం నా కల. అది నిజం కావడంతో నాకు చాలా సంతోషం కలిగించింది. ఎందుకంటే నేను కూడా అతని లాగే ఎడమచేతి వాటం ఆటగాడిని. ఐపీఎల్ నుంచి నేను చాలా నేర్చుకున్నాను. వైవిధ్యమైన షాట్లు సంధించడంలో రైనాను అనుసరిస్తాను' అని రింకూ ఉద్వేగంతో తెలిపాడు. అలీగఢ్ నుంచి తొలిసారిగా నేను మాత్రమే ఐపీఎల్‌కు ఎంపికయ్యానని చెబుతూ.. నా స్ఫూర్తిగా అలీగఢ్‌లో క్రికెట్ ఆడే కుర్రాళ్లంతా చాలా అంకితభావంతో ప్రాక్టీస్ చేస్తున్నారని కొనియాడాడు. ఈ ఏడాది ముంబై ఇండియన్స్ జట్టు నిర్వహించిన క్యాంప్‌లో 31 బంతుల్లో 91 పరుగులు చేయడంతోనే వెలుగులోకి వచ్చానని వివరించాడు. రంజీ ట్రోఫీతోపాటు దేశవాళీ టీ20 పోటీలలో రాణించడంతో ఐపీఎల్‌లో ఆడేందుకు అవకాశం దక్కిందన్నాడు. ఎలాంటి ఒత్తిడి ఎదురైనా ప్రశాంతంగా ఆడి పరుగులు సాధిస్తానని రింకూ సింగ్ ధీమా వ్యక్తం చేశాడు.

విధిని ఎదిరించి.. పేదరికాన్ని జయించి..



ఉత్తరప్రదేశ్ రాష్ట్రం..అలీగఢ్.. ఆ యువ క్రికెటర్ పుట్టింది అక్కడే.. పెరిగింది.. క్రికెటర్ కావాలని కలలు కన్నదీ అక్కడే.. అతని తండ్రి ఇంటింటికీ గ్యాస్ సిలిండర్లు సరఫరా చేస్తాడు..తల్లి గృహిణి.. ఇల్లు తండ్రి పని చేసే గ్యాస్ కంపెనీ గౌడౌన్‌లోనే రెండు గదులు.. ఐదుగురి సంతానంలో మూడో వ్యక్తి.. ఆటోరిక్షా నడిపే సోదరుడు.. నేపథ్యం పేదరికం..అతని ఆశ క్రికెట్.. అతని ధ్యేయం టీమ్ ఇండియాకు ఆడడం.. అతని తపన మైదానంలో రాణించడం.. 20 ఏండ్ల వయసుకే ఎన్నో కష్టాలు..మరెన్నో ఎదురుదెబ్బలు..

ఒకసారి సోదరుడు అతన్ని రోజువారీ కూలీగా స్వీపర్ పని చేసేందుకు ఒప్పించి తీసుకువెళ్లాడు.. కానీ అతని అంతరాత్మ అందుకు అంగీకరించలేదు..మళ్లీ తనకు ఇష్టమైన క్రికెట్ మైదానం వైపే పరుగుదీసాడు..
ఢిల్లీలో జరిగిన స్థానిక టోర్నీలో మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచాడు..అతనికి బైక్ బహుమతిగా లభించింది.. ఆ బైక్ సిలిండర్లను సరఫరా చేసేందుకు అతని తండ్రి వాడుకున్నాడు.. అలా చిన్నప్పటి నుంచే కుటుంబానికి ఆసరాగా నిలిచాడు.. కోచ్‌ల సలహాతో క్రికెట్‌పై దృష్టి పెట్టాడు.. ఉత్తరప్రదేశ్ జట్టు తరపున అండర్-16, అండర్-19 జట్ల తరపున ఆడి రాణించాడు. రంజీ జట్టులోనూ ఆడి సెహభాష్ అనిపించుకున్నాడు.. జీవితం కాస్త కుదుటపడింది..
అందరు యువ క్రికెటర్ల లాగే అతను కూడా ఐపీఎల్ ఆడాలని..కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని కలలు కన్నాడు. గత సీజన్‌లో కింగ్స్ పంజాబ్ అతన్ని ప్రాథమిక ధర రూ.10లక్షలకు సొంతం చేసుకుంది.. అంతే ఏకైక సోదరి వివాహం చేసాడు..ఇంట్లోకి కాస్త ఆధునిక సామాగ్రి సమకూర్చుకున్నాడు.. కానీ అతనిలో అదే అసంతృప్తి.. ఆడేందుకు అవకాశం రాలేదు.. రిజర్వ్‌బెంచ్‌పై కూర్చోవాల్సి వచ్చింది.. మైదానంలోకి దిగాలి.. ఆడాలి.. ఇదే తపన..అంతే ఆరాటం..
2018 ఏడాది మళ్లీ ఐపీఎల్ వేలం..మహామహులకే దక్కని అవకాశం.. కానీ రింకూసింగ్ కోసం కేకేఆర్.. ముంబై ఇండియన్స్ జట్లు పోటీ పడ్డాయి..పాట పెరుగుతూ పోయింది.. రూ.80 లక్షలకు కోల్‌కతా రింకూను వేలంలో గెలుచుకుంది.. దీంతో అతని కుటుంబంలో ఆనందోత్సాహాలు.. బంపర్ లాటరీ తగిలినట్లుగా సంబురాలు.. ఇప్పుడు తాజాగా ఓ మంచి ఇంటికి మారుతున్నాడు.. అతనే యూపీ క్రికెటర్..యువ రింకూ సింగ్..

వివాన్‌కు కాంస్యం



సిడ్నీ: ఐఎస్‌ఎస్‌ఎఫ్ జూనియర్ ప్రపంచకప్‌లో భారత యువ షూటర్లు అదురగొడుతున్నారు. శుక్రవారం జరిగిన పురుషుల ట్రాప్ ఫైనల్లో వివాన్ కపూర్ రెండు కాంస్యాలతో మెరిశాడు. వ్యక్తిగత విభాగంలో 40 క్లేస్‌ల్లో 30 పాయింట్లు కొల్లగొట్టాడు. చైనీస్తైపీ షూటర్ కున్ పి యంగ్ 26 పాయింట్లకే పరిమితంకావడంతో వివాన్‌కు మూడోస్థానం సొంతమైంది. మట్టె మారోంగి (ఇటలీ) స్వర్ణం సంపాదించాడు. క్వాలిఫికేషన్ రౌండ్‌లో 113 పాయింట్లతో ఐదో షూటర్‌గా ఫైనల్ చేరుకున్న వివాన్.. కున్ పి యంగ్‌తో జరిగిన షూటాఫ్‌లోనూ 4-3తో నెగ్గి టైటిల్ పోరుకు అర్హత సాధించాడు. లక్ష్య, ఎలాహి వరుసగా 8, 13వ స్థానాల్లో నిలిచారు. టీమ్ ఈవెంట్ ఫైనల్లోనూ వివాన్ (113), లక్ష్య (112), అలీ అమన్ ఎలాహి (103)లతో కూడిన భారత బృందం మొత్తం 328 పాయింట్లతో మూడోస్థానంలో నిలిచి కాంస్యాన్ని ఒడిసిపట్టుకుంది. 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్ ఫైనల్లో రమేశ్ (402.5) ఆరోస్థానంతో సరిపెట్టుకున్నాడు. ఓవరాల్‌గా ఈ టోర్నీలో భారత్ రెండు స్వర్ణాలు, మూడు కాంస్యాలతో రెండోస్థానంలో కొనసాగుతున్నది.

విలియమ్సన్ రికార్డు సెంచరీ

తొలి ఇన్నింగ్స్‌లో న్యూజిలాండ్ 229/4



ఆక్లాండ్: ఇంగ్లండ్‌తో జరుగుతున్న తొలి డేనైట్ టెస్టులో న్యూజిలాండ్ పట్టు బిగించింది. కెప్టెన్ విలియమ్సన్ (220 బంతుల్లో 102; 11 ఫోర్లు, 1 సిక్స్) రికార్డు సెంచరీ సాధించడంతో శుక్రవారం రెండో రోజు తొలి ఇన్నింగ్స్‌లో కివీస్ 92.1 ఓవర్లలో 4 వికెట్లకు 229 పరుగులు చేసింది. నికోలస్ (49 బ్యాటింగ్), వాట్లింగ్ (17 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. 175/3 ఓవర్‌నైట్ స్కోరుతో రెండో రోజు ఆట కొనసాగించిన కివీస్ ఇన్నింగ్స్‌ను వరుణుడు అడుగడుగునా అంతరాయం కలిగించాడు. దాదాపు 90 నిమిషాల ఆట తుడిచిపెట్టుకుపోగా, కేవలం 23.1 ఓవర్లు మాత్రమే సాధ్యమయ్యాయి. 91 పరుగుల వద్ద వ్యక్తిగత స్కోరు వద్ద ఆట మొదలుపెట్టిన విలియమ్సన్.. అండర్సన్ బౌలింగ్‌లో గల్లీలో సింగిల్ తీసి కెరీర్‌లో 18వ శతకాన్ని నమోదు చేశాడు. దీంతో కివీస్ తరపున అత్యధిక సెంచరీలు చేసిన జాబితాలో మార్టిన్ క్రో (17), రాస్ టేలర్ (17)లను వెనక్కి నెట్టి అగ్రస్థానాన్ని సంపాదించాడు. ఈ దశలో గంటపాటు వర్షం అంతరాయం కలిగించినా.. నికోలస్‌తో నాలుగో వికెట్‌కు 83 పరుగులు జోడించి విలియమ్సన్ ఔటయ్యాడు. ఈ దశలో బ్యాటింగ్‌కు వచ్చిన వాట్లింగ్ ఆచితూచి ఆడినా.. రెండోసారి వచ్చిన వర్షం ఎంతకూ ఆగకపోవడంతో మ్యాచ్‌ను ఆపేశారు.

రెండో రౌండ్‌లో యూకీ



మియామి: భారత టెన్నిస్ యువ ఆటగాడు యూకీ భాంబ్రీ.. ఏటీపీ సర్క్యూట్‌లో ఆధిపత్యాన్ని చూపెడుతున్నాడు. మియామి ఓపెన్‌లో భాగంగా గురువారం అర్ధరాత్రి జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 107వ ర్యాంకర్ యూకీ 7-5, 6-3తో ప్రపంచ 75వ ర్యాంకర్ మీర్జా బాసిక్ (బోస్నియా)పై గెలిచి రెండోరౌండ్‌లోకి అడుగుపెట్టాడు. గంటా 32 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో.. యూకీ తన సర్వీస్‌లో 68 శాతం పాయింట్లు సాధించాడు. ఇక బాసిక్ కొట్టిన సర్వీస్‌లను రిటర్న్ చేయడంలో 71 శాతం విజయవంతమయ్యాడు. మ్యాచ్ మొత్తంలో వచ్చిన 13 బ్రేక్ పాయింట్ అవకాశాల్లో యూకీ ఐదింటిని సద్వినియోగం చేసుకోగా, బాసిక్ రెండింటిని కాపాడుకున్నాడు.

'ఆసియా' ఫైనల్లో అద్వానీ

యాంగన్(మయన్మార్): ఆసియా బిలియర్డ్స్ చాంపియన్‌షిప్‌లో భారత స్టార్ క్యూయిస్టు డిఫెండింగ్ చాంపియన్ పంకజ్ అద్వానీ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. తన దైన జోరును కొనసాగిస్తూ శుక్రవారం అద్వానీ వరుస విజయాలతో ప్రత్యర్థులను మట్టికరిపించాడు. తొలుత జరిగిన క్వార్టర్స్‌లో అంగ్ హ్యతెపై 5-1తో పంకజ్ అలవోకగా గెలిచాడు. అదే దూకుడు కొనసాగిస్తూ సెమీస్‌లో ధ్వజ్ హారియాను 5-1తో చిత్తుగా ఓడించాడు. భాస్కర్, రూపేశ్ షా మధ్య జరిగే సెమీఫైనల్ విజేతతో అద్వానీ ఫైనల్లో తలపడుతాడు.















దేశ ఔన్నత్యాన్ని చాటింది
రామాయణమే

ప్రముఖ ప్రవచకులు చాగంటి కోటేశ్వర్‌రావు

కార్యక్రమంలో పాల్గొన్న సీఎం కేసీఆర్ సతీమణి శోభ, ఎంపీ కవిత

ఖలీల్‌వాడీ: రామాయణం గొప్ప కావ్యమని, అందులో ప్రతీ అంశం దాగి ఉన్నదని, దేశ ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన గొప్ప గ్రంథమని ప్రముఖ ప్రవచకులు చాగంటి కోటేశ్వరరావు అన్నారు. శ్రీరామనవమిని పురస్కరించుకొని నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ గ్రౌండ్‌లో రామాయణ పారాయణం శుక్రవారం రాత్రి కూడా కొనసాగింది. సీఎం కేసీఆర్ సతీమణి శోభ పాల్గొన్న ఈ కార్యక్రమాన్ని ఎంపీ కవిత దంపతులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. రామాయణంలోని సీతారాముల కల్యాణ ఘట్టాన్ని ఈ సందర్భంగా చాగంటి ప్రవచించారు. రామాయణంలో లేనిది ఈ లోకంలోనే ఉండదన్నారు. వేదం, నీతిశాస్త్రం, జ్యోతిషశాస్త్రం, నదులు, పక్షులు, మర్యాద, బంధాలు, అనుబంధాలు ఇలా.. ప్రతీది రామాయణంలో పొందుపరిచారని, ఇది గొప్ప గ్రంథమని ఉద్బోధించారు. భార్యాభర్తల అన్యోన్యతను అత్యంత సుందరంగా, మనోహరంగా తెలియజేసి రామాయణం భారతదేశ ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటిందన్నారు. రామాయణం చదువడం వీలుకాని వారు దాన్ని ఇంట్లో ఉంచుకొని చందనం, కుంకుమ, దూపం పెడితే చదివినంత పుణ్యం దక్కుతుందని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, వేలాదిగా భక్తులు హాజరై చాగంటి కోటేశ్వరరావు ప్రవచనాలను ఆసక్తిగా విన్నారు.




శ్రీరామనవమిని పురస్కరించుకొని నిజామాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న ఎంపీ కవిత దంపతులు. చిత్రంలో చాగంటి.. పాల్గొన్న సీఎం కేసీఆర్ సతీమణి శోభ

వాట్సప్‌లో టెన్త్ ప్రశ్నపత్రం!

ఖానాపూర్: నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లో శుక్రవారం పదోతరగతి సామాన్య శాస్త్రం మొదటి పేపర్ లీకేజీ వ్యవహారం కలకలం సృష్టించింది. ఓ ప్రైవేటు స్కూల్‌ను అడ్డాగా చేసుకొని ప్రశ్నపత్రాలను వాట్సప్ ద్వారా తెప్పించుకొని, మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతున్న ముఠా బండారం బయటపడింది. విషయం తెలుసుకున్న పోలీసులు ప్రైవేటు పాఠశాలపై దాడులు నిర్వహించి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. స్థానిక సీఐ ఆకుల అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. ఖానాపూర్‌కు చెందిన ఓ వ్యాపారి కూతురు పదోతరగతి పరీక్షలు రాస్తున్నది. ఆ వ్యాపారి తనకు సుపరిచితుడైన లక్ష్మణచాందాలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో స్కూల్ అసిస్టెంట్ మదన్‌రెడ్డితో ప్రశ్నపత్రాన్ని పొందేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. సదరు ఉపాధ్యాయుడు వాట్సప్ ద్వారా ప్రశ్నపత్రాన్ని వ్యాపారికి పంపించాడు. ఆ ప్రశ్నపత్రాన్ని సదరు వ్యాపారి బాలుర ఉన్నత పాఠశాలలోని పరీక్షా కేంద్రం ఎదురుగా ఉన్న ఓ ప్రైవేటు పాఠశాల సిబ్బంది, నిర్వాహకులకు షేర్‌చేశాడు. అక్కడి ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయులు, నిర్వాహకులు ప్రశ్నలకు జవాబులు చీటీలపై రాస్తుండగా పోలీసులు దాడులు నిర్వహించి ప్రశాంత్, ఎస్ గంగాధర్, ఎస్ రవికుమార్, సాయన్న, శ్రీనివాస్, జీ రాజేందర్‌ను పట్టుకున్నట్టు తెలిపారు. వారి నుంచి రెండు సెల్‌ఫోన్లతోపాటు జవాబులకు సంబంధించిన స్టడీ మెటీరియల్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ ఘటనకు కారకులైన వారిపై కేసు నమోదుచేసినట్టు తెలిపారు.

నిన్న భార్య.. నేడు భర్త

మృత్యువులోనూ ఒక్కటైన భార్యాభర్తలు

భార్య చనిపోయిందనే మనస్తాపంతో కానిస్టేబుల్ బలవన్మరణం



దంపతులు రంజిత, రవికుమార్(ఫైల్)


మహబూబ్‌నగర్ క్రైం: పెండ్లి సమయంలో ఏడడుగులు నడిచి కలకాలం తోడుంటానని చెప్పిన ఆ భర్త మృత్యులోనూ వీడిపోలేదు. గురువారం భార్య రంజిత మనస్థాపంతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకోగా భర్త రవికుమార్ శుక్రవారం బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ హృదయ విదారకర ఘటన మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో జరిగింది. వన్‌టౌన్ సీఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని బీకేరెడ్డి కాలనీకి చెందిన రంజిత (25)ను పాతపాలమూరు చెందిన రవికుమార్ (28) అనే కానిస్టేబుల్ రెండేండ్ల కింద పెండ్లి చేసుకున్నాడు. పిల్లలు కావటం లేదని రవి దంపతులు బాధపడుతుండేవారు. ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి గురువారం రంజిత ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడింది. దీంతో భర్త రవి బాధపడుతూ తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. గురువారం సాయంత్రం భార్య దహన సంస్కారాలు చేసి కుటుంబసభ్యులతో ఇంటికి వచ్చాడు. శుక్రవారం తెల్లవారుజామున తన గదిలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. రవి అంత్యక్రియలను పోలీసులు అధికారిక లాంఛనాలతో నిర్వహించారు.

కొత్తపల్లి అటవీ ప్రాంతంలో అగ్నిప్రమాదం

వేమనపల్లి : మంచిర్యాల జిల్లాలోని కుష్నపల్లి ఫారెస్టు రేంజ్ పరిధిలోని కొత్తపల్లి అటవీ ప్రాంతంలో శుక్రవారం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. కార్చిచ్చు సమాచారంతో హైదరాబాద్ అటవీ శాఖ టీఎస్‌ఎఫ్ డీజీఐఎస్ వెబ్‌సైట్‌కు శాటిలైట్ ద్వారా సమాచారం అందింది. దీంతో కుష్నపల్లి అటవీ రేంజర్ అప్పలకొండ వెంటనే వేమనపల్లి సెక్షన్ అధికారి జ్ఞానేశ్వర్, బీట్ అధికారులు అనిల్, మధును అప్రమత్తం చేశారు. వీరు వెంటనే ఘటన స్థలానికి చేరుకొని మంటలు వ్యాప్తి చెందకుండా బ్లోయింగ్ మిషన్‌తో ఫైర్‌లైన్స్ ఏర్పాటు చేశారు. సుమారు 3 గంటల పాటు అటవీ సిబ్బంది అక్కడే ఉండి రాలిన ఆకులను పక్కకు జరిపి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అలాగే జాజులపేట అటవీ ప్రాంతంలోని మేదరికుండి గుట్టపై కూడా కార్చిచ్చు కావడంతో అటవీ సిబ్బంది స్పందించి ఆర్పివేశారు.

గీతన్నల సంబురాలు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: కల్లు గీత కార్మికులకు సీఎం కేసీఆర్ వరాలు ప్రకటించడంతో రాష్ట్ర వ్యాప్తంగా గీత కార్మికులు, గౌడ కులస్థులు సంబురాల్లో మునిగిపోయారు. గీత కార్మికులకు పన్ను రద్దు చేయడం, లైసెన్సుల గడువును పొడిగించడం, పింఛన్‌వంటి వరాలు ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం కూడా ఊరూరా సీఎం కేసీఆర్, మంత్రుల చిత్రపటాలకు క్షీరాభిషేకాలు నిర్వహించారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం పాపయ్యపల్లి, జమ్మికుంట, సైదాపూర్‌తోపాటు దుద్దెనపల్లిలో గౌడ సంఘాల ఆధ్వర్యంలో, గంగాధర మండలం నారాయణపూర్, మానకొండూర్, చిగురుమామిడిలో, శంకరపట్నం మండలం కొత్తగట్టులో, గన్నేరువరం మండలం గునుకుల కొండాపూర్, జంగపల్లిలో, కొత్తపల్లి మండలం చింతకుంటలో గీత కార్మికులు పెద్ద ఎత్తున సంబురాలు నిర్వహించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా సిరిసిల్ల మండలం సర్దాపూర్‌లో గౌడ సంఘం ఆధ్వర్యం లో ఎల్లమ్మ ఆలయ ప్రాంగణంలో, సిరిసిల్ల జిల్లా కేంద్రంతోపాటు ఎల్లారెడ్డిపేట, ఇల్లంతకుంట, చం దుర్తి, బోయినపల్లి మండలాల్లోనూ సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, పద్మారావు ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం చేశారు. పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం కుక్కలగూడూరులో రామగుండం జెడ్పీటీసీ సంధ్యారాణి ఆధ్వర్యంలో గీత కార్మికులు సీఎం ముఖచిత్రంతో కూడిన గులాబీ జెండాను తాటిచెట్టుపై ఎగురవేసి అభిమానాన్ని చాటుకున్నారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో, వికారాబాద్ జిల్లా తాండూరు, కులకచర్ల మండలాల్లో, నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో సంబురాలు జరిపారు. నిజామాబాద్ జిల్లా బోధన్ మండలం సాలూరలో గౌడ సంఘం ఆధ్వర్యంలో, ఎడపల్లి, భీమ్‌గల్, ఏర్గట్ల, ధర్పల్లి, జక్రాన్‌పల్లి మండలాల్లో గౌడ కులస్థులు, నాయకులు సీఎం కేసీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. మెండోరాలో సీఎం కేసీఆర్, ఎంపీ కవిత, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. కామారెడ్డి జిల్లా బాన్సువాడలోని మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి నివాసం వద్ద, కామారెడ్డి, దోమకొండ, భిక్కనూరు, నిజాంసాగర్, లింగంపేట మండలం భవానీపేటలో, ఆదిలాబాద్, మావలలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.



పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం కుక్కలగూడూరులో తాటిచెట్టుపై గులాబీ జెండా ఎగురవేసిన గీత కార్మికులు



నిజామాబాద్ జిల్లా మెండోరాలో సీఎం కేసీఆర్, ఎంపీ కవిత, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న గౌడ కులస్థులు



రాజన్న సిరిసిల్ల జిల్లాకేంద్రంలో సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, పద్మారావు ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న గీత కార్మికులు

ముంబైలో ఎస్పీఎంపై కీలక చర్చలు


సానుకూల నిర్ణయం తీసుకోవాలని

ఐడీబీఐ చైర్మన్‌కు మంత్రి కేటీఆర్ లేఖ

కాగజ్‌నగర్, నమస్తే తెలంగాణ: కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ పేపర్ మిల్లు పునరుద్ధరణలో భాగంగా శుక్రవారం ముంబైలో చర్చలు మొదలయ్యాయి. మొదటిరోజు ఐఆర్‌పీ (ఇంటెరిమ్ రిజల్యూషన్ ప్రొఫెషనల్), జేకే పేపర్ మిల్లు ప్రతినిధులు ఐడీబీఐ చైర్మన్‌తో చర్చలు జరిపినట్టు సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప 'నమస్తే తెలంగాణ'కు ఫోన్ చేసి తెలిపారు. మిల్లుపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని పరిశ్రమలశాఖ మంత్రి కేటీఆర్ ఐడీబీఐ చైర్మన్‌కు, ప్రతినిధులకు లేఖ రాశారన్నారు. ఈ లేఖానుసారంగా చర్చలు కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే వివరించారు. గత యాజమాన్యం ఐడీబీఐ నుంచి తీసుకున్న రుణాలు, ఇతరత్రా లావాదేవీలు చర్చకు వచ్చినట్టు సమాచారం.

రైతుల స్థితిగతులు మెరుగుపడాలి

రైతు సమన్వయ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గుత్తా సుఖేందర్‌రెడ్డి




నీలగిరి: రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి, వారి ఆర్థిక స్థితిగతులు మెరుగుపరిచేందుకు ప్రభుత్వం రైతు సమన్వయ సమితులను ఏర్పాటుచేసిందని సమితి రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఉదయాదిత్య భవనంలో నకిరేకల్ నియోజకవర్గ పరిధిలోని రైతు సమన్వయ సమితి గ్రామ కోఆర్డినేటర్లకు నిర్వహించిన ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలో లక్షా 61 వేల రైతు సమన్వయ సమితులను, రాష్ట్ర స్థాయిలో కార్పొరేషన్‌ను ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ప్రతి 5 వేల ఎకరాలను ఒక క్లస్టర్ ఏర్పాటుచేసి, దానికి ఒక వ్యవసాయాధికారిని నియమించి రైతుల సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. రైతులు ఒకచోట కూర్చొని తమ సమస్యలను చర్చించి పరిష్కరించుకునేందుకు వీలుగా ప్రతి గ్రామంలో రూ.12 లక్షలతో రైతు వేదికలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. నల్లగొండ జిల్లాలో 124 రైతు వేదికలకు స్థలాన్ని గుర్తించినట్టు తెలిపారు.ఈ సమావేశంలో కలెక్టర్ గౌరవ్ ఉప్పల్, సమితి జిల్లా అధ్యక్షుడు రామచందర్‌నాయక్, జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు, కేవీకే కంపాసాగర్ ఇన్‌చార్జి బాలాజీనాయక్, మత్స్యశాఖ అధికారి చరిత, అర్టికల్చర్ అధికారి సంగీత లక్ష్మి, కోఆర్డినేటర్ శైలజా, మార్కెటింగ్ ఎండీ అలీం పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

1.2 కిలోల బంగారం స్మగ్లింగ్‌కు యత్నం

- ఎయిర్‌పోర్ట్‌లో స్వాధీనం చేసుకున్న అధికారులు



శంషాబాద్: సినీఫక్కీలో 1.2 కిలోల బంగారాన్ని విదేశాల నుంచి స్మగ్లింగ్ చేస్తుండగా శంషాబాద్ ఎయిర్‌పోర్టు ఇంటెలిజెన్స్ యూనిట్ అధికారులు శుక్రవారం పట్టుకున్నారు. దుబాయ్ నుంచి ఓ ప్రయాణికుడు ఎయిర్‌ఇండియా విమానంలో శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వచ్చాడు. వెంట ఎలాంటి సామగ్రి తీసుకురాలేదు. అతడి ప్రవర్తనపై అనుమానం రావడంతో అధికారులకు అదుపులోకి తీసుకొని విచారించారు. తనది ఉత్తరప్రదేశ్ రాష్ట్రమని, బంగారాన్ని విదేశాల నుంచి స్మగ్లింగ్ చేస్తున్నట్టు వెల్లడించాడు. విమానంలో తాను కూర్చున్న సీటు కవర్‌కు ఉన్న రెండు పాకెట్లలో 10 తులాల చొప్పున బరువున్న 10 బంగారు బిస్కెట్లు, ముక్కలుగా చేసిన బంగారం కలిపి మొత్తం 1.224 కిలోల బంగారం ఉన్నట్టు పేర్కొన్నాడు. ఈ బంగారాన్ని దుబాయ్ నుంచి హైదరాబాద్‌కు తీసుకురావడం తన బాధ్యతని, ఇక్కడ మరో స్మగ్లర్ అదే సీట్‌లో కూర్చొని బంగారాన్ని విశాఖపట్నం మీదుగా ఢిల్లీకి తీసుకెళ్తాడని చెప్పాడు. ఇందుకు తనకు స్మగ్లర్లు రూ.50 వేలు ఇస్తారని వెల్లడించాడు. గతంలో పలుమార్లు భారత్‌తోపాటు, గల్ఫ్ దేశాల్లోనూ బంగారం స్మగ్లింగ్ చేసినట్టు చెప్పాడు. ఈ మేరకు అధికారులు స్మగ్లర్‌ను అరెస్ట్ చేసి, బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. మరింత లోతుగా దర్యాప్తు జరుపుతున్నట్టు వివరించారు.

డిగ్రీ సీట్లు మిగిలిపోకుండా చర్యలు

- ఏప్రిల్ 30లోగా సీట్లపై స్పష్టత ఇవ్వండి
- వర్సిటీలకు ఆదేశాలు జారీచేసిన దోస్త్ అధికారులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో సీట్లు మిగిలిపోకుండా దోస్త్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం విద్యార్థుల డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో సీట్లను తగ్గించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్రంలోని ఆరు యూనివర్సిటీలకు ఆదేశాలు జారీచేశారు. ఏప్రిల్ 30 నాటికి కాలేజీలు, కోర్సులు, సీట్ల సంఖ్యపై స్పష్టత ఇవ్వడంతోపాటు దోస్త్-2018 వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని దోస్త్ కన్వీనర్ ప్రొఫెసర్ లింబాద్రి తెలిపారు. 2017-18 విద్యా సంవత్సరంలో 25 శాతం కంటే తక్కువ అడ్మిషన్లు ఉన్న ప్రైవేటు కాలేజీలు 186 ఉన్నాయన్నారు. కేయూ పరిధిలో 68, ఓయూ పరిధిలో 43, శాతవాహన వర్సిటీ పరిధిలో 25, పాలమూరు వర్సిటీ పరిధిలో 20, తెలంగాణ వర్సిటీ పరిధిలో 14, మహాత్మా గాంధీ వర్సిటీ పరిధిలో 16 కాలేజీలు ఉన్నాయి. ఒకే కాలేజీలో మాత్రమే 100 శాతం ప్రవేశాలు ఉన్నట్టు గుర్తించారు. సున్నా అడ్మిషన్లు ఉన్న డిగ్రీ కాలేజీలు 51 ఉన్నాయి. ఈ పరిణామాలు, మార్కెట్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని అవసరమైన కోర్సులను అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు మొదలుపెట్టామని దోస్త్ అధికారులు పేర్కొన్నారు.

విస్తరిస్తున్న రిటైల్ కార్యకలాపాలు

- హైదరాబాద్‌లో త్వరలో కొత్త నియామకాలు: జేడీఏ సాఫ్ట్‌వేర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హైదరాబాద్‌లో సప్లై చైన్, రిటైల్ సేవలు విస్తరిస్తున్నాయని అమెరికా కేంద్రంగా పనిచేసే ప్రముఖ టెక్నాలజీ సంస్థ జేడీఏ సాఫ్ట్‌వేర్ సీఈవో గిరీశ్ రిషి పేర్కొన్నారు. నూతన టెక్నాలజీతో తమ సేవలను హైదరాబాద్ కేంద్రంగా మరింత విస్తృతం చేయనున్నట్టు చెప్పారు. ఇందులోభాగంగా నూతన నియామకాలు చేపడుతామన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను సందర్శించిన ఆయన మీడియాతో మాట్లాడారు. ఐటీ సహా ఉత్పత్తి, సేవారంగం పెద్దఎత్తున విస్తరిస్తున్న నేపథ్యంలో సప్లై చైన్, రిటైల్ సేవలు అందించే సంస్థలు సైతం ఏర్పాటవుతున్నాయన్నారు. జీఎస్టీతో టెక్నాలజీ ఆధారిత సేవలకు డిమాండ్ పెరిగిందన్నారు.

సజావుగా విమానాశ్రయానికి!

కనెక్టివిటీని పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి ● మరోసారి స్పష్టం చేసిన మంత్రి కేటీఆర్ ● ఎయిర్‌పోర్ట్ వరకు మెట్రోరైలు

ఇప్పటికే 'పుష్పక్' ఏసీ బస్సులు నడుపుతున్న ఆర్టీసీ ● త్వరలో అందుబాటులోకి బ్యాటరీ బస్సులు ● ఎంఎంటీఎస్ అనుసంధానానికి రైల్వేశాఖ కసరత్తు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: శంషాబాద్‌లోని అంతర్జాతీయ విమానాశ్రయానికి ప్రయాణికులు సులభంగా, సౌకర్యవంతంగా రాకపోకలు సాగించేలా అడుగులు పడుతున్నాయి. ఎయిర్‌పోర్ట్‌కు కనెక్టివిటీ పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా కృషి చేస్తున్నది. ఇప్పటికే ప్రభుత్వ రంగ సంస్థ టీఎస్‌ఆర్టీసీ ప్రత్యేకంగా 'పుష్పక్' పేరుతో శంషాబాద్ వరకు ఏసీ బస్సులను నడిపిస్తుండగా.. విమానాశ్రయానికి అనుసంధానించేందుకు హైదరాబాద్ మెట్రోరైలు, దక్షిణమధ్య రైల్వే ఆధ్వర్యంలో నడుస్తున్న ఎంఎంటీఎస్ పోటీపడుతున్నాయి. ఇప్పటికే ఈ రెండు సంస్థలు తమ ఆసక్తిని వెల్లడించాయి. రెండోదశ విస్తరణలో పనులు చేపడుతామని ప్రకటించాయి. కార్యాచరణను ప్రారంభించి ముందుగా ఎయిర్‌పోర్టుకు చేరుకోవడానికి పోటీ పడుతున్నాయి. ఇదే విషయాన్ని ఐటీ, పట్టణాభివృద్ధిశాఖల మంత్రి కే తారకరామారావు మరోమారు శుక్రవారం అసెంబ్లీలో స్పష్టం చేశారు. విమానాశ్రయం పదేండ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మెట్రోరైలు, ఎంఎంటీఎస్ అనుసంధాన ప్రణాళికలను వివరించారు.



ఈ-బస్సుల కోసం బిడ్లు

పర్యావరణ హిత ప్రయాణంలో భాగంగా టీఎస్‌ఆర్టీసీ త్వరలో హైదరాబాద్ రోడ్లపై బ్యాటరీతో నడిచే బస్సులను అందుబాటులోకి తేనున్నది. అద్దె ప్రాతిపాదికన మొదటి దశలో 48 ఎలక్ట్రికల్ బస్సులను తీసుకురానున్నారు. ఈ బస్సులను ఏయిర్‌పోర్ట్‌కు అనుసంధానించనున్నారు. నగరంలోని ప్రధాన ప్రాంతాల నుంచి విమానాశ్రయం వరకు తిప్పేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. విద్యుత్‌తో నడిచే వాహనాలకు రాయితీలు ఇస్తామని ఇప్పటికే కేంద్రం ప్రకటించగా, రాష్ట్ర ప్రభుత్వం సైతం త్వరలో ఎలక్ట్రికల్ వాహన పాలసీని తేనున్న నేపథ్యంలో ఆర్టీసీ ముందడుగు వేసింది. రూ.2 కోట్లు విలువైన బస్సును 50 శాతం రాయితీతో అందిస్తున్నారు. బస్సులోని బ్యాటరీలను ఒక్కసారి పూర్తిగా చార్జి చేస్తే 200 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తాయి. ఇప్పటికే ఈ-బస్సులు బెంగళూరులో విజయవంతంగా నడుస్తున్నందున హైదరాబాద్‌లోనూ ఆదరణ ఉంటుందని అధికారులు చెప్తున్నారు. ఈ మేరకు ప్రైవేటు ఆపరేటర్ల నుంచి బిడ్లను ఆహ్వానించారు. ఇప్పటికే పలు కంపెనీలు ముందుకు వస్తున్నట్టు సమాచారం.

సిద్ధమవుతున్న మెట్రో డీపీఆర్

హైదరాబాద్ మెట్రోరైలు రెండోదశ విస్తరణలో భాగంగా ఎయిర్‌పోర్ట్ వరకు పొడిగించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఐటీ కారిడార్‌ను కలుపుతూ శంషాబాద్‌కు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించనున్నారు. డీపీఆర్‌ను రూపొందించే పనులను ఇప్పటికే ఢిల్లీ మెట్రోరైలు ప్రాజెక్టు అధికారులకు అప్పగించారు. ఢిల్లీ అధికారులు ఇప్పటికే హైదరాబాద్‌లో పర్యటించారు. క్షేత్రస్థాయిలో పర్యటించి డీపీఆర్‌ను సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఎయిర్‌పోర్ట్ వరకు కనెక్టివిటీ ప్రతిపాదన గత ఏడాది నవంబర్‌లో ప్రధాని నరేంద్రమోదీ మెట్రోరైలును ప్రారంభించినప్పుడు చర్చకు వచ్చినట్టు సమాచారం.

అండర్‌గ్రౌండ్ ద్వారా ఎంఎంటీఎస్

ఎంఎంటీఎస్ రెండోదశ విస్తరణలో భాగంగా శంషాబాద్ విమానాశ్రయం వరకు పొడిగించేందుకు దక్షిణ మధ్య రైల్వే నిర్ణయించింది. ఇప్పటికే ప్రణాళికలు సిద్ధంచేసినా విమానయాన శాఖ అధికారుల నుంచి అనుమతులు రాకపోవడంతో పనుల్లో ఆలస్యం అవుతున్నది. ఈ నేపథ్యంలో దక్షిణమధ్య రైల్వే అధికారులు విమానయానశాఖతో నిరంతరం చర్చలు జరుపుతున్నారని రైల్వే బడ్జెట్ సందర్భంగా దక్షిణమధ్య రైల్వే జీఎం వినోద్‌కుమార్ యాదవ్ వెల్లడించారు. భద్రత విషయంలో స్పష్టత రాలేదని, త్వరలో కొలిక్కి వస్తుందన్నారు. మెట్రోరైలును అనుసంధానిస్తున్నట్టు ప్రకటించినా తమ ప్రణాళికలో మార్పులు లేవని స్పష్టం చేశారు. ఎంఎంటీఎస్‌ను అండర్‌గ్రౌండ్ ద్వారా తీసుకువెళ్తామని, పనులను రైల్వే వికాస్ నిగమ్ లిమిటెడ్(ఆర్‌వీఎన్‌ఎల్)కు అప్పగించినట్టు వివరించారు.

780 కిలోల గంజాయి పట్టివేత

- రహస్యంగా లారీలో తరలిస్తుండగా రామోజీ ఫిలింసిటీ వద్ద పట్టుకున్న ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు
- విలువ రూ.93 లక్షలు
- ఇద్దరి అరెస్ట్.. పరారీలో మరో ముగ్గురు

హయత్‌నగర్: ఓ లారీలో రహస్యంగా అరలు ఏర్పాటు చేసి గంజాయిని దాచి హైదరాబాద్‌కు తరలిస్తున్న ముఠాను రంగారెడ్డి జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సంయుక్తంగా దాడిచేసి పట్టుకున్నారు. సుమారు రూ.93 లక్షల విలువైన 780 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని ఇద్దరిని అరెస్ట్ చేశారు. మరో ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నారు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. శుక్రవారం అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ పవన్‌కుమార్‌తో కలిసి ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ అకున్‌సబర్వాల్ కేసు వివరాలు వెల్లడించారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ సమీపంలోని గయారాంతండాకు చెందిన హరిమాన్ రాథోడ్ గంజాయిని అక్రమ వ్యాపారం నిర్వహిస్తున్నాడు. ఇదే ప్రాంతానికి చెందిన జే సంతోష్ జాదవ్‌ను మేనేజర్‌గా, గంజాయిని సేకరించి సరఫరా చేసేందుకు తూర్పు గోదావరి జిల్లా తుని ప్రాంతానికి చెందిన చంటిని ఏజెంట్‌గా నియమించుకున్నాడు. చంటి విశాఖ ఏజెన్సీలోని పాడేరు, జీమాడుగుల, ఉరంపేట మండలాల పరిధిలో గంజాయిని సేకరించి, ప్యాక్ చేసి, లారీల్లో నింపి ఎలమంచిలి, నర్సీపట్నం, అనకాపల్లి, తుని తదితర ప్రాంతాల్లో సంతోష్ జాదవ్‌కు అప్పగిస్తాడు. సంతోష్ ఈ సరుకును హైదరాబాద్ మీదుగా జహీరాబాద్‌కు తరలిస్తాడు. అక్కడ సరుకును మరో వాహనంలోకి మార్చి మహారాష్ట్ర, గోవాకు రవాణా చేస్తుంటారు. ఈ క్రమంలో చంటి తాను సేకరించిన గంజాయిని లారీలో లోడ్‌చేశాడు.

లారీలో ప్రత్యేక అరలు

లారీలో క్యాబిన్ వెనుక 7 ఫీట్ల పొడవు, రెండు ఫీట్ల వెడల్పు, 5 ఫీట్ల ఎత్తుతో ఒక అరను ఏర్పాటు చేసి అందులో 416 కిలోల గంజాయిని, డీజిల్ ట్యాంక్ పక్కన మరో అరను ఏర్పాటు చేసి అందులో 364 కిలోల గంజాయిని దాచాడు. ఈ లారీని గురువారం రాత్రి తుని వద్ద మేనేజర్ సంతోష్‌కు, జహీరాబాద్ మండలం హుగ్గి గ్రామానికి చెందిన డ్రైవర్ కోరంటి బిచ్చప్పకు అప్పగించాడు. ఈ లారీ హైదరాబాద్‌కు వస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం అందడంతో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు రంగంలోకి దిగారు. శుక్రవారం ఉదయం 6 గంటల సమయంలో విజయవాడ జాతీయ రహదారిపై రామోజీ ఫిల్మ్‌సిటీ సమీపంలోని ఇండియన్ ఆయిల్ ఎదురుగా లారీని ఆపి తనిఖీ చేశారు. సుమారు రూ.93 లక్షలు విలువ చేసే 780 కిలోల గంజాయిని గుర్తించారు. మేనేజర్ సంతోష్ జాదవ్, డ్రైవర్ కోరంటి బిచ్చప్పను అరెస్ట్ చేశారు. ప్రధాన సూత్రధారి హరిమాన్ రాథోడ్, సప్లయర్ చంటి, లారీ ఓనర్ మహ్మద్ నిజాం పరారీలో ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐలు పీ శ్రీధర్, ఎండీ జియావుద్దీన్, ఎస్సై ఎంపీ ప్రసన్నరెడ్డి, సీఐ శ్రీనివాస్‌రావు, రంగయ్య, నర్సింహా తదితరులు పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న గంజాయిని, నిందితులను చూపుతున్న ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ అకున్ సబర్వాల్



కృతజ్ఞతాభివందనములు...
ఒక ముదిరాజు బిడ్డగా నాకు రాజ్యసభ సభ్యునిగా అవకాశం కల్పించి
ప్రజాసేవ చేసేందుకు అవకాశం ఇచ్చిన జనహృదయనేత,
బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, తెలంగాణ ఉద్యమనేత,
మత్స్య కారుల అభివృద్ధికోసం తపనపడే మన ప్రియతమ ముఖ్యమంత్రివర్యులు
గౌ॥ శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గారికి
నా హృదయపూర్వక కృతజ్ఞతాభివందనములు...
నాకు అండగా నిలిచి నిండు మనస్సుతో ఆశీస్సులు అందించిన
మంత్రులకు, ఎంపిలకు ఎమ్మెల్యేలకు, ఎమ్మెల్సీలకు, కార్పోరేషన్ చైర్మన్‌లకు,
మన రాష్ట్ర పార్టీ కార్యవర్గ సభ్యులకు, ఇతర పెద్దలకు పార్టీ అన్ని శ్రేణుల నాయకులకు,
కార్యకర్తలకు అందరికి నాహృదయపూర్వక కృతజ్ఞతాభివందనములు
డా॥ బండా ప్రకాష్ ముదిరాజ్
రాజ్యసభ సభ్యులు
With Best Compliments From:
కాకతీయ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీస్ అండ్ సైన్సెస్
ఏకశిల ఎడ్యుకేషనల్ ట్రస్ట్-వరంగల్
మహారాజ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్
శ్రీరామ ఎడ్యుకేషనల్ సొసైటి-విజయనగరం
అల్లూరి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషనల్ సొసైటి
అల్లూరి ఎడ్యుకేషనల్ ట్రస్ట్-వరంగల్
తెలంగాణ ముదిరాజ్ మహాసభ 443/14
మత్స్యగిరీంద్ర ఫిషరీష్ ప్రై.లి. తెలంగాణ

జిందగీ పేజీ పై మీ అభిప్రాయాలు,
సలహాలు తెలియజేయండి.
zindagi@ntdaily.news
www.ntzindagi.com
/nt.zindagi

హైదరాబాద్
శనివారం 24 మార్చి 2018

WWW. NTNEWS.COM



అమ్మలాంటి అతిథి!

సర్వాంగాలు సవ్యంగా ఉండి... ఇద్దరు పిల్లలుంటేనే వారి అల్లరి తల్లిదండ్రులకు చిరాకు. ఒక్కోసారి చికాకు తలెకెక్కి అమానుషంగా.. అతి భయానకంగా ప్రవర్తించే రోజులివి! అలాంటిది ఒకరు కాదు.. ఇద్దరు కాదు.. ఏకంగా యాభై మంది పిల్లలు. అదీ మానసిక స్థితి సక్రమంగా లేని వాళ్లు. వీళ్లంతా ఒకేచోట చేరితే? ఊహించడానికే భయంగా ఉంది కదూ! 'ఇలాంటి పిల్లలు మాకొద్దు' అని తల్లిదండ్రుల నిరాదరణకు గురయ్యే పిల్లలను చేరదీసి.. తల్లిలా ఆదరిస్తూ.. తండ్రిలా బాధ్యతను నెరవేరుస్తున్నది అతిథి!

హన్మకొండ పట్టణంలోని పెద్దమ్మగడ్డ పోయేదారిలో ఉన్న అతిథి ఆశ్రమంలోకి ఒక్కసారి వెళ్లి చూస్తే గుండె తరుక్కుపోతుంది. 'హో...' అంటూ బిగ్గరగా నవ్వడం, ఎవరిలో వారు మాట్లాడుకోవడం, గోడల మీద గోర్లతో గీసుకోవడం.. ఇలా ఒకటా రెండా వారితో పది నిమిషాలు గడిపితేచాలు జీవితంలో పగవాడికీ కూడా ఇటువంటి దుస్థితి రాకూడదు అనుకుంటారు.

ఎంతటి పాశాన హృదయాలైనా సరే అతిథిలో ఆశ్రయం పొందుతున్న పిల్లల బ్యాక్‌గ్రౌండ్ చూస్తే ఇలాంటి పరిస్థితి ఎవ్వరికీ రావద్దు అనిపించకమానదు. 'అతిథి'లో ఉన్నవారంతా మానసిక వైకల్యం గల పిల్లలే. స్పందన, ప్రతిస్పందనలపై ఆధారపడి వారి స్థితిగతుల్ని అంచనా వేస్తారు. ఆ ప్రకారంగానే వారి దినచర్యను నడుస్తుంది.

> **మా చేతుల్లో పెరిగి బయటికి వెళ్లిన తర్వాత పిల్లలు పెండ్లి చేసుకొని జీవిస్తున్నారు. ఒకరు జనరల్‌స్టోర్ పెట్టుకొని స్వయం ఉపాధి పొందుతున్నవాళ్లు.. హాస్టళ్లలో వేరేచోట్ల ఉపాధి పొందుతున్నవాళ్లను చూస్తే సంతోషంగా ఉంది. అలా ఆశ్రమం నుంచి బయటకు వెళ్లి ఉపాధి పొందుతున్న వాళ్లే స్ఫూర్తిగా ఇతరులకు చెప్తూ అదే స్ఫూర్తిని వాళ్లలో ఏర్పడేలా అతిథి ఆశ్రమం కొనసాగిస్తున్నది. దీనిని మరింత మందికి చేరువయ్యేలా ప్రణాళికలు రచిస్తున్నాం. వారి ఆనందమే మా 'అతిథి' లక్ష్యం.**

యాభై మంది పిల్లలకు

అతిథి మానసిక దివ్యాంగుల నిలయం నిర్వాహకురాలు సాంబరాజు సుజాత. అన్నీ సక్రమంగా ఉండే పిల్లలతో బడులు నిర్వహిస్తేనే తలనొప్పులు తప్పని పరిస్థితుల్లో ఇట్లా మానసిక దివ్యాంగులుగా ఉన్నవారిని చేరదీసి సేవ చేయాలనే ఆలోచన ఎవరిది? అసలీ ఆశ్రమం పెట్టాలన్న ఆలోచన ఎందుకొచ్చింది? ఆశ్రమం నిర్వహణలో ఎదురయ్యే సమస్యలు మొదలైన అంశాలను సుజాత వివరించారు. 'మాది హన్మకొండ పట్టణం కుమార్‌పల్లి. ముగ్గురు అన్నదమ్ములు, ముగ్గురు అక్కాచెల్లెల్లు. అందరి కంటే నేనే చిన్నదాన్ని. డిగ్రీ చదివాను. స్పెషల్ ఎడ్యుకేషన్‌లో డిప్లొమా రాజమండ్రిలో చేశాను. 1996 వరకు నేను సాధారణ గృహిణే. ఇద్దరు ఆడపిల్లల తల్లినే. కానీ అప్పుడు హైదరాబాద్ నుంచి నా యేడాదిన్నర పాప (భవానీ), నాలుగునెలల పాపతో కాజీపేట రైల్వే స్టేషన్‌లో దిగాను. స్టేషన్ నుంచి ఆటోకోసం ఒక బిడ్డను చంకన ఎత్తుకొని, మరోబిడ్డను (భవానీ), అదేచేతిలో సంచినీ పట్టుకొని ఆటోకోసం బయటకు వస్తున్నాను. నాతోపాటే నా బిడ్డ వస్తున్నది అనుకొని వెళుతున్నాను. తీరా ఆటో ఎక్కేముందు భవానీ లేదు. తప్పిపోయింది. అక్కడంతా చూశాను. రైల్వే స్టేషన్ లోపలికి వెళ్లి చూశాను. ఏడ్చాను. ఎంత వెతికినా పాప జాడ తెలియలేదు. ఏడ్చి..ఏడ్చి కళ్లల్లో నీళ్లింకిపోయే దాకా రోజూ ఏడుపే అందరూ ధైర్యం చెప్పారు.

బిడ్డ సంతోషం కోసం

ఎవరు ఎంత ధైర్యం చెప్పినా నా మనసులోని బాధ మాత్రం అలానే ఉంది. నాలోనే ఏడ్చేదాన్ని.. ఒక దశలో నాకు పిచ్చిపడుతుందేమో అనుకున్నారు. నా పరిస్థితి అలాగే తయారైంది. నాలో నేను కుమిలిపోయేదాన్ని. ఎవరు ఎన్నిరకాలుగా ధైర్యం చెప్పినా కళ్లముందు తిరిగే పాప. కాళ్లల్లో కాలువేసి నడిచే పాప. చేతిలో ఉన్న పాప ఒక్కసారిగా నా నుంచి దూరం కావడం అనేది నా జీవితంలో మరచిపోని, మరపురాని క్షణాలు. అందరూ అన్నారు. తప్పిపోయిన వారితో మనమూ పోలేం కదా..అని ధైర్యం చెప్పారు. చివరికి నేను గట్టి ధైర్యం చేసుకున్నాను. నా బిడ్డకు గుర్తుగా నేను ఏదన్నా చేయాలె అనుకున్న. అప్పుడు తట్టింది. ఈ ఆలోచన. అయితే సహాయం ఎవరైనా చేస్తారు. అది అన్నీ సక్రమంగా ఉన్న వాళ్లకు ఎవరైనా చేస్తారు. కానీ తప్పిపోయినప్పుడు నా బిడ్డ 'అమ్మా.. అమ్మా.. అంటూ అపురూపంగా పిలిచే యేడాదిన్నర వయస్సే. ఎంత పెద్దపెరిగినా మానసికంగా ఎదగని పిల్లల కోసం నేను ఏదైనా చేయాలి అనుకున్నాను. నా బిడ్డ తప్పిపోతే ఏంటీ. చిన్నప్పుడు నా బిడ్డకు తల్లిలా ఎన్ని చేశానో.. చేయాలనుకున్నానో అదేరీతిగా నా వంతు సహాయం చేయాలని గట్టిగా నిర్ణయించుకున్నాను. అలా పుట్టిన ఆలోచనల్లోంచే వచ్చింది మానసిక దివ్యాంగుల నిలయ స్థాపన నేపథ్యం. ముందుగా (2007) డే స్కాలర్స్‌గా మొదలుపెట్టి, తరువాత సంవత్సరానికి డే అండ్ నైట్ అదే పూర్తి ఆశ్రమంగా ఏర్పాటు చేశాను. ఇప్పుడిందులో అమ్మాయిలు, అబ్బాయిలు కలిపి యాభై మంది ఉన్నారు. వీళ్లంతా నా పిల్లలుగానే భావిస్తున్న. నేను వీళ్లకు ఈ రకంగా సేవ చేస్తే నా బిడ్డ ఎక్కడున్నా సుఖంగా సంతోషంగా ఉండాలని ఈ భగవంతుడికి మొక్కుతున్నా' అన్నారు.



> **తల్లికి విడాకులిస్తే, తల్లి మరో పెళ్లి చేసుకొని వెళితే ఎటువంటి ఆలనా పాలనా లేక నిరాదరణకు గురైన వాళ్లు.. కుటుంబాల్లో కలహాలు పెరిగి పెరిగి వదిలించుకున్న పిల్లలు ఇలా అనేక రకాల నేపథ్యాలున్న వాళ్లు ఇందులో ఉన్నారు. కాలకృత్యాలకు వెళ్లే స్పృహ లేకుండా అన్నీ బట్టల్లోనే పోయే పిల్లల్ని చూసుకుంటూ కాలం వెళ్లదీస్తున్నది సుజాత.**



ఒక్కొక్కరిది ఒక్కో గాథ


అనాథలు. అమ్మానాన్నలు వదిలించుకున్నవాళ్లు. తల్లి, తండ్రి చనిపోతే నానమ్మలు, అమ్మమ్మ ఆలనలో వారు చేయాల్సినంత వరకు చేసి వారి వయస్సు సహకరించక వారికి అన్ని సపర్యలు చేసే ఓపిక లేక ఉన్నవాళ్లు. తప్పిపోయి వచ్చినవాళ్లు ఉన్నార్లు. పిలగాడు పుట్టి కొంత కాలం అయిన తరువాత ఆ పిలగాడి చేష్టలు చూడలేక, భరించలేక, తీవ్ర అవమానభారంతో ఉంటూ చివరికి ఆ పిలగాడిని వదిలేసినవాళ్లు చాలామంది పిల్లలు ఇక్కడ కనిపిస్తారు.

కంటికి రెప్పలా

ముక్కుచీది, మూతే కాదు ఒక్కోసారి ఒకరి వెంట ఒకరు బట్టల్లోనే అన్నీ అయినా ఓపికతో సహనంతో తనే చేసే తల్లిగా ఆమె వారితోనే ఇరవై నాలుగు గంటలు వారిని కంటికి రెప్పలా సాకుతున్నారు. అమ్మాయిలకు, అబ్బాయిలకు వేర్వేరు గదులు. ఆయాలు. ఆమెకు తోడుగా మరో ఇద్దరు స్పెషల్ ఎడ్యుకేషన్ చేసిన ఇద్దరు టీచర్లున్నారు. అక్కడంతా చదువు చెప్పడం కాదు వారిలో మానసిక పరివర్తన తీసుకురావడం కోసం ఆ ఆశ్రమం పనిచేస్తున్నది. పుట్టిన రోజుకో, పెళ్లిరోజుకో అనాథలకు దానధర్మాలు చేయాలనే ఉద్దేశంతో ఉండేవాళ్లు, పెద్దమనసుతో ముందుకొచ్చే దాతలు ఇలా కొంతమంది భగవత్స్వరూపులు చేసే కొద్దిపాటి సహాయంతో ఈ ఆశ్రమాన్ని నిర్వహిస్తున్నానని సుజాత అతిథి నిర్వాహణ వెనుక కష్టసుఖాలను వెల్లబోసుకున్నారు. వరంగల్ ఉమ్మడి జిల్లా కలెక్టర్‌గా రాహుల్‌బొజ్జా ఉన్నకాలంలో ఆశ్రమం కోసం కొంత స్థలం కేటాయిస్తే కొంతమంది అధికారుల అలసత్వం వల్ల, సహాయ నిరాకరణ వల్ల అది రాకుండా పోయిందని ఆమె ఆవేదన చెందుతున్నారు. ఎన్ని కష్టాలైనా భరిస్తా..వీళ్లకు సేవ చేస్తే తప్పిపోయిన నా బిడ్డకు ఆ భగవంతుడు మంచిచేస్తాడన్న నమ్మకమే నన్ను నడిపిస్తున్నది. మానసికంగా పరిపక్వతను పెంచి సమాజం పట్ల అవగాహనను కలిగించి తాను 11 యేండ్లుగా చేస్తున్న కృషికి ఫలితం.. పిల్లల రూపంలో ఫలితాన్నిస్తున్నదంటున్నారు.

నూర శ్రీనివాస్
నమస్తే తెలంగాణ ప్రధాన ప్రతినిధి-వరంగల్
📷 గొట్టె వెంకన్న

మొటిమలా?.. ఇవి వద్దు!



- బ్రెడ్ చర్మపు యాంటీఆక్సిడెంట్ల స్థాయిని తగ్గిస్తుంది. అందువల్ల ముఖంపై మొటిమల అభివృద్ధి జరుగుతుంది. కాబట్టి ఇది మీ డైట్‌లో లేకుండా ఉండేలా చూసుకోండి.
- చాక్లెట్లలో ఉండే అధిక కొవ్వు, చక్కెరలు తరుచూ మీ శరీరంపై మంటను కలిగించే సెబమ్ తైలాన్ని అధికంగా ఉత్పత్తి చేస్తుంది. కాకపోతే యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉన్న డార్క్ చాక్లెట్లను నిరభ్యంతరంగా తినవచ్చు.
- మీ ఆహారం నుంచి జున్నును తొలిగించండి. ఇందులో ఉండే ప్రొజెస్టెరాన్ కొవ్వు ఉత్పత్తి గ్రంథులను అధిక మొత్తంలో పెంచుతుంది. ఇది చర్మాన్ని జిడ్డుగా, అనారోగ్యంగా తయారుచేస్తుంది.

కాన్పు తర్వాత థైరాయిడ్ తగ్గుతుందా?





డాక్టర్ జయసింహా రెడ్డి
కన్సల్టెంట్
ఎండోక్రైనాలజిస్ట్
కేర్ హాస్పిటల్స్
హైదరాబాద్

నా భార్య ప్రస్తుతం 6 నెలల గర్భవతి. ఇటీవల థైరాయిడ్ పరీక్ష చేయిస్తే హైపోథైరాయిడిజమ్‌గా నిర్ధారణ జరిగింది. 50 ఎంజీ థైరాక్సిన్ మందు వేసుకోవాల్సిందిగా సూచించారు. నాకు రెండు మూడు రకాల అనుమానాలు ఉన్నాయి. టెస్ట్ రిపోర్టుల్లో టీఎస్‌హెచ్ సాధారణ విలువలు 0.3 -5.5 వరకు అని ఉంది. మరి ఆమెకు థైరాక్సిన్ మందులు ఎందుకు మొదలు పెట్టారు?కాన్పు తర్వాత హైపోథైరాయిడిజం తగ్గుతుందా?
- విజయ్, మెట్‌పల్లి

సాధారణ విలువలు మొదటి కాన్పులో ఇది వర్తించదు. మొదటి 3 నెలలు హైపోథైరాయిడిజమ్‌లో టీఎస్‌హెచ్ 2.5 కంటే ఎక్కువ, తర్వాత 6 నెలలు టీఎస్‌హెచ్ 3 కంటే ఎక్కువ, 4.5 కంటే తక్కువ ఉండాలి. భవిష్యత్తులో వచ్చే ప్రసవ ఒత్తిడిని ఎదుర్కొనడానికి శరీరంలో జరిగే ఏర్పాట్లలో భాగంగా థైరాయిడ్ ఎక్కువగా పనిచెయ్యాల్సి ఉంటుంది. థైరాక్సిన్ ఏ కారణం చేత తగ్గినా అది ప్రసవ సమయంలో ప్రమాదకరం కావచ్చు. కాబట్టి ఇలాంటి సందర్భాల్లో వీలైనంత త్వరగా థైరాక్సిన్ టాబ్లెట్లు మొదలుపెట్టడం అవసరం. మీరు చెప్పిన వివరాల ప్రకారం మీ ఆవిడ హైపోథైరాయిడిజంలోనే ఉంది. కాబట్టి తప్పకుండా రోజు థైరాక్సిన్ మందులు వేసుకోవాలి. క్రమం తప్పకుండా ఎండోక్రైనాలజిస్ట్‌ను సంప్రదిస్తూ ఉండాలి. ప్రసవం తర్వాత రోజూ నుంచి థైరాక్సిన్ డోసేజ్ క్రమంగా తగ్గిస్తూ రావాలి. ఎంత వరకు తగ్గించవచ్చనే ప్రసవానంతరం పరీక్షలు చేసి నిర్ధారించాల్సి ఉంటుంది. ప్రసవానంతరం 4-5 వారాల మధ్య మళ్లీ పరీక్షలు చేయించుకొని థైరాక్సిన్ స్థాయిలు ఎలా ఉన్నది నిర్ధారించుకోవాల్సి ఉంటుంది. ఒక్కోసారి ప్రసవనాంతరం తగ్గిపోయినా తిరిగి మళ్లీ థైరాక్సిన్ స్థాయిలు పెరుగవచ్చు. లేదా తగ్గవచ్చు. దీన్ని పోస్ట్ పార్టమ్ థైరాయిడిజమ్ అంటారు. ఇలాంటపుడు తగ్గించిన డోస్ మళ్లీ పెంచాల్సి రావచ్చు. ప్రసవం తర్వాత థైరాయిడ్ సమస్య తగ్గిపోతుందా అనేది ముందుగానే ఊహించడం సాధ్యపడదు. చాలా మందిలో గర్భవతులుగా ఉన్నపుడు థైరాయిడ్ సమస్యలు వచ్చిన వారికి ప్రసవం తర్వాత సాధారణం అవుతుంది. ప్రసవం జరిగిన 24 గంటల్లోపు పాపాయికి కూడా థైరాయిడ్ టెస్ట్ చేయించాల్సి ఉంటుంది. అందుకు ఆస్కారం తక్కువే కానీ ముందు జాగ్రత్తగా ఇలా పరీక్షించి చూసుకోవడం మంచిది.

నీదీ నాదీ ఒకే కథ.. ఇది మనందరి కథ

సినిమా రివ్యూ



'తొలిసారి నీ గురించి ఒక కవిత రాయాలనుందిరా'

—తెల్లని కాగితంపై నల్లని అక్షరాలు.. కళ్లద్దాలు.. కారుతున్న ఓ కన్నీటి బొట్టు.. ఆరుతున్న ఆ గుండె తడి గానంతో.. హృదయమెంత తపిస్తే బతుకు విలువ తెలిసింది.. గుండెనెంత మదిస్తే.. కన్నీటి విలువ తెలిసింది.. అని చెప్పే కథ. నీదీ నాదీ ఒకే కథ.

ఆ తండ్రి (దేవీప్రసాద్) మొదటిసారి తన కొడుకు గురించి కవిత రాయాలనుకుంటాడు. ఆయనొక ఉత్తమ ఉపాధ్యాయుడు. మంచి కవి. అంతకుమించి సగటు మధ్యతరగతి వాడు. అందరిలాగే తన కొడుకూ చదువుల్లో స్టేట్ ఫస్ట్ రావాలనుకుంటాడు. ఆ తర్వాత కాలేజ్ ఫస్ట్ వస్తే చాలానుకుంటాడు. ఇప్పుడు కనీసం కొడుకు పరీక్ష రాస్తే చాలానుకుంటున్నాడు. ఆ కొడుకుకేమో చదువు ఎక్కదు. పరీక్షలంటే భయం. ఎలాగూ పాసవ్వనిదానికి ఈసారి రాయడం దేనికి అనుకుంటాడు. అదే విషయం నాన్నకు చెప్తాడు. 'మరేం చేద్దామనుకుంటున్నావ్?' అంటాడు తండ్రి. ఆ అబ్బాయి ఒక లిస్ట్ రాసుకొని వస్తాడు.

మెకానిక్ షాపు.. పాన్‌షాప్.. అసిస్టెంట్ డైరెక్టర్.. ఇలా ఉంటుందాలిస్టు. ఇందులో ఏదో ఒకటి చేస్తానంటాడు.

సమాజంలో ఎంతో గౌరవంగా బతుకుతున్న తనకు తన కొడుకు అలాంటి పనులు చేయడం నామోషీ. ఇతరులు ఏమంటారోననే భయం. పరువు ప్రతిష్టలకు భంగం. అందుకే వద్దంటాడు. అది కాదు సెటిల్‌మెంటు అంటాడు. మరేంటీ సెటిల్‌మెంట్? మంచి ర్యాంకులా? ఉన్నత ఉద్యోగమా? బాగా డబ్బు సంపాదించడమా? మరి పాన్ షాపోడిది బతుకుకాదా? వాడు సెటిల్ అవ్వలేదా? మెకానిక్?? డ్రైవర్???

అడుగుతాడు.. పాన్ షాప్‌వాడిని.. మెకానిక్‌ని.. డ్రైవర్‌ను.. కొబ్బరి బోండాలు అమ్ముకునేవాడిని.. అందర్నీ. మీరు ఆనందంగా ఉన్నారా? అని. ఆశ్చర్యం. అందరూ ఆనందంగానే ఉన్నారు. ఆనందానికి.. డబ్బుకు.. సంపాదనకు.. సెటిల్‌మెంట్‌కు అసలు సంబంధం ఉందా? ఉంటే లక్షల్లో డబ్బులు సంపాదిస్తున్నవారు కూడా ఆత్మహత్య ఎందుకు చేసుకుంటున్నారు? పెద్దగా డబ్బు సంపాదించని వాళ్లు కూడా ఆనందంగా ఎలా బతుకుతున్నారు? ఈ అంశాన్నే చక్కటి భావోద్వేగాలతో తెరకెక్కించిన సినిమా 'నీదీ నాదీ ఒకే కథ'.

ఈ పోటీ ప్రపంచంలో.. కంపారిజన్స్ జమానాలో.. ఫేక్ ప్రెస్టేజీ ఎరాలో.. మనం ఎలా బతుకుతున్నాం? మన పిల్లలపై ఆ భావాలను ఎలా రుద్దుతున్నాం. మార్కులు.. ర్యాంకులు.. సక్సెస్.. సెటిల్‌మెంట్.. అంటూ.. వారికి ఏం దూరం చేస్తున్నాం.. వారినెలా తయారు చేస్తున్నాం? అని ప్రశ్నిస్తూ.. వ్యక్తిత్వవికాస నిపుణుల్ని నిక్కచ్చిగా నిలదీస్తూ చర్చను లేవదీసే చిత్రం ఇది. చదువు పూర్తయ్యాక.. జీవితంలో సెటిలవ్వడానికి మధ్యన ప్రతి ఇంట్లో.. ప్రతి యువతీయువకుల జీవితంలో జరిగే సంఘటనల సమాహారం ఈ కథ. మన ఫేక్ ప్రెస్టేజీ ముసుగుల్ని తొలిగించి మనల్ని మనకు అచ్చంగా.. స్వచ్ఛంగా.. చూపించాడు దర్శకుడు వేణు ఊడుగుల. మన కథని మనకే బోర్ కొట్టకుండా కూర్చోబెట్టి చూపించడంలో టీమ్ ఎఫర్ట్ ప్రతి ఫ్రేమ్‌లో కనిపిస్తుంటుంది. మనల్ని మనం రోజూ అద్దంలో చూసుకున్నట్లు.. ఈ సినిమా చూస్తున్నంత సేపు వెండితెర మీద మిమ్మల్ని మీరు చూసుకోవచ్చు.



నీదీ నాదీ ఒకే కథ

నటీనటులు : శ్రీ విష్ణు, సాట్నా టిటుస్, దేవీ ప్రసాద్, పోసాని..
సంగీతం : సురేష్ బొబ్బిలి
ఛాయాగ్రహణం : రాజ్ తోట, పర్వేజ్ కె
కూర్పు: బి. నాగేశ్వర్ రెడ్డి
కళ : టి.ఎన్. ప్రసాద్
నిర్మాత : ప్రశాంతి, కృష్ణ విజయ్
రచన, దర్శకత్వం : వేణు ఊడుగుల
బ్యానర్ : ఆరన్ మీడియా వర్క్స్
శ్రీ వైష్ణవి క్రియేషన్స్
సమర్పణ : నారా రోహిత్, అట్లూరి నారాయణ రావు
విడుదల తేదీ : 23-08-2018

మానవ జీవితంలోని సహజత్వాన్ని, వాస్తవికతను, సంఘర్షణలను, సంభాషణలను అందంగా హృద్యంగా జనరంజకంగా యంగేజింగ్‌గా విజువలైజ్ చేసిన ఒక ఇంటలిజెంట్ ఫిలిమ్ ఇది. దర్శకుడిలోని రచయిత, రచయిత అయిన దర్శకుడు పోటాపోటీగా ఒకరినొకరు డామినేట్ చేసుకుంటుంటారు అక్కడక్కడా. అయినా క్లారిటీ ఎక్కడా మిస్సవదు. మొదటి సినిమానే అయినా నీట్‌గా ఎంత చెప్పాలో.. ఎలా చెప్పాలో చెప్పుకుంటూ వెళ్లిపోయాడు దర్శకుడు. బాగా డబ్బు సంపాదించడం ఎలా? అనే పుస్తకం డబ్బులు లేక ముద్రించలేకపోవడం.. లాంటి అతని మాటలు నవ్విస్తే.. 'పనికిమాలిన ఆదర్శం' లాంటి 'కుక్క కథలు' ఆలోచింపజేస్తాయి. మాటల్లో పాటలు కలిసిపోయాయి. పాటల్లో సంగీతం ఒదిగిపోయింది. సురేష్ బొబ్బిలి నేపథ్య సంగీతం.. సన్నివేశాలకు మరింత బలాన్నిచ్చింది. సూటిగా సుత్తిలేకుండా బొంతల నాగేశ్వర్ రెడ్డి చేసిన కూర్పులో అతని నేర్పు కనిపిస్తుంటుంది. ఐదు ప్రధాన పాత్రల్లో ఐదుగురు నటులూ చక్కగా జీవించారు. కొడుకుగా శ్రీవిష్ణు, తండ్రిగా దేవీప్రసాద్ ఎప్పటికీ గుర్తుండిపోతారు. ధార్మిక (సాట్నా టిటుస్) అందం, అభినయంతో ఆకట్టుకుంటుంది. తన కెమెరా పనితనంతో రాజ్ తోట మరోసారి నిరూపించుకున్నారు. ఒక సామాజిక ఇతివృత్తాన్ని ఇంత సూటిగా, పదునుగా వెండితెరపై ఆవిష్కరించడంలో దర్శకుడు చేసింది ఒక సాహసమే. ఆ ధైర్యాన్ని నిర్మాణ రూపంలో ప్రోత్సాహకంగా అందించిన నారా రోహిత్ అభినందనీయులు.

ఫార్ములాను, ఫార్మాట్‌ను వీడి కొత్త పుంతలు తొక్కుతున్న తెలుగు సినిమా చరిత్రలో పెళ్లిచూపులు, అర్జున్ రెడ్డి తర్వాత ఈ ఏడాది ఆ వరుసలో నిలిచే చిత్రం నీదీ నాదీ ఒకే కథ. హీరో ఇంట్రడక్షన్, ఇంటర్వెల్ బ్యాంగ్, ఐటమ్ సాంగ్, ఊహించని ట్విస్టులు, ఫైట్లు, బాంబు బ్లాస్టులు, ఎగిరిపడే సుమోలు.. ఇవేవీ లేని.. ప్రారంభంలో రాహుల్ ద్రావిడ్ యాడ్ కూడా లేని అతి సామాన్య సాదాసీదా సినిమా. తారే జమీన్ పర్, త్రీ ఇడియట్స్‌లాంటి సినిమాలు తెలుగులో ఎందుకు రావో అనుకునేవాళ్లకు ఓ సమాధానం ఈ సినిమా. తప్పక చూడాల్సిన సినిమా. అమ్మానాన్నలకు చూపించాల్సిన సినిమా. అమ్మానాన్నలుగా మీరూ చూడాల్సిన సినిమా.

- నగేష్ బీరెడ్డి, ఫీచర్స్ ఎడిటర్



ఢిల్లీ తెలంగాణ భవన్‌కు కొత్త కళ

రాష్ట్ర సంస్కృతి ఉట్టిపడేలా ఏర్పాట్లు

విభజన తర్వాత మరమ్మతులు చేపట్టి ప్రారంభోత్సవం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర సంస్కృతి ఉట్టిపడేలా, కళలకు ప్రాధాన్యం ఇస్తూ ఢిల్లీలోని తెలంగాణ భవన్ సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకున్నది. విభజన తర్వాత తెలంగాణభవన్‌కు మరమ్మతులు చేపట్టి, అన్ని వసతులు కల్పించింది. రిసెప్షన్ లాబీతోపాటు భవన్‌లోని పలు కార్యాలయాలు, గదులను సిద్ధంచేయించింది. తెలంగాణ భవన్ ప్రిన్సిపల్ రెసిడెంట్ కమిషనర్ అశోక్‌కుమార్ వీటిని శుక్రవారం ప్రారంభించారు. భవన్‌లోకి స్వాగతం పలుకుతూ ఏర్పాటుచేసిన నిలువెత్తు తెలంగాణ తల్లి విగ్రహంతోపాటు రాష్టానికి వన్నె తెచ్చిన విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. హరితహారం పథకం ప్రతిబింబించేలా భారీగా నాటిన మొక్కలు ఆకట్టుకుంటున్నాయి. రాష్ట్రంలో గుర్తింపుపొందిన పూలమొక్కలన్నీ అక్కడే దర్శనమిస్తున్నాయి. వీటి పరిరక్షణకు ప్రత్యేక ఏర్పాట్లుచేశారు. మన విశిష్టతను తెలిపేలా చేనేత కళారూపాలతో హస్తకళా చిత్రాలను, బుద్ధ విగ్రహాన్ని ఏర్పాటుచేయడంతో తెలంగాణభవన్ కొత్త శోభను సంతరించుకున్నది. ప్రారంభోత్సవం సందర్భంగా అశోక్‌కుమార్ మాట్లాడుతూ విభజన తర్వాత తెలంగాణ భవన్ ఆధునీకరణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరువ తీసుకున్నదని చెప్పారు. ఫిష్ అక్వేరియం, రిసెప్షన్, సెంట్రల్ ఎయిర్ కండిషనింగ్‌తోపాటు పలు ఏర్పాట్లుచేశామని పేర్కొన్నారు. గతంలో భవన్‌లో కొంత భాగం ఇరుకుగా ఉండటంతో ఇబ్బందులు ఎదురయ్యాయని, ఈ నేపథ్యంలో కొత్త నిర్మాణాలు చేపట్టామని తెలిపారు. ఢిల్లీలోని తెలంగాణ మీడియాకు మెరుగైన సౌకర్యాలు అందించాలని నిర్ణయం తీసుకున్నట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు రెసిడెంట్ కమిషనర్ వేదాంతం గిరి, సహాయ కమిషనర్ రామ్మోహన్, ఓఎస్డీ కాశి చరణ్, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.



రైతు కోసం మొబైల్ యాప్

రూపకల్పనపై వ్యవసాయ విశ్వవిద్యాలయం దృష్టి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆధునిక సమాచార, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం మొబైల్ యాప్‌ను రూపొందిస్తున్నది. ఆస్ట్రేలియాకు చెందిన వెస్టర్న్ సిడ్నీ యూనివర్సిటీ, రివర్ బ్రిడ్జ్ వెంచర్స్, వ్యవసాయ విశ్వవిద్యాలయం సంయుక్తంగా రూపొందిస్తున్న ఈ యాప్‌పై శుక్రవారం విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వీసీ వీ ప్రవీణ్‌రావు మాట్లాడుతూ ప్రస్తుతం వివిధ సేవలకు అనేక రకాలైన యాప్‌లు అందుబాటులో ఉన్నాయని, వ్యవసాయంలోనూ రైతులకు విస్తరణ సేవలు అందించడానికి సమాచార సాంకేతికపరిజ్ఞానాన్ని వినియోగించుకుంటున్నామని చెప్పారు. రైతులు తమస్థాయిలో మేలైన నిర్ణయాలు తీసుకునేందుకు వీలుగా అవసరమైన పరిజ్ఞానాన్ని, సమాచారాన్ని ఈ యాప్ ద్వారా అందించాలని సూచించారు. ముంబైకి చెందిన రివర్‌బ్రిడ్జ్ వెంచర్స్ వ్యవస్థాపకుడు గోరంట్ల విష్ణు యాప్ రూపకల్పనలో తమ భాగస్వామ్యాన్ని వివరించారు. ఆస్ట్రేలియాకు చెందిన వెస్టర్న్ సిడ్నీ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ అతుల్ గినిజే మాట్లాడుతూ ప్రస్తుతం స్మార్ట్‌ఫోన్ల విప్లవం కొనసాగుతున్నదని వాటిద్వారా రైతుకు సరైన సమయంలో సరియైన సమాచారం అందించాల్సిన అవసరం ఉన్నదని చెప్పారు. వెస్టర్న్ సిడ్నీ విశ్వవిద్యాలయంలో ఉన్న వ్యవసాయ సామర్థ్యాలను ప్రొఫెసర్ శాంసుల్‌హుడా వివరించారు. విస్తరణ సేవలు అందిస్తున్న వ్యవస్థలు, సిబ్బంది, సంస్థలపై విశ్వవిద్యాలయ విస్తరణ సంచాలకులు డాక్టర్ డీ రాజిరెడ్డి పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ పాలకమండలి సభ్యులు డాక్టర్ మనోహర్‌రావు, డాక్టర్ జగదీశ్, రివర్‌బ్రిడ్జ్ వెంచర్స్ ప్రతినిధులు, వివిధ విభాగాల శాస్త్రవేత్తలు, వ్యవసాయ, ఉద్యానశాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

'హెచ్‌ఎండీఏ' కేసులో యాదవరెడ్డికి బెయిల్ నిరాకరణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హెచ్‌ఎండీఏ ప్రణాళిక విభాగం డైరెక్టర్ పురుషోత్తంరెడ్డి ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో రెండో నిందితుడు యాదవరెడ్డికి హైకోర్టు బెయిల్ నిరాకరించింది. ఆయన దాఖలుచేసిన బెయిల్ పిటిషన్‌ను జస్టిస్ ఎం సత్యనారాయణమూర్తి నేతృత్వంలోని న్యాయస్థానం శుక్రవారం కొట్టివేసింది. పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఏసీబీ తరపు న్యాయవాది రవికిరణ్‌రావు వాదనలు వినిపిస్తూ.. పురుషోత్తంరెడ్డికి చెందిన సంపాదనను యాదవరెడ్డి రియల్ ఎస్టేట్, భవన నిర్మాణ ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెట్టినట్లు తెలిపారు. అందుకు తగిన ఆధారాలు ఉన్నాయని కోర్టుకు వెల్లడించారు. వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం యాదవరెడ్డికి బెయిల్ నిరాకరించింది.

ప్రజారోగ్య పథకాలు భేష్

సర్కారు చర్యలతో తెలంగాణలో రోగాలు తగ్గుముఖం ■ వివిధ వ్యాధులపై జాతీయ సంస్థల సర్వేలో వెల్లడి

అన్నివర్గాలకు ఉచిత వైద్యసేవలపై ప్రభుత్వం కసరత్తు ■ గవర్నర్ నుంచి సామాన్యుడి వరకు హెల్త్ ప్రొఫైల్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

ఆరోగ్య తెలంగాణ సాధన దిశగా రాష్ట్ర ప్రభుత్వం వినూత్న రీతిలో ప్రజారోగ్య పథకాలు అమలుచేస్తున్నది. సర్కారు చర్యలతో రోగాల శాతం తగ్గుముఖం పడుతున్నది. వివిధ వ్యాధులపై జాతీయ ఆరోగ్య సంస్థలు చేసిన సర్వేలు.. వాటిద్వారా వెల్లడైన వ్యాధుల తీవ్రతను నియంత్రించేందుకు ప్రణాళికాబద్ధంగా కార్యక్రమాలు ప్రవేశపెడుతున్నది. ఆర్థికంగా వెనుకబడిన వారికి (తెల్లరేషన్ కార్డుదారులకు) ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్యసేవలు అందిస్తున్నది. ఉద్యోగులు, జర్నలిస్టులకు హెల్త్‌కార్డులతో కొంత పరిమితి మేరకు ఉచిత వైద్యం అందిస్తున్నది. కేసీఆర్ కిట్లతో అండగా నిలుస్తున్నది. రాష్ట్రంలోని అన్నివర్గాలవారికి ఉచిత వైద్యసేవలు అందించేలా.. అందరినీ ఆరోగ్య పథకం పరిధిలోకి తెచ్చేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నది. ఇంటింటికీ కంటి వైద్యం పేరిట ప్రత్యేక శిబిరాల ద్వారా ప్రజలందరికీ నేత్ర పరీక్షలు జరిపి ఉచితంగా అద్దాలు పంపిణీచేసి, శస్త్రచికిత్సలు నిర్వహించనుంది. గ్రామీణప్రాంతాల్లో షుగర్, బీపీ వంటి వ్యాధుల నిర్ధారణ పరీక్షలు నిర్వహించి.. సంబంధించిన మందుల కిట్లను అందించేందుకు వైద్య, ఆరోగ్య శాఖ కసరత్తు చేస్తున్నది. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రిసెర్చ్, పబ్లిక్ హెల్త్ ఫౌండేషన్ ఇండియా, ఇన్‌స్టిట్యూట్ ఫర్ హెల్త్ మెట్రిక్స్ అండ్ ఎవల్యూషన్ సంస్థలు సంయుక్తంగా 2016లో రాష్ట్రాలవారీగా వ్యాధులపై నిర్వహించిన సర్వే ఫలితాలను ఇటీవలే విడుదల చేశాయి.



సర్వే ప్రకారం రాష్ట్రంలోని ప్రజల సగటు ఆయుర్దాయం

ఏడాది	సగటు ఆయుర్దాయం	
	మహిళల్లో	పురుషుల్లో
1990లో	61.8 ఏండ్లు	60.2 ఏండ్లు
2016లో	73.2 ఏండ్లు	69.4 ఏండ్లు

ఉచితంగా వైద్య సేవలు

ఆహారపు అలవాట్లు, రోగ నిరోధక శక్తి తగ్గడం వంటి కారణాలతో వ్యాధులబారిన పడేవారి సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతున్నది. ప్రైవేటులో వైద్యానికి రూ.లక్షల్లో ఖర్చును భరించలేక నిరుపేదలు ఇబ్బంది పడాల్సి వస్తున్నది. దీన్ని దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం ప్రజలందరికీ ఉచితంగా వైద్యసేవలు అందించాలని భావిస్తున్నది.

ప్రతి ఒక్కరి రోగం.. హెల్త్ ప్రొఫైల్‌లో నిక్షిప్తం

రాష్ట్రవ్యాప్తంగా ప్రబలుతున్న వ్యాధులు, ప్రాంతాలవారీగా సమాచారం సేకరించి అందరికీ ఆరోగ్యం అందించేందుకు కృషి చేస్తున్నది. రాష్ట్రంలో హెల్త్ ప్రొఫైల్ ఆఫ్ తెలంగాణ పేరిట ప్రతి ఒక్కరికీ వైద్య పరీక్షలు నిర్వహించి, ఆరోగ్య కార్డులు అందజేస్తామని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఇటీవల ప్రకటించారు. గవర్నర్ నుంచి సామాన్యపౌరుడి వరకు రాష్ట్రంలోని ప్రతి ఒక్కరి ఆరోగ్య సమాచారంతో వైద్య, ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రొఫైల్‌ను రూపొందించేందుకు ప్రణాళికలు చేపట్టింది. ముందస్తు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసి, మందులు అందించి.. ఆ కుటుంబాలకు ఆర్థికభారం తగ్గించాలన్నది ప్రభుత్వ యోచన. ఆ పరీక్షల ఫలితాలను ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేసి.. ప్రతి ఒక్కరికి ఒక యునిక్ కోడ్ ఇస్తారు. రోగి ఎప్పుడు మందులు తీసుకోవాలి. మళ్లీ ఎప్పుడు పరీక్షలకు రావాలన్న సమాచారం ఫోన్‌కు మెసేజ్ వెళ్లేలా ఏర్పాట్లు చేస్తున్నట్టు సమాచారం.

రాష్ట్రంలో ఆయా వ్యాధులబారిన పడుతున్నవారి శాతం

- అంటువ్యాధులు (సీఎంఎన్‌ఎన్డీ) 27.6శాతం
- ఇతర వ్యాధులు: 59.2శాతం
- ప్రమాదాలు (రోడ్డు, అగ్ని, ఇతరత్రాలు) 13.2శాతం

వ్యాధిపేరు	2016లో స్థానం	శాతం	1990లో స్థానం	శాతం
గుండె సంబంధ వ్యాధులు	1	10.3	4	4.9
సీవోపీడీ	2	4.6	8	2.8
అతిసార వ్యాధి	3	4.4	1	13.2
ప్రీటెమ్ బర్త్ కాంప్లికేషన్స్ (ప్రేరేపిత జనన సమస్య)	4	3.6	3	7.2
ఆత్మహత్యలు	5	3.5	9	2.6
అంతర్గత అవయవ వ్యాధులు	6	3.4	15	1.5
ఐరన్‌లోపం, రక్తహీనత	7	3.3	10	2.2
స్ట్రోక్	8	3.3	12	2.2
రోడ్డు ప్రమాదగాయాలు	9	2.9	17	1.5
లోబ్యాక్ అండ్ నెక్ పెయిన్	10	2.8	18	1.4
డిప్రెస్సివ్ డిజార్డర్స్	11	2.5	23	1.2
శ్వాసకోశ సంబంధ వ్యాధులు	12	2.5	2	7.5
మైగ్రెయిన్ (తీవ్రమైన తలనొప్పి)	13	2.4	22	1.2
డయాబెటిస్ (మధుమేహం)	14	2.3	30	0.8

శారీరక వైకల్యం, మరణాలకు దారితీస్తున్న ప్రధాన అనారోగ్యాలు

వ్యాధిపేరు	2016లో స్థానం	శాతం	1990లో స్థానం	శాతం
పోషకాహార లోపం	1	11.4	1	35.1
ఆహార పదార్థాల కలీ	2	9.9	4	5.7
హై బ్లడ్ ప్రెషర్ (బీపీ)	3	8.7	5	4.2
వాతావరణ కాలుష్యం	4	8.6	3	10.1
హై ఫాస్టింగ్ ప్లాస్మా గ్లూకోజ్	5	5.9	7	2.4
హై టోటల్ కొలెస్ట్రాల్	6	5.1	9	2.3
పొగాకు వినియోగం	7	5.0	6	4.0
అధిక బరువు (ఒబెసిటీ)	8	4.6	10	1.8
అపరిశుభ్రత	9	4.2	2	13.5
వృత్తిపరంగా వచ్చే వ్యాధులు	10	3.4	8	2.3

తెలంగాణ పోస్టల్‌లో 136 ఖాళీలు

విద్య, ఉద్యోగ సమాచారం

డిపార్ట్‌మెంట్ ఆఫ్ పోస్ట్స్ పరిధిలో పనిచేస్తున్న తెలంగాణ పోస్టల్ సర్కిల్ ఆర్ఎంఎస్/పోస్టల్ డివిజన్‌లలో ఖాళీగా ఉన్న పోస్టుమ్యాన్, మెయిల్‌గార్డ్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

- పదోతరగతి ఉత్తీర్ణత
- రాతపరీక్ష ద్వారా ఎంపిక
- నెగెటివ్ మార్కింగ్ లేదు
- కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం
- మంచి జీతభత్యాలు, సమాజసేవకు అవకాశం
- దరఖాస్తులకు చివరితేదీ: ఏప్రిల్ 21

పోస్టల్ డిపార్ట్‌మెంట్ మినిస్ట్రీ ఆఫ్ కమ్యూనికేషన్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ పరిధిలో పనిచేస్తుంది.



వివరాలు:

- మొత్తం పోస్టుల సంఖ్య: 136
- పోస్ట్‌మ్యాన్-132 ఖాళీలు

హెడ్‌క్వార్టర్ హైదరాబాద్ రీజియన్‌లో ఖాళీలు:

- హైదరాబాద్ సిటీ డివిజన్-23, హైదరాబాద్ సౌత్ ఈస్ట్ డివిజన్-30, సికింద్రాబాద్ డివిజన్-15, సంగారెడ్డి డివిజన్ -4, మెదక్ డివిజన్-3
- **హైదరాబాద్ రీజియన్‌లో ఖాళీలు:** ఆదిలాబాద్-9, హన్మకొండ-7, కరీంనగర్-8, ఖమ్మం-11, మహబూబ్‌నగర్-1, నల్లగొండ-1, నిజామాబాద్-5, పెద్దపల్లి-6, సూర్యాపేట-4, వనపర్తి-1, వరంగల్-4
- **పోస్టు పేరు:** మెయిల్‌గార్డు - 4 ఖాళీలు (ఆర్ఎంఎస్ జెడ్ డివిజన్)
- **అర్హతలు:** గుర్తింపు పొందిన బోర్డ్ నుంచి పదోతరగతి/మెట్రిక్యులేషన్ లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణత.
- **వయస్సు:** 2018 ఏప్రిల్ 21 నాటికి 18 నుంచి 27 ఏండ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేండ్లు, ఓబీసీలకు మూడేండ్ల వరకు పీహెచ్‌సీలకు పదేండ్లు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- **పేస్కేల్:** రూ. 21,700/-(7వ వేతన పే కమిషన్ ప్రకారం జీతం + ఇతర అనుమతించదగిన అలవెన్స్‌లు ఇస్తారు)
- **ప్రొబేషనరీ పీరియడ్** : రెండేండ్లు
- **ఎంపిక:** రాతపరీక్ష (ఆప్టిట్యూడ్ టెస్ట్) ద్వారా
- రాతపరీక్షలో పదోతరగతి స్థాయిలోనే ప్రశ్నలు ఇస్తారు.
- నెగెటివ్ మార్కింగ్ లేదు.
- ప్రతి ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం100 ప్రశ్నలకు 100 మార్కులకు రాతపరీక్ష నిర్వహిస్తారు. పరీక్ష కాలవ్యవధి - 120 నిమిషాలు
- ప్రతి విభాగం నుంచి కనీస అర్హత మార్కులను సాధించాలి.

పార్ట్- ఏ : 25 మార్కులు- 25 ప్రశ్నలు . దీనిలో జనరల్ నాలెడ్జ్, రీజనింగ్, అనలిటికల్ ఎబిలిటీపై ప్రశ్నలు ఇస్తారు.

పార్ట్- బీ: 25 మార్కులు, 25 ప్రశ్నలు. దీనిలో మ్యాథమెటిక్స్ సబ్జెక్టుపై ప్రశ్నలు ఇస్తారు.

పార్ట్-సీ: ఇది రెండు భాగాలు. 25 మార్కులకు ఇంగ్లిష్, 25 మార్కులకు తెలుగు భాషపై ప్రశ్నలు ఇస్తారు.

- పార్ట్ ఏ, పార్ట్ బీలలో కనీసం మార్కులు జనరల్ అభ్యర్థులు-10, ఓబీసీలు- 9, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు -8 మార్కులను సాధించాలి.
- పార్ట్ సీ (ప్రతి విభాగంలో) కనీసం మార్కులు జనరల్ అభ్యర్థులు-10, ఓబీసీలు- 9, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు -8 మార్కులను సాధించాలి.
- ఓవరాల్‌గా జనరల్ అభ్యర్థులు-40, ఓబీసీలు-37, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు -33 మార్కులను సాధించాలి.
- **అప్లికేషన్ ఫీజు:** రిజిస్ట్రేషన్ ఫీజు - రూ. 100/, ఎగ్జామినేషన్ ఫీజు రూ. 400/-,
- ఎస్సీ, ఎస్టీ, మహిళా అభ్యర్థులకు ఎగ్జామినేషన్ ఫీజు లేదు. రిజిస్ట్రేషన్ ఫీజును ప్రతి ఒక్కరు చెల్లించాలి.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **దరఖాస్తులకు చివరితేదీ:** ఏప్రిల్ 28
- **ఫీజు చెల్లించడానికి చివరితేదీ:** ఏప్రిల్ 25
- **వెబ్‌సైట్:** www.telanganapostalcircle.in

ఓఎన్‌జీసీలో ఉద్యోగాలు

అసిస్టెంట్ లీగల్ అడ్వైజర్లు

ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఓఎన్‌జీసీ)లో అసిస్టెంట్ లీగల్ అడ్వైజర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.

వివరాలు:

ఓఎన్‌జీసీ భారత ప్రభుత్వ రంగ సంస్థ. ఇది మహారత్న కంపెనీ. ఆయిల్, గ్యాస్ అన్వేషణ, ఉత్పత్తి ఈ సంస్థ ప్రధాన కార్యకలాపాలు.

- **పోస్టు:** అసిస్టెంట్ లీగల్ అడ్వైజర్ (ఈ 1 లెవల్)
- **పేస్కేల్:** రూ. 60,000 - 1,80,000/-
- **మొత్తం పోస్టులు:** 15 (జనరల్ - 8, ఓబీసీ - 4, ఎస్సీ - 2, ఎస్టీ - 1)
- **వయస్సు:** 2018, జనవరి 1 నాటికి 30 ఏండ్లు మించరాదు. ఓబీసీలకు 33, ఎస్సీ/ఎస్టీలకు 35 ,పీహెచ్‌సీలకు 40 ఏండ్లు మించరాదు.
- **అర్హత:** కనీసం 60 శాతం మార్కులతో లా డిగ్రీ ఉత్తీర్ణత. అడ్వకేట్‌గా కనీసం మూడేండ్ల నుంచి ప్రాక్టీస్ చేస్తున్నవారికి ప్రాధాన్యం ఉంటుంది. లా డిగ్రీ ఫైనల్ ఇయర్ పరీక్షలు రాస్తున్నవారు/ఫలితాల కోసం ఎదురుచూస్తున్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- **ఎంపిక:** ఎల్ఎల్ఎం కోసం నిర్వహించే క్లాట్ - 2018లో వచ్చిన స్కోర్ ఆధారంగా. గతంలో నిర్వహించిన క్లాట్ స్కోర్‌లను పరిగణనలోకి తీసుకోరు.
- అర్హత డిగ్రీకి 25 మార్కులు (అదనపు విద్యార్హత i.e. పీహెచ్‌డీకి మార్కులు ఇస్తారు), క్లాట్ - 2018 స్కోర్‌కు 60 మార్కులు. ఇంటర్వ్యూకు 15 మార్కులు.
- మొత్తం 100 మార్కులకు వచ్చిన మార్కులను బట్టి తుది ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో మే 23 నుంచి ప్రారంభం (ఓఎన్‌జీసీ పోస్టులకు)
- **నోట్:** మే 13న నిర్వహించే క్లాట్ -2018 చేసుకుని ఉండాలి. ఆ తర్వాత ఓఎన్‌జీసీకి దరఖాస్తు చేసుకోవాలి.
- **చివరితేదీ:** జూన్ 21
- **ఇంటర్వ్యూ తేదీ:** ఆగస్టు మొదటి వారంలో

ఎగ్జిక్యూటివ్ పోస్టులు

ఓఎన్‌జీసీ ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

- **పోస్టు:** ఎగ్జిక్యూటివ్స్ (ఈ 1 లెవల్)
- **విభాగాలు:** హ్యూమన్ రిసోర్స్ ఎగ్జిక్యూటివ్, ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ ఆఫీసర్, అఫీషియల్ లాంగ్వేజ్ ఆఫీసర్.
- **మొత్తం పోస్టుల సంఖ్య:** ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభ సమయంలో ప్రకటిస్తారు.
- **పేస్కేల్:** రూ. 60,000 - 1,80,000/-
- **అర్హతలు:** హెచ్‌ఆర్ పోస్టులకు: ఎంబీఏలో పర్సనల్ మేనేజ్‌మెంట్/హెచ్‌ఆర్‌డీ లేదా హెచ్‌ఆర్‌ఎంలో కనీసం 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత. యూజీసీ నెట్‌లో - లేబర్ వెల్ఫేర్/పర్సనల్ మేనేజ్‌మెంట్ లేదా ఇండస్ట్రియల్ రిలేషన్స్ లేదా లేబర్ అండ్ సోషల్ వెల్ఫేర్ లేదా హెచ్‌ఆర్ మేనేజ్‌మెంట్ సబ్జెక్టుల్లో క్వాలిఫై కావాలి.
- ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ ఆఫీసర్ పోస్టులకు - కనీసం 60 శాతం మార్కులతో ఎంబీఏ (ఫైనాన్స్) ఉత్తీర్ణత. యూజీసీ నెట్‌లో మేనేజ్‌మెంట్ సబ్జెక్టులో క్వాలిఫై కావాలి.
- అఫీషియల్ లాంగ్వేజ్ ఆఫీసర్ - కనీసం 60 శాతం మార్కులతో పీజీలో హిందీ ఉత్తీర్ణత. డిగ్రీలో ఇంగ్లిష్ ఒక సబ్జెక్టుగా చదివి ఉండాలి. ట్రాన్స్‌లేషన్ వచ్చిన వారికి ప్రాధాన్యం ఇస్తారు. యూజీసీ నెట్‌లో హిందీ సబ్జెక్టులో అర్హత సాధించాలి.
- **ఎంపిక:** యూజీసీ నెట్ స్కోర్, అర్హత డిగ్రీలో మార్కులు, ఇంటర్వ్యూ ఆధారంగా చేస్తారు.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో ఏప్రిల్ 6 నుంచి ప్రారంభం (మొదట యూజీసీ నెట్ దరఖాస్తు చేసుకుని ఆ రిజిస్ట్రేషన్ నంబర్‌తో ఓఎన్‌జీసీకి దరఖాస్తు చేసుకోవాలి)
- **చివరితేదీ:** ఏప్రిల్ 27
- **వెబ్‌సైట్:** www.ongcindia.com

ఎస్ఆర్ఎంలో ప్రవేశాలు

ఎస్ఆర్ఎం యూనివర్సిటీకి చెందిన స్కూల్ ఆఫ్ లిబరల్ ఆర్ట్స్ అండ్ బేసిక్ సైన్సెస్ (ఎస్ఎల్ఏబీఎస్)లో 2018-19 విద్యాసంవత్సరానికిగాను ప్రవేశాల కోసం నోటిఫికేషన్ విడుదలైంది.

వివరాలు:

ఎస్ఆర్ఎం యూనివర్సిటీ అమరావతి క్యాంపస్‌ను 2017లో ఏర్పాటుచేశారు.

- **కోర్సులు:**

బీఏ, బీఎస్సీ, బీబీఏ, బీకాం

- **స్పెషలైజేషన్స్:** కామర్స్, ఎకనామిక్స్, ఇంగ్లిష్ స్టడీస్, హిస్టరీ, జర్నలిజం, సైకాలజీ, బిజినెస్ స్టడీస్, బయాలజీ, కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్, మ్యాథ్స్, ఫిజిక్స్.
- **ఎర్లీ ఎంట్రీ:** ఏప్రిల్ 20 నుంచి ప్రారంభమవుతాయి.
- **కౌన్సెలింగ్ టైం:** ఏప్రిల్ 25 నుంచి మే 10
- **సైకిల్ 2 ప్రవేశాలు:** జూన్ 15 నుంచి
- **వెబ్‌సైట్:** http://srmap.edu.in


కురుక్షేత్ర యూనివర్సిటీలో ప్రొఫెసర్లు

హర్యానాలోని కురుక్షేత్ర యూనివర్సిటీ టీచింగ్, నాన్ టీచింగ్ విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

దేశ మొదటి రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్ 1956లో ఈ విశ్వవిద్యాలయాన్ని ప్రారంభించారు.

- మొత్తం పోస్టుల సంఖ్య: 63
- **విభాగాలవారీగా ఖాళీలు:** కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్-2, అసిస్టెంట్ రిజిస్ట్రార్-3, స్టెనో-టైపిస్ట్ (ఇంగ్లిష్)-24, లైబ్రేరియన్-1, ప్రిన్సిపాల్-1, ప్రొఫెసర్-1, అసోసియేట్ ప్రొఫెసర్-5, అసిస్టెంట్ ప్రొఫెసర్-26
- **అర్హతలు:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి సంబంధిత సబ్జెక్టుల్లో పీజీతోపాటు నెట్/స్లెట్, సెట్, పీహెచ్‌డీ, ఏదైనా గ్రాడ్యుయేషన్, లైబ్రేరీ సైన్స్‌లో పీజీ/డిగ్రీలో ఉత్తీర్ణత లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణత. స్టెనో టైపిస్ట్‌కు స్టెనోగ్రఫీలో ప్రావీణ్యం ఉండాలి. సంబంధిత విభాగంలో అనుభవం ఉండాలి.



- **ఎంపిక:** రాతపరీక్ష/స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా.

చిరునామా: Assistant Registrar, Estt.(T), Kurukshetra University, Kurukshetra-136119

- **దరఖాస్తుకు చివరితేదీ:** ఏప్రిల్ 16
- **వెబ్‌సైట్:** www.kuk.ac.in

నేషనల్ రైస్ రిసెర్చ్‌లో

కటక్‌లోని ఐసీఏఆర్ - నేషనల్ రైస్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్ఆర్ఆర్ఐ)లో కింది ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.

వివరాలు:

ఎన్ఆర్ఆర్ఐ జాతీయ సంస్థ. ఇది ఐసీఏఆర్ పరిధిలో పనిచేస్తుంది. ప్రస్తుత ఖాళీలు కాంట్రాక్టు ప్రాతిపదికన భర్తీ చేయనున్నారు.

- ప్రాజెక్టు కో ఆర్డినేటర్ -1 పోస్టు
- **అర్హతలు:** అగ్రికల్చర్/ సంబంధిత రంగాల్లో డిగ్రీ, ఎంబీఏ లేదా తత్సమాన అర్హతలు ఉన్నవారు.
- సీఈవో ఆఫ్ ది ఎఫ్‌పీవో - 5 పోస్టులు
- **అర్హతలు:** అగ్రికల్చర్/ అనుబంధ సబ్జెక్టుల్లో డిగ్రీ ఉత్తీర్ణత. ఎంబీఏ (అగ్రికల్చర్ సంబంధిత స్పెషలైజేషన్ ఉన్నవారికి ప్రాధాన్యం ఇస్తారు)
- పై రెండు పోస్టులకు ఎంపిక: ఇంటర్వ్యూ ద్వారా
- **ఇంటర్వ్యూ తేదీ:** ఏప్రిల్ 3
- **వెబ్‌సైట్:** http://www.crri.nic.in

లైంగికంగా వేధించాడు..15 కోట్లు ముంచాడు..

వ్యాపారవేత్తపై బాలీవుడ్ నటి జీనత్ అమన్ ఫిర్యాదు

నిందితుడు అమన్ ఖన్నాను కోర్టులో బైండోవర్ చేసిన పోలీసులు



జీనత్ అమన్



అమన్‌ఖన్నాను అరెస్టు చేసి తీసుకెళ్తున్న పోలీసులు

ముంబై: తనను లైంగికంగా వేధించడంతోపాటు రూ.15 కోట్ల వరకు ముంచాడని బాలీవుడ్ సీనియర్ నటి జీనత్ అమన్(68) ఫిర్యాదు మేరకు నిందితుడు సర్ఫరాజ్ అలియాస్ అమన్ ఖన్నాను అరెస్టు చేసినట్టు పోలీసులు శుక్రవారం తెలిపారు. 'జుహు పోలీస్‌స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. నిందితుడిని అరెస్టు చేసి స్థానిక కోర్టులో ప్రవేశపెట్టాం. ఈ కేసును క్రైం బ్రాంచ్ పోలీసులకు అప్పగించాం. దర్యాప్తు కొనసాగుతున్నది' అని క్రైం డీసీపీ నిసార్ తంబోలి మీడియాకు వివరించారు. ఖన్నా (38) తన వెంటపడి వేధిస్తున్నాడని ఈ ఏడాది జనవరిలో కూడా ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసులో అరెస్టయిన ఖన్నా తర్వాత బెయిల్‌పై విడుదలయ్యాడు. ఖన్నా లైంగిక వేధింపులకు గురిచేస్తున్నాడని, ఒక ఆస్తి ఒప్పందం ఖరారు సాకుతో రూ.15.40 కోట్లకు మోసం చేశాడని నటి జీనత్ అమన్ తాజాగా పోలీసులకు ఫిర్యాదు చేశారు.

లోక్‌పాల్ కోసం హజారే మళ్లీ దీక్ష

స్వామినాథన్ నివేదికను అమలు చేయాలని డిమాండ్



ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో జెండా ఊపి తన నిరవధిక నిరాహారదీక్షను ప్రారంభిస్తున్న అన్నా హజారే

న్యూఢిల్లీ: లోక్‌పాల్‌ను నియమించేలా కేంద్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సామాజిక కార్యకర్త అన్నాహజారే నిరవధిక నిరాహార దీక్షకు దిగారు. ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో శుక్రవారం ఈ దీక్షను ప్రారంభించారు. లోక్‌పాల్ చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేస్తూ ఆయన 2011లో ఇదే మైదానంలో ఆందోళనకు దిగారు. మళ్లీ ఇదే మైదానం నుంచి ఆయన తన ఉద్యమాన్ని ప్రారంభించారు. 2011లో ఆయన యూపీఏ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి ఉద్యమం చేపట్టగా.. తాజాగా మోదీ ప్రభుత్వంపై ఒత్తిడి తేవడానికి నిరవధిక నిరాహార దీక్షకు దిగారు. కేంద్రంలో లోక్‌పాల్‌ను నియమించాలని, రాష్ట్రాల్లో లోకాయుక్తాలను ఏర్పాటు చేయాలని, రైతులకు ప్రయోజనకరమైన స్వామినాథన్ నివేదికను అమలు చేయాలని హజారే డిమాండ్ చేస్తున్నారు.

లోకాయుక్తను ఎందుకు నియమించలేదు?
12 రాష్ట్రాలను ప్రశ్నించిన సుప్రీంకోర్టు

లోకాయుక్త నియామకాలు జరుపకపోవడం సుప్రీంకోర్టు శుక్రవారం ఆగ్రహం వ్యక్తంచేసింది. ఇంతవరకు లోకాయుక్తను ఎందుకు నియమించలేదని 12 రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులను ప్రశ్నించింది. ఒడిశా ప్రభుత్వం లోకాయుక్తను నియమించిందా, లేదా అనే కనీస సమాచారం కూడా ఆ రాష్ట్ర ప్రభుత్వం న్యాయస్థానానికి తెలుపలేదని జస్టిస్ రంజన్ గగోయ్, జస్టిస్ ఆర్ భానుమతితో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఆగ్రహం వ్యక్తంచేసింది. 2013 లోక్‌పాల్ బిల్లులోని సెక్షన్ 63 ప్రకారం రాష్ట్రాలు అవినీతి నిరోధక అంబుడ్స్‌మన్ అయిన 'లోకాయుక్త'ను నియమించాల్సి ఉంది. 2014 జనవరి 14నుంచి చట్టం అమల్లోకి వచ్చింది. నాలుగేండ్లు దాటినప్పటికీ పలు రాష్ట్రాలు లోకాయుక్త నియామకాలు చేపట్టకపోవడాన్ని, అవినీతి నిరోధక యంత్రాంగాలకు తగిన నిధులు కేటాయించకపోవడాన్ని ప్రశ్నిస్తూ బీజేపీ నేత అశ్వినికుమార్ ఉపాధ్యాయ్ దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని ధర్మాసనం శుక్రవారం విచారించింది. లోకాయుక్త నియామకాలను చేపట్టకపోవడానికి తగిన కారణాలేంటో తెలుపుతూ అఫిడవిట్లు దాఖలు చేయాలని జమ్ముకశ్మీర్, మణిపూర్, మేఘాలయ, మిజోరాం, నాగాలాండ్, పుదుచ్చేరి, తమిళనాడు, తెలంగాణ, త్రిపుర, అరుణాచల్‌ప్రదేశ్, ఢిల్లీ, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాలను ధర్మాసనం ఆదేశించింది.

ఉత్పత్తి వ్యయం కన్నా..

ఒకటిన్నర రెట్లు అధికంగా మద్దతు ధర


త్వరలో అమల్లోకి నూతన విధానం: రాధామోహన్‌సింగ్



న్యూఢిల్లీ, మార్చి 23: రైతుల ఆదాయాన్ని 2022లోపు రెట్టింపు చేయాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఉన్నదని కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి రాధామోహన్ సింగ్ తెలిపారు. ఇందులో భాగంగా త్వరలో నూతన విధానాన్ని ప్రకటిస్తామని చెప్పారు. పంట ఉత్పత్తికి అయ్యే ఖర్చుకన్నా 1.5రెట్లు అధికంగా మద్దతు ధర లభించేలా చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఈ విషయాన్ని 2018–19 బడ్జెట్‌లో ప్రస్తావించామని గుర్తుచేశారు. ఇప్పటికే కొన్ని పంటలకు ఉత్పత్తి వ్యయం కన్నా కనీస మద్దతు ధర(ఎంఎస్‌పీ) 50శాతం అధికంగా ఉన్నదని, మిగిలిన పంటకు కూడా ఇది వర్తించేలా చూస్తామని హామీ ఇచ్చారు. శుక్రవారం ఆయన ఢిల్లీలో జరిగిన ఫిక్కీ కార్యక్రమంలో మాట్లాడుతూ మద్దతు ధర విషయంలో నీతిఆయోగ్ రాష్ట్రాలతో చర్చించి ముసాయిదా విధానాన్ని రూపొందిస్తున్నదని, త్వరలోనే ఈ ముసాయిదాపై తుది నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. పంట ధర కనీస మద్దతు ధర కన్నా కిందకు పడిపోతే ప్రభుత్వం అండంగా నిలిచి ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. మొత్తం 22 పంటలకు కేంద్రం కనీస మద్దతు ధరను నిర్ణయిస్తున్నదని చెప్పారు. ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించడం, మార్కెటింగ్ సదుపాయాలను కల్పించడం, మౌలిక వసతులు సమకూర్చడం ద్వారా రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయవచ్చని వివరించారు.

వివిధ నేరాల్లో డీ కంపెనీ హస్తం!

అమెరికన్ చట్టసభ సభ్యుల వెల్లడి



వాషింగ్టన్, మార్చి 23: పాకిస్థాన్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న అండర్ వరల్డ్ డాన్ దావూద్ ఇబ్రహీం ఆధ్వర్యంలోని ఉగ్రసంస్థ డీ కంపెనీ వివిధ రకాల నేరపూరిత ఉగ్ర కార్యకలాపాల్లోకి విస్తరించిందని అమెరికన్ చట్టసభల సభ్యులు శుక్రవారం వెల్లడించారు. ప్రస్తుతం పాకిస్థాన్‌లోని కరాచీ కేంద్రంగా పనిచేస్తున్న దావూద్ భారత్‌లో పలు ఉగ్రదాడులు చేయించాడని పేర్కొన్నారు. కాగా దావూద్ పాకిస్థాన్‌లోనే ఉన్నాడన్న వాదనను ఆ దేశం ఖండిస్తూ వస్తున్నది. 'భారత మూలాలు కలిగిన దావూద్‌కు చెందిన డీ కంపెనీ మాదకద్రవ్యాలతోపాటు ఇతర నేరపూరిత కార్యకలాపాల్లో శక్తివంతమైన ఉగ్రసంస్థగా ఎదిగింది' అని జార్జ్ మాసన్ యూనివర్సిటీకి చెందిన స్కార్ స్కూల్ ఆఫ్ పాలసీ అండ్ గవర్నమెంట్ ప్రొఫెసర్ డాక్టర్ లూయిస్ షెల్లీ అమెరికన్ చట్టసభ సభ్యులకు వివరించారు. 'పాక్ కేంద్రంగా పనిచేస్తున్న డీ కెంపెనీ మెక్సికన్ డ్రగ్స్ సంస్థల తరహాలో వివిధ రంగాల్లో విస్తరించింది. ఈ మేరకు ఉగ్రవాదంపై పనిచేసే అమెరికన్ కాంగ్రెస్ సబ్‌కమిటీకి నివేదిక సమర్పించారు.

ఆప్.. హమ్మయ్య

అనర్హత వేటుపడిన 20 మంది ఆప్ ఎమ్మెల్యేలకు ఊరట ■ ఎన్నికల సంఘం నిర్ణయాన్ని పక్కనబెట్టిన ఢిల్లీ హైకోర్టు

ఎమ్మెల్యేల వాదనలను మరోసారి వినాలని ఈసీకి సూచన


న్యూఢిల్లీ, మార్చి 23:

కొన్నాళ్లుగా వరుస పరాభవాలతో సతమతం అవుతున్న ఆమ్ ఆద్మీ పార్టీకి ఢిల్లీ హైకోర్టు గొప్ప ఊరటనిచ్చింది. నిబంధనలకు విరుద్ధంగా లాభదాయక పదవుల్లో కొనసాగుతున్నారన్న ఆరోపణలతో ఢిల్లీ ప్రభుత్వంలోని 20 మంది ఆప్ ఎమ్మెల్యేలపై ఎన్నికల సంఘం వేసిన సస్పెన్షన్‌ను పక్కనబెట్టింది. ఎన్నికల సంఘం (ఈసీ) ఈ కేసు విచారణను మళ్లీ మొదటి నుంచి ప్రారంభించాలని జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ చందర్ శేఖర్‌తో కూడిన బెంచ్ శుక్రవారం తీర్పునిచ్చింది. ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించడం చట్టవిరుద్ధమని, ఈ కేసులో సహజ న్యాయం లోపించిందని వ్యాఖ్యానించింది. వారిపై అనర్హత వేటు వేసే ముందు ఎన్నికల సంఘం ఒక్కొక్కరి సంజాయిషీ వినలేదని అభిప్రాయపడింది. వారి వివరణను మరోసారి వినాలని ఈసీకి సూచించింది. ఇలాంటి ఘటనలు ఇంకా ఉంటే వాటన్నింటినీ తిరిగి విచారించి తుది నిర్ణయం తీసుకోవాలని సూచించింది. 2015 ఢిల్లీ ఎన్నికల్లో విజయం అనంతరం సీఎం అరవింద్ కేజ్రీవాల్ నిబంధనల ప్రకారం ఏడుగురికి మంత్రి పదవులు ఇచ్చారు. అయితే అదనంగా మరో 20 మంది ఎమ్మెల్యేలను పార్లమెంటరీ సెక్రటరీలుగా నియమించారు. దీనిపై విమర్శలు చెలరేగాయి. దీంతో ఆ 20 మంది నిబంధనలకు విరుద్ధంగా లాభదాయక పదవులు పొందారని కేంద్ర ఎన్నికల సంఘం ఆక్షేపిస్తూ నోటీసులు జారీ చేసింది. కేవలం వారికి పదవులు మాత్రమే ఇచ్చామని, జీతాలు ఇవ్వడం లేదని ప్రభుత్వం ఇచ్చిన వివరణతో ఎన్నికల సంఘం సంతృప్తి చెందలేదు. అదే సమయంలో ఢిల్లీ హైకోర్టు సైతం ఈసీ విచారణపై స్టే ఇవ్వడానికి నిరాకరించింది. దీంతో 20 మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని ఎన్నికల సంఘం రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు ప్రతిపాదించగా, ఆయన ఆమోదం తెలిపారు. దీంతో తమ వాదనలు వినకుండా సస్పెండ్ చేశారంటూ 20 మంది ఎమ్మెల్యేలు మరోసారి ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. విచారణ జరిపిన న్యాయస్థానం వారిపై సస్పెన్షన్‌ను ఎత్తివేస్తూ తీర్పునిచ్చింది.



తీర్పు అనంతరం విజయసంకేతం చూపుతున్న ఆప్ ఎమ్మెల్యేలు

సత్యమే గెలిచింది: కేజ్రీవాల్



హైకోర్టు తీర్పును సత్యానికి దక్కిన విజయంగా ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ అభివర్ణించారు. ఎమ్మెల్యేలను అడ్డదారిలో సస్పెండ్ చేశారని, చివరికి సత్యమే గెలిచిందని ట్వీట్ చేశారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఢిల్లీ హైకోర్టు తీర్పునిచ్చిందన్నారు. డిప్యూటీ సీఎం మనీశ్‌సిసోడియా సైతం హైకోర్టు తీర్పును స్వాగతించారు.

పోరాటం కొనసాగిస్తాం: కాంగ్రెస్

లాభదాయక పదవులు పొందిన 20 మంది ఎమ్మెల్యేలపై తమ పోరాటం కొనసాగుతుందని కాంగ్రెస్ పేర్కొన్నది. వారిపై ఎన్నికల సంఘం మరోసారి విచారణ చేపట్టేలా ఒత్తిడి తెస్తామని కాంగ్రెస్ పార్టీ ఢిల్లీ అధ్యక్షుడు అజయ్ మాకెన్ ట్వీట్ చేశారు. ఆప్ ప్రభుత్వం 20 మంది పార్లమెంట్ సెక్రటరీలకు జీతాలు ఇవ్వకున్నా, వారి కార్యాలయాల ఏర్పాటు, రవాణా కోసం భారీగా ఖర్చు చేసినట్టు గతంలోనే ఈసీ ముందు ఒప్పుకున్నదని గుర్తు చేశారు.

బడ్జెట్ సమావేశాలకు హాజరు

ఢిల్లీ హైకోర్టు సస్పెన్షన్ ఎత్తివేసిన నేపథ్యంలో 20 మంది ఆప్ ఎమ్మెల్యేలు ప్రస్తుతం జరుగుతున్న బడ్జెట్ సమావేశాలకు హాజరయ్యేందుకు ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్ రామ్‌నివాస్ గోయెల్ అనుమతినిచ్చారు. దీంతో అసెంబ్లీకి హాజరయ్యారు. వారు సభలోకి వస్తుండగా మిగతా ఆప్ ఎమ్మెల్యేలు బల్లలు చరుస్తూ ఆహ్వానం పలికారు.

ఎమ్మెల్యేల అనర్హతలో ముఖ్యఘట్టాలు

2015 మార్చి 13: ఆప్ ఎమ్మెల్యేల్లో 21 మందిని పార్లమెంటరీ కార్యదర్శులుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన ఢిల్లీ సీఎం కేజ్రీవాల్.

జూన్ 19: ఈ నియామకాలను సవాలు చేస్తూ ఆ 21 మందిపై అనర్హత వేటు వేయాలని రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీని కోరిన అడ్వొకేట్ ప్రశాంత్ భూషణ్.

జూన్ 24: పార్లమెంటరీ కార్యదర్శులపై అనర్హత వేటు పడకుండా ఆ పదవులను లాభదాయక పదవుల జాబితా నుంచి మినహాయిస్తూ రూపొందించిన బిల్లును ఆమోదించిన ఢిల్లీ అసెంబ్లీ.

2016 జూన్ 13: ఆ బిల్లును ఆమోదించడానికి రాష్ట్రపతి ముఖర్జీ తిరస్కృతి.

జూన్ 25: ఆ బిల్లుతోపాటు ఢిల్లీ అసెంబ్లీ ఆమోదించిన 14 బిల్లులను తిప్పిపంపిన కేంద్రం.

జూలై 14: ఎమ్మెల్యేల వాదనను విన్న ఎన్నికల కమిషన్

సెప్టెంబర్ 8: పార్లమెంటరీ కార్యదర్శుల నియామకంపై కేజ్రీవాల్ సర్కారు జారీ చేసిన ఉత్తర్వుల నిలిపివేత.

సెప్టెంబర్ 8: ఎన్నికల కమిషన్ నుంచి 21 మంది ఎమ్మెల్యేలకు నోటీసుల జారీ.

2017 జనవరి 6: పార్లమెంటరీ కార్యదర్శులుగా నియమితులైన వారిలో ఒకరైన ఎమ్మెల్యే జర్నైల్‌సింగ్ రాజీనామా.

జూన్ 24: తమపై లాభదాయక పదవుల కేసును విరమించుకోవాలన్న ఆప్ ఎమ్మెల్యే వినతిని తిరస్కరించిన ఈసీ.

అక్టోబర్ 9: వివరణ కోరుతూ 20 మంది ఆప్ ఎమ్మెల్యేలకు ఈసీ నోటీసుల జారీ.

2018 జనవరి 19: ఆ 20 మంది ఆప్ ఎమ్మెల్యేలపై అనర్హులుగా ప్రకటించాలని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు ఈసీ సిఫారసు.

జనవరి 20: సిఫారసుకు రాష్ట్రపతి ఆమోదం

జనవరి 24: ఈ నిర్ణయాన్ని సవాలు చేస్తూ హైకోర్టును ఆశ్రయించిన ఎమ్మెల్యేలు

ఫిబ్రవరి 7: ఎమ్మెల్యేల వాదనలు వినేందుకు తేదీలు నిర్ణయించిన హైకోర్టు

ఫిబ్రవరి 28: ఆప్ ఎమ్మెల్యేల వినతిపై తీర్పును రిజర్వు చేసిన హైకోర్టు

మార్చి 23: ఆప్ ఎమ్మెల్యేల అనర్హతకు దారి తీసిన నోటిఫికేషన్‌ను రద్దు చేసిన హైకోర్టు.

ఎస్సీ, ఎస్టీ కేసులో రివ్యూ పిటిషన్ వేయండి

కేంద్రాన్ని డిమాండ్ చేసిన కాంగ్రెస్ ■ రాహుల్‌గాంధీ ఆధ్వర్యంలో ఆ పార్టీ ఎంపీల నిరసన



పార్లమెంట్ వద్ద కాంగ్రెస్ ఎంపీల నిరసన

న్యూఢిల్లీ, మార్చి 23: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు సవరణలకు సంబంధించి సుప్రీంకోర్టులో కేంద్రం రివ్యూ పిటిషన్ దాఖలు చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో ఆ పార్టీ ఎంపీలు పార్లమెంట్ ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద శుక్రవారం ఆందోళన నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంలో ఉన్న కొన్ని నిబంధనలను మంగళవారం సుప్రీంకోర్టు సరళీకరించింది. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా నిక్కచ్చిగా విధులు నిర్వహించే ప్రభుత్వ అధికారులను ఎస్టీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టి బెదిరింపులకు గురిచేయకుండా సుప్రీంకోర్టు నిబంధనల్లో మార్పులు చేసింది. కాగా ఈ కేసులో కేంద్ర ప్రభుత్వం తన వాదనలను సరిగా వినిపించలేదని.. దీనిపై రివ్యూ పిటిషన్ దాఖలు చేయాలని కాంగ్రెస్ పార్టీ ఎంపీలు డిమాండ్ చేశారు. 'దళితోంకీ సమ్మాన్ మే.. రాహుల్‌గాంధీ మైదాన్ మే' (దళితుల హక్కుల కోసం రాహుల్‌గాంధీ పోరాటం) అంటూ కాంగ్రెస్ ఎంపీలు నినాదాలు చేశారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టానికి సుప్రీంకోర్టు ఇచ్చిన తాజా నిర్వచనంతో చట్టం దాదాపు రద్దయిపోయినట్టేనని.. దీనికి సంబంధించి కోర్టులో కేంద్రం సరిగా వాదనలు వినిపించలేదని లోక్‌సభలో కాంగ్రెస్ పక్షనేత మల్లికార్జున్ ఖర్గే తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. 'ఈ పరిస్థితుల నేపథ్యంలో కేంద్రం కచ్చితంగా రివ్యూ పిటిషన్ దాఖలు చేయాలి. దళిత, గిరిజన హక్కుల రక్షణ కోసం చట్టసవరణ చేసి తీరాలి. ఒకవేళ అలా చేయని పక్షంలో డిఫెన్స్ వాదనలను ప్రభుత్వం సమర్థించినట్లే అర్థంచేసుకోవాలి' అని ఆయన పేర్కొన్నారు. అంతకుముందు కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ కార్యాలయం వద్ద సమావేశమైన ఆ పార్టీ ఎంపీలు ఈ అంశంతోపాటు ఉభయ సభల్లో వ్యవహరించాల్సిన తీరుపై చర్చించినట్టు సమాచారం.

15వ రోజూ అదే ప్రతిష్టంభన

మంగళవారానికి లోక్‌సభ, సోమవారానికి రాజ్యసభ వాయిదా




రాజ్యసభలో గందరగోళం

న్యూఢిల్లీ, మార్చి 23: పార్లమెంట్ ఉభయసభల్లో వరుసగా 15వ రోజూ శుక్రవారం అదే ప్రతిష్టంభన కొనసాగింది. ఇరు సభల్లోనూ విపక్ష సభ్యులు నిరసన తెలుపుతుండటంతో రాజ్యసభ 20 నిమిషాల్లోపే సోమవారానికి వాయిదా పడింది. లోక్‌సభ తొలుత మధ్యాహ్నానికి తర్వాత మంగళవారానికి వాయిదా పడింది. కాగా, అంతకుముందు 87 ఏండ్ల క్రితం బ్రిటిష్ పాలకులు ఉరి తీసిన స్వాతంత్ర్య సమరయోధులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లకు పార్లమెంట్ ఉభయ సభలు నివాళులర్పించాయి. అన్నాడీఎంకే, టీఆర్‌ఎస్ సభ్యుల నిరసన తెలుపుతుండటంతో ప్రభుత్వంపై అవిశ్వాసం ప్రకటిస్తూ టీడీపీ, వైసీపీ ఇచ్చిన అవిశ్వాస తీర్మానాలను సభ ఆర్డర్‌లో లేనందుకు చేపట్టలేకపోతున్నట్లు స్పీకర్ సుమిత్ర మహాజన్ తెలిపారు. ఆర్జేడీ బహిష్కృత సభ్యుడు పప్పూ యాదవ్.. బీహార్‌కు ప్రత్యేక హోదా కల్పించాలని కోరుతూ రెండు ప్లకార్డులు ప్రదర్శించారు. మరోవైపు విపక్షాలు నిరసన తెలుపుతుండటంతో రాజ్యసభ ఎటువంటి కార్యకలాపాలు చేపట్టకుండానే వాయిదా పడింది. సభలో నిరంతరాయంగా సాగుతున్న నిరసనపై చైర్మన్ వెంకయ్యనాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. సభ్యుల నిరసన సమ్మతం కాదని, వచ్చే వారం నుంచైనా సభా కార్యకలాపాలు ప్రారంభం అవుతాయని భావిస్తున్నట్లు తెలిపారు. సభా కార్యక్రమాలు సజావుగా సాగేందుకు విపక్షాలను ప్రభుత్వం విశ్వాసంలోకి తీసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని, టీడీపీ సభ్యులు, కాంగ్రెస్ ఎంపీ కేవీపీ రామచంద్రరావు, కావేరీ జల వివాదంపై డీఎంకే, అన్నాడీఎంకే సభ్యులు వెల్‌లోకి దూసుకొచ్చి నిరసన తెలిపారు. ఎస్టీ, ఎస్టీలకు వ్యతిరేకంగా ప్రభుత్వం పని చేస్తున్నదని నినాదాలు చేస్తూ కాంగ్రెస్ సభ్యులు వెల్‌లోకి దూసుకొచ్చారు. సభలో పరిస్థితి బాధాకరంగా ఉన్నదని చైర్మన్ వెంకయ్యనాయుడు పేర్కొన్నారు.

ప్రభుత్వంపై కాంగ్రెస్ అవిశ్వాసం నోటీసు

కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా లోక్‌సభలో కాంగ్రెస్ పార్టీ అవిశ్వాసం ప్రకటిస్తూ స్పీకర్‌కు నోటీసు అందజేశారు. ఈ మేరకు కాంగ్రెస్ పక్ష నేత మల్లిఖార్జున ఖర్గే శుక్రవారం అవిశ్వాస తీర్మానం నోటీసును లోక్‌సభ సెక్రటరీ జనరల్‌కు సమర్పించారు. దీంతో ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టిన పార్టీగా కాంగ్రెస్ పార్టీ నిలిచింది. 'మంత్రి మండలిపై ఈ సభ అవిశ్వాసం ప్రకటిస్తున్నది' అని ఆ నోటీసులో పేర్కొన్నారు. ఈ నోటీసు ఈ నెల 27న లోక్‌సభలో చర్చకు వచ్చే అవకాశం ఉన్నది.



చంద్రయాన్-2 అక్టోబర్‌కు వాయిదా

- మరిన్ని పరీక్షలు నిర్వహించేందుకే ప్రయోగం వాయిదా
- లిథియమ్ అయాన్ సెల్ తయారీకి ఇస్రోతో బీహెచ్‌ఈఎల్ ఒప్పందం

చెన్నై, మార్చి 23: వచ్చే నెలలో నిర్వహించతలపెట్టిన చంద్రయాన్–2 ప్రయోగం అక్టోబర్‌కు వాయిదా పడింది. చంద్రయాన్–2 కు మరికొన్ని పరీక్షలు నిర్వహించాలని నిపుణులు సూచించిన మీదట ప్రయోగాన్ని వాయిదా వేసినట్లు ఇస్రో తెలిపింది. 'చంద్రయాన్–2 ప్రయోగాన్ని ఏప్రిల్‌కు బదులుగా అక్టోబర్‌లో నిర్వహించనున్నాం' అని ఇస్రో చైర్మన్ కే శివన్ చెన్నై విమానాశ్రయంలో మీడియాకు వెల్లడించారు. పూర్తిగా దేశీయంగా తయారైన చంద్రయాన్–2 లో ఆర్బిటార్, ల్యాండర్, రోవర్ ఉంటాయి. 3,290 కిలోల బరువున్న ఈ చంద్రయాన్–2 అంతరిక్ష నౌక చంద్రుడి కక్ష్యలో తిరుగుతూ సమాచారాన్ని అందించనున్నది. చంద్రుడి ఉపరితలం ఎలా ఉంది, ఖనిజాల లభ్యత ఎలా ఉంది, నీరు, మంచు లభ్యత గురించి అంశాలపై పరిశోధనలు నిర్వహించేందుకు చంద్రయాన్–2 సహకరించనున్నదని ల్యూనార్ మిషన్‌కు సంబంధించిన సమాచారంలో ఇస్రో వెబ్‌సైట్ వివరించింది. కాగా, చంద్రయాన్–1 ప్రయోగాన్ని 2008లో ఇస్రో విజయవంతంగా చేపట్టిన విషయం తెలిసిందే. ఇలాఉండగా, అంతరిక్ష పరిశోధనలకు ఉపయోగించే లిథియమ్ అయాన్ సెల్ తయారీకి ఇస్రోతో బీహెచ్‌ఈఎల్ ఒప్పందం చేసుకున్నది. ఇస్రో చైర్మన్ కే శివన్, బీహెచ్‌ఈఎల్ చైర్మన్ అతుల్ సోబ్తీల సమక్షంలో ఒప్పంద పత్రాలపై అధికారులు శుక్రవారం సంతకాలు చేశారు. ఇప్పటివరకు లిథియమ్ అయాన్ సెల్స్‌ను ఇస్రో విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటుండగా, విడిభాగాల అనుసంధానం, పరీక్షలను బీహెచ్‌ఈఎల్ చేపట్టేది. ప్రస్తుతం విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్‌లోని టెక్నాలజీని వినియోగించుకోవడం ద్వారా ఇస్రోకు అవసరమైన లిథియమ్ అయాన్ సెల్స్‌లను బీహెచ్‌ఈఎల్ రూపొందించనుంది. ఇందుకోసం బెంగళూరులో అధునాతన యూనిట్‌ను ప్రారంభించేందుకు భెల్ ఏర్పాట్లు చేస్తున్నది.

ఫేస్‌బుక్ ఖాతాల సమాచారం భద్రతకు చర్యలు

సీనియర్ అధికారులతో కేంద్రమంత్రి రవిశంకర్ ప్రసాద్ చర్చలు

న్యూఢిల్లీ, మార్చి 23: సామాజిక మాధ్యమం ఫేస్‌బుక్‌లో ఖాతాదారుల వ్యక్తిగత సమాచారం దుర్వినియోగ అంశాన్ని కేంద్రప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తుంది. ఈ క్రమంలో గురువారం ఢిల్లీలో సీనియర్ అధికారులతో ఆ శాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ సమావేశమయ్యారు. రెండుగంటలపాటు జరిగిన ఈ సమావేశంలో ప్రధానంగా వినియోగదారుల ఫేస్‌బుక్ ఖాతాల సమాచారం దుర్వినియోగం కాకుండా నిరోధించడంపై చర్చించారు. దీనికి సంబంధించి శాశ్వత ప్రాతిపదికన పరిష్కారం చూపాలని అధికారులను కోరారు. దీంతోపాటు కాంగ్రెస్ పార్టీపై కేంద్రమంత్రి ఆరోపణలు చేశారు. రాజకీయ కన్సల్టింగ్ సంస్థ కేంబ్రిడ్జ్ ఎనలిటికా సహకారంతో వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలువాలని చూస్తుందని ఆయన మండిపడ్డారు.

బీహార్‌లో

ఐదుగురు సజీవ దహనం

- అక్రమ పటాకుల యూనిట్‌లో పేలుడు
- మృతుల్లో ముగ్గురు చిన్నారులు, ఓ మహిళ
- మరో 18 మందికి గాయాలు

బీహార్ షరీఫ్ (బీహార్), మార్చి 23: బీహార్‌లోని నలంద జిల్లాలో అక్రమంగా నిర్వహిస్తున్న పటాకుల తయారీకేంద్రంలో గురువారం రాత్రి భారీ పేలుడు సంభవించింది. ఒక మహిళ, ముగ్గురు చిన్నారులు సహా మొత్తం ఐదుగురు సజీవ దహనమయ్యారు. మరో 18మంది గాయపడ్డారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి నితిశ్‌కుమార్ విచారం వ్యక్తంచేశారు. క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. ఇక్కడ రద్దీగా ఉండే నివాసప్రాంతంలో ఓ వ్యక్తి ఇంటిని కిరాయికి తీసుకుని అక్రమంగా పటాకుల యూనిట్ నెలకొల్పాడు. పేలుడు పదార్థాలు కూడా పెద్దమొత్తంలో నిల్వ చేయడంతో భారీ పేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో నిందితుడి ఇద్దరు కుమార్తెలు, (ఒకరు నెల పసికందు కాగా, మరొకరికి మూడేండ్లు) ఒక కుమారుడు (4)తోపాటు అతడి సోదరి, పొరుగువారు ఒకరు సజీవ దహనమయ్యారు. నిందితుడితోసహా 18 మందికి గాయాలు కాగా, వీరిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉందని నలంద జిల్లా మెజిస్ట్రేట్ త్యాగరాజన్ తెలిపారు. తీవ్రంగా గాయపడిన వారిని పట్నా మెడికల్ కళాశాల దవాఖానకు తరలించారు. కొన్ని గంటలపాటు మంటలు చెలరేగాయి. అక్రమ కార్యకలాపాలను కనిపెట్టడంలో విఫలమైన ఖాస్‌గంజ్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ షేర్ సింగ్‌యాదవ్‌పై సస్పెన్షన్ వేటు వేసినట్టు కలెక్టర్ తెలిపారు. అక్రమంగా ఓ ఇంట్లో పటాకుల యూనిట్‌ను నెలకొల్పినందుకు నిందితుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ఐఎన్‌ఎక్స్ మీడియా కేసులో కార్తీకి బెయిల్



న్యూఢిల్లీ: ఐఎన్‌ఎక్స్ మీడియా కేసులో కేంద్ర మాజీ ఆర్థికమంత్రి చిదంబరం కుమారుడు కార్తీ చిదంబరానికి ఊరట లభించింది. శుక్రవారం ఢిల్లీ హైకోర్టు ఆయనకు బెయిల్ మంజూరుచేసింది. రూ.10 లక్షల జామీను ఇవ్వాలని ఆదేశించడంతోపాటు అదనంగా పలు షరతులు విధించింది. దేశాన్ని విడిచి వెళ్లాలనుకుంటే సీబీఐ అనుమతి తీసుకోవాలని సూచించింది. బెయిల్‌పై బయటకెళ్లాక ఈ కేసులో సాక్ష్యాలను తారుమారు చేయొద్దని న్యాయస్థానం పేర్కొన్నది. ఈ నెల 16న సీబీఐ, కార్తీ తరపున వాదనలు విన్న న్యాయస్థానం తీర్పును ప్రకటించకుండా రిజర్వులో పెట్టింది. ఈ కేసులో నిందితుడు సాక్షాలను ప్రభావితం చేయగల వ్యక్తి అని, ఇప్పటికే సాక్ష్యాలను తారుమారుచేశారని, అతనికి బెయిల్ ఇవ్వొద్దని సీబీఐ వాదించింది. కార్తీకి వ్యతిరేకంగా సీబీఐ ఇప్పటివరకు అవినీతి నిరోధక చట్టం కింద ఎలాంటి కేసులు నమోదు చేయలేదని కార్తీ న్యాయవాది పేర్కొన్నారు. సాక్ష్యాలను తారుమారుచేశారన్న ఆరోపణలను సైతం ఆయన ఖండించారు. మళ్లీ కస్టడీలోకి తీసుకొని విచారిస్తామని సీబీఐ కోరలేదని, అలాంటప్పుడు జుడిషియల్ కస్టడీలో ఎందుకు ఉంచుతారని ఆయన ప్రశ్నించారు. ఇప్పటివరకు సీబీఐ ఈ కేసులో మరెవరినీ అరెస్టు చేయలేదని చెప్పారు. ఐఎన్‌ఎక్స్ మీడియా కేసులో కార్తీని సీబీఐ అధికారులు ఫిబ్రవరి 28న అరెస్టుచేశారు. శనివారంతో ఆయన జుడిషియల్ కస్టడీ ముగియనుండగా, ఈ మేరకు ఢిల్లీ హైకోర్టు బెయిల్ మంజూరుచేసింది.

పుతిన్ ఎన్నికపై అధికారిక ప్రకటన

మాస్కో, మార్చి 23: రష్యా అధ్యక్షుడిగా పుతిన్ తిరిగి ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు అధికారికంగా ప్రకటించారు. శుక్రవారం ఈ మేరకు చివరి ఫలితాలను విడుదల చేశారు. ఈ ఫలితాల ప్రకారం పుతిన్ 77శాతం ఓట్లను పొందారు. వామపక్షాల అభ్యర్థి పావెల్ గ్రుడినిన్ 12శాతం ఓట్లు సాధించి రెండోస్థానంలో నిలిచారు. ఎన్నికల్లో గెలిపొందిన పుతిన్ 2024 వరకు అధ్యక్ష పదవిలో కొనసాగనున్నారు.

స్వల్ప అస్వస్థతకు గురైన సోనియాగాంధీ

సిమ్లా, మార్చి 23: యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీ(71) స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. సిమ్లాలోని ఛరబ్రా ప్రాంతంలో తన కుమార్తె ప్రియాంకగాంధీ నిర్మిస్తున్న ఇంటిని పరిశీలించడానికి వచ్చిన సోనియా గురువారం అర్ధరాత్రి స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. దీంతో వెంటనే ఢిల్లీకి తరలించడానికి డాక్టర్లు అంబులెన్స్‌ను ఏర్పాటు చేశారు. కానీ ఆమె తన సొంత కారులో బయలుదేరగా, డాక్టర్లు ఆమె వెంట ఉన్నారు. ప్రస్తుతం సోనియా ఆరోగ్యం నిలకడగా ఉన్నదని డాక్టర్లు తెలిపారు.

టెంపర్ రీమేక్‌లో...


రాశీఖన్నా

'తొలి ప్రేమ' విజయంతో లక్కీస్టార్‌గా మారిపోయింది రాశీఖన్నా. ఆమెలోని నటనాప్రతిభను చాటిచెప్పిన చిత్రమిది. ఈ సినిమా తర్వాత తెలుగు, తమిళ భాషల్లో రాశీఖన్నాకు చక్కటి అవకాశాలు వరిస్తున్నాయి. తాజాగా 'టెంపర్' తమిళ రీమేక్‌లో ఆమె కథానాయికగా నటించబోతున్నట్లు తెలిసింది. ఎన్టీఆర్ కథానాయకుడిగా పూరిజగన్నాథ్ దర్శకత్వంలో రూపొందిన 'టెంపర్' చిత్రం మంచి వసూళ్లను సాధించింది. ఈ సినిమాను తమిళంలో రీమేక్ చేసేందుకు చాలా కాలంగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇందులో విశాల్ హీరోగా నటించనున్నారు. ఈ చిత్రానికి ఏ.ఆర్. మురుగదాస్ శిష్యుడు వెంకట్ మోహన్ దర్శకత్వం వహించనున్నారు. కాగా ఈ రీమేక్‌లో రాశీఖన్నా కథానాయికగా నటించనున్నట్టు తెలిసింది. తెలుగులో కాజల్ అగర్వాల్ పోషించిన పాత్రలో రాశీఖన్నా కనిపించనున్నట్లు సమాచారం. ఇటీవలే ఆమె ఈ రీమేక్‌లో నటించడానికి అంగీకారం చెప్పినట్లు తెలిసింది. మే లేదా జూన్ నెలలో ఈ సినిమాను సెట్స్‌పైకి తీసుకొస్తామని చిత్ర బృందం ప్రకటించింది.


'రంగస్థలం' చిత్రంలో రామ్‌చరణ్

సెట్స్‌పైకి 'థాక్రే'



దివంగత శివసేన అధినేత బాల్ థాక్రే జీవితకథతో రూపొందిస్తున్న చిత్రం 'థాక్రే'. నవాజుద్దీన్ సిద్ధిఖీ టైటిల్ పాత్రను పోషిస్తున్నారు. అభిజిత్ పాన్సే దర్శకుడు. ఈ నెల 25నుంచి రెగ్యులర్ షూటింగ్‌ను ప్రారంభించనున్నారు. మరాఠీల ఆత్మగౌరవానికి ప్రతీకగా, మహారాష్ట్ర రాజకీయాల్లో అత్యంత శక్తివంతుడిగా ప్రఖ్యాతి పొందిన బాల్‌థాక్రే బయోపిక్ ఇప్పుడు దేశవ్యాప్తంగా ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నది. 'దాదాపు వందకు పైగా లొకేషన్లలో చిత్రాన్ని తెరకెక్కించబోతున్నాం. కార్టూనిస్ట్‌గా ప్రయాణాన్ని మొదలుపెట్టిన బాల్‌థాక్రే మహారాష్ట్ర రాజకీయాల్లో ప్రబల శక్తిగా ఎలా అవతరించాడమే అంశాన్ని, ఆయన వ్యక్తిగత జీవితంలోని పలు తెలియని కోణాల్ని ఈ సినిమాలో ఆవిష్కరించబోతున్నాం. జూన్ నెలలో చిత్రీకరణ పూర్తిచేసి బాల్‌థాక్రే జన్మదినాన్ని పురస్కరించుకొని వచ్చే ఏడాది జనవరి 23న చిత్రాన్ని విడుదల చేస్తాం' అని దర్శకుడు చెప్పారు.

సరికొత్త పాత్రలో..!


భూమిక

కథానాయికగా మంచి గుర్తింపును సొంతం చేసుకున్న భూమిక కొంత విరామం తరువాత నాని నటించిన 'ఎంసీఏ' చిత్రంతో తెలుగులో రీఎంట్రీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ చిత్రంలో హీరో నానికి వదినగా నటించి ఆకట్టుకున్న భూమిక ప్రస్తుతం చందు మొండేటి తెరకెక్కిస్తున్న తాజా చిత్రం 'సవ్యసాచి'లో హీరో నాగచైతన్య పాత్రకు అక్కగా కనిపించనున్నట్లు తెలిసింది. ఇదిలా వుండగా భూమిక తాజాగా మరో చిత్రానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు తెలిసింది. పవన్‌కుమార్ స్వీయ దర్శకత్వంలో రూపొందించిన చిత్రం 'యూటర్న్'. కన్నడంలో సంచలన విజయాన్ని సాధించిన ఈ చిత్రాన్ని తెలుగు, తమిళ భాషల్లో మాతృకను తెరకెక్కించిన పవన్‌కుమార్ రీమేక్ చేస్తున్నారు. సమంత ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ ఇటీవల రాజమండ్రి పరిసర ప్రాంతాల్లో ప్రారంభమైంది. కాగా ఈ చిత్రంలోని కీలక పాత్రలో భూమిక కనిపించనున్నట్లు చిత్ర వర్గాల సమాచారం. ఓ ఆత్మ సంఘర్షణ నేపథ్యంలో రూపొందుతున్న ఈ సినిమాలో ఘోస్ట్‌గా భూమిక మునుపెన్నడూ చేయని సరికొత్త పాత్రలో కనిపించనుందని తెలిసింది.

ప్రశ్నించే యువకుడి కథ!


అనీష్, అక్షిత

అనీష్‌బాబును హీరోగా పరిచయం చేస్తూ రాజావన్నెంరెడ్డి రూపొందిస్తున్న తాజా చిత్రం 'ప్రశ్నిస్తా'. అక్షిత కథానాయిక. జనం ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై పి. సత్యారెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రం ఇటీవల హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి దర్శకుడు బాబీ క్లాప్ నివ్వగా, సీనియర్ దర్శకుడు బి.గోపాల్ గౌరవ దర్శకత్వం వహించారు. దర్శకుడు మాట్లాడుతూ 'ప్రశ్నించే ఓ యువకుడి కథ నేపథ్యంలో సాగే చిత్రమిది. సక్సెస్ వెంట పరుగెడుతున్న ఈ రోజుల్లో నన్ను నమ్మి నిర్మాత సత్యారెడ్డి తన కుమారుడు అనీష్‌ని నాకు అప్పగించారు. కమర్షియల్ హీరోగా నిలబడే సత్తా అతనిలో వుంది' అన్నారు. ఈ చిత్రానికి రచన: రాజేంద్రకుమార్, ఛాయాగ్రహణం: యోగిరెడ్డి, ఎడిటింగ్: కోటగిరి వెంకటేశ్వరరావు, సంగీతం: ఎల్.ఎం.ప్రేమ్, సమర్పణ: బి.శేషుబాబు.


రాజ్‌తరుణ్, అమైరా దస్తూర్

రాజుగాడి లీలలు

రాజ్‌తరుణ్, అమైరా దస్తూర్ జంటగా నటిస్తున్న చిత్రం 'రాజుగాడు'. ఏ.కె. ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్నారు. సంజనారెడ్డి దర్శకురాలిగా పరిచయమవుతున్నది. మే 11న ఈ చిత్రం విడుదలకానున్నది. నిర్మాత చిత్ర విశేషాల్ని తెలియజేస్తూ 'క్లెప్టోమేనియా అనే వింతజబ్బుతో బాధపడే యువకుడి కథ ఇది. తనకు తెలియకుండా దొంగతనాలు చేస్తుంటాడు. ఈ వ్యాధి కారణంగా అతడికి ఎదురయ్యే సరదా సంఘటనలతో ఆద్యంతం ఆహ్లాదభరితంగా సాగుతుంది. రాజేంద్రప్రసాద్, రాజ్‌తరుణ్ కలయికలో వచ్చే ప్రతి సన్నివేశం నవ్విస్తుంది. ఇటీవల విడుదలైన టీజర్‌కు చక్కటి స్పందన లభిస్తున్నది. త్వరలో చిత్ర గీతాల్ని విడుదలచేస్తాం' అని తెలిపారు. రాజేంద్రప్రసాద్, నాగినీడు, రావురమేష్, పృథ్వీ, సుబ్బరాజు ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి మూల కథ: మారుతి, మాటలు: వెలిగొండ శ్రీనివాస్, సంగీతం: గోపీసుందర్, సినిమాటోగ్రఫీ: బి. రాజశేఖర్

పరాజయాలు పాఠాలు నేర్పాయి!


రకుల్‌ప్రీత్‌సింగ్

విజయాల కంటే పరాజయాల నుంచే ఎక్కువ పాఠాలు నేర్చుకున్నానని అంటోంది రకుల్‌ప్రీత్ సింగ్. అపజయాలే తన సక్సెస్‌కు పునాదులుగా ఉపయోగపడ్డాయని చెబుతున్నది. రకుల్‌ప్రీత్‌సింగ్ నటించిన గత చిత్రాలు కొన్ని వైఫల్యాలుగా నిలిచాయి. ఫెయిల్యూర్స్ కారణంగానే తెలుగులో ఆమెకు అవకాశాలు తగ్గినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఈ పుకార్లను ఖండించింది రకుల్‌ప్రీత్‌సింగ్. జీవితంలో ఎత్తుపల్లాలు సహజమని చెబుతున్నది. రకుల్‌ప్రీత్‌సింగ్ మాట్లాడుతూ 'ఫెయిల్యూర్స్ లేకపోతే సక్సెస్ విలువ, అందులో ఉండే ఆనందమేమిటో తెలియదు. కొన్నిసార్లు పరాజయాలు జీవితానికి అవసరమైన విలువైన అనుభవాల్ని అందిస్తాయి. వృత్తిని మరింతగా ప్రేమించేలా చేస్తాయి. కష్టపడి పనిచేయడానికి స్ఫూర్తినిస్తాయి. వాటిని నేనెప్పుడు మంచి పాఠాలుగానే భావిస్తాను. అంతేగానీ పరాజయాల్ని తల్చుకొని బాధపడను. గతంలో కథల ఎంపికలో కొన్ని పొరపాట్లు చేశాను. వాటిలో చేసిన తప్పుల్ని ఇకపై పునరావృతం కాకుండా జాగ్రత్తపడాలని నిర్ణయించుకున్నాను' అని తెలిపింది. ప్రస్తుతం తమిళంలో సూర్య, కార్తీలతోసినిమాలు చేస్తున్నది రకుల్‌ప్రీత్‌సింగ్.

అనుబంధాల బృందావనం


హర్షవర్ధన్‌రాణే, రిచా పణయ్

రిచా పణయ్, హర్షవర్ధన్ రాణే, లగడపాటి విక్రమ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'బృందావనమది అందరిది'. శ్రీధర్ సీపాన దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీనివాస్ వంగల, ప్రభాకర్‌రెడ్డి కూతురు నిర్మిస్తున్నారు. తొలి షెడ్యూల్ పూర్తయింది. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ 'ప్రేమానుబంధాల కంటే డబ్బే ముఖ్యమని నమ్మే ఓ యువతి కథ ఇది. తన తప్పును ఆమె ఎలా సరిదిద్దుకుంది అనేది ఇతివృత్తం. ప్రేమ, వినోదం, భావోద్వేగాల సమాహారంగా సాగుతుంది. తొలి షెడ్యూల్‌లో వైజాగ్ సాగర తీరంలో వేసిన సెట్‌లో ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాల్ని చిత్రీకరించాం. అవన్నీ అద్భుతంగా వచ్చాయి. తదుపరి షెడ్యూల్‌ను ఏప్రిల్ 1 నుంచి ఏడు రోజుల పాటు బెంగళూరులో తెరకెక్కిస్తాం' అని తెలిపారు. పృథ్వీ, శివప్రసాద్, హీరాసాహిలి, బెనర్జీ, తాగుబోతు రమేష్, భద్రం, అదుర్స్ రఘు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: మణిశర్మ, కెమెరా: తమ్మ శ్యామ్.

